దుగ్ధఫేని (రెండపది) కటు తిక్తరసములు గురు రూక్షగుణములు శీతవీర్యము కటువిపాకము గలది. విషము వ్రణము హరించును. కల్ప ప్రకారము సేవించిన జరారోగములను లేకుండజేయును.

నాగార్జుని మధుర తిక్త కటు లవణరసములు రూక్షగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. మలబద్ధము వాతము వీర్యము బలము కలిగించును. రసమును బంధించును. మేహము కఫము కుష్టు కృమి నశింపజేయును. మిర్యాలు నాగార్జుని కలిపి నూరి కుంకుడుగింజంత మాత్రలుచేసి తినిన చలిజ్వరమునుఆపును. స్త్రీలు బహిష్ఠులైనపుడు మూడు దినములలో దీనిరసమున మిర్యాలచూర్ణముచేర్చి ఉదయములందు మాత్రమిచ్చిన ఋతుశూల రజోదోషములు నివర్తించును. దీనిరసమున విడంగచూర్ణమునుచేర్చి యిచ్చిన కృములునశించును. దీనిపాలతో కట్టిన రసగుళికలు వైద్యమునందును వాదమునందును విశేష ఫలదాయకములుగనుండును. దీనిపాలు నాగము (సీసము) మున్నగు లోహములను భస్మముచేయుటకుపయోగించును రెడ్డివారినానబాలును బట్టలకు రంగు వేయుటకు విదేశీయులెక్కువగ యుపయోగింతురు.

నాచు:—సం. శైవాల, జలనీలి, శైవలఅనియు, హిం. సివార్ అనియుపేరు. నిలువనీటిలో మొలచునట్టి యొకవిధమగు తుక్కు. ఇది అనేకవిధములు. నీచువాసనగలదిగనుండును. ఇది తీపి ఉప్పు చేదు రుచులు స్నిగ్ధ సర లఘుగుణములు శీతవీర్యము కటువిపాకముగలది. పిత్తవ్రణములపై వేసి కట్టిన మంటహరించును. శరీరమునకు గట్టిన అన్నివిధములగు పిత్తతాపములు హరించును. పిత్తజ్వరము రక్తవికారము నశింపచేయును. పంచదారను శుభ్రముచేయుటకై నాచును విశేషముగనుపయోగింతురట

నాభి:—చూ. వసనాభి.

నారదబ్బపండు:—చూ. దబ్బచెట్టు.

నారింజచెట్టు:—సం. నారంగ, త్వక్సుగంధ, గోరక్ష, ఐరావతక అనియు, హిం. నారంగ్ అనియుపేరు. ఇది నిమ్మచెట్టును పోలియుండు



ను. కాయలు అంతకన్న నాలుగంతలు పెద్దవి. అంతయు దబ్బకాయను పోలియుండును. పచ్చినారింజపండు పులుపు రుచి లఘుగుణము శీతవీర్యము అమ్లవిపాకముగలది. పిత్తమును పెంచును. దప్పికట్టును. కంఠస్వరమును పాడుచేయును. త్రేనుపు దెచ్చును. పడిసెము పట్టించును. పండినపండు తీపి పులుపు రుచులు లఘు సరగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. ఆకలిదప్పికల నణచును. ఛర్ది తాపము జ్వరము కఫము వాతము గుల్మము అరుచి కృమి హరించును. మలమూత్రములను జారీచేయును. ప్రతిప్రాతఃకాలమునను నారింజపండ్లరసమును త్రాగి ఒకగంటయైనతరువాత ఆవుపాలు పుచ్చుకొనుచుండు నెడల అజీర్ణము తగ్గును. రక్తము శుద్ధమగును శుద్ధరక్తముపుట్టును. వీర్యవృద్ధి బలము కాంతి కలుగును. ప్రత్యేకముగ ఆహారముగ నుపయోగించిన ఆరోగ్యకరముగనుండును. గర్భిణీస్త్రీలకు నారింజపండ్లరసమున తేనెకలిపి త్రాగించుటవలన వేవిళ్ళు ఉడుకుజ్వరము తలనొప్పి తగ్గును. నారింజపండుపై చర్మమును యెండించి చూర్ణించి పంచదారకలిపి యిచ్చిన తక్షణము దారుణమైన ఛర్ది నివర్తించును. నారింజఆకులను రాత్రిపూట తలకుగట్టి పరుండునెడల వాతమువలన గలుగు తలపోటు తగ్గును. నారింజవేరును ఆవునేతిలోవేసి కాచి వడియగట్టి ఆనేతిని త్రాగిన శీఘ్రప్రసవము గలిగించును.

నిద్రగన్నిచెట్టు:—సం. లజ్జాలు, శమీపత్ర, సనుంగ, రక్తపాదిఅనియు హిం. ఛుయీముయీ, లజ్జావంతీ, శర్మానీ అనియుపేరు. దీనిని అత్తపత్తిచెట్టనియు వాడుదురు. నీటియొడ్డున మొలచు చిన్న మొక్క. దీనిఆకులు జమ్మిఆకుల వలెనుండును. యెరుపు పసుపు రంగు పూవుల భేదముచేత రెండువిధములు దీనిని చేతితో ముట్టుకొనిన యెడల ఆకులు ముడుచుకొనును.

తిక్తకషాయరసములు సర లఘుగుణములు శీతవీర్యము కటువిపాకముగలది. కఫ పిత్తములు రక్తపిత్తము అతిసారము యోనిరోగము శోఫ తాపము శ్రమ శ్వాస వ్రణము కుష్ఠము కఫరక్తము హరిం

చును, పచ్చపూవుల నిద్రగన్నికదెచ్చి వేళ్ళు చిగురు ఆకు తీసివేసి వట్టి కాడలను మెత్తగానూరి తాటిబెల్లముకలిపి ఉదయ సాయంత్రములందు కుంకుడుకాయంతమాత్రలు తినుచున్న అతిమూత్రము నివర్తించును. ఆకులనునూరి కట్టినను ఆకురసమును వ్రణములపై పూచినను వ్రణములు మానును. వేరునునూరి యాముద్దను కుంకుడుకాయంతమింగి ఆవుపాలు త్రాగినను అరికాళ్ళకు లేపనము చేసుకొనినను వీర్యము స్తంభించి రతిసౌఖ్యము కలుగును. ఆకును ప్రత్యేకముగ చూర్ణించి పటికిబెల్లపు చూర్ణముకలిపి తిని ఆవుపాలు త్రాగుచున్న శుక్లనష్టము సెగరోగము నివర్తించును. వీర్యవృద్ధిచేయును. సడలబడిన ఇంద్రియము గట్టిపడును. ఆకురసమును రాగిపళ్ళెమునకు 7 సారులు పూతలుపూసి ఆవునేతితో దీపముపెట్టి పైన ఆపళ్ళెమును బోర్లించి పళ్ళెమునకంటిన మసిని గ్రహించి రాగిపళ్ళెముమీద రాగిపాత్రలో ఆడుగుర్రపు మూత్రమునువేసి నూరి యాకాటుకను కండ్లకు మిగుల సూక్ష్మముగ అంజనము చేయుచున్న రెప్పలు దళసరియెక్కుట పొరలు మెరుపు మంట మసక మున్నగు అనేక నేత్రరోగములు నశించును. సమూలచూర్ణమును నాగకేసరములతో ఋతుస్నానదినము మొదలు మరల ఋతుమతియగువరకు స్త్రీ తినినయెడల సమస్త యోనివ్యాధులు నివర్తించి సంతానయోగ్యతను పొందును.

నిద్రగన్నికయందు విపరీతలజ్జాలు అని మరియొకజాతికలదు. దీని ఆకులుపెద్దవి క్షుపముచిన్నది. తక్కినలక్షణములు సమము. కటురసము ఉష్ణవీర్యముకలది. కఫమును హరించును. రసమును బంధించును. అనేక విజ్ఞానములను కలుగజేయును. నాదవిద్యయందు బహువిధములుగ నుపయోగింతురు,

నిమ్మపండు:— సం. జంబీర, దంతశఠ, జంభ అనియు, హిం. నీంబూ అనియుపేరు. నిమ్మచెట్టు దబ్బచెట్టును పోలియుండు సాధారణవృక్షము. తెల్లని చిన్నపూవులును పెళుసును నలుపు ఆకుపచ్చ గలసిన రంగుగల ఆకులును గుండ్రని కాయలును కలది. పచ్చినిమ్మకాయలు



ఆకుపచ్చగను పండినవి పసుపుపచ్చగను ఉండును నిమ్మచెట్టంతయు సువాసన గలది.

నిమ్మపండు పులుపు రుచి గురుగుణము ఉష్ణవీర్యము అమ్లవిపాకముగలది. క్రిమి ఛర్ది శూల ఉదరము అజీర్ణము మతిభ్రమ నేత్రవ్యాధులు విషూచిక దాహము దప్పి విషము అరుచి ఎక్కిళ్ళు శ్వాసకాసలు గుల్మము ఊర్ధ్వ జత్రుగ (కన్ను ముక్కు నోరు చెవి మున్నగు చోట్ల బుట్టు) రోగములు శీతపిత్తజ్వరము శ్రమ మున్నగు రోగములను హరించును. నిమ్మకాయను సమముగకోసి యాబద్దకు ఉక్కపొడిఅద్ది గుడ్డలోబెట్టి కన్నులపైన అద్దుచున్న కన్నుకలక మెరుపు పోటు తగ్గును. రాతిసున్నములో నిమ్మపండ్లరసముపోసి ఉడికించి పట్టువేసిన మేహవాతపునొప్పులు హరించును. నిమ్మపండ్లరసములో తేనె అల్లపురసము పంచదారకలిపి కాచి కొంచెము కొంచెముగ త్రాగిన గుండెలలోను కడుపులోను పుట్టు మంట నోట నీరుగారుట తగ్గును. నిమ్మపండు రసముతో రుద్రాక్షను అరగదీసి నాలుకకురుద్దిన సన్నిపాతాదులందు గలుగు జిహ్వాదోషములు నివర్తించును. నిమ్మపండురసమున సైంధవలవణచూర్ణము చేర్చి నస్యముచేయించిన సన్నిపాతమునందు హితకరము. వెచ్చని నేతిలో నిమ్మకాయబద్దనుముంచి దానితో కాపడముపెట్టిన కవ్వుకుదెబ్బనొప్పి తీయును, నిమ్మకాయలను ఉప్పునీళ్ళలో పదిదినములు ఊరబెట్టి తీసి రెండుమూడుసారులు మంచినీళ్ళతో ఉడకబెట్టిన పైచర్మముపగులును. అట్లు పగిలిన కాయలనుతీసి రెట్టింపు పంచదారలోవేసి ఉడకబెట్టిన మురబ్బాఅగును. దీనిని భోజనాత్పూర్వముగాని భోజనమైనవెంటనేగాని తినుచున్న దారుణమైన వాంతికట్టును. అగ్నిదీప్తికలుగును. ఎక్కిళ్ళు త్రేనుపులు కట్టును. నోటియందు రుచి బుట్టించును. గర్భిణులకు మిగుల హితముగనుండును. గంజాయి నల్లమందు సారాయి మొదలగు మత్తుపదార్థములను అమితముగ సేవించుటచేగలిగిన నానావికారములనణచును. మాడుపట్టున కత్తితో వెండ్రుకలను గొరికివైచి కొద్దిగ రక్తము చిందునట్లు నరుకుచేసి అందు నిమ్మపండురసమును బాగుగా రుద్ది విశేష

ముగ చన్నీళ్ళతో స్నానము చేయించిన ఉన్మాదము (పిచ్చి) కుదురును. నిమ్మపండ్లరసము సమస్త పాషాణ లోహ రసాదులందలి విష దోషములను పోగొట్టి శుద్ధపరచును. బాలింతపోలు ముసాంబరం కటుకరోహిణి మండపసుపుకొమ్ము నిమ్మపండ్లరసముతో అరగదీసి కంటిచుట్టు పట్టువేసిన కండ్లకలక వాపు హరించును. నిమ్మపండ్లను రాగిముల్లుతో పొడిచి అందు లవంగములను చొప్పించి నిమ్మకాయ కంతకును దళసరిగ వెన్న పొదిగి మంచినీళ్ళలో 40 దినములు నానబెట్టవలెను. (ప్రతిదినము పాతనీరు పారపోసి క్రొత్తవిపోయుచుండవలెను.) పిదప లవంగముల సహా కాయను మెత్తగానూరుకొని రాగిపళ్ళెముమీద ఆముద్దను బెట్టి కంచు పాత్రతో 15 దినములు మర్దనచేసి యాకాటుకను భద్రపరచునది. ఇది యజంబీరాద్యంజనము అనబడును. దీనిని కండ్లలో అంజనముచేసిన కంటిలో పూవులు హరించును. మరికొన్ని నేత్రరోగములు హరించును. ప్రత్యేకముగ లవంగములనుమాత్రము నీళ్ళతో అరగదీసి అంజనముచేసిన సన్నిపాతమునందలి ప్రలాపముతగ్గును.

నిశ్రేణిక:—సం నిశ్రేణిక, రసహీన, శ్రేణిబలా అందురు. ఇది తృణవిశేషము ఇది రసహీనమైనది. మిగులపేడిచేయును. పశువులకుకూడ బలకరమైనదికాదు.

నీటిప్రబ్బలి:—సం. జలవేతస, నాదేయ, నికుంచక అనియు, హిం. జల బేంత్ అనియుపేరు. ఇది లతాకారముగలచెట్టు. నీటియొడ్డున బయలుదేరును. వేతసము జలవేతసము అని రెండువిధములు. ఆకులు వెదురాకులవలెనుండును. మెట్టప్రబ్బలి నీరుప్రబ్బలులు రెండును ఇంచుమించు సమాన గుణములు కలవి. మెట్టప్రబ్బ మెరకనేలయందు మొలచును.

మెట్టప్రబ్బలిచెట్టు వగరు చేదు కారము రుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముకలది. త్రిదోషములను హరించును. తాపము శోఫ అర్శస్సు అశ్మరి మూత్రకృచ్ఛ్ర విసర్పము ప్రదరము యోని రోగము దప్పి రక్తదోషము వ్రణము మేహము రక్తపిత్తము కుష్ఠము



విషము హరించును. ప్రబ్బలిచిగురు కారము ఉష్ణరుచులు లఘురూక్ష గుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కఫవాతములను హరించును. ప్రబ్బలిఆకు వగరు చేదు కారమురుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. మలమును భేదించును. వాతము పెంచును. రక్తదోషము కఫపిత్తములు నశింపజేయును. దీనివెన్ను పులుపు వగరు తీపిరుచులురూక్షగుణము ఉష్ణవీర్యము అమ్లవిపాకము గలది. పిత్తమును పెంచును. రక్తదోషమును కఫమును హరిం చేయును.

నీరుప్రబ్బలి చేదు, వగరు, రుచులు రూక్షగుణము, శీతవీర్యము కటువిపాకము గలది. వాతమును హరించి పిత్తమును పెంచును. గ్రహబాధలను పోగొట్టును. తక్కిన మెట్టప్రబ్బలి గుణములను కూడగలిగియుండును.

రెండువిధముల ప్రబ్బలిలో పెద్దచిన్న భేదముచే పెద్దనీరు ప్రబ్బలి చిన్ననీరు ప్రబ్బలి పెద్దమెట్టప్రబ్బలి చిన్నమెట్ట ప్రబ్బలి అని భేదములు కలవు అన్నియు సమాన గుణాదులు కలవి.

నీరుగొబ్బి:—చూ. గొబ్బిచెట్టు.

నీరుడుగింజలు:—సం. తువరక అందురు. ఇవి కుంకుడు గింజల కంటె కొంచెము పెద్దవిగ బూడిదరంగుగ గుండ్రగ నుండును. ఈగింజలలోని పప్పునునూరి ఆముదములోగాని వేపనూనెలోగాని కలిపిరాచిన గజ్జి చిడుము దురద మున్నగు సకల చర్మరోగములు నశించును. నీరుడు విత్తులనుండి తీసిన తైలమును లోపలకు తినుటకును పైకిపూయుటకునుగూడ ఉపయోగించును. తైలమును 20 మొదలు 30 చుక్కల వఱకు పంచదారలో కలిపి త్రాగిన కుష్ఠము, వాతరక్తము, సవాయి మచ్చలు, దద్దురు తామర హరించును. మోతాదు యెక్కువైన వాంతులగును.

నీరుపిప్పలి:—సం. జలపిప్పలి, శారదీ, శకులాదని, మత్స్యగంధ అనియు హిం. పనిసిగా గంగతిరియా, జలపీపల్ అనియుపేరు. దీనికిబొ

క్కినాకు అనిపేరుకలదు. ఇదిజలప్రాయ ప్రదేశములందు భూమిమీద ప్రాకును. ఆకులు చిన్నవిగ కంగోరా గలిగి మృదువుగ ఉండును.

కటుకషాయ రసములు, లఘురూక్ష గుణములు, శీతవీర్యముకటు విపాకము గలది. హృదయమునకును నేత్రములకును మేలుచేయును. శుక్రవృద్ధి మలబద్ధము గలిగించును. తాపము రక్తదోషము వ్రణము అగ్నిమాంద్యము క్రిమి రక్తదోషము, రసదోషము, శ్వాస, కఫము, భ్రమ, విషము, మూర్ఛ దప్పి. పిత్తజ్వరము హరించును. దీనిస్వరసము లేక తేలిక కషాయము నిచ్చిన ప్రసవస్త్రీల మైలరక్తమును జారీ చేయును. ఆకును ఆముదముతో వెచ్చజేసి కట్టిన వ్రణములు హరించును. ఆకునుతొక్కి తలకు గట్టిన సన్నిపాతదోషము తొలగును.

నీరుల్లి:—సం. పలాండు యవనేష్ట, దుర్గంధ, ముఖదూషక అనియు హిం. లాల్ ప్యాజ్ అనియుపేరు. ఇదియొకదుంప యెర్రగ తెల్లగనుండును. దుర్వాసన గలిగియుండును. యీదుంపనుండి సన్నముగ అర్ధగజము మొదలు గజము పొడవుగ ఆకుపచ్చని కాడలు పుట్టును. యీ కాడలు కలవ కాడలవలె నుండును. కాడలచివర తెల్లని పూవులు పూచును. ఈకాడలను ఉల్లికోళ్ళందురు. వీటిని కూరవండుకొని తిందురు.

ఉల్లిగడ్డలు కారము తీపి రుచులు, గురుగుణము, శీతవీర్యము, మధుర విపాకము గలవి. కఫము, బలము, పుష్టి గలిగించును. కొద్దిగపిత్తమును హెచ్చించును. వాతము హరించును. వాంతి దోషము నశించును. దీపనము మేహశాంతి చేయును. తెల్లనీరుల్లి పాయలను ముక్కలుగాకోసి నేతితో వేయించి పంచదారలో కలిపి ప్రతిదినము దినుచున్న బలము పుష్టివీర్యము గలుగును. శుక్లనష్టము కట్టును. మేహఉడుకుతగ్గును. ఉల్లిగింజలు శుక్రవృద్ధి జేయును. పుప్పిపంటిలోని పురుగులను చంపును, ప్రమేహములను తగ్గించును.

నిర్విషి:—సం. నిర్విష, అపవిష, వివిషఅనియు, హిం. నిర్విషీ ఘూస్ అనియుపేరు. ఇదియొకవిధమగు గడ్డిదినుసు మొక్క. కాశ్మీరము హిమాలయ ప్రాంతములందు విశేషముగ పెరుగును. దీనికి దుంప



ఉండును. ఇది తేలు పాము మొదలగు అనేక విషజాతులను నశింపజేయు ప్రభావముకలదై యుండును. వ్రణము కఫవాతములు రక్తదోషము నశింపజేయును. ఇది కారము రుచి సరగుణము శీతవీర్యము కటువిపాకముగలది. మనదేశమందుగూడ నిర్విషి అరుదుగ దొరకుచున్నది.

నీలమణి:—సం. నీలమణి, ఇంద్రనీల అందురు. నవరత్నములలోనొకటి. ఇది జలనీలము ఇంద్రనీలము అని రెండువిధములు ఇంద్రనీలము మంచిది. తెలుపు నలుపు రంగులుగలిగి తేలికయైనది జలనీలమనబడును. నల్లనివర్ణము కాంతి బరువు నునుపుగలిగి మధ్యభాగమున నైగనిగ్యముగల ఇంద్రనీలము శ్రేష్ఠము. ఇంద్రనీలమును శోధనమారణములుచేసి సేవించిన వీర్యవృద్ధి అగ్నిదీప్తి కల్గును. త్రిదోషములను పోగొట్టును. శ్వాసకాసలు విషమజ్వరము మూలవ్యాధి హరించును. పాపమును పోగొట్టును నీలమును గాడిదమూత్రమునందు నానబెట్టి ఎండించిన శుద్ధమగును. పిదప పాలకూరరసముతో మూడుదినములు భావనచేసి కొలిమిలోబెట్టి యూదినచో భస్మమగును.

నీలాంజనము:—సం, పార్వతేయ, రక్తసంవరణ, సువీరఅందురు. బరువుగ స్నిగ్ధముగనుండును. నేత్రరోగములను దోషత్రయ వికారములను అణచును. స్వర్ణమును భస్మముచేయుట కుపయోగించును. సర్వలోహములకు మృదుత్వము కలిగించును. క్షయ దృష్టిమాంద్యము అగ్నిమాంద్యము కాస రక్తదోషము హరించును.

నీలిచెట్టు:—సం. నీలీ, నీలినీ, మేఘవర్ణా అనియు, హిం. నీల్ లీల్ అనియుపేరు. ఇది చిన్నక్షుపము. దీనిఆకులు గుండ్రముగా చిన్నవిగా నలుపుకలసిన ఆకుపచ్చరంగుగ ఉండును. ఇంచుమించు తంగేడాకువలెఉండును. పిల్లిపెసరకాయలకంటె సగము చిన్నవియగు కాయలు కాచును. ఆకునునూరి గోళ్ళకుపట్టించినయెడల గోరు నీలిమందు రంగుగానగును. ఈచెట్లనుండి నీలిమందు తయారుచేయుదురు.

నీలి మహానీలి అని ఇందు రెండుభేదములుకలవు. మహానీలిచెట్టు కొంచెము పెద్దది.

నీలి కారము చేదు రుచులు సరగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. వెంట్రుకలకు నలుపెక్కించును. వ్యంగము శ్లేష్మోదరము మేహము హృద్రోగము భ్రమ వాతరక్తము ఉదావర్తము ఆమవాతము కఫము మదము కాస విషము గుల్మము జ్వరము కుష్ఠము క్రిమి ప్లీహ వ్రణము మున్నగురోగములు హరించును ఆకురసమును పెరుగులోవేసి త్రాగిన శెగరోగము నివర్తించును. ఆకుచూర్ణము పటికిబెల్లము సమముగాకలిపి తేనెతో కలిపి నాకించిన ఉష్ణమువలన కలిగిన శూల నొప్పి తగ్గును.

వేసకషాయమున పసుపుకలిపి యిచ్చిన పాముపిషము పొంగించిన పటికిచూర్ణము కలిపి త్రాగిన మూత్రకృచ్ఛ్రము పాలు పంచదార కలిపి యిచ్చిన మలబద్ధము, ఆవనూనెకలిపి శరీరమునకురాచిన చిడుము దేవదారుచెక్క చూర్ణము కలిపి త్రాగిన కృములు ఆకురసము ప్రత్యేకముగ త్రాగుచు మచ్చలకుగూడ రాచుచున్న బొల్లి తగ్గును. ఆకును తొక్కి ఆముదముతో వెచ్చజేసి పొత్తికడుపునకు కాపడముపెట్టిన యెడల మూత్రబద్ధమును విప్పును.

నీలిఆకు గుంటగలగరాకు త్రిఫలములు నల్లవుమ్మెత్తవిత్తులు ఇనపకిట్టము నల్లగోరింటపువ్వులు మద్దిపట్ట వీనిని సమభాగములుగ గ్రహించి మెత్తగత్రొక్కి వకకుండలోపెట్టి నాలుగురెట్లు మంచినూనెయు, నూనెకు నాలుగురెట్లు గుంటగలగరాకురసమును అయిదుతులములు త్రిఫలచూర్ణమునుచేర్చి మూతమూసి చీరజేసి పదిహేను దినములు నిలవయుంచి పిదప ద్రవము యిగురువరకుకాచి వడియగట్టి వెండ్రుకలకు రాచుకొనునెడల నెరసిన వెండ్రుకలు నల్లబడును. ఆరుమాసముల వరకు పెరుగ తెల్లబడవు. కుదుళ్లలోనుంచి ఆరుమాసములవరకు నల్లని వెండ్రుకలే బుట్టును.

నీలిమందు పంచదారకలిపి యిచ్చిన శెగరోగమును తేనె గలిపి యిచ్చిన మూర్ఛయు, తమలపాకురసముతో యిచ్చిన శ్వాస కాసలను



నీలిమందు యవక్షారము కలిపి వాననీళ్లతోనూరి పొత్తికడుపునకుపూసిన మూత్రబంధమువిడును నీలిమందు చూర్ణమును పుండ్లపై చల్లిన నవి మానుపట్టును. వెన్నపూసలో నీలిమందు యష్టిమధుక చూర్ణము కలపి పూసిన కాలినవ్రణములయొక్క మంటతగ్గును. నీలిమందుకలిపిన నీళ్లను మూత్రనాళములోనికి పిచికారీచేసిన సెగరోగమునివర్తించును

నులిదడచెట్టు:—సం. ఆవర్తకి, రంగలత అందురు. చేదు వగరు రుచులు ఉష్ణవీర్యము సరగుణము కటువిపాకము గలది. సమూలరసము దురద దగ్గు క్రిమి ఉబ్బసము విషము హరింపచేయును.

నువ్వుచెట్టు:—సం. తిల, పాపఘ్న, పితృతర్పణ అనియు, హిం. తిల్ అనియుపేరు. చిన్నమొక్క ప్రసిద్ధమైనది.

నువ్వుగింజలు కారము చేదు తీపి వగరు రుచులు గురు స్నిగ్ధగుణములు ఉష్ణవీర్యము, కటువిపాకముగలది. కఫపిత్తములు బలము, కేశవృద్ధి, శరీరకాంతి, మలబంధము, జ్ఞాపకశక్తి కలిగించును. దంతములనుగట్టిపరచును. జఠరాగ్నినిపెంచును. కొలదిగ మూత్రమును వెడలించును. స్తన్యము (చనుబాలు) పడజేయును నల్లనూవులు మంచివి. తక్కినవి అల్పగుణములుకలవి. కొన్ని గ్రంధములందు నువ్వులు మధురవిపాకముగలవియని చెప్పబడెను.

నువ్వులు పటికిబెల్లము కలిపి నమిలి పుక్కిటబట్టిన నోటిపూత తగ్గును. దంతములకు బలముకలుగును. నువ్వులపిండిని వెన్నలో కలిపి శరీరమునకుపూసిన నల్లజీడిగింజలను తినుటచేత కలిగిన శరీరమందలి దద్దురు వాపు తగ్గును. పైపొట్టుదీసిన తెల్లనినూవులను దోరగా వేయించి బెల్లమువేసి తొక్కి యాచూర్ణమును రెండు లేక మూడుతులములు ప్రతిసాయంత్రము పరుండబోవునపుడు నమిలి మ్రింగి మంచినీళ్ళుత్రాగుచున్న మలబద్ధము మూలవ్యాధితగ్గును. రక్తరోగులకిది అమృతతుల్యము. గానుగలోనువ్వులనుపోసి తైలము తీసివేయబడిన పిండి అనగా తెలకపిండిని కూరవండుకొనితినిన శరీరమందలి నీరునార్చును. నంజుదోషులకును బాలింతలకును హితకరముగనుండును. మలబద్ధము నేత్రములకు

జబ్బుచేయును. కఫవాత ప్రమేహములనణచును. బలము పుష్టి యిచ్చును. మధురరసము రూక్షగుణము ఉష్ణవీర్యము మధురవిపాకము గలది. సంస్కృతమున దీనిని తిలకిట్ట పిణ్యాకఅందురు.

నువ్వులనూనె మధురరసము తీపి ప్రధానముగను కషాయతిక్త రసము లప్రధానముగను ఉండును. ఉష్ణవీర్యము గురు సర విశదగుణములు మధురవిపాకముగలది. బలము వీర్యము పుష్టి కాంతి గలిగించును. వాతకఫములహరించును. రక్తపిత్తకరము లేఖనకారి మలమూత్రబంధమునువిప్పును. గర్భాశయమును బాగుపరచును. అగ్నిదీప్తి బుద్ధి మేధ గల్గించును. వ్రణములనుమాన్పును. చెవి, యోని, శిరస్సు వీనియందలిపోటును పోగొట్టును. చర్మమునకుపూసిన కాంతినిచ్చును. పాదములందభ్యంజనముచేసిన నేత్రములకు హితముగనుండును. కాలిన పుండ్లు నరుకు గాయములు ఎముకలువిరుగుట కీళ్ళుపట్టువదలుట చీరుకొనిపోవుట మున్నగు బాధలు కలిగినపుడు నూనెను ఆయావస్తువులవేసి కాచిగాని పచ్చిదిగాని రాచినను పూసినను గుడ్డ తడిపి కట్టుగట్టినను వైవ్యాధులునయమగును. తిలతైలము, వస్తి, అభ్యంగనము, నస్యము, పానము, అన్నసంస్కారము, నేత్రపూరణము, సేకము. పూతమున్నగు కర్మలయందు మిగుల శ్రేష్ఠతమముగనుండును. తిలతైలమునకన్న సకలవాతముల నపహరింపదగిన యౌషధములేదు. అనేక విధములగు సంస్కారములనంది తైలము సకలరోగములను హరించును. నూనె నేతికంటె బలకరమై శ్రేష్ఠమై యుండును. మరియు నేయివలె పాతదియగుకొలది వీర్యవత్తరమగును. పిత్తరోగములందును రక్తవికారములందును నూనె నుపయోగింపరాదు. వాతరోగములందన్నిటియందు తిలతైలము ప్రధానమైన యౌషధముగ నుపయోగింపజనును. తిలతైలము సంస్కారవశమునపొందు అనేకనామములను వాని ప్రభావములను అనంతములగుటచే వ్రాయుటకు వీలుపడదు.

నూగుదోసకాయ:—సం. వాలకం, కాండకం, వాలు అనిపేరు. చక్కగపండినపండు మధురరసము లఘుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. రక్తపిత్తమునుహరించును. విరేచనము చేయును. జఠరదీప్తినిచ్చును.

నూతినీరు:—ఉష్ణగనుండు నూతినీరు కఫమునుహరించును. పిత్తమును జఠరమునుహెచ్చించును. తేలికనిచ్చును. చూ. ఉదకము.

నూరుమారులు కడిగిననేయి:—దీనిని శరీరమునకుబూసిన తాపము మోహము జ్వరము నశింపజేయును. పాలయొక్క గుణాదులనన్నిటిని గలిగియుండును.

నెమలి:—సం. మయూర, బర్హి, కలాపిఅందురు. దీనిమాంసము శరీరపుష్టినిచ్చును. చెవులు శిరస్సు వీనియందలిరోగములు వాతము శోష హరించును. వేడిచేయును. బలము ఆయువు బుద్ధి అగ్నిదీప్తి గలుగజేయును. వెండ్రుకలకు నేత్రములకు హితకరము. హేమంత శిశిర వసంతములందు దినుటకర్హముగను తక్కినఋతువులందు అపథ్యముగను ఉండును.

నెమలియీకలతో కట్టబడిన విసనకర్రతో విసరిన గాలి తగిలిన కఫవాతములు పిత్తజ్వరము విషమజ్వరము శరీరతాపము జ్వరమునశించును. శుక్రము కాంతికలుగును.

నెమలియీకలను కాల్చినమసిని తేనెతో రంగరించి నాకిన డోకులుకట్టి వాతము వాతజ్వరము హరించును,

నెమలిచెట్టు:—సం. పూతీక, పూతివర్ణ, చిరిబిల్వ అనియు, హిం. పూతీకరంజ అనియుపేరు. కానుగుచెట్లలో భేదము. కానుగుచెట్టుయొక్క ఆకారమువంటిదాని కలిగియుండును. ఇది కారము రుచి ఉష్ణవీర్యము తీక్ష్ణగుణము కటువిపాకముగలది. యోనిదోషము కుష్ఠము ఉదావర్తము గుల్మము అర్శస్సు వ్రణము కృమి కఫము హరించును. కాయలలోనిపప్పు కఫవాతములు మేహము కృమి కుష్ఠము హరించును. నిమ్మకాయరసముతో అరగదీసి శరీరమునకుపూసిన దారుణమైన తీట గజ్జి నశించును. ఆకునునూరి కట్టుకట్టిన పొక్కును గనుక కొంచెము నొప్పుంచి మంటబెట్టగానే తీసివేసి యప్పటి కొబ్బరినూ

నెనురాయవలెను. ఆకుకట్టువలన అనేకవిధములగు వాపులు వ్రణశోధహరించును. నవీనస్థితియందున్న సవాయిగడ్డలకు గట్టిన నవిహరించును. మరియు కాసినుగుయొక్క సకలగుణములు దీనియందుగలవు. దీని వేరుచేతను ఆకుచేతను మైలతుత్థము తాళకము మున్నగు వస్తువులు భస్మములగును.

నెయ్యిసాధారణగుణము:—ఆయువు, ఆరోగ్యము, కాంతి, ఉత్సాహము, తేజస్సు, సౌందర్యము, బుద్ధి, పుష్టి, వీర్యము గలిగించును. నేత్రములకు హితకరము, గురుగుణము శీతవీర్యము మధురరసము మధురవిపాకముగలది. విషము వాతపిత్తము వాతము అలక్ష్మి ఉదావర్తము జ్వరము ఉన్మాదము శూల అనాహము వ్రణము క్షయ విసర్పి రక్తదోషము హరించును. నేయి తేనె సమముగగల్పిన విషతుల్యమగును. దీనిని సద్యోవ్రణములకు రాచిన వెంటనే వ్రణములను మాన్పును. ఆవు గేదె మున్నగువాని నేతులనుగూర్చి ఆయా శీర్షికలందు జూచునది.

నెల్లిచెట్టు:—చూ. తక్కలిచెట్టు.

నెవ్వరిధాన్యము:—సం. నీవార, అరణ్యధాన్య, మునిధాన్య అనియు, హిం. తిలీ, తీనీ, తీరీ యనియుపేరు. ధాన్యవిశేషము. యీగింజలకుచివర సన్ననిముల్లుండును. నలుపురంగుగల యీధాన్యములోని బియ్యము యెఱ్ఱగనుండును. మహర్షులీధాన్యము నాహారార్థముపయోగించుచుండిరని గ్రంథమువలన దెలియుచున్నది.

ఇది తీపి వగరు రుచులు రూక్షగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. పిత్తమునుహరించును. మలబద్ధముచేయును. కఫవాతములను పెంచును.

నేతిబీరకాయ:—సం. ఘృతకోశాతకి అందురు. తియ్యబీరకాయకుండు వాడియగు ధారలు (అంచులు) దీనికుండవు. తెల్లగా నుండును. తీగఅంతయు మంచిబీరనుపోలియుండును గాని దీనిఆకులపైన మచ్చలుండును. మరియు ఆకులు కొంచెముపెద్దవి. ఇదిరుచిగనుండును.



రక్తపిత్తము ఎక్కిళ్ళు విషము చలిజ్వరము నశింపజేయును: శుక్రవృద్ధి జేయును. వాతకఫరోగములకపథ్యముగనుండును. మలబద్ధకరము.

నేపాలము:—సం. జయపాల, సారక దంతిబీజ అనియు హిం. జమాల్ గోటా అనియుపేరు. ఇదిసాధారణమైనచెట్టు. ఇందుఅనేకజాతులుకలవు. గింజలోనిపప్పు మాత్రమే ఉపయోగించు యీనేపాలపుచెట్టు ఆంధ్రదేశమునందులేదు.

నేపాలపుగింజలు కారమురుచి, గురుతీక్ష్ణస్నిగ్ధగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలవి. గాఢమగువిరేచనముచేసి అగ్నిదీప్తినిచ్చును. జఠరదోషములు, కఫపిత్తములు, క్రిమి, హరించును. శుద్ధిచేసిన నేపాలపుగింజలు 4భాగములు రససిందూరముఒకభాగము కలిపినిమ్మపండ్లరసముతో వారముదినములు బాగుగనూరి పెసరగింజంతలేక కందిగింజంతమాత్రను యిచ్చిన గాఢముగ విరేచనము చేయును. వేపగింజలపప్పు, శుద్ధరసము, శుద్ధగంధకము, శుద్ధనేపాలము సమముగచేర్చి నిమ్మపండ్లరసముతో మూడుదినములునూరి కందిగింజంతమాత్రలు చేసి వాడినపిత్తజ్వరములు హరించును. సుఖవిరేచనముచేయును. సవాయిరోగులకు విరేచనార్థముగ నుపయోగించుట కనుకూలముగ నుండును. ఇంగిలీకము, నేపాలము, శొంఠి సమభాగముగ నిమ్మపండ్లరసముతో 4 దినములునూరి గుంజలంత మాత్రలుచేసి యిచ్చిన కొన్నిజ్వరములు తగ్గును. బిడ్డలకడుపుజ్వరము, క్రిమి, చంటిబిడ్డగుణము మొదలగువ్యాధులందుశీఘ్రముగవిరేచనముజేయుటకిదియుపయుక్తము. దీనిమోతాదు యెక్కువయైన వమన విరేచనములధికమై మరణము తటస్థించును. నేపాలపుగింజలనుండి తీసినతైలము గూడపైగుణములను కల్గియుండును. ఒకగింజ రెండుమోతాదులుగను తైలపుచుక్క నొక్కమోతాదుగను సాధారణముగ నుపయోగింపవలెను.

నేపాలమును శుద్ధిజేయువిధి—గింజలపైనుండు పెంకులను పగులగొట్టి లోనిపప్పును గ్రహించి ఆవుపేడలోకలిపి నీళ్లుపోసి యొకజాము ఉడికించి కడిగితీసి రెండుపక్షములకుమధ్య నుండుచిగురుటాకును తీ

సిపారచేసి యాపప్పును పాలలోవేసి కొంచెము బియ్యము బెల్లముచేర్చి ఉడకబెట్టిమరల కడిగితీసి ఆవునేతితో దోరగవేయించి పసుపుచల్లవలెను. ఇదివృద్ధవైద్యులుచేయు శుద్ధిప్రక్రియ. ఇంకను అనేకరీతులుకలవు. గ్రంథవిస్తరభీతిచే వ్రాయబడవు.

అమితముగ నేపాలమును సేవించుటచే గల్గినవమన విరేచనముల నాపుటకు పెరుగు అన్నముతినుట నిమ్మపండురసములో పంచదారకలిపి త్రాగుటమంచిది. చూ. పెద్దనేపాలము. సీమనేపాలము.

నేపాలవనమల్లి:—సం. వాసంతి ప్రహసంతి శిఖరిణీ అనియు హిం. నెవారీవాసంతీ యనియుపేరు। ఇదిపెద్దవృక్షము ఆకులుకొంచెముగుండ్రగ పొడవుగనుండును. పూవులుగుత్తులుగ పూచును. పూవులుసుగంధముగలవి.

నేపాలవనమల్లిపూవు కటుతిక్తరసములు లఘుగుణము శీతవీర్యము కటువిపాకము గలది. త్రిదోషహరము నేత్రములకు హితముచేయును. ముఖకర్ణరోగములందుపయోగించును.

నేరేడుచెట్టు:—సం. జంబూ, సురభిపత్ర, శ్యామఫలఅనియు హిం. జామున్ అనియుపేరు. నేరేడుచెట్లలో నేరేడు, అల్లనేరేడు. జిన్ని, నేలనేరేడు, కాకినేరేడుఅని అయిదుభేదములు కలవు. అల్లనేరేడునకు సం. మహాజంబు, రాజజంబు, స్వర్ణమాత అనియు హిం. బీడీజామున్ అనియుపేరు. జిన్నికి క్షుద్రజంబు దీర్ఘపత్ర, సూక్ష్మకృష్ణఫల అనియు ఛోటీజామున్ అనియుపేరు. నేలనేరుడునకు భూజంబు హ్రస్వఫల భృంగవల్లభ యనియు, కాకినేరేడునకు కాకజంబు కాకఫల అనియుపేరు.

నేరేళ్ళుపెద్దవృక్షములు. ఆకులుకోలగ పెళుసుగ పచ్చికాయలు ఆకుపచ్చగ దోరకాయకొంచెము యెరుపుగ బాగుగాపండినదిడి నల్లగనుండును.

నేరేడుపండు వగరు, తీపి, పులుపు రుచులు, రూక్షగురుగుణములు శీతవీర్యము మధుర విపాకముగలది. రుచిబుట్టించును. లేఖనకారి.



మలబంధమును కంఠమునందునొప్పి వాతము, ఆధ్మానముకలిగించును. కఫపిత్తములు రక్తపిత్తము హరించును. కంఠస్వరమును పాడుచేయును. నేరేడుపండ్లరసమును రెట్టింపు పటికిబెల్లపుచూర్ణములోవేసి తీగపాకమువచ్చువరకు కాచివడియగట్టుకొని తులముమొదలు రెండుతులములయెత్తువరకునిచ్చిన నీళ్ళవిరేచనములు అతిమూత్రము తగ్గును.

నేరేడుగింజలలోనిపప్పును దోరగవేయించి 26వ పంతు నల్లమందుచేర్చి మెత్తగానూరి తేనెకలిపి శనగగింజంతమాత్రలుచేసి దినమునకు ఒకటిమొదలు నాలుగుమాత్రలువరకు సేవించిన మూత్రముతో బోవు శర్కర నశించును. అతిమూత్రముకట్టును. కళ్ళైదగ్గుఆపును.

నేరేడుచక్కరసములో పంచదార కలిపియిచ్చిన తెల్లకుసుమ నీళ్ళవిరేచనములు కట్టును. నేరేడుచక్కచూర్ణమును పెరుగులోకలిపి త్రాగిన జిగటవిరేచనములు నయమగును. నేరేడాకులచూర్ణముతోగాని నేరేడుపుల్లతోగాని దంతధావనముచేసికొనిన దంతములు గట్టిపడును. నేరేడుచక్కరసముతో వ్రణములనుకడిగిన త్వరగమానుపట్టును. కషాయమునందు కాచుచూర్ణమును పటికిపొడిని చేర్చి పుక్కిటబట్టిన నోటిపూతతగ్గును. గ్రహణినాడి వదులగుటచే తినినపదార్థమువెంటనే ఆసనమువెంటపడి పోవునపుడు చక్కకషాయమునందు తుంగముస్తల చూర్ణమును కలిపి దినమునకు 5, 6 సారులు కొంచెము కొంచెముగ నిచ్చుచుండవలెను.

అల్లనేరేడుచక్కరసము లేక కషాయము వగరు తీపి రుచులు, రూక్షగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. కంఠస్వరమును బాగుచేయును. శ్వాసకాసలనడంచును. ముఖరోగము అతిసారము శ్రమ వీనినిబోగొట్టును.

కాకినేరేడుచక్క చేదు వగరు రుచులు గురుగుణము మధుర విపాకముకలది. బలము, వీర్యము కలిగించును. గ్రహణి అతిసారము శ్రమ తాపము రక్తదోషము కఫము వ్రణము మున్నగు వానిని హరించును

జిన్ని మున్నగు యితరభేదములకును పైగుణాగులుకలవు.

నేలఆనగచెట్టు:—సం. భూతుంబి, నాగతుంబి, వల్మీకసంభవ, అనిపేరు. ఇది వర్షకాలమునందు ఇంద్రధనుస్సు బయలుదేరు సమయమున పుట్టలపైతరుచు మొలచి కొన్నిమాసములు బ్రతికి చచ్చిపోవును.

సమూలరసము చేదు రుచి లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. సన్నిపాతము ధనుర్వాతము మున్నగు అనేక వాతరోగములు గళగండము హరించును.

నేలకడిమిచెట్టు:—సం. భూకదంబ, భూనీప. వృత్తపుష్ప, విషఘ్న, వ్రణహారక అనియు, హిం. భూమికదమ్ అనియుపేరు.

ఇది కారము వగరు చేదు రుచులు గురుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. వీర్యవృద్ధిజేయును. విషము శోథ వ్రణము పిత్తము సకలమేహములు హరించును.

నేలగుమ్ముడు:—సం. విదారి, వృష్యకంద, క్షీరశుక్ల, ఇక్షుగంధ అనియు, హిం. బిలాయీకంద అనియుపేరు. ఇది తీగజాతియును అరణ్యములలో మెట్టప్రదేశములందుండును. ఇది దుంపయేప్రధానముగ గలది. దుంపకు సన్నని వెంద్రుకలవంటి వేళ్ళుండును. దుంపలుమిక్కిలి పెద్దవిగ పెరుగును. ఆకులు మిక్కిలి పెద్దవిగనుండును. పాలగుమ్ముడు నేలగుమ్ముడు అని యిందు రెండుభేదములున్నవి.

ఇది తీపి రుచి గురు స్నిగ్ధగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. మిగుల వీర్యవృద్ధిచేయును. రక్తపిత్తము వాతము తాపము ఛర్ది హరించును. బలము వీర్యము పుష్టి తేజస్సు కలిగించును. కఫమును పెంచును. మూత్రమును ఋతురక్తమును జారీచేయును. స్తన్యమును పుట్టించును. స్త్రీలకు గర్భమునునిలుపును. నిక్కాళ నణచును. రక్తవృద్ధిచేయును.

నేలగుమ్ముడుపూవు మధురరసము గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. కఫవాతములబెంచును. పిత్తమునుహరించును.



నేలగొలిమిడిచెట్టు:—భూమికి జెత్తెడెత్తున లేచెడునొక్క మిగులచెడుగనుండును. వేడిచేయును. కుష్ఠము, తీరని మొండివ్రణములు సకలచర్మరోగములు నశింపచేయును. సమూలచూర్ణమును పంచదార కలిపి పుచ్చుకొనవలెను. మోతాదుపూటకు వీడెత్తు

నేలతంగేడుచెట్టు:—సం. మార్కండిక, భూమిచర, మృదురేచని అనియు హిం. భుయీఖఖసా అనియుపేరు. నేలపాకును. ఆకారమంతయు యించుమించు తంగేడుచెట్టును పోలియుండును. పసుపుపచ్చని పూవులుపూచును సమూలచూర్ణము చేదువగరు రుచులు, లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. కుష్ఠము విషము దుర్గంధము కాస గుల్మము ఉదరము హరింపచేయును. ఊర్ధ్వఅధఃకాయములను శోధనముచేయును. వీర్యపటుత్వము కలిగించును జఠరదీప్తినిచ్చును. తంగేడుచెట్టుయొక్క యితరగుణములు గూడదీనియందు గలవు. చూ. తంగేడుచెట్టు.

నేలతప్పెట:—ఇది నేలమీద నేలఆనుకొని యుండుచిన్నమొక్క. నాలుగైదు ఆకులుండును. జామఆకంత ఆకుండును. దీనివేరు మిరియములసమముగ కలిపినూరి కుంకుడుగింజంత మాత్రనుయిచ్చిన సూతికావాతమును హరించును. కషాయము సన్నిపాతమునందును దారుణవాతరోగములందును పనిచేయును.

నేలతాడి:—(తెల్లది) సం. ముసలీ, ఖలినీ, తాళపత్రి, తాళమూలీ అనియు హిం. ముసలీఅనియుపేరు. నల్లనేలతాడికి సంస్కృతమున వారాహి, మాగధి. గృష్టి. సూకరిఅనిపేరు. జానెడెత్తు రమారమిగలమొక్క. దుంపప్రధానముగల వస్తువు. తెల్లనేలతాడిదుంప తెలుపుకలసిన నలుపువర్ణముగను నల్లనేలతాడిదుంపపట్టనలుపుగను ఉండును. నల్లది శ్రేష్ఠము. దీనిఆకులు లేతఖర్జూరపు ఆకులవలెనుండును. మిగులచిన్నవియగు పసుపుపచ్చపూల బూచును. దుంపకు పందివెంద్రుకలనుబోలిన వేళ్ళుండును. గనుకదీనిని సూకరిఅందురు. దుంపమిగుల జిగటగనుండును

తీపిచేదురుచులు గురుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. అగ్నిదీప్తివీర్యవృద్ధి, బలము, పుంస్త్వము మృదుత్వము గలుగజేయును. వయస్సును నిలుపును. వాతపిత్తములను గుదజన్యమగు రోగములను హరించును. క్రమముగ సేవించిన రోగములను ముదిమినిపోగొట్టును. రక్తదోషమును ఆయాసమును అణచును. క్షయరోగులకు హితకరము దుంపచూర్ణమును పాలతో ఉడికించి పిప్పలిచూర్ణము పంచదారకలిపి ప్రతిప్రాతః కాలమునందు సేవించుచున్న మూలవ్యాధి శుక్లనష్టము తగ్గును. సంభోగశక్తి వృద్ధియగును. పూటకు రెండుచిన్నములయెత్తు చూర్ణమును వాముర సములో కలిపి దీనిని సేవింపనగును.

నేలనేరేడు:—సం. నాదేయి, క్షుద్రఫలఅందురు. నేలనేరేడు వగరు తీపిరుచులుగలది. కఫపిత్తములు, కంఠరోగము నశింపజేయును. మలబద్ధము శుక్రవృద్ధి గలుగజేయును.

నేలములగచెట్టు:—సం. బృహతి, క్షుద్రవార్తాకి, సింహికఅనియు హిం. కటాయి వరహంటా అనియుపేరు. నేలములకచెట్లు బీడవులందు తోటలందు వానియంత నవిపుట్టును. చెట్టునకు చిన్నముళ్లు పలచగనుండును. దీనియాకులు వంగఆకులవలె నుండును. గానివాటికన్న మిక్కిలిచిన్నవి. తెలుపు నీలిరంగులు పూవులుపూచును. తెల్లపూవులుపూచు ములక తెల్లనేలములక యనియు నీలిరంగుల పూలబూచునది నల్లనేలములకయనియు పిలువబడును. దీనికాయలు గుండ్రగ చిన్నవిగనుండును. పండినపుడు పసుపు పచ్చగనుండును. లేతకాయలు కూరవండుకొని తిందురు. మూలసారముగల మూలిక తెల్లది శ్రేష్ఠము

దీనివేరు కారముచేదురుచులు లఘుగుణము,ఉష్ణవీర్యము, కటువిపాకముగలది. హృదయమునకు మేలుచేయును. మలబంధము జీర్ణశక్తికలిగించును. కఫవాతములు, అరుచి, శ్వాసకాసలు, శూల, కుష్ఠు హరించును. వేరుచూర్ణమును మిర్యాలరసముతో నిచ్చిన దారుణ కఫకాసశమించును. ములక తెల్లజిల్లేడు వాకుడు, ఉస్తి, లేక ఉచ్చింత వీనిపుష్పములచూర్ణమును కొలదిగ పిప్పలిచూర్ణముతో చేర్చి తేనెతో కలిపి



నాకిన సమస్తకాసశ్వాసలు హరించును. సమూలకషాయమున శంఖభస్మమును చేర్చి త్రాగినను తేనెచేర్చి త్రాగినను శూల పిల్లికూతలు ఉబ్బసము నయమగును.

ములకకాయలు ఉప్పు, వగరు చేదురుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలవి. క్షయ, కాస, గుల్మము, ప్లీహ, ఉదరము అర్శస్సు శోథహరింపచేయును. దీపనపాచనముల గల్గించును.

లేతకాయలు త్రిదోషహరముగనుండును. ముదిరినవి పిత్తమును పెంచును. పండినపండ్లు శ్లేష్మమును పుట్టించును.

తెల్లపూవులుపూచు ములకకును పైగుణాదులుకలవు. మరియు నిది స్త్రీలగర్భదోషములు హరించి గర్భమునిలుపును. వేరుఅరగదీసి నేత్రములందంజనము చేసిన నానావిధములగు నేత్రవ్యాధులను నశింపచేయును. తెల్లములకవేరు రసమును ఒకమట్టిమూకుడునకుపట్టించి ఆవునేతి దీపముపైబోర్లించి పట్టిన కాటుక నేత్రములందు ధరించిన కండ్లపుసిమున్నగు కఫాభిష్యందవికారములు హరించును.

నేలయుసిరిగ:—సం. తామలకీ, భూమ్యామలకి, శివా, సూక్ష్మఫల అనియు, హిం. భుయిఆమలా, భద్రఆవలా, పాతాళఆవరా అనియుపేరు. నేలమీద బెత్తెడు మొదలు అడుగు యెత్తువరకు పెరుగు చిన్నమొక్క. దీనిఆకులు మిగులచిన్నవిగ కొలగ జమ్మిఆకులవలె నుండును. ఆకుయొక్క క్రిందిభాగమున యీనెనానుకొని సూక్ష్మమగు కాయలు వరుసగాపుట్టును. కాడలయొక్క యెరుపు తెలుపు భేదముచే నిది రెండువిధములు. యెర్రది రసవాదులు లోహములందు బరువు గల్గించుటకై వాడుదురు. మరియు తాళకమున్నగు పోగవస్తువులను కట్టి భస్మములుచేయుదురు.

సమూలరసము లేక చూర్ణము వగరు చేదు తీపిరుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. మూత్రకృచ్ఛ్రి, తాపము, యోని, దోషము, స్త్రీలగర్భదోషము, దప్పి, కాస, రక్తపిత్తము, కఫము, పాండువు, క్షతము, విషము, కుష్ఠు, ఎక్కిళ్ళు, క్షయ మున్నగు

రోగములను హరించును. రసమును వ్రణములపై పూసిన పుండ్లనుమాన్పును. గుక్కెడురసమునందు బేడెత్తుమిర్యాలచూర్ణమునుచేర్చి స్త్రీ బహిష్టయైన మూడుదినములందు ఉదయకాలములందు త్రాగించిన దారుణ ఋతుశూల ఋతుబద్ధము నశించును. ఆమూడుదినములును పొంగుసీళ్ళు అన్నము పాలుమాత్రము పథ్యముగనీయవలెను. బియ్యముకడిగిన నీళ్ళలో రసమునుకలిపి యిచ్చిన మూత్రము ధారాళముగవెడలి పొత్తికడుపులోనిపోటు నొప్పి తగ్గును. సమూలచూర్ణమును రెండుమొదలు 5 చిన్నములవరకు గోమూత్రముతోనిచ్చిన ఉబ్బు కామిల నయమగును.

నేలయుసిరిగఆకు హారతికర్పూరము కలిపి బిడ్డలమూత్రముతో నూరి శరీరమునకుపూసిన గజ్జి చిడుము వాడిపోవును. ఆకురసమందు నల్లకాచుచూర్ణము ఒకచిన్నంకలిపి యిచ్చిన జిగటవిరేచనము రక్తగ్రహణికట్టును.

నేలవేము:—సం. భూనింబ, చిరతిక్త, కిరాత, రామసేనకఅనియు, హిం. చిరాయతాఅనియుపేరు. చేదు రుచి లఘు రూక్ష సరగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. దప్పి కఫము పిత్తము జ్వరము కుష్ఠు దురద వాపు కృమి సన్నిపాతజ్వరము తాపము శూల మేహము వ్రణము శ్వాస కాసలు ప్రదరము అర్శస్సు అరుచి మున్నగు రోగములను హరించును.

నేలవేము త్రిఫలములు నేలయుసిరిగ వీనికషాయము చలిజ్వరమును ఆపును. జఠరదీప్తిగలిగించును. రక్తమును బాగుచేయును. నేలవేమును మెత్తగానూరి సెనగగింజలంత మాత్రలుచేసి తులసియాకురసముతో జ్వరమువచ్చుటకుపూర్వము గంటకొకమాత్రచొప్పున 4 మాత్రలనిచ్చిన మూడుదినములకు తప్పక ఆహ్నికజ్వరములు తగ్గును. నులిపురుగులునశించును. నేలవేము రసకర్పూరము కలిపి కందిగింజలంత మాత్రలుచేసి యిచ్చిన అజీర్తివిరేచనములు కలరా తగ్గును. సవాయిపుండ్లు మచ్చలు దురదనయమగును. నేలవేము స్వరసము 4 భాగము



లు నేయి 1 భాగము వేసి రసము యిగురువరకు కాచి వడియగట్టిన ఘృతమును పైకిపూయుటకును లోపలకు బలానుసారము తినుటకును ఉపయోగించిన కుష్ఠు పొడలు తగ్గును. నేలవేమును నలియగొట్టి మూడుగెట్లనీళ్ళలోవేసి ఒకరాత్రినిలవయుంచి ఉదయమునవడియగట్టి యాశీతకషాయమును గంటకు రెండుతులముల చొప్పున త్రాగుచున్న చిరకాలమునుండి బాధించు వరుసజ్వరములు మానును.

నేలవేము 8 భాగములు, వాము 5 భా॥ యవక్షారము, వెలిగారము, త్రిఫలములు, త్రికటుకములు, సైంధవలవణము, సౌవర్చలవణము, బిడాలవణము అనునవి ప్రత్యేకము ఒక్కొక భాగము యీవస్తువులనన్నిటిని చక్కగ చూర్ణించి వయోరోగబలానుసారముగ నాలుగుమొదలు 12 గుంజలెత్తువరకు ఉష్ణోదకముతో సేవించునెడల సకల విషమజ్వరములు నశించును. ఇది సింహళదేశమున ప్రసిద్ధముగ వాడు యోగము.

పంచకోలములు:—పిప్పలి, మోడి, చవ్యము, చిత్రమూలము, శొంఠి అను అయిదువస్తువులకూటమికి పంచకోలముఅనిపేరు. కారము రుచి తీక్షణ ఉష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము గలది. దీపనపాచనముల గలిగించును. కఫవాతములు గుల్మము ప్లీహ ఉదరము ఆనాహము శూల అనువానిని హరింపచేయును. పిత్తమును పెంచును.

కరకకాయ అజామోదము సౌవర్చలవణము ఇంగువ శొంఠి అనువాని కూటమికిగూడ గ్రంథాంతరమున పంచకోలమనిపేరు కలదు. ఇదియును దీపనపాచనములంజేయును.

పంచదార:—సం. శర్కరా, ఖానాండి, శుక్ల, సిత, అకాచ్ఛత్ర, సితోపల అనియు, హిం. బూరా, మిశ్రీ, బతాసే, కంద్ అనియు పేరు. చెరకురసమునుండియు, తేనెనుండియు, పుష్పమునుండియు, కొన్నివిధముల దుంపలనుండియు పంచదార తయారగును. శర్కర యావనాళశర్కర, యవాసశర్కర, మధుశర్కర, పుష్పశర్కర అనిఅనేకతరగతుల పంచదారలుకలవు. పంచదార తెల్లగ చూర్ణముగనుండును.

చెరకునుండి పుట్టిన పంచదార తీపిరుచి సరగుణము శీతవీర్యము మధురవిపాకముగలది తాపము దప్పి మూర్ఛ రక్తపిత్తము మోహము శోష జ్వరము శ్వాస ఛర్ది మదాత్యయము ఆయాసము విషదోషము దౌర్బల్యము క్షయ అతిసారము భ్రాంతి అర్శస్సు మున్నగు రోగములహరించును. బలము కఫము వీర్యము శుక్రము వృద్ధిజేయును. తృప్తినిచ్చును. శరీరమున వేగముగ వ్యాపించును. పరగడుపున పంచదారకలిపిన నీళ్ళనుగాని, పంచదారనుగాని యెక్కువగ సేవించిన జలుబు దగ్గు అగ్నిమాంద్యము గలిగించును. నులిపురుగును పుట్టించును. అనేక ఔషధములకు అనుపానముగ వాడదగియుండును. రెండుతులముల పంచదారను 6 తులముల నీళ్ళలోకలిపి త్రాగిన ఉమ్మెత్తవిషమును హరింపచేయును. తాంబూలమును మ్రింగుటచే పట్టిన గుండెనొప్పివికారమును తగ్గించును. పంచదారనీళ్ళను వెండిగిన్నెలోబోసి ఒకరాత్రి నిలవయుంచి తెల్లవారుజామున త్రాగుచున్న ఒంటితలనొప్పి తగ్గును. మూడుదినములు త్రాగవలెను. మరియు పటికిబెల్లమునకుగల గుణములన్నియు పంచదారయందుగలవు.

యావనాళశర్కరకు సంస్కృతమున యావనాళీ హిమోత్పన్న, హిమశర్కర క్షుద్రశర్కర అనిపేరు. తీపి చేదు రుచులు ఉష్ణవీర్యము స్నిగ్ధ పిచ్ఛిల సరగుణములు మధురవిపాకముగలది. తాపము వాత పిత్త రక్తదోషములు హరించును.

యవాసశర్కర తీపి వగరు చేదు రుచులు సరగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. వీర్యవృద్ధినిచ్చును. భ్రమ పిత్తము దప్పి జ్వరము అగ్నిమాంద్యము హరించును. గర్భిణులకు బాలురకు వృద్ధులకు బలహీనులకు విరేచనార్థముగ నుపయోగించదగియుండును. ప్రాతదియగు యవాసశర్కర చక్కగ విరేచనముచేయును.

మధుశర్కర అనగా తేనెనుండి తయారుచేసిన పంచదార తీపి వగరు రుచులు శీతవీర్యము గురు రూక్షగుణములు మధురవిపాకము గలది. తృప్తి బలము శుక్రము వృద్ధిచేయును. తృప్తినిచ్చును. ఛర్ది దప్పి తాపము పిత్తము అతిసారము రక్తపిత్తము కఫము అను వానిని హరింపచేయును.



పుష్పములనుండి తయారైన పంచదార (పుష్పశర్కర) తీపిరుచి గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. పిత్తమును రక్తదోషమును హరించును. మనోహరముగనుండును.

శర్కరలన్నియు సామాన్యముగ దాహము దప్పి రక్తపిత్తము ఛర్ది మూర్ఛ అను రోగములను హరింపచేయునవై యుండును.

పంచదారకు సాధారణముగ నిమ్మపండు చింతపండు మామిడిఫలము మున్నగు అమ్లపదార్థములు విరుగుడుగనుండును.

పంచపల్లవములు—మామిడి నేరేడు వెలగ మాదీఫలము మారేడు అను నైదుచెట్లయొక్క చిగుళ్ళకు పంచపల్లవములనిపేరు. వీనిని పరిమళమునుగల్గించు క్రియావిశేషములందుపయోగింతురు. వీనికషాయము పిత్తాతిసారమును హరించును. మలబద్ధము చేయును. రూక్షగనుండును.

పంచలవణములు—సైంధవలవణము, సౌవర్చలవణము, బిడలవణము, కాచలవణము, సముద్రలవణము అను నైదువస్తువులుకలసి పంచలవణములనబడును.

ఉప్పు రుచి రూక్షగుణము శీతవీర్యము మధురవిపాకము గలది. శరీరమును శోషింపచేయును. రుచిబుట్టించును. మలమును వెడలించును. విదాహమునుపుట్టించును. నేత్రములకు హితముజేయును. వాతకఫములు శూల ఆనాహము మున్నగురోగములహరించును.

పంచలవణములను మూక్కొండఆకురసముతో నూరి ఉడికించి మరల ఆకురసముతో నూరి బిళ్ళలుచేసి మూకుళ్ళలోనుంచి గాఢముగ పుటము వేయునది. యిట్లు 7 సార్లుచేసిన లవణములు యెఱ్రగ సిందూరించును. దీనిని రెండుమొదలు ఆరుగుంజలెత్తువరకు వాముర సముతోగాని అల్లపురసముతోగాని యిచ్చిన దారుణమగుశూల అజీర్ణము కడుపుబ్బరము హరించును. మలమూత్రముల జారీచేయును. ఆకలిబుట్టిం

చును. మరియు పంచలవణములను కట్టుకట్టియు జయనీరులుచేసియు భస్మముగావించియు వాదవిద్యయందు వాడుదురు.

పంచసుగంధములు: — చూ. యక్షకర్దమము:

పందిలిదోస:—సం. చీనాకర్కటీ యనియు, హిం. చీనాకకడీ యనియుపేరు. మామూలు దోసకాయకంటె పెద్దది. తీపి రుచి గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. పిత్తమునుహరించి కఫవాతములను తృప్తిని కలిగించును. తాపము శోష హరింపచేయును.

పందిమాంసము:—సం. కిటి, సూకర అనియు, హిం. సువ్వర్ అనియుపేరు. పందిమాంసము వాతము బలము కాంతి గలుగజేయును. బుద్ధిమాంద్యము దెచ్చును. క్రొవ్వుపుట్టించును. పందిమాంసము ధూపమువేసిన భూతబాధ దుష్టవ్రణములు జ్వరము నయమగును. ఊరబందిమాంసముకన్న అడవిపందిమాంసము మంచిది. చూ. అడవిపంది.

పంపరపనసపండు:—గుండ్రగ సూర్యగుమ్మడికాయంతయుండును, దీనిపైచర్మము గరుసుగనుండును. పండువలిచిన దూదివంటి కండ యెక్కువనుండి లోపల తొనలుండును. ఇవియెర్రగను కొన్ని తెల్లగను ఉండును. కొంచెము పులుపు తీపి రుచులు శీతవీర్యము గురుగుణము మధురవిపాకముగలది. అజీర్ణము శరీరముబరువు మొదలగు దుర్గుణములను కలిగించును. తృప్తినిచ్చును. రుచిగనుండును.

పక్కిచెట్టు:—సం. పిచుల, ఝావుక, బహుగ్రంథిక అనియు, హిం. ఝావూకావృక్ష అనియుపేరు. ఈచెట్టు తరుచు నదీతీరములందుపుట్టును. చెట్టుఅంతట గణుపులును విశేషముగ చిన్నచిన్నపండ్లును ఉండును. దీనికర్ర మిగులగట్టిది. దీనినినరికిన పాలుగారును. ఇది కారము చేదు రుచులుగలది. మూత్రకృఛ్రమును హరించును. దీనిపాలను పట్టించి పసుపుచల్లినయెడల కాలిపగుళ్ళుమానును. చేదు రుచి కలదిగనుకను పుల్లచివర నమిలినయెడల కుంచికవలెనుండి దంతసంధులందలి మలమును చక్కగ పోగొట్టును గనుకను దీనిపుల్ల దంతధావనముచేయుట కనుకూలమైనది.



పక్వరసశీధుమద్యము:—శీధు అను పేరుగల మద్యము కాచిన చెరకురసమువలన తయారుచేయబడినదనియు కాచని చెరకురసమువలన తయారుచేయబడినదనియు రెండువిధములు. వీనిలో కాచిన చెరకురసముచే తయారుచేయబడిన శీధువు మేదస్సు శోఫ ఉదరవ్యాధి అర్శస్సు అనువానిని హరింపచేయును.

పగడపుతీగచెట్టు:—చూ. సువ్వగుత్తి.

పగడము:—సం. విద్రుమ, ప్రవాళ, భౌమరత్న, లతామణి అనియు, హిం. మూంగాఅనియుపేరు. సముద్రమునందుపుట్టును. రత్నములలో చేరినది. దొండపండువంటి ఛాయిగలిగి గుండ్రనై పొడవుగలిగి వంకరలేక నున్నగ గోగ్గులు పుచ్చులులేక స్థూలముగనుండు ప్రవాళము శ్రేష్ఠము. పాండురధూసర వర్ణములుగలదియై చిన్నదిగ పుచ్చులు గోగ్గులు పొరలు గలదినుండు ప్రవాళము మంచిదికాదు. ప్రవాళము మధురఆమ్లరసములు లఘుగుణముకలది. కఫపిత్తములు, క్షయ, పిత్తరక్తకాస విషభూతాది వికారములు నేత్రరోగములు అనువానిని హరింపచేయును. దీపనపాచనముల గల్గించును, శోధనమారణములజేసిసేవించవలెను. సులక్షణముగల పగడములను ధరించిన స్త్రీలకు మంగళప్రదముగ నుండును. ప్రవాళభస్మసేవచేత వీర్యవృద్ధి పుష్టి కాంతిబలము కలుగును. సాధారణముగ వచ్చుబిడ్డల దగ్గులకు గుంజెత్తుభస్మమును వెన్నలోకలిపి యివ్వవలెను పగడములను నిమ్మపండురసములో ఒకజాము నానబెట్టి వేడినీళ్ళతో కడిగిన శుద్ధమగును. అట్టిదానినిచక్రకేళీఅరటి పండులోపెట్టి శరావసంపుటమునందుంచి గాఢపుటమువేసిన భస్మమగును. యీభస్మము మేహము నణచును. వీర్యనష్టకట్టును. మేహమువలన గలిగిన శరీరముమీది మచ్చలుతగ్గును. అనేకతుల ప్రవాళభస్మ ప్రక్రియలుకలవు. వట్టిభస్మమును తినిననోరుపొక్కును. గానఅనుపానము లేకనే దీనిని సేవించరాదు. పెద్దవారలకుభస్మమును ఒకటిమొదలు ఆరుగుంజలెత్తువరకు వాడవచ్చును. రుద్రాక్షప

గడము తేనెతోఅరగదీసి యాగంధమును నాలుకపై రుద్దినయెడల సన్నిపాతాదులందు పుట్టుజిహ్వాదోషములు తగ్గును.

పగటినిద్ర:—రాత్రిజాగరణము చేసినవారు సంభోగము మార్గాయాసము అధికవ్యాయామము మద్యపానము వీనిచేనలసినవారు అతిసారము శూల శ్వాస వెక్కిళ్ళు అను నీరోగములు కలవారు. ఉపవాసముచేసినవారు పగటియందు నిద్రించిన యెడల ఆరోగ్యము సుఖము కలుగును.

పచ్చకర్పూరము:—హారతికర్పూరముతో అనేకవిధముల తయారుచేయుదురు హారతికర్పూరముయొక్క సకలప్రభావములు దీనియందుండును. గాని అనేకరెట్లు దానికన్ననిది ఉత్తమగుణములుకలది. గవ్వపలుకుసాంబ్రాణి 4 తులములు, హారతికర్పూరము 4 తు॥ లవంగాలు, జాపత్రి జాజికాయ, యాలకులు, కస్తూరిపసుపు, గవిలాలు, కుంకుమపూవు, కచ్చూరాలు, ఇవి ప్రత్యేకము అరతులము. వీనినెల్ల పన్నీరుతోగాని మల్లిపూవులరసముతో గాని మెత్తగానూరి ముద్దజేసి యొకపాత్రలోపెట్టి ఆపాత్రకుపైన సందులేకుండ సరిపోవు పింగాణీపాత్రను బోర్లించి గట్టిగా సంధిబంధము గావించి యాసంపుటమును సన్ననిమంటపై బెట్టి వండవలెను. కొంతసేపటికి పైమూతకు అడుగున పలచగ పచ్చకర్పూరముపట్టియుండును. పచ్చకర్పూరము తయారుచేయు పద్ధతులలోనిదియొకటి. ఇట్లు స్వచ్ఛముగ తయారుచేసిన పచ్చకర్పూరము చేదు రుచి శీతవీర్యము లఘుగుణము కటువిపాకము కలిగియుండును. క్రిమి రక్తపిత్తము నేత్రవ్యాధులు దప్పి తాపము అజీర్ణవిరేచనములు సెగరోగము శ్లేష్మవాతములు నిక్కాక అతిమూత్రము శుక్లనష్టము దుర్గంధము పిత్తవికారములు అనువానిని హరింపచేయును. తాంబూలముతో పచ్చకర్పూరమును తినిన ముఖదుర్గంధము పుప్పిపంటిబాధ పంటిబాధ దంతములుకదలుట మున్నగునవి శమించును. చలువచేయును. హెచ్చుగతినిన పడిసెము బుట్టించును. అనేక ఔషధయోగములలోచేర్చి దీనినివాడదగును. ఒకకుండలో సగమువరకు ఆవుపాలు



పోసి వాసెనగట్టి వాసెనపైన మల్లిపూవులుపరచి ఆపైని పచ్చకర్పూరమును సన్ననిగుడ్డలో మూటగట్టి పెట్టి పైన పూవులుకప్పి మూకుడు మూసి సన్ననిమంటబెట్టి పాలఆవిరిచే నొకగంటసేపు ఉడికించి తీసి యా కర్పూరమును మల్లెపూలరసముతోను పన్నీరుతోను ఆవుపాలతోను మూడుదినములునూరి భద్రపరచునది. దీనిని కన్నులలో నంజనముచేసినచో వేడివలనబుట్టు కండ్లయొప్పులు మంట నీరుగారుట మూడుపోటు మున్నగు బాధలు నివర్తించును.

పచ్చపెసలు:—సం. హరిన్ముద్గ శరద అనియు, హిం. హరీమూంగ్ అనియుపేరు. పెసలలో అనేకజాతులుకలవు. ఇవి వగరు రుచులు లఘుగుణము శీతవీర్యము మధురవిపాకము గలవి. మూత్రవ్యాధులు రక్తవికారము కఫపిత్తములు హరించును. మలమును గట్టిపరచును. స్వల్పముగ వాతమునుకలిగించును. నేత్రములకు హితముగ నుండును. అన్నిజాతులలో పచ్చపెసలు శ్రేష్ఠమునైనవి. పొట్టుతీయని పెసలు రుబ్బి అల్లము జీలకర్ర సైంధవలవణముచేర్చి నూరి నేతిలో అట్టువలెచేసి వేగనిచ్చి ప్రాతఃకాలమున దినుచున్న పిత్తము కడుపులోమంట అరుచి తగ్గును. అన్నహితముకలుగును. విరేచనబద్ధమును విప్పును.

పచ్చసిరుల్లి:—చూ. సిరుల్లి.

పచ్చలు:—సం. గరుత్మత, అశ్మగర్భ, మరకత అనియు, హిం. పన్నా అనియుపేరు. ఆకుపచ్చరంగు బరువు స్నిగ్ధత కాంతి గనుపుగల మరకతము (పచ్చ) శ్రేష్ఠమైనది. ఇది శరీరమునధరించుటకును శోధన మారణములజేసి సేవించుటకును ఉపయోగించును.

పచ్చలభస్మము మధురరసము శీతవీర్యము లఘుగుణము మధురవిపాకముగలది. బలము కాంతి పుష్టి అగ్నిదీప్తి సన్నిపాతము జ్వరము ఛర్ది విషదోషము శ్వాస సంతాపము దుర్నామరోగము పాండువు శోఫ వీనిని హరించును.

మరకతమును నేలగుమ్ముడుగడ్డ మధ్యబెట్టి చీరజేసి యెండించి కుక్కుటపుటమువేసిన శుద్ధమగును పిదప వాకుడుకాయల రసమునం

డు భావనచేసి కొండపిండి వేళ్ళ రసముతో మర్దించి పుటముపేసిన భస్మమగును. శోధన మారణములజేయక పచ్చిగనుపయోగింపజనదు

పటికి:—సం. లోహద్రావీ, సుభగ, టంకణ, ధాతువల్లభ అనియు, హిం. సుహాగాయనియుపేరు సౌరాష్ట్రదేశమున గనులలోపుట్టు నొకవిధమగుమన్ను. గుడ్డలకు రంగువేయుటకును లోహములను స్వచ్ఛముగ ద్రవింపజేయుటకును ఉపయోగింతురు. ఇందు పటికి పుల్లిక అని రెండువిధములు. పటికి కొంచెము పచ్చగను బరువుగను నునుపుగను ఉండును. పుల్లిక తేలికగ తెల్లగ నునుపుగ పుల్లగ నుండును. నుడిము గొన్నితంత్రములందు చూర్ణము ఖండము అనుపేళ్ళతో తెలుపు నలుపు వర్ణములుగలిగి పటికి రెండువిధములుగ నుండునని చెప్పబడెను. ప్రకృతము తెల్లగ రాళ్ళవలెనుండు పటికి మనకుదొరుకుచున్నది,

ఇది వగరు కారము పులుపు రసములు రూక్ష తీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. విషము వ్రణము కుష్ఠము అనువ్యాధులను విశేషముగహరించును. కంఠరోగము బొల్లి నేత్రవ్యాధులుహరింపజేయును. మొద్రుకలకు నలుపెక్కించును. మూత్రమునుగావించును. రసజారణమునకుపయోగించును. పటికిని నిప్పుపై వేసి పొంగించి చూర్ణముచేసి వాననీళ్లలోకలిపి వడియగట్టి కండ్లలోబోసిన దురద పుంట పుసి మెరుపు తగ్గును. మంచినీళ్ళలోగాని తుమ్మచక్కమున్నగువగరువస్తువుల కషాయములోగాని కలిపి పుక్కిటబట్టిన రసపుపుండ్లు చిగురు వాపు నాలుకపూతతగ్గును. తెల్లజొన్నలకడుగులో కలిపి యిచ్చిన రక్తప్రదరము తగ్గును. రక్తవమనముకట్టును. పటికి సురాకారము వెలిగారము మూడును సమభాగములుగ కలిపి నిప్పులపైవేసి పొంగించి చూర్ణించి బలానుసారముగ నిచ్చిన తెల్లకుసుమతగ్గును. మూత్రబంధమునువిప్పును. రసవాదమునందు పటికి అనేకవిధముల నుపయోగబడును.

పణ్యాంధాతృణము:—సం. పణ్యాంధా, కంగుణీపత్ర, పణ్యధాన్య పణధా అనిపేరు. చిన్నమొక్కగ మధ్యమముగ కొంచెము పెద్దదిగ



మూడువిధములుగ మొలచును. మధ్యమముగనుండు పణ్యాంధాతృణము రసవీర్యాదులందు ఉత్తమము.

ఇది చేదు ఉప్పు రుచులు సరగుణము సమశీతోష్ణవీర్యము కటువిపాకముగలది. తత్కాల శస్త్రఘాతము (నరుకు గాయము) లకు దీనియాకునుతొక్కి కట్టినయెడల శీఘ్రముగమాన్పును.

పత్రబీజము:—సం. బీజపత్రి, హేమసార అనియు, హిం. జక్మే హయాత్ అనియుపేరు. దీనిని గాయపాకు అందురు. ఆకులు పాతిపెట్టిన వేరునాటి మొక్క మొలచును. ఆకు మందముగ పెళుసుగ గరుకుగ కంగోరాకలిగియుండును.

వగరు ఉప్పు రుచులు శీతవీర్యము రూక్షగుణము మధురవిపాకముగలది. ఆకును తిరుగవేసి వ్రణములపైగట్టిన పెంచును. బోర్లగిల వేసి కట్టిన పగులగొట్టును. ఆకునూరి కట్టుగట్టిన మోకాళ్ళు మోచేతులలోవచ్చు పట్టునొప్పులు తగును. పప్పులోవేసుకొని కూరవండుకొని తినిన చలువ మేహశాంతిచేయును.

పద్మకము:—సం. మలయ, చారు, పీతరక్త, సుప్రభ అనియు హిం. పద్మాక్ అనియుపేరు. ఇది పెద్దవృక్షము. కేదారములందును, హిమాలయప్రదేశములందును పుట్టును. దీనికిపండ్లుండవు. పసుపు మెరుపు రంగులుకల పూవులపూచును. పూవులు పరిమళముగలిగి యుండును. ఈచెట్టుయొక్క కట్టెను ఔషధములందుపయోగింతురు.

కషాయతిక్తరసములు శీతవీర్యము, లఘుగుణము, కటువిపాకముకలది. తాపజ్వరము విస్ఫోటము కుష్ఠు కఫము రక్తపిత్తము దప్పి విసర్పము మేహము జ్వరము దురద భ్రమ ఛర్ది మున్నగు రోగముల హరించును. నష్టసంతానముగల స్త్రీలు దీనికషాయమును సేవించిన సంతతినిలుచునట్లు చేయును. గర్భస్రావముకలుగకుండ ఆపును. గర్భదోషములనన్నిటిని మాన్పును.

పనసచెట్టు:—సం. పనస, కంటికిఫల, బృహత్ఫల. అపుష్పఫలద అనియు, హిం. కటహర్, కటహల్, ఫణైల్ అనియుపేరు. పెద్ద

మొర్రప్రత్తి మధురరసము లఘుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. ఆకు కాయ పూవు వీటిరసము వాతము, విషవికారము చెవి కన్ను వీనియందలిరోగములు హరించును. పూవుల రసమునందు పంచదారకలిపి యిచ్చిన నాభి విషమును లేతకాయల రసమునందు పంచదారచేర్చి యిచ్చిన పాషాణవిషమును ఆకు కాయ పూవు అను మూటిరసమును కలిపి యిచ్చిన యెలుక పాము మొదలగు జంగమవిషములనుహరించును.

ఆకులను నిప్పులపై వెచ్చచేసి నలిపి రసమును చెవిలోపిండిన చెవినుండి చీముకారుట చెవిలో హోరు చెముడుతగ్గును.

పూవులరసమును కంటిలోబోసిన కండ్లకలకతగ్గును. ఆకుల రసముతోనూరి అయిదారు పుటములుబెట్టిన బంగారు వెండి మున్నగు కొన్నిలోహములు భస్మములగును. పైడిప్రత్తిగింజలలోని పప్పు నెమలియీకల భస్మము తెల్లపట్టుబట్టభస్మము కాకిదొండగింజలలోని పప్పు ఏలకకాయలు సమభాగములుగ చూర్ణించిన కార్పాసాది చూర్ణమనబరగును. దీనిని తేనెతోనాకిన ఛర్ది ఎక్కిళ్ళు అరుచి మున్నగునవి తత్క్షణము శమించును, ప్రత్తిగింజలను నలియగొట్టి కషాయముగాచి అందు శర్కరజేర్చి త్రాగినచో స్త్రీలకు స్తన్యము పుట్టును. ప్రత్తిగింజలపప్పు మధురరసము స్నిగ్ధ గురుగుణములు శీతవీర్యము మధుర విపాకముగలది.

పరమాన్నము:—సం. క్షీరోదనం, క్షీరేయీ, పాయసం అని పేరు. పాలలో బియ్యము శర్కర చేర్చి వండినది పరమాన్నమన బడును. మధురరసము గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది ఆలస్యముగ జీర్ణమగును. బలము ధాతుపుష్టి కఫము తృప్తి గలిగించును. మలమును బంధించును. పిత్తరక్తము దప్పి వాతము వీనిని నశింపచేయును.

పర్పటపుచెట్టు:—సం. జతుక, రంజని, పర్పటి అనియు, హిం. పపడీ అనియుపేరు. ఇదిపెద్దచెట్టు. వగరు చేదు రుచులు శీతవీర్యము

వ. వస్తుగుణదీపము. ౨౨౩

మొర్రప్రత్తి మధురరసము లఘుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. ఆకు కాయ పూవు వీటిరసము వాతము, విషవికారము చెవి కన్ను వీనియందలిరోగములు హరించును. పూవుల రసమునందు పంచదారకలిపి యిచ్చిన నాభి విషమును లేతకాయల రసమునందు పంచదారచేర్చి యిచ్చిన పాషాణవిషమును ఆకు కాయ పూవు అను మూటిరసమును కలిపి యిచ్చిన యెలుక పాము మొదలగు జంగమవిషములనుహరించును.

ఆకులను నిప్పులపై వెచ్చచేసి నలిపి రసమును చెవిలోపిండిన చెవినుండి చీముకారుట చెవిలో హోరు చెముడుతగ్గును.

పూవులరసమును కంటిలోబోసిన కండ్లకలకతగ్గును. ఆకుల రసముతోనూరి అయిదారు పుటములుబెట్టిన బంగారు వెండి మున్నగు కొన్నిలోహములు భస్మములగును. పైడిప్రత్తిగింజలలోని పప్పు నెమలియీకల భస్మము తెల్లపట్టుబట్టభస్మము కాకిదొండగింజలలోని పప్పు ఏలకకాయలు సమభాగములుగ చూర్ణించిన కార్పాసాది చూర్ణమనబరగును. దీనిని తేనెతోనాకిన ఛర్ది ఎక్కిళ్ళు అరుచి మున్నగునవి తత్క్షణము శమించును, ప్రత్తిగింజలను నలియగొట్టి కషాయముగాచి అందు శర్కరజేర్చి త్రాగినచో స్త్రీలకు స్తన్యము పుట్టును. ప్రత్తిగింజలపప్పు మధురరసము స్నిగ్ధ గురుగుణములు శీతవీర్యము మధుర విపాకముగలది.

పరమాన్నము:—సం. క్షీరోదనం, క్షీరేయీ, పాయసం అని పేరు. పాలలో బియ్యము శర్కర చేర్చి వండినది పరమాన్నమన బడును. మధురరసము గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది ఆలస్యముగ జీర్ణమగును. బలము ధాతుపుష్టి కఫము తృప్తి గలిగించును. మలమును బంధించును. పిత్తరక్తము దప్పి వాతము వీనిని నశింపచేయును.

పర్పటపుచెట్టు:—సం. జతుక, రంజని, పర్పటి అనియు, హిం. పపడీ అనియుపేరు. ఇదిపెద్దచెట్టు. వగరు చేదు రుచులు శీతవీర్యము

లఘుగుణము కటువిపాకముగలది. విషము వ్రణము కఫము పిత్తరక్తము కుష్ఠము గురద తాపము దప్పి ఛర్ది హరించును. రుచిబుట్టించును అగ్నిదీప్తినిచ్చును.

పర్పాటకము:—సం. పర్పట, తృష్ణారి, వరతిక్త, కవచ అనియు, హిం. పిత్తపావడా, దవనపాపరా అనియుపేరు. ఇది చిన్నక్షుపము. సన్నని చిన్నఆకు చిన్నచిన్న కాయల వెన్నున్న ఉండును. పూవుల నలుపు మెరుపు రంగులభేదముచే రెండువిధములు. ఎఱ్ఱపూవులది శ్రేష్ఠము.

చేదు రుచి శీతవీర్యము లఘుగుణము కటువిపాకముకలది. అన్నివిధములగు దప్పికలను అణచును. వాతమును పెంచి పిత్తకఫములనశింపచేయును. అరుచి ఛర్ది తాపము ఆయాసము భ్రమ మదము దగ్గు క్రిమి వీనినిహరించును. దీనికూరతినిన రక్తాతిసారము తగ్గును. విదాహమునణచును. నోటియందునీరూరించును. మలబద్ధముచేయును. పర్పాటకము విశేషముగ తృష్ణా (దప్పి) రోగమునందుపయుక్తమగును.

పల్లివాహతృణము:—సం. దీర్ఘతృణ, సుపత్ర, తామ్రవర్ణ, అదృఢ అనిపేరు. ఇది పొదవుగ పెరుగును. దీనిని పశువులకుమేపిన పశువుల బలమునుహరించి నీరసింపచేయును. నిరుపయోగమైనది.

పల్లేరు:—సం. గోక్షుర, ఇక్షుగంధ, శ్వదంష్ట్రి, స్వాదుకంటక వనశృంగాట అనియు, హిం. గోఖుర్ అనియుపేరు, ఇది చిన్నచెట్టు. తెల్లగనుండును. వర్షకాలమునందు బాగుగామొలచి వేసవియందుమాడిపోవును.

దీనిపూవులు నువ్వుపూవుల ఆకృతిగలిగి పసుపుపచ్చగ నుండును. కాయలు గచ్చలాయంత ఉసుపుగలిగి ప్రక్కలందు నాలుగు ముండ్లుండును. దీనిని ఏనుగుపల్లేరని పెద్దపల్లేరని వాడుదురు. ఇందు చిన్నపల్లేరుఒకటికలదు. ఇదినేలప్రాకును. ఆకులు చింతాకులవలెనుండును. దీనిపూవులు చిన్నవిగ యెఱ్ఱగ నుండును. దీనికాయలకు 4 జంటముం



డ్లుండును. సంస్కృతమున క్షుద్రగోక్షుర, బహుకంటక, గోకంటక అనియు, హిం. ఛోటీ గోఖుర్ అనియుపేరు.

తిక్త మధుర రసములు శీతవీర్యము స్నిగ్ధగుణము మధురవిపాకముగలది. బలము వస్తి శుద్ధి పుష్టి కలిగించును. అగ్నిదీప్తి నిచ్చును. మూత్రకృచ్ఛ్ర, అశ్మరి, దాహము, మేహము, శ్వాస, కాస, హృద్రోగము, అర్శస్సు, కుష్ఠు, శూల, త్రిదోషవికారములు, వాతవ్యాధి హరింపచేయును పల్లేరాకు కూరవండుకొనితినిన స్రోతస్సులుబాగుపడును. మూత్రము జారీచేయును. కీళ్ళనొప్పులు తగ్గును. ఆకులను నీడనెండించి ఆకులో చుట్టవలెచుట్టి పొగబీల్చిన శుక్రమువృద్ధియగును. పల్లేరువేరురసమునందు యవక్షారముకలిపి త్రాగిన మూత్రము తక్షణమువెడలును. మూత్రపుసంచియందలి రాళ్ళుపడిపోవును. వేరు చూర్ణమునందు అడ్డిగెత్తుచా॥ శతపుటకృష్ణాభ్రక సిందూరమునుకలిపి దినమునకు రెండుసాగులు పుచ్చుకొనుచున్న జీర్ణించిన సెగరోగములుమానును. మూత్రపుచురుకుకట్టును. చూర్ణపు మోతాదు 2 చిన్నములు. పల్లేరుసమూలరసము 4 భా॥ నువ్వులనూనె 1 భా॥ కలిపి రసము యిగురువరకు కాచి వడియగట్టి మర్దనచేయుచు లోపలకుకూడ సేవించునెడల మేహనొప్పులు కీళ్ళనొప్పులు మేహవాతపునొప్పులు తగ్గును. పల్లేరుకాయల చూర్ణమును ఆవుపాలలోవేసి ఉడికించి పంచదారకలిపి సేవించుచున్న శుక్లనష్టముకట్టును. వీర్యము గట్టిపడును. పుంస్త్వము సంభోగశక్తి హెచ్చించును. పల్లేరుక్షారము స్రోతస్సులను శుద్ధపరచును. వాతమును మూత్రకృచ్ఛ్రమును హరించును. చిన్న పల్లేరునకుగూడ యివియేగుణములు. గాని పెద్దపల్లేరుమంచిది. పల్లేరు 28 పలములు నలియగొట్టి ఆరురెట్ల నీటిలోవేసి సగము మిగునటులగాచి వడియగట్టి అందు 7 పలములు శుద్ధిజేసిన గుగ్గులుచూర్ణమునువేసి పాకమువచ్చువరకు కాచి శొంఠి పిప్పళ్ళు మిర్యాలు కరకతాని యుసిరిగలు తుంగముస్తలు యివిప్రత్యేకము ఒకప॥ చొప్పునచూర్ణించి యందుచేర్చి కలియబెట్టి దించి కుంకుడుగింజలంత మాత్రలుచేసి భద్రపరచునది ఇదియ

గోక్షురాదిగుగ్గులు అనబడును. దీనిని సేవించిన ప్రమేహము మూత్రకృచ్ఛ్రి ప్రదరము మూత్రాఘాతము వాతరక్తము వాతవ్యాధులు శుక్రదోషము అశ్మరి మున్నగునవి నశించును.

పసుపు:—సం. హరిద్ర, నిశా, పీతా, యువతి, హేమరాగిణి అనియు, హిం. హలదీ అనియు పేరు. దుంప ప్రధానముగగల మొక్క. ఆకులు పొడవుగ కొనదేరియుండును. ఆకులకుగూడ పసుపువాసనకలదు. గెలవేసి పూలుపూచును. ఇందు అనేకభేదములుకలవు.

పసుపుదుంప కారము చేదు రుచులు రూక్షగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. కఫవాతముల జయించును. శరీరకాంతినిచ్చును. పాండువు మేహము వ్రణము దురద కుష్ఠము రక్తదోషము ప్రమేహము చర్మదోషము కృమి విషము శ్వాసకాసలు మున్నగు అనేకరోగములబోగొట్టును. పసుపుచూర్ణమును నరమూత్రములో కలిపి త్రాగిన కృష్ణసర్పవిషము హరించును. పచ్చిపసుపు రసమునందు మిర్యాలచూర్ణముచేర్చి త్రాగిన దారుణ కఫ కాస తగ్గును. సున్నము పసుపు కలిపి నూరి అరికాళ్ళకు అరిచేతులకు రాచినయెడల సన్నిపాతమందలి కరపాద శీతలముతగ్గి వేడిపుట్టును. కుష్ఠవ్రణములపైన పసుపును చల్లిన నవిమానును. పసుపుకషాయమును త్రాగిన ఉబ్బు కామిలతగ్గును. ప్రతిదినమున శరీరమునకు పసుపుపూసి స్నానము చేయించుచున్నచో చంటిపిల్లలకు చిడుముమొదలగు చర్మరోగములు పుట్టకయుండును. వేపాకు పసుపు కలిపి నూరి మశూచికపుపొక్కులకు పూతబెట్టిన దురదనుపోగొట్టి వెంటనే ఆరి ఊడిపోవునట్లుచేయును. దుర్గంధమునుహరించును. పసుపుకొమ్మును జిల్లేడుపాలతో 3 దినములు భావనచేసి నాల్గవదినమున పుటమువేసి యామసిని తమలపాకులోపెట్టి నమిలిన ఆయాసముతో కూడిన దగ్గుతగ్గును. పసుపుకొమ్మును కరక్కాయ నీళ్ళతో అరగదీసి కన్నులలోబెట్టిన పొరలుకోయును. శ్లేష్మసంబంధమగు నేత్రరోగముకుహరించును. ఆవుపెరుగుమీద మీగడలో పసుపు కలిపి అర్ధాంగరలు గడ్డలు వీనిపై మందముగావేసి ఆరనిచ్చిన యెడల నవి అణగిపోవు



ను. పసుపునీళ్ళలో ముంచిన గుడ్డను మంచమునకుచుట్టు కట్టినయెడల దోమలుకుట్టకుండ నుండును. సలసలకాగుచున్న నీళ్ళలో పసుపుకొమ్ము చెము ఊకవేసి ఆవిరి శరీరమునకుతగులునట్లు పట్టిన పడిసెపు భారము తత్క్షణముతగ్గును. పసుపు కరివేపాకువేసి కాచిన కషాయముతో కడిగిన మురికివ్రణములు త్వరగ మానుపట్టును. సున్నము పసుపు కలిపి నీళ్ళతోతడిపిన యెర్రబడును. దానికి పారాణి అనిపేరు. దానిని కట్టు కట్టినయెడల కణుపు జెష్ఠ అనగ వేళ్ళకణుపులలో లేచెడు పుప్పిగోరు గోటిలోలేచెడు పుండ్లు వీనిపోటుతగ్గును. వెంటనే మానును. పసుపు కొమ్మును నీళ్ళలోఅరగదీసి యొక రాగిపళ్ళెమునకు పూసి ఆముదపు దీపముపైన బోర్లించి అందు పట్టిన కాటుకను కండ్లలోపెట్టిన పొరమసక దురదమున్నగు అనేక నేత్రరోగములు మానును. పసుపును కాగితములోచుట్టి కాల్చి పొగ బీల్చిన దగ్గు ఆయాసము తగ్గును, పసుపు నల్లమందు తుమ్మాకు కలిపి నూరి కండ్లకుచుట్టు పట్టువేసిన యెరుపుపోటు తగ్గును.

పాచితీగ:—సం. ఆకాశవల్లి అనియు, హిం. అమరవేల్ అనియుపేరు. ఇది చెట్లమీద సన్నముగ త్రాళ్ళవలె పాకును. దీనికివేరు యెచ్చటను కానబడదు. పసుపు ఆకుపచ్చరంగులుకలిగియుండును.

ఇది చేదు వగరు రుచులు పిచ్ఛిలగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. నేత్రరోగము పిత్తశ్లేష్మములు ఆమదోషము అగ్నిమాంద్యము హరించును. మలబద్ధముచేయును. వీర్యవృద్ధి బలముకలిగించును. దివ్యమైనయౌషధము. దీనినికాల్చి మసిచేసి దుసికి తెట్టెంపు మృద్దారుశృంగినిచేర్చి తెల్లజిల్లేడుపూవుల రసముతో మెత్తగామర్దించి భగందరవ్రణముపై పూసినయెడల అతిశీఘ్రముగ లూటీలుపూడి వ్రణము నశించిపోవును. ఇతరములగు దుష్టవ్రణములకును వేయవచ్చును ఇది దృష్టప్రత్యయమైన మహౌషధము.

పాదరసము:—సం. పారద, సూత, రసేంద్ర, రుద్రవీర్య అనియు, హిం. పారా అనియుపేరు. ప్రసిద్ధమైన వస్తువు మనకు దొరకు

చున్న రసమునందు పండ్రెండుదోషములుండును. అట్టిదోషములు నివర్తించుటకై స్వేదన మర్దనాది సంస్కారములుచేసి ఔషధాదులందువాడనగును. రసమును శుద్ధిచేసి బద్ధము భస్మము సిందూరము కర్పూరము మున్నగు అనేకవిధములగు పరిణామముల నందించు విధానములు విపులముగ వ్రాయబడినవి. సక్రమముగ సిద్ధమైనరసమును సేవించిన ముదిమి మరణములేకుండచేయును. సాధారణముగ వ్యాధులను హరించుటకై రసమునకు 8 సంస్కారములుగావించి ఆయా యోగములలో కూర్చి సేవించిన కుష్టము క్షయ సన్నిపాతము కృమి సవాయి శ్వాస కాసలు మున్నగువ్యాధులన్నియు నశించును. దేహపుష్టి బలము కాంతి శుక్రము గలుగజేయును. శీఘ్రముగ శరీరమున వ్యాపించును. స్వల్పమోతాదుతో రోగము హరించుటచేతను అరుచిని కల్గించకుండుట చేతను శీఘ్రముగ ఆరోగ్యము నిచ్చుటచేతను యితర ఔషధములకన్న రసము శ్రేష్ఠము. రసమును పైకిపూయుటచేత సకల చర్మరోగములు హరించును. అపరిశుద్ధమైన రసమును సేవించినచో ఔషధ సాధ్యము కాని రోగములుపుట్టును. వట్టిరసమును లేక రసభస్మమును తినిన నోరుపుండగును. పండ్లూడిపోవును. కీళ్ళయందు పట్లు వదలిపోవును. నొప్పులుపుట్టును. రససేవచేయునపుడపథ్యముచేసినను పైరోగములు కలుగును. కాన రససేవకులు జాగ్రతవహించవలెను.

రసమునకు సంబంధించిన శాస్త్రమంతయు మారసరత్నసముచ్చయమున విశేషముగ వివరింపబడినది. గ్రంథవిస్తరభీతిచే నిచట నింతకన్న వివరింపబడదు.

పాపరచెట్టు:—సం. మహేంద్రవారుణి, కాయా, విశాలా అని అనియు, హిం. ఇందారియణ్, ఘగ్‌ఫేంద్ అనియుపేరు. ఇదిక్షుపము పెద్దదిసామాన్యముగా చవుడుభూములందు పుట్టును. నూగువంటి ముండ్లుగల యెర్రనికాయలుకాచును. పచ్చనిపూలును పొడవైనఆకులును ఉండును. ఆకులకుచిల్లలుండును. పెద్దపాపర చిన్నపాపర యని రెండు



విధములు. చిన్నపాపర ఇసుకభూములందు పుట్టును. దీనిపండ్లు పసుపుపచ్చగనుండును.

కారము చేదు రుచులు ఉష్ణవీర్యము లఘు సరగుణములు కటువిపాకముగలది. గుల్మము పిత్తము ఉదరము కఫము కృమి కుష్ఠు జ్వరము వ్రణము శ్వాస కాస గ్రంథి మేహము అపచి మూఢగర్భము కామిల ప్లీహ శుష్కగర్భము విషము గలగండము అనాహము ఆమవాతము దుష్టోదరము 8 విధములగు ఉదరరోగములు. పాండువు మున్నగు అనేకరోగములను హరింపచేయును. మలబద్ధమునువిప్పును. దీనికాయలు వేరు విరేచనార్థముగ వాడదగును. పాపరకాయలకూర మధురరసము ఉష్ణవీర్యము మధురవిపాకము సరగుణము కలది. రుచి అగ్నిదీప్తి పుష్టి వీర్యవృద్ధి బలము గురుత్వము కలుగజేయును. వాతపిత్తము గుల్మము జ్వరము హరింపచేయును. రస వీర్య విపాకములందు చిన్నపాపరకంటె పెద్దపాపర శ్రేష్ఠము. గాని యించు మించు చిన్న పెద్ద పాపరలు సమానప్రభావములుకలవి.

పాము:—సం. సర్ప, దంష్ట్రి, సరీసృప అనియు, హిం. సాంప్ అనియుపేరు. దీనిమాంసము చేదు రుచి గురుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. నేత్రములకు హితమైనది. పుష్టినిచ్చును. కండ్లుపుసి కట్టుట క్రిమి మూలరోగము హరించును. పాముకుబుసము యొక్క పొగనుపట్టిన మూలరోగులకు ఆసనముపోటు తగ్గును.

పాయిలఆకు:—సం. లోణా, లోణి, ఘోలిక అనియు, హిం. కుల్‌ఫా, నోనియా అనియుపేరు. లోని, బృహల్లోని యని రెండువిధములు. తెనుగున చిన్నపాయిల పెద్దపాయిల అందురు. ఇది పాటిభూములయందు మడుళ్ళమీదను మొలచును. చేతితో నలిపినయెడల జిగటగానుండును. దారపుపోగులవంటి దీనితీగలు నేలమీదపాకును. ఇదిచిన్నతీగ. పులుపు కారము వుప్పు రుచులుగలది. సర రూక్ష గురు గుణములు ఉష్ణవీర్యము ఆమ్లవిపాకముగలది. వాతశ్లేష్మము అర్శస్సు అగ్నిమాంద్యము విషము జిహ్వాదోషము వ్రణము గుల్మము శ్వాసకా

సలు ఆమ్లపిత్తము గ్రహణి కుష్ఠము అతిసారము చర్మరోగము నేత్రవ్యాధులు మున్నగువానిని హరించును. విశేషముగ తినిన శుక్రమునకు హానిచేయును. ఇంచుమించుగా చిన్న పెద్ద పాయిల కూరలు సమాన గుణములుకలవి. పాయిలకూరను ఆవుపాలలో వేసి త్రొక్కి రసముతీసి యిచ్చిన రక్తవాంతికట్టును. ఆకును ఆముదముతో వెచ్చజేసి పొత్తికడుపునకు కట్టిన మూత్రముజారీజేయును.

పారుజాతము:—సం. పారిభద్ర, రక్తపుష్ప, కంటకీ అనియు, హిం. పరహాత్ అనియుపేరు. యిది అరణ్యములయందు పుట్టు పెద్దచెట్టు. తోటలయందును ఉపవనములయందును వేసి పెంచుదురు. ఎఱ్ఱని సుందరమైన పూవులుపూచును. దీనికొమ్మలకు చిన్నచిన్న ముండ్లుండును. ఒకతొడిమకు మూడుబిళ్ళలుగల ఆకుండును. పట్టఆకు పువ్వులు వైద్యులుపయోగింతురు. కారము రుచి ఉష్ణవీర్యము లఘుగుణము కటువిపాకముగలది. దీనిరసము లేక కషాయము కఫవాతములను అరోచకము అగ్నిమాంద్యము కృమి మేహము శోఫ వీనిని హరించును. పారిజాతపు పుష్పములనుత్రొక్కి తీసినరసమును చెవిలో పోసిన చెవిపోటుతగ్గును. ఆకురసమునందు మిరియాల చూర్ణముకలిపి యిచ్చిన కడుపునందలి నులిపురుగులు హరించును. ఆకుత్రొక్కి కట్టిన వాతపు నొప్పులు హరించును. ఆకుకూర మృదువైన విరేచనము జేసి పిత్తమును హరించును.

పాలంకి:—సం. పాలక్యా, వాస్తుకాకార, ఛాత్రికా, చరితచ్ఛద, అనియు, హిం. పాలగ్ అనియుపేరు. ఆకు జిగటగానుండును. మధురరసము గురుగుణము శీతవీర్యము మధుర విపాకము గలది. వాతశ్లేష్మములను వృద్ధిజేయును. ఆలస్యముగజీర్ణమగును. మలబద్ధకరమైనది. మదము శ్వాస రక్తపిత్తము హరించును.

పాలచెట్టు:—సం. క్షీరి, క్షత్రియ, రాజాదన అనియు, హిం. ఖిర్నీ అనియుపేరు. యిది పెద్దవృక్షము. దీనిపండ్లు పసుపు పచ్చగానుండును. శీతవీర్యము మధురరసము స్నిగ్ధ గురుగుణములు స్వాదువి



పాకముకలది. బలమునిచ్చును. దప్పి మూర్ఛ మదము భ్రమ క్షయ రక్తదోషము త్రిదోషములు వీనినిహరించును. నేత్రములకు హితమైనది. ఇంద్రియమును పుంస్త్వమును హెచ్చించును. అమితముగతినిన శ్లేష్మమును పెంచును. కడుపుబ్బరము మలబద్ధముచేయును.

పాలానబకాయ:—దుగ్ధతుంబీ, క్షీరతుంబీ, దంతబీజా అని పేరు. మధురరసము స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకము కలది, వాతపిత్తములనుహరించును. స్త్రీల గర్భములపోషించును. బలము పుష్టి శుక్రము వృద్ధిచేయును,

పాలకొడిశ:—చూ. కొడిశచెట్టు.

పాలగుండ:—తూర్పుదేశమున ఒకదుంపతో తయారుచేయుదురు. చూచుటకు తిప్పసత్తువలెనుండును. దీనిని దేశవాళితవక్షీరి అని అమ్మెదరు, గాని యిది తవక్షీరికాదు. తియ్యగానుండును. శ్వాసకాసలు మేహము పిత్తము హరించును. వీర్యవృద్ధిచేయును.

పాలగుమ్మడు:—సం. క్షీరవిదారి, యిక్షుగంధ, క్షీరకంద అనియు, హిం. బిలారీకంద్ దూద్‌బిదారి అనియుఅందురు. ఇదితీగ బాఱును. దుంపప్రధానమగుతీగ ఒకతొడిమకు 7 లేక 8 ఆకులుచొప్పున ఉండును. దుంప మెరుపు తెలుపు రంగులుగనుండును. ఇది నేలగుమ్మడులో ఒకభేదము. యిది మధుర ఆమ్ల కషాయరసములు గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. శుక్రము పుష్టి బలము కాంతి కంఠస్వరము వీనిని బాగుపరచి పెంచును, స్త్రీలకు స్తన్యమును పుట్టించును. మూత్రమును అధికపరచును. కఫకరమైనది. పిత్తశూల తాపము మేహము మున్నగురోగములను హరించును. నేలగుమ్మడు గుణములు గూడ దీనియందుగలవు

పాలతుత్థము:—సం. కర్పూరికాతుత్థ, అమృతాసంగ అని పేరు పాలతుత్తము లేఖనకారి త్రిదోషములను భేదించును. దురద కుష్ఠము విషము కఫము క్రిమి అనువానిని హరింపజేయును. నేత్రములకు హిత

మైనది. మైలతుత్థముయొక్క గుణములుకూడ దీనియందు గలవు. క్రమముగ శుద్ధిచేయక పాలతుత్థమును సేవించిన హానిజేయును.

పాలసుగంధి:—సం. శారిబా, అనంతా, ఉత్పలశారిబా అనియు, హిం. అనంత అనియుపేరు. నల్లసుగంధి తెల్లసుగంధి అని రెండువిధములు. నల్లసుగంధికి బర్రెసుగంధియనిపేరు. నల్లసుగంధికి సం. శ్యామాలత, పాలిందీ, కృష్ణశారిబా అనియు, హిం. కాలీసర్, సాలసా, సరివన్ అనియుపేరు. నల్లసుగంధికన్న తెల్లసుగంధి శ్రేష్ఠము. దీనిఆకులు సన్నముగా పొడవుగానుండును. ఆకులపైన తెల్లజీరలుండును. పేరుకుదగినట్లు దీనివేరు పరిమళముగలది. వేరునమిలి ఉమిసినయెడల తెల్లగానుండును.

ఇది తీపి చేదు రుచులు శీతవీర్యము గురు స్నిగ్ధగుణములు మధురవిపాకముకలది. కుష్ఠము దురద జ్వరము దేహదుర్గంధము అగ్నిమాంద్యము శ్వాసకాసలు అరుచి ఆమము త్రిదోషవికారములు రక్తపిత్తము ప్రదరము కఫాతిసారము దప్పి తాపము వాతము మున్నగు రోగములు హరించును. సుగంధికషాయమున పంచదార జేర్చి పుచ్చుకొనిన మేహ ఉడుకుతగ్గును. సుగంధిచూర్ణమును ఆవునేతితో కలిపి రాచిన సర్పిమొదలగు మంత్రపుకురుపులుమానును. పచ్చివేళ్ళరసమును పుక్కిటబెట్టిన యెడల నోటిపూతతగ్గును. సుగంధివేరు బావంచాలు ఫిరంగిచెక్క కషాయముకాచి యిచ్చిన సవాయిజీర్ణించుటచే గలిగిన దురద చర్మవ్యాధులు గలగండ గండమాలాదులు హరించును. పచ్చిసుగంధివేరు కన్యకోమలిదుంప ఈ రెండును మేకపాలలోవేసి తొక్కితీసినరసమును ప్రతి యుదయమున త్రాగుచున్న తొమ్మిదిదినములకు దారుణ శుక్లనష్టముకట్టును. స్వప్నస్ఖలనముమానును. సుగంధి 20 ప॥ జీలకర్ర 2 ప॥ బావంచాలు 9 ప॥ ఫిరంగిచెక్క 18 ప॥ సోపు 10 ప॥ వీనిని నలియగొట్టి 4 రెట్లు నీళ్ళలోవేసి 4 వ వంతు మిగులునటులకాచి వడియగట్టి అందు లవంగాలు నాగకేసరములు పిప్పళ్ళు మిర్యాలు వీనిచూర్ణము ప్రత్యేకము 1 పలము 4 పలములు ఆరెపువ్వు కషాయమునకు రెట్టింపు బెల్లము



నాల్గవవంతు తేనె చేర్చి యొకకుండలోపోసి సందిబంధము చేసి రెండు మాసములు నిల్వయుంచిన నది శారిబాద్యరిష్ట అను పేరబరగును. దీనిని బలానుసారము సేవించిన సకల చర్మరోగములు రక్తవికారములు మేహము నశించును. రక్తవృద్ధి వీర్యపుష్టి బలము కాంతి కలుగును. నల్ల సుగంధికిగూడ నివియేగుణములు.

పాలు:—ఆవుయొక్క ఉష్ణధారలు అగ్నిదీప్తి బలమునిచ్చును. చులకనగా శీతలముగానుండును. త్రిదోషములను హరించును. పితికిన వెనుక 6 ఘడియలునిల్వయుంచిన పాలు వికారమునుజెందును. గనుక అవి త్రాగగూడదు. ఆవుపాలు ఉష్ణముగనుండునపుడును గేదెపాలు చల్లగనుండునప్పుడును మేకపాలు కాచి కొంచెము వేడిగానుండునప్పుడును గొర్రెపాలుకాగి చల్లారినప్పుడును శ్రేష్ఠము. కాగి చల్లారినపాలు పిత్తమునుహరించును. కాగి సుఖోష్ణముగనుండుపాలు కఫవాతములను హరించును. అధికముగ కాగినపాలు గురుత్వము చేయును. జిగటుగానుండును. శుక్రము బలము వృద్ధిచేయును. కాగనిపాలు ఆమరోగము శ్లేష్మము పుట్టించును. గురుత్వముగ నుండును. కాచనిచనుబాలు పథ్యముగను కాచినవి త్రిదోషముల ప్రకోపింపజేయునవిగను నుండును. రాత్రులందు శీతమధికముగ నుండుటచేతను సంచారము లేకుండుటచేతను ఉదయమున పితికినపాలు మలబద్ధము గురుత్వము శరీరపుష్టి కలుగజేయును. పగటియందు సూర్యకిరణ సంబంధము, విశేషసంచారము, వాయుస్పర్శ ఇవి కలిగియుండుటచే సాయంకాలమున పితికినపాలు ఆమరోగము వాతపిత్తము హరింపచేయును. నేత్రహితముగను బలకరముగనునుండును. ఉదయమున పాలు త్రాగిన శుక్రము శరీరపుష్టి జఠరాగ్ని వృద్ధియగును. మధ్యాహ్నమున పాలుత్రాగిన బలము నిచ్చును. రుచిబుట్టించును. మూత్రకృచ్ఛ్రను హరింపజేయును. క్షీరపానము వలన బాలురకు అగ్నిదీప్తి కృశించినవారికి పుష్టి వృద్ధులకు శుక్రవృద్ధి జేయును. రాత్రియందు క్షీరపానమువలన అనేకదోషములుహరించును.

వికారవర్ణమునుజెంది వాసనగలిగి కుసుపులు గట్టి పుల్లగా

నుప్పగానుండు పాలు కుష్ఠము మున్నగు రోగములను గలుగజేయును. కాగినపాలమీద మీగడ చలవచేయును. ఆలస్యముగ జీర్ణమగును. శుక్రము బలము పుష్టి కలిగించును. పిత్తరక్తము వాతముహరించును. ఈనిన 7 దినములవరకు పితికినపాలు ముర్రుపాలుఅనబడును. వీనిని కాచిన గట్టిపడును. దీనికిజున్నుఅనిపేరు. యిది మిక్కిలి బలునైన ఆహారము. దీనిని తినిన ఒడలునొప్పులు కీళ్ళనొప్పులు అజీర్ణము మున్నగు వానిని గలుగచేయును. శ్లేష్మవాతరోగులకు విషతుల్యము.

అయస్కాంతపాత్రలోనిపాలు సకలరోగ హారముగ గంధకపాత్రలోనిపాలు కఫరోగహారముగ రసపాత్రలోనిపాలు రసాయనముగ బంగారు వెండి పాత్రలలోనిపాలు పిత్తశ్లేష్మ హారముగ కంచుపాత్రలోనిపాలు వాత పిత్తశ్లేష్మహారముగ నుండును.

బాలురకు వృద్ధులకు నీరసపడినవారికి వ్యాయామముచేయువారికి గర్భిణులకు పాలు హితకరము. క్రిమి అజీర్ణము వ్రణము కఫము ఆమము కలరా లేక విషూచి రక్తవిరేచనము యివిగలవారు పాలు సేవించరాదు.

పావుదార:—లొట్టిపిట్ట లేక ఒంటెయొక్క చేదుకట్టె (చేదు) పావుదారయనబడును. మిగులవేడిచేయును. కస్తూరి మొదలగు వానిలోకలిపిగాని ప్రత్యేకముగగాని సేవించిన వాత శ్లేష్మములు సన్నిపాతము జలుబు హరించును. పిత్తమును పెంచును. రెండు మొదలు 6 వడ్లగింజలయెత్తువరకు వాడవచ్చును.

పావురము:—పావురపుమాంసము కారము రుచి గురుస్నిగ్ధగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. శరీరమందలినీరు నాన్పును. మిగులవేడిచేయును. కాకతత్వముగలవారికి తలనొప్పి తలత్రిప్పు గలిగించును. పక్షవాత ఉబ్బురోగులకు హితకరముగనుండును పావురపురక్తమునురాచిన మూతివంకరపోవుట పక్షవాతపునొప్పులు దారుణమగు వాతపునొప్పులు తగ్గును. పావురపు మాంసము వీర్యపుష్టి సంభోగశక్తి కలుగజేయును.



పాషాణము:—గౌరిపాషాణము పసుపువచ్చగ రాయివలెనుండును. ఇది గనులలోపుట్టును. కృత్రిమమగు పాషాణములు 64 విధములు. వీనిని తయారుచేయువిధములు అగస్త్య సంప్రదాయమున వర్ణింపబడినవి. గ్రంథవిస్తర భీతిచే వ్రాయబడవు. ఇందు ముఖ్యముగ రక్తపాషాణము, శంఖపాషాణము, ఉల్లిపాషాణము, గౌరిపాషాణము సవీరము అనునవి ప్రధానములు. పాషాణములు మహావిషములు. కానశుద్ధిజేసి యల్పమగు మోతాదుగవాడనగును. కాకరకాయలోపెట్టి కాంజికముతో స్వేదనముచేసిన శుద్ధములగును. గౌరిపాషాణభస్మము లేక సిందూరము ఏకాహిక ద్వ్యాహిక త్ర్యాహిక చాతుర్థికజ్వరములు, సన్నిపాతజ్వరము శ్లీపదము వాతము వ్రణము కుష్టము గ్రంథులు సకల సవాయిలుహరించును. క్రమముగ సేవించిన బలము వీర్యము పుష్టి గలిగించును. దీనిమోతాదు హెచ్చుఅయినను అక్రమముగవాడినను వమనములు మున్నగు ప్రమాదములు పుట్టించి చంపును. పాషాణమును పాషాణమిశ్రౌషధములను సేవించిన వారలపథ్యముచేసిన కీళ్ళు పట్టువదలును. నంజుపుట్టును.

గౌరీపాషాణమును చూర్ణించి వెన్నపూసలోకలిపి మీగాలిమీద తామరవలెపుట్టి దురద రసికల మేహజనితమగు పుండ్లకుపూసినవి యెన్నటికినిపుట్టవు. రసగంధకములు గౌరీపాషాణము సమభాగముగ కలిపి నిమ్మపండ్లరసముతోనూరి పెసరగింజలంత మాత్రలుచేసి యిచ్చిన చలిజ్వరముతగ్గును. గౌరీపాషాణ సిందూరము సకల సవాయిరోగములను కుష్ఠమును హరించును. ఒకతులం శంఖపాషాణమును 15 తులముల పిచ్చికుసుమరసములోపోసి 80 తులముల కట్టెపుల్లలతో నుడకబెట్టినయెడల సంపూర్తిగశుద్ధినొందును. దానిని చిన్నపావిలి ఆకుతోనూరి భూధరపుటమువేసిన భస్మమగును. దానిని రసంబంధమందును, వాదవిద్యయందును కుష్టముమొదలగు చర్మరోగములందును వాడనగును. శుద్ధిచేసిన సవీరము ఒకతులము శుద్ధిచేసిన నవాసాగరము ఒకతులము. శుద్ధరసగంధకములు ప్రత్యేకము రెండుతులములు వీనిని చేర్చి

హైడ్రపత్రికాయల రసముతో నూరి కాచకుప్పెలో నుంచి వాలుకాయంత్రమునవండి సిద్ధముచేసిన సిందూరమును సకలసన్నిపాతములు సవాయి కుష్ఠము ఉబ్బసము మొదలగు దారుణవ్యాధులందువాడిన అమోఘముగ పనిచేయును. రక్తపాషాణచూర్ణమును గంధఫిరోజాలో కలిపి అడ్డుగర్రలు సవాయిబిళ్ళలు లేతగానున్నపుడు పట్టువేసిన ఒకదినములో అణగగొట్టును.

ఉల్లిపాషాణము అన్నిపాషాణములలో కూరమైనది. పైపాషాణముల గుణములన్నిటిని కలిగియుండును. మిగుల చురుకుగ పనిచేయును. పాషాణములన్నియు నోరుపట్టును; గనుక వైద్యులుజాగ్రతవహించి వాడదగియుండును. పాషాణములనుగురించిన విషయమంతయు నొకగ్రంథముకాగలదు. గాన నిట విశేషవిస్తరముచేయబడదు.

సాధారణముగ పాషాణ విషమునకు కాకరఆకు నిమ్మపండ్ల శర్కరాయుకషాయము వమనశోధనము సున్నపుతేట మున్నగునవి శాంతికరములుగనుండును.

పిండికొండచెట్టు:—సం. పాషాణభేది, అశ్మఘ్ను, శైలగర్భజ అనియు, హిం. పాఖానభేద అనియుపేరు. చిన్నమొక్క. దీని ఆకులు బూడిదచరచినట్లు తెల్లగనుండును. తెల్లనివెన్నువేయును. దీనిఆకు నమిలి యానోట చిన్నచిన్నరాళ్ళునమిలిన పంటికి బాధలేకుండ నలిగిపోవును. మరియు మూత్రపుసంచియందలి రాళ్ళు పడునట్లును కరిగిపోవునట్లునుచేయును. గనుక పాషాణభేద అనియు, కొండపిండియనియు. దీనికిపేరుకలిగెను. ఆకులుగుండ్రగ చిన్నవిగనుండును.

చేదు వగరు రసములు గురుస్నిగ్ధగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. మూత్రప్రవృత్తిని కలుగజేయును. మూత్రకృచ్ఛ్రము శర్కర ప్రమేహము తాపము సెగరోగము మూత్రనాళములోని పుండ్లు తెల్లకుసుమ అతిసారము హరించును. వేళ్ళరసమునందు యవక్షారము కలిపి యిచ్చిన తక్షణము మూత్రమునువెడలించును. వేళ్ళ స్వరసము



పూటకు ఒకతులము చాలును. కషాయము 2 మొదలు 4 తులములవరకు యివ్వవలెను.

పిన్నదూలగొండి:—సం. ధన్వయాస, తామ్రమూలి, మాసక్ష సూక్ష్మపత్రి, దుస్పర్శ అనియు, హిం. జవాసా అనియుపేరు. నీటిపట్టులమొలచుమొక్క. ఆకులుగుండ్రగనుండును. ఉస్తికాయలంతచిన్నవియగు గుండ్రనికాయలుకాచును. శరీరమునకు తగిలినయెడల అధికమైన దురదగలిగి బొబ్బలెక్కును. చెట్టునందంతట నూగుండును. వర్షఋతువుయొక్క ఆద్యంతములందు పూచి కాచును. పిదప లేనంతకాను చచ్చిపోవును. పెద్దదూలగొండియొక్క గుణములన్నియు దీనికుండును. దీనివేరు ముఖ్యముగ ఔషధయోగ్యము.

మధుర తిక్త కషాయరసములు లఘు సరగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. కఫము మేదస్సు మదము భ్రాంతి పిత్తరక్తము కుష్ఠు కాస దప్పి విసర్పి వాతరక్తము ఛర్ది జ్వరము తాపము హరించును.

పిన్నపాపర:—చూ. పాపరచెట్టు.

పిన్నపాలచెట్టు:—చూ. రెడ్డివారినానబాలు.

పిప్పలికట్టె:—సం. పిప్పలీమూల, గ్రంథిక, కణామూల, చటికి, మూల యనియు, హిం. పీపరామూల్ అనియుపేరు. పిప్పలితీగయొక్కవేరును పిప్పలికట్టెయనియు మోడి అనియు వాడుదురు.

ఇది కారము రుచి లఘురూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముకలది. దీపనపాచనములను పిత్తమును కలిగించును. వాతకఫములు అనాహము ప్లీహ గుల్మము కృమి శ్వాస క్షయ ఉబ్బు పాండు కామిల అగ్నిమాంద్యము సూతికావాతము మున్నగువానినిహరించును. విరేచనబద్ధమువిప్పును. ఉష్ణతత్వముగలవారికి అహితముగనుండును. శ్లేష్మవాతరోగులకు హితము. పిప్పళ్ళ యొక్క గుణములు దీనికుండును గాని అంతకన్న తక్కువవీర్యముకలది.

పిప్పళ్లు:—సం. కణా, కృష్ణ, చపలా, చంచల, ఉపకుల్యా, తిక్తతండుల అనియు, హిం. పీపల్, పీపర్ అనియుపేరు. పిప్పలితీగ మలయాళము మున్నగు చల్లనిదేశములందుపుట్టును. ఆకులు ముదురుతమలపాకు ఆకారముగనుండును. తీగబ్రాకును.

కారము రుచి స్నిగ్ధ లఘుగుణములు సమ శీతోష్ణవీర్యము మధురవిపాకముగలది. వాతశ్లేష్మములు శ్వాసకాసలు ఉదరము జ్వరము కుష్ఠు గుల్మము ప్రమేహము అర్శస్సు ప్లీహ శూల ఆమవాతము విషము పక్షవాతము జలుబు సూతికారోగము మున్నగువానినిహరించును. పిప్పలిచూర్ణము గుంటగలగరరసముతో నిచ్చిన కఫజ్వరముతగ్గును. పిప్పలిచూర్ణమును 7 దినములు నిమ్మపండ్లరసములో భావనచేసి నిమ్మపండ్లరసముతో నూరి కుంకుడుగింజలంత మాత్రలుచేసి ప్రతిప్రాతస్సాయంకాలములందు ఆవుపాలతో పుచ్చుకొనుచున్న శుక్లనష్టము స్వప్నస్ఖలనముతగ్గును. పురుషాయవమునకు బలమునిచ్చును. పిప్పలి చూర్ణమును వెదురాకుకషాయముతో నిచ్చిన బాలింతల దుష్టరక్తమును వెడలించును. గర్భిణీస్త్రీలు పిప్పళ్లనుతినిన గర్భస్రావము కలిగించును. 5 లేక 7, 8, 10 పిప్పళ్లను ప్రతిదినము తేనె నేయి కలిపి ఒకసంవత్సరమువరకు తినుచున్న ముదిమిని రోగములహరించి శరీరమును వజ్రతుల్యము జేయును.

మోదుగుకట్టెల క్షారోదకముతో 7 దినములు భావనచేసి నేతితో వేయించిన పిప్పళ్లను భోజనమునకు ముందుగా పూర్వాహ్ణమున తేనెతో సేవించుచుండిన శ్వాస కాసలు క్షయ శోష హిక్క గళరోగము అర్శస్సు గ్రహణి పాండువు విషమజ్వరము స్వరభేదము పీనస శోథ గుల్మము వాతబలాసకము నశించి ఆరోగ్యముకలుగును. ఇది కింశుకపిప్పలియనిపేర బరగును. పిప్పలి వర్ధమాన క్రమమున (మొదటిదినమొకటి రెండవదినమున రెండు మూడవదినమున మూడు ఇట్లు) 21 దినములవరకు హెచ్చించుచు క్రమముగ తగ్గించుచు సేవించు నెడల వలీప



లితములను పోగొట్టును. సకలరోగములను హరించును. ఇట్లు పిప్పలీకల్పము లనేకములుకలవు.

పిరంగిచెక్క:—సం. ద్వీపాంతరవచ అనియు, హిం. చోపచీనీ అనియుపేరు. ఇది ఫిరంగిదేశము అనగా పాశ్చాత్యఖండమునుండి యీదేశమునకు తేబడినది. గాన పిరంగిచెక్కయనియు, వసను పోలినదుంప గనుక ద్వీపాంతరవచయనియు నామముకలిగెను. చీనాయందిది ప్రసిద్ధము. దుంప ప్రధానమైనది.

కారము చేదు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. అగ్నిదీప్తికలిగించును. మలబంధమునువిప్పును, శూల ఆధ్మానము కృమి ఊరుస్తంభము వాతవ్యాధులు అపస్మారము కంపవాతము ఉన్మాదము కుబ్జవాతము శరీరమందలి నొప్పులు హరించును. బలము వీర్యము ధాతుపుష్టి మలమూత్రశుద్ధి కలిగించును. స్త్రీలగర్భదోషములను నివర్తింపచేసి గర్భమునునిలుపును. విశేషముగ సవాయివ్రణము విసర్పము గలగండము గండమాల పరూషూషము దగ్గు నేత్రశుక్రదోషములు నశింపచేయును, క్షీణశేతస్సుకలవారలకును సెగసవాయిలు జనించి నీరసపడినవారలకును కుష్ఠము మొదలగు చర్మరోగములకును మిగులహితమైన యౌషధము.

అరతులము పిరంగిచెక్కచూర్ణము ఒకనల్లజీడిగింజ వీనిని ఉష్ణోదకములో వేసి ఒకగడియయుంచి వడియగట్టి (ప్రతియుదయమున త్రా)గుచున్న చిరకాలానుగతములగు దగ్గులుతగ్గును. పిరంగిచెక్కను సేవించునపుడు మద్యము పులుపు నూనె తరవాణి లేక కాంజికము ఉప్పు చేదు అనువానిని వర్జించవలెను. దీనిని సేవించునపుడు అపథ్యముచేసినచో రోగములకలిగించి ప్రాణహానికూడ చేయును. పిరంగిచెక్క తినుటకు ముందు వమనవిరేచనముల జేయించుకొనవలెను. పిరంగిచెక్క పెన్నేరుదుంపతో సమానముగ వీర్యవృద్ధిచేయును. ఎండినదానికన్న పచ్చి పిరంగిచెక్క పైత్యముహెచ్చించును. గాని త్వరగపనిచేయును.

పిరంగిసాంబ్రాణి:—సం. కుందురు, పాలంక్యా, శిఖరి అనియు హిం. కుందురు, గుదవరోసా అనియుపేరు. అందుగుచెట్టుయొక్క జిగురునకు పిరంగిసాంబ్రాణి అనియుపేరు. ఇదిచేదు తీపి కారము రుచులు ఉష్ణవీర్యము తీక్ష్ణగుణము కటువిపాకముగలది. జ్వరము చెమటవలన బుట్టువ్యాధులు గ్రహబాధ అలక్ష్మి ముఖరోగములు కఫవాతములు రక్తవికారము ప్రదరము రక్తాతిసారము యోనిదోషములు హరించును. నేతిలో పంచదారకలిపి తినిన మేహము నణచును. వృషణములకుపూసినవరిబీజము బుడ్డ మున్నగు బాధలుతగ్గును. వేపచెక్కరసములో కలిపియిచ్చిన కుష్ఠము సుగంధిరసములో కలిపి యిచ్చిన సెగరోగము మానును. ప్రధానముగ చర్మవ్యాధులకు వ్రణములకు ఉపయోగించును. దీనియందనేక వస్తువులనుచేర్చి పలాస్త్రీపట్టీలు చేయుదురు. ఇదిసుగంధవంతమైయుండును. చిన్నంమొదలు రెండుచిన్నములవరకు దీనిని లోపలకు పుచ్చుకొనవచ్చును.

పిల్లిపీచర:—సం. శతమూలీ, శతావరీ, అభీరు అనియు, హిం. సతావర్ అనియుపేరు. ఇదితీగ తీగకుముండ్లును సన్ననిఆకులును ఉండును. ఒకతీగను త్రవ్వినయెడల దానికి గంపెడు దుంపలుండును. ఇవి తాటితేగలవలె నుండును గనుక పిల్లితేగలని వీటినిపిలుతురు. పెద్దపిల్లిపీచర చిన్నపిల్లిపీచర అని యిందు రెండుభేదములుకలవు. పెద్దపిల్లిపీచరకు మహోదరీ మహాశతావరీ అని సంస్కృతనామములు.

తీపి చేదు రుచులు గురుగుణము శీతవీర్యము మధురవిపాకము గలది. రసాయనము. మేధ పుష్టి బలము వీర్యము కాంతి కలిగించును. స్త్రీలకు స్తన్యముగలుగజేయును. నేత్రరోగము గుల్మము అతిసారము వాతపిత్తరక్తదోషములు శోథ క్షయ హరింపచేయును. తైలములందును ఘృతములందును చూర్ణములందును విశేషముగ జేర్పబడును. పెద్ద చిన్న పిల్లిపీచరలు రెండును సమానవీర్యగుణాదులుకలవి గాని పెద్దది కఫవాతములయందును అర్శస్సునందును మిక్కిలిగపనిచేయును. రసాయనయోగములందు చేర్పదగినది.



పిల్లిపీచరయొక్క అంకురములు చేదు రుచి లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలవి, బలము శుక్రము గలిగించును. త్రిదోషములుఅర్శస్సు క్షయ సంగ్రహణి హరించును. హృదయమునకు మేలుచేయును.

పిల్లిపెసలు:—సం. ముద్గపర్ణి, క్షుద్రసహా, సూర్యపర్ణి, కురంగిణీ అనియు, హిం. ముగవన్ అనియుపేరు. నీటియొడ్డులను చేలగట్లను మొలచు చిన్నమొక్క. ఒకతొడిమెకు మూడు గుండ్రని చిన్నాకులును, చిన్నచిన్న పూవులును ఉండును. కాయలు పెసరకాయలవలె నుండునుగాని అంతకన్న పొడవు లావు తక్కువ. పచ్చికాయలోని గింజలను పిల్లలుతిందురు. పిల్లిపెసరపప్పు వాతరక్తము క్రిమి తాపము క్షయ పిత్తము ఉన్మాదము జ్వరము హరింపచేయును. నేత్రములకు హితమైనది. శుక్రవృద్ధిచేయును.

పిస్తాపప్పు:—సం. నికోచక. చారుఫల, జలగోచక, ముకూలక, అనియు, హిం, పిస్తాఅనియుపేరు. ఇదియూనానీ సంప్రదాయ ద్రవ్యము పిస్తాపప్పు కందిబద్దలవలె నుండును.

తీపి రుచి, గురుస్నిగ్ధగుణములు, ఉష్ణవీర్యము, మధురవిపాకము గలది. ధాతుపుష్టి, శుక్రబలము, శరీరపుష్టి, రక్తశుద్ధి, గలుగజేయును. పిత్తమును పెంచును. వాతము, గుల్మము, హరించును. ఆలస్యముగ జీర్ణమగును. గుండెలకు బలమిచ్చును.

పీతచందనము:—సం. కాలేయక, పీతసార, నారాయణప్రియ, అనియు, హిం. పీలాచందన్ అనియుపేరు చందనములలో భేదము. చేదురుచి, గురుగుణము, శీతవీర్యము, కటువిపాకము గలది. శరీరకాంతినిచ్చును. విచర్చిక, కుష్ఠు, దురద, కఫదద్రులు, విషము, ఛర్ది, హిక్క, మేహము, దప్పి తాపము, అతిసారము మొదలగు రోగములను హరించును.

పుగాకు:—సం. తమాఖు, క్షౌరపత్రి, కృమిఘ్ని, ధూమ్రపత్రిక, అనియు, హిం. తమాఖు అనియుపేరు. పుగచెట్లను శీతకాలము

నంను పెంతురు. ౩ మాసములకు తయారగును. ఆకు పొడవుగ సన్నము గనుండును. పొడవైన వెన్ను వేయును. గింజలుమిక్కిలి సన్నముగ గస గసాల వలెనుండును. ఆకులుమిక్కిలి తీక్షణమైనవి. పొగాకుఅనియు దీనినివాండుదురు.

పుగాకు చేదు కారము రుచులు, సరగుణము, ఉష్ణవీర్యము, కటువిపాకము గలది. పిత్తమును హెచ్చించును. వస్తిశుద్ధికరము. సుగము, దృష్టిమాంద్యము, భ్రమ కలుగజేయును. త్రిప్పును వాతపును సులోమగతికి దెచ్చును. కఫము కాస, శ్వాస వాతము, కోష్ఠవాతము, కృమి, దంతములు, శుక్రము, నేత్రము వీనియందలి దోషములు, లింగ యోనిదోషములు, తేలు జెర్రి పాము మున్నగు విషములు శోధము న్నగు రోగములను హరించును. దీనిని చుట్టజుట్టి పొగను బీల్చిన సాధారణపు కల్లిదగ్గు గుణకతగ్గును. ఆకులను చక్కగాకాచి సున్నమునే బు వేసి చేసినచూర్ణమున కొద్దిగ కస్తూరికలిపి నస్యముచేసిన దారుణ పీనసరోగములు మానును. జలుబుహరించును. తమలపాకుతో నలిపిబు గ్గను పెట్టుకొనిన జలదోషమువలన గలుగు వ్యాధులనడగించును. పొగబీల్చుటవలన విరేచనముజేయును. అజీర్ణకడుపుబ్బరము తగ్గును. ఉబ్బసము మేహరంజి దగ్గు మొదలగు దగ్గురోగులకు పుగచుట్ట గాల్చుట కొంతశాంతి కరముగనుండును. చురుకుబుట్టించును. గాటుగల పొగాకునకు ఉమ్మిరాచి అంటించిన గడ్డలుపగులును. పుగాకునమిలి కండ్లలో నుమిసిన కఫాభిష్యందము (కండ్లకలక) నీరు పుసిగ్గును. చెవిలో బోసిన చీము పోటు తగ్గును. పొగాకును నీళ్ళలోవేసి పిసికి యానీటిని త్రాగించిన వెంటనే వమనమై కప్పనాకుడు అనువ్యాధి తగ్గును. శ్లేష్మజనితములగు యితరప్రమాదములు నయముగును. కొబ్బరినూనెలో పుగాకుపిసికి వడగట్టి యాచమురును తలకురాచిన చుండ్రు వెండ్రుకలు ఊడిపోవుట పేలు యివినివర్తించును. ఉదరవ్యాధి నంజు కఫకాసలు అను రోగములుగలవారలకు పుగాకురసముతో వమనముచేయించుట హితదాయకము. పుగాకు అలవాటుకలవారలకు సూక్ష్మమైన మోతాదు



లోనికిచ్చిన నిద్రతెచ్చును. పుగాకును అర్ధసరపుకషాయముతో మెత్తగానూరి ఆముదముకలిపి పిసికి వ్రణములపైగట్టిన పురుగులు దూరమై నతిశీఘ్రముగ పుండునయమగును వ్రణములయొక్క దుష్టమగుభాగము నుకోయును. పుగాకును గచ్చపలుకును కలిపి నీళ్ళతో నూరి అండము నకుపట్టించిన వరిబీజపుబాధ వాపు తగ్గును. గాటుకలపుగాకును ఉమ్మితో తడిపి నాలుగైదువరుసలుగ కట్టుగట్టిన మొలగజ్జి క్రమముగ మానును. రసి వాపు కలయే వ్రణములకైన పుగాకుకట్టిన నెమ్మదించును. పుగాకుకషాయము పిప్పలిచూర్ణమును కలిపి నిమ్మపండ్ల రసముతో యిచ్చిన కఫశూలనివర్తించును. మూత్రము గావించును గాటుకల పుగాకును తునకలుగాజేసి రెండురెట్లుమంచినూనెలోవేసి గాజుబిరడాగల సీసాలో 2 మాసములునిల్వయుంచి తీసి చేతితో బాగుగాపిసికి వడియగట్టి గాలి తగులకుండ మరల సీసాలో భద్రపరచునది, యీయౌషధ మును పాముకరచినవానికి 10 మొదలు 40 చుక్కల వరకు లోపలకు త్రాగించిన తక్షణం వమనమై పాముకరచినవాని విషముదిగును. ఒకవిరేచనముకూడ అగుటయుకలదు. ఈతైలమును తేలు జెర్రి కుట్టినచోట మర్దనచేసిన బాధనెమ్మదించును. పుగాకును యెక్కువగా కాల్చి పొగబీల్చుట చేతను నోటిలోవేసికొని నములుటచేతను పిత్తము హెచ్చును. మతిస్థిమితముపోవును. చలిజ్వరముపుట్టించును. గుండెలను శుక్రమును అర్పివేయును. నరములందును జఠరమునందును బలమును తగ్గించును. ఇది యొకవిషవస్తువు కావున విశేషముగ పుగాకును వాడుకచేయరాదు. దీని వికారమునకు చింతపండు పంచదార కలిపిన వేడిపాలు శాంతికరములు.

పుచ్చకాయ:—కాళింగ. కృష్ణబీజ, కాళింది, సువర్చల అనియు, హిం. తరుబూజ, సరదాతరుబూజ్ అనియుపేరు. తీగ బ్రాకును. ఆకులు చిల్లులుగ గుండ్రముగ నైన తెల్లజీరలు కలవిగనుండును. ఏటిలంకలయందు విశేషముగ పెరుగును. సొరకాయలవంటి యీకాయలపైనగూడ తెల్లజీరలుండును. కాయ పండినతరువాత నడిమికి కోసిన మధ్యభాగము యెర్రగనుండును. పచ్చికాయ గర్భము తెల్లగ నుండు

ను. దీనిలోనిగింజలు పలుచగ కోలగ నల్లగనుండును. తియ్యపుచ్చ చేదుపుచ్చయని యిందు రెండువిధములుకలవు. ఇదితియ్యపుచ్చ.

తియ్యపుచ్చపండు మధురరసము లఘుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. పిత్తము తాపము దప్పి శ్రమ హరించును. మిగుల పక్వమై తొడిమనుండిఊడినపండు కొంచెము ఉప్పదనము తీసి రుచులు ఉష్ణవీర్యముకలదిగ నుండును. కఫవాతములబెంచును. దోరపండు తృప్తిని బలమును వీర్యమును పుష్టినికలిగించును. యెండదెబ్బవలనగలిగిన ఆయాసమును పోగొట్టును. మలబద్ధముచేయును. పుచ్చఆకు చేదుగ రక్తవృద్ధికరముగనుండును. చూ. చేదుపుచ్చ.

పుత్రజీవి:—సం. పుత్రజీవ, పవిత్ర, గర్భద, సుతజీవకఅనియు హిం. జియాపోతా, పనిశియా. పితౌంజియా, జియాంపుతా అనియు పేరు. పుత్రజీవిచెట్టు పూర్తిగ ఇంగువవృక్షమును పోలియుండును. పుత్రజీవి గింజలను రుద్రాక్షలనువలె మాలికలు గుచ్చి సాధువులు ధరించెదరు.

పై పి కారము ఉప్పు రుచులు గూతు గురుగుణములు మధురవిపాకము శీతవీర్యముకలది. వీర్యవృద్ధి శ్లేష్మ వాతములు కలిగించును. మలమూత్రములను వెడలించును. స్త్రీలగర్భము నిలుపును. నేత్రములకు మేలుచేయును. పిత్తము తాపము మూలరోగము మేహము దప్పి హరించును. గింజ నీళ్ళతో అరగదీసి కంటిలోబెట్టిన మూర్ఛతగ్గును.

పుదీనా:—సం. వ్యంజన, వాంతిహారీ, రుచిశ్య, శాకశోభన అనియు, హిం. పోదీనా అనియుపేరు. ఇది చిన్నమొక్క. దొడ్లలోను తోటలలోను వేసి పెంతురు. యేకూరలోవేసినను పరిమళముగ రుచిగ నుండును. గనుక శాకశోభనయని దీనికిపేరుకలిగెను.

మధురరసము గురుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. రుచిగ మనోహరముగసుఖావహముగనుండును. మలమూత్రబద్ధముగా విడుచును. కఫ కాసలు మదము అగ్నిమాంద్యము విషూచి సంగ్రహణి అతిసారము జీర్ణజ్వరము కృమి ఛర్ది కడుపులోని పొర్లునొప్పులు హరించును. పుదీనాఆకు పచ్చడి పిత్తమును దోషను హరించును. అగ్నిహితముగలిగించును. జ్వరపడిలేచినవారికిని బిడ్డలకును హితమైనది. కడుపులోని నులిపురుగులచంపును. పుదీనాఆకునుండి తీసిన అర్కముకూడ నైగుణములను కలిగి మిక్కిలిచురుకుగ బనిచేయును. తీక్ష్ణముగ నుండును. విశేషముగ పుదీనాఆకును సేవించిన జబ్బుచేయును.

పునుగు:—సం. మార్జారీ, గంధచేలికా అందురు. పునుగుపిల్లి యను నొకజంతువుయొక్క మదమును పునుగుఅందురు. మిగుల పరిమళముగనుండును. చందనము మొదలగు యితరవస్తువులతో చేర్చిగాని చేర్చకగాని స్నానకాలములందు శరీరమునకుపూసుకొనిన దురద దద్దులు చిడుము కుష్ఠము మొదలగు చర్మరోగములునశించును. దేహ దుర్గంధమును పోగొట్టును. లోపలకు తినిన వాతవ్యాధులు రక్తపిత్తము తగ్గును. ఉత్సాహము కామోద్రేకము కలిగించును.

పున్నాగవృక్షము:—సం. పురుష, రక్తవృక్ష, పున్నాగ, దేవవల్లభ అనియు, హిం. పులాక్ సుల్తాన్‌చంపక అనియుపేరు. ఇదిపెద్దవృక్షము. పున్నాగమొగ్గలను నాగకేసరమునని వాడుదురు. దీనిపండ్లు పెద్దములకపండ్లవలె గుండ్రగనుండును. పండ్లనుండి తైలముదీయుదురు పరిమళముగనుండును.

పున్నాగపట్ట వేరు మధురరసము గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. పిత్తము రక్తరోగము రక్తపిత్తము కఫపిత్తము భూతబాధ హరించును. దేవతాప్రసాదము గలుగ జేయును. పూవులు వీర్యవృద్ధిచేయును. వాతశూల కఫదోషముహరించును.

పురుగుడుచెట్టు:—సం. కాంబోజి, బహుపుత్రి అనియు, హిం. కంబోయీా అనియుపేరు. ఇది పెద్దవృక్షము. దీనిఆకులు ఉశిరిగఆకులవలెనుండును. దీనికొమ్మలు మిక్కిలి పొడవుగ పెరుగును. దీనిపండ్లు గుండ్రముగను పచ్చిదిగనున్నపుడాకు పచ్చగపండినపుడు నల్లగనుండును

వాతము శోఫ హరించును. రక్తమును శుభ్రపరచును. మూత్రమును జారీచేయును.

పునుగుతుత్తిగ:—ఇది గుల్మము. ఆకు కొంచెముకోలగ గుండ్రగ నుండును. జెత్తములవలెనుండు నీలికాడనువిరచిన నీరువంటిసొనవచ్చును: దానినికండ్లలోబెట్టిన కండ్లకలక మంటనేనివారించును.

పులిచింత:—సం. చుక్రం, అమ్లవాస్తూకం, దళామ్ల అనియు, హిం. చూకా అనియుపేరు. ఇదిచిన్నమొక్క. ఒకతొడిమకు ౩ ఆకులు విడివిడిగనుండును. తినిన పుల్లగనుండును. పచ్చడిచేసికొనితిందురు. సాధారణముగ చెట్లపాదుమొదలగు తడిగల ప్రదేశములందు మొలచును. పులిచెంచలియనియు దీనిని వాడుదురు.

సమూలము పులుపు రుచి లఘుగుణము ఉష్ణవీర్యము అమ్లవిపాకముగలది. రుచిబుట్టించును. అగ్నిదీప్తినిచ్చును. పిత్తమునుపెంచి కఫవాతములహరించును. విరేచనముచేయును. పథ్యమైనది శూలగుల్మము అగ్నిమాంద్యము హృదయపీడ మలబద్ధము దప్పి ఛర్ది నోటియందలి అరుచి మున్నగువానినిహరించును. గ్రహణీరోగులకు మిగుల పథ్యమైనది. ఆకును పిత్తవ్రణములపై వేసి కట్టిన మంటతగ్గును. ఆకురసము కొబ్బరినూనె కలిపి శిరస్సునకుపూసిన తలనొప్పి పోటుతగ్గును. ఆకురసమున సైంధవలవణముకలిపి శరీరమునకు పూసిన చర్మరోగములు మానును. ఆకురసముతో కరక్కాయ అరగదీసి యాగంధమును కండ్లకు కాటుకపెట్టిన మురద పొరలు దుర్మాంసములు నయమగును. చిత్రమూలము శొంఠి వాము అను వస్తువుల సమభాగకల్కము 1 పాలు, నేయి 4 పాళ్లు, పులిచింతఆకురసము 16 పాళ్ళు అన్నియును కలిపి రసముయిగురువరకు కాచి వడియగట్టిన నది చాంగేరీఘృతమనబడును. దీనిని సేవించిన కఫవాతములు గ్రహణి మూలవ్యాధి మూత్రకృఛ్ర హరించును. ఇంకను అనేకయోగములందు పులిచింత చేర్చబడి ఉత్తమమైన ఆరోగ్యమునిచ్చును.

పులి:—సం. వ్యాఘ్ర, శార్దూల అందురు, పులిచర్మముమీద కూర్చుండిన సౌఖ్యముగ నుండును. గ్రహబాధశమించును దీనిమీద కూర్చుండి ఆచరించిన తపస్సు విశేషఫలవంతమగునందురు. పులిగోరు



నుధరించుటవలన గ్రహబాధ తొలగుటయేగాక ఆయుష్య ఆరోగ్యము కలుగును.

పుల్లపబ్బలి:— సం. అమ్లవేతస అందురు. తెనుగున పుల్లబచ్చలి యనియు, చుక్కకూరయనియు వాడుదురు. చిన్నమొక్క. ఆకుగుండ్రగ పెళుసుగ మందముగనుండును. సన్నని ఒకవిధముగునూగు ఆకులవెనుకభాగము నంటియుండును. సాధారణముగా మాంసపు కూరలందు విశేషముగవేసి వండుకొందురు.

పులుపు రుచి రూక్షగుణము ఉష్ణవీర్యము అమ్లవిపాకముగలది. క్షయ రక్తపిత్తము అర్శస్సు ఉదరము గుల్మము తేలు పాముమున్నగు విషములు హరించును. అన్నహితమును కలిగించును. రుచి బుట్టించును. మలమూత్రములను జారీచేయును, రక్తగ్రహణి కడుపులోని పైత్యపుమంట పోగొట్టును. ఆకురసమును పుక్కిటబట్టిన చిగురు వాపు దంతములతీపు తగ్గును. ఆకురసమునందు సైంధవలవణము కలిపి శరీరమునకుపూసిన గజ్జి చిడుము మానును. మేహతత్వముగలవారలకు పథ్యమైనది. విశేషముగ వాడుకచేసిన శుక్రమునకును సంభోగ శక్తికిని హానిచేయును. కఫవాతములపెంచును.

పుష్కరమూలము:—సం. పౌష్కరం, పుష్కరమూలం, పద్మపత్రకంఅనియు, హిం. పోహకరమూల్ అనియుపేరు. పుష్కరమూలము నిజమైనది స్వచ్ఛమైనది దొరుకుట అరుదు. దీనికి ప్రతినిధిగ చామరతూండ్లను వాడునది.

పుష్కరమూలము కారము చేదు రుచులు ఉష్ణవీర్యము లఘుసరగుణములు కఫవాతములు జ్వరము శ్వాసకాసలు అరోచకము శోఫ పాండువు పార్శ్వపునొప్పి వాతకాస శోధ ఊర్ధ్వవాతము హిక్క నశింపచేయును.

పుష్పశర్కర:—చూ. పంచదార.

పుష్యరాగము:—బరువు స్నిగ్ధత స్వచ్ఛత లావు సమము మృదువు గోగుపూవువంటి ఆకృతి నునుపు అను లక్షణములుగల పుష్యరా

గమునుమంచిది. పుష్యరాగమును శోధన మారణముల జేసి సేవించిన విషము ఛర్ది కఫవాతములు అగ్నిమాంద్యము తాపము కుష్ఠము రక్తదోషము హరించును. దీపనపాచనముల జేయును,

పుష్యరాగమును మేకమూత్రమునందు భావనచేసిన శుద్ధమగును. పిదప పాషాణభేది లేక కొండపిండివేళ్ళరసముతో భావనచేసి కొలిమిలోపెట్టి యూదినచో భస్మమగును. ఈభస్మము ఆయుర్వృద్ధి బలము బుద్ధి కాంతి వీర్యవృద్ధికలుగ జేయును.

పుష్పాంజనము:—తెల్లగ స్నిగ్ధముగ శీతలముగ నుండును. నేత్రరోగములను కూరమైన హిధ్మను విషజ్వరములను పోగొట్టును. లోపలకుసేవించిన హిక్క- శ్వాస కాసలు పీనస మొదలగు రోగముల ను హరించును.

పెండలము:—సం. స్థూలకంద, గోపుకంద అనిపేరు పెండలము గురుత్వముచేయును. శ్లేష్మవాతము బెంచును. పిత్తము వాపు హరింపచేయును. నాగపెండలమునకు మానకంద సుహాచ్ఛద అని సంస్కృతనామములు. శీతలముగ రుచికరముగ నుండును. పిత్తరక్తము నణచును. గురుత్వముచేయును.

పెద్దగుమ్ముడు:—గంభారీ, సర్వతోభద్ర, కాశ్మరి అనియు, హిం. కుంభేర్, ఖంబారీ అనియుపేరు. ఇదిపెద్దవృక్షము. గురు పంచమూలములలోచేరినది. గనుక మూలమందు విశేషసారముగలది. బావిమామాకులంత ఆకులును పసుపుపచ్చనిపూవులు పండ్లును తెల్లగబూడిద చరిచినట్లుండు పట్టయుకలదు. దీనిని నరికిన పాలుగారును.

చేదు తీపి వగరు రుచులు గురుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. దీపనపాచనముల గలిగించును. పవిత్రమైనది మలమును భేదించును. భ్రమ శోష దప్పి ఆమశూల అర్శస్సు విషము తాపము జ్వరము హరించును.

పెద్దగుమ్ముడుపండు వీర్యవృద్ధి బలము గలిగించును. వెండ్రుకల కుదుళ్ళలమిచ్చును. వాతపిత్తములు దప్పి రక్తదోషము క్షయ తాపము



వాతరక్తము క్షతక్షయము హరించును. మలబద్ధముచేయును. పూలు పు తీపి రుచులు స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకముగలది.

పెద్దగుమ్ముడుపూవు తీపి వగరు, చేదురుచులు, స్నిగ్ధగుణము, శీతవీర్యము మధురవిపాకము గలది. పిత్తము, రక్తము, రక్తరోగము హరించును. మలబద్ధము వాతము తగ్గించును.

పెద్దగుమ్ముడువేరుపట్ట ప్రదరము, జ్వరము, దప్పి, తాపము, అర్శస్సు, మూత్రకృఛ్రము, రక్తపిత్తము, ఆమవాతము, క్షయ, వాతము, క్షతక్షయ మున్నగు రోగములను హరించును. రసాయనము.

పెద్దఆముదపుచెట్టు:—సం. స్థూలైరండ, మహా పంచాంగుళ, హిం. సఫేద్ అండ, లాల్ అండ్, బడాఅండ్, అనియుపేరు. ఇదిప్రసిద్ధమైనచెట్టు.

ఆముదపుచెట్టు సాధారణముగ మధురరసము గురుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది.

ఆముదపుఆకు వాతము, కఫము, క్రిమి, మూత్రకృఛ్ర హరించును. పిత్తరక్తమును ప్రకోపింపజేయును. చిగురుటాకు గుల్మము వస్తిశూల కఫవాతములు కృమి ఆమము హరించును. ఆముదపుఆకుల ను వెచ్చజేసి కడుపునకు గట్టిన మలమూత్ర బద్ధమువిప్పును. పచ్చిఆకులను తలకుగట్టిన మేహపునొప్పి తగ్గును.

ఆముదపుపండు మిక్కిలి వేడిచేయును. గుల్మము, శూల, వాతము, యకృత్, ప్లీహ, అర్శస్సు, హరించును. దీపనముకల్గించును.

ఆముదపు పండుగుంజు మలమును వెడలించును. వాతశ్లేష్మము లు ఉదర రోగములు హరించును.

ఆముదపువేరు శూల, వాతకఫములు హరించును. వీర్యవృద్ధిచేయును.

ఆముదపుపూవు వాతము, కఫము, గుల్మము, గుదమునందుపుట్టురోగములు శూల, ఊర్ధ్వవాతము హరించును.

ఆముదపు గింజలనుండి తీసినతైలము మధురరసము గురుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. కడుపులోని సరములను మెత్తబరచును. మలమును వెడలించును. జీర్ణజ్వరము వాతరక్తము హృద్రోగము, నంజు, మున్నగు రోగములను హరించును. చిన్నాముదపు గుణాదులుగూడ దీనియందుగలవు. చూ. ఆముదపుచెట్టు.

పెద్దజీవంతి:—సం. బృహజ్జీవంతి పుత్రభద్ర. ప్రియంకరీ, జీవపుష్పఅనియు హిం. బడీజీవంతి, అనియుపేర్లు, మధురరసము, స్నిగ్ధగుణము, శీతవీర్యము, మధురవిపాకముగలది. క్షయము. తాపము జ్వరము, రక్తపిత్తము, వాతము, నేత్రవ్యాధులు, శ్వాస కాసలు, స్వరభేదము, రక్తదోషము, భూతబాధ హరించును బలము, పుష్టి, కాంతి గలుగజేయును. జీవంతిఫలము తియ్యగా గురువుగానుండును. కఫ శుక్రములను పెంచును. జీవంతిలో అనేకభేదములుగలవు. చూడు. మనుబాల.

పెద్దదూలగొండి:—సం. కపికచ్ఛూ, ఆత్మగుప్త, శూకశింబా కపిప్రభా, కండురా అనియు హిం. కౌంఛ్, కివాంఛ్ అనియుపేర్లు. ఇది పెద్దతీగ దీనిపువ్వులు చిక్కుడు పువ్వులవలె నుండును. కాయలుకూడచిక్కుడు కాయలవలెనేయుండును. కాయలపైన సన్నని నూగుండును. యీనూగుశరీరమునకు తగిలిన అమితమైన దురదపుట్టును. గింజలు చిక్కుడుగింజలవలెనే వుండును.

దూలగొండిగింజలు మధురరసము, శీతవీర్యము, స్నిగ్ధగురుగుణ వాతములు మధురవిపాకముగలవి. అమితమైన వీర్యవృద్ధి చేయును. ము. క్షయ, పిత్తరక్తము, శీతపిత్తము, రక్తవికారము, దుష్టవ్రణము హరించును. యించుమించు దీనివేరుకూడ పైగుణములు కలిగియుండును, కాడలకషాయము అతిసారము, వాతజ్వరము హరించును. పచ్చి కాడలరసమున తేనె మిరియాల చూర్ణముకలిపి యిచ్చిన కలరా అతిసారముతగ్గును. సీమగోబ్బివిత్తులు, పల్లేరువిత్తులు దూలగొండివిత్తులు చూర్ణించి ఆవుపాలతో వుడికించి పంచదారకలిపి సేవించిన వీర్యవృద్ధి



కలుగును. సంభోగశక్తి వీర్యస్తంభనత్వము కలిగించి శుక్లనష్టమునాపును. దీనిసమూలకషాయము పక్షవాతము గొట్టును. వేరుచూర్ణము, ... పాతము, కరపాదశీతము నశింపజేయును. దీనివేరు చిటికెంజ ముతీసి తేలుకుట్టినచోట మందముగా వేసిన విషముదిగును. దీనిసమూలకషాయమునందు పంచదారచేర్చి యిచ్చిన మలబద్ధమును విప్పును, జీర్ణించిన సుఖరోగములు గలవారికి చాలహితము. చూడు దూలగొండి.

పెద్దనేపాళము:—సం. బృహద్దంతి, గుచ్ఛఫలా, దుగ్ధగర్భాని మభద్రాఅనియు హిం. ముగలాయీఅండ్, అనియుపేరు. సాధారణముగ నచెట్టు ఆకులుగుండ్రముగా కొనదేరియుండును. కొమ్మవిరిచిన నీరువంటి పాలుగారును. దీనిపాలు కారముగా ఉష్ణవీర్యముగా వుండును. జఠరరోగమును శోధించును. అర్శస్సు, అశ్మరి, మూత్రకృఛ్రి, శూలచర్మరోగములు హరించును. దీనిపాలను మర్దనజేసినయెడల మేహవాతపుకీళ్ళనొప్పులు హరించును. పొక్కుపొక్కును. పుండ్లపైన రాచినయెడల త్వరగమాన్పును. దీనిగింజలనుండి తీసినతైలముగాని గింజలుగానితినిన విరేచనముజేయును. వీర్యపుష్టి, బలము, పుష్టి కలిగించును. కఫపిత్తములను హరించును. కొందరకువాంతిజేయును. ఇదివిషతుల్యమైనది. కనుక సేవించుటయందు జాగ్రతగా వుండవలెను ఇంచుమించు నేపాళపుగింజల ప్రభావము గలిగియుండును. చూ. నేపాళము.

పెద్దబోడ తరము:—చూడు. బోడతరము.

పెనువేప:—సం. మహానింబ, కార్ముక, విషముష్టిక, కేశముష్టి అనియు హిం. బకాయన్ అనియుపేరు. ఇది పెద్దవృక్షము. వేపచెట్టువలెనేయుండును. ఆకులు పెద్దవి. మాను తెల్లగానుండును. ఇది కటుతిక్త,కషాయరసములు. రూక్షగుణము శీతవీర్యము కటువిపాకముగలది. మలబద్ధముచేయును. కఫము తాపము వ్రణము రక్తవికారము పిత్తము కృమి విషమజ్వరము హృద్రోగము అష్టాదశకుష్టములు ఛర్ది ప్రమేహము విషూచిక ఎలుకవిషము గుల్మము శీతపిత్తము కోశరోగ

ము అర్శస్సు శ్వాస అనురోగములహరింపచేయును. వేరు పత్రరసమందు ఒకచిన్నము కాచు చూర్ణమును కలిపి ఉదయ సాయంత్రములందు పుచ్చుకొనిన రక్తగ్రహణికట్టును. వేరు కషాయమునందు బావంచాల చూర్ణముకలిపి పుచ్చుకొనుచున్న కుష్ఠమునశించును.

పెద్దహంసపాది:—సం. కీటారి, కీటమారి అనియు, హిం. కీడామారీ అనియుపేరు. వాతశ్లేష్మములు జ్వరము హరించును. సంధులయందును అస్థులయందును కల వ్యాధులను హరింపచేయును.

పెన్నేరు:—సం. అశ్వగంధా, అశ్వావరోహక, తురగీ, వాజికరీ అనియు, హిం. అసగంధ్ అనియుపేరు. ఇదిచిన్నక్షుపము. ఆకులు గుండ్రగ మృదువుగనుండును. ఇది వేరు ప్రధానముగల మూలిక. దీని పండ్లు యెర్రగ గుండ్రగ పగడములవలెనుండును. పండ్లలోనిగింజలు మిక్కిలిసన్నముగ తెల్లగనుండును.

దీనివేరు చేదు వగరు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలవి. వాతశ్లేష్మములు శోఫ శ్విత్రము (బొల్లి) క్షయ శ్వాసకాసలు వ్రణము కుష్ఠము విషము కృమి క్షతక్షయము దురద మున్నగు రోగముల హరించును. బలము వీర్యపుష్టి వీర్యస్తంభనము కాంతి ఆయువు గలుగజేయును. వీర్యవృద్ధికరమైన వస్తువులలో శ్రేష్ఠమైనది. పెన్నేరాకునూరి పూతపెట్టిన గ్రంధులు గండమాల అపచిమున్నగు చర్మరోగములుమానును. ఆకులకు ఆముదముపూసి వెచ్చజేసి గడ్డలపై వేసి కట్టిన పక్వములైపగులును. అశ్వగంధకషాయమున పాలు పంచదారకలిపి త్రాగుచున్నయెడల స్త్రీలకు గర్భకోశము బాగుపడి సంతానయోగ్యతకలుగును. పురుషులకు పుంస్త్వముహెచ్చును. జఠరమువృద్ధియగును. మూత్రము పరిశుద్ధమగును.

పెన్నేరురసము 4 భాగములు, ఆవునేయి 1 భా॥ కలిపి రసము యిగురువరకు కాచి మర్దనచేసిన వాత మేహవాతపునొప్పులు తగ్గును. లోపలకుగూడ పుచ్చుకొనవచ్చును. పెన్నేరు నేలగుమ్ముడు శొంఠి సుగంధివేరు నాలుగుచూర్ణములను గావించి సలసలకాగు నీళ్ళలో వేసి యొక



ఘడియయుంచి వడియగట్టి యీమూలిక కషాయమున పాలు పంచదార చేర్చి ప్రతిదినముదయమున పుచ్చుకొనుచున్న అత్యుష్ణము స్వప్నస్ఖలనము గుండెలలోదడ కడుపులోని పైత్యపుమంట పోయిదగ్గుతగ్గును. బలము పుష్టియిచ్చును. వీర్యముగట్టిపడును. సంభోగశక్తిని పెంచును. శుక్రదోషములను హరించును.

పెరుగుతోటకూర:—సం. మారిష, బాష్పక అనియు, హిం. మరసా, నవడా అనియు పేరు. తోటకూర దొడ్లలోవేసి పెంచబడు శాకవిశేషము. ఆకులు పలచగ కొంచెముకోలగ గుండ్రగ నుండును. యెర్ర పెరుగుతోటకూర తెల్లపెరుగుతోటకూరయని యిందులో రెండు భేదములున్నవి. తక్కిన కొయ్యతోట ముళ్ళతోటమున్నగుఅనేకభేదము లాయాశీర్షికలందు చూడునది. పెరుగుతోటకూరగింజలు సన్నముగ నల్లగ మిలమిలలాడుచుండును.

మధురరసము గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. మలబద్ధము వాతశ్లేష్మములు కలిగించును. రక్తపిత్తము విషము విషమాగ్ని వీనినిజయించును. మేహశాంతిచేయును. పథ్యముగనుండును.

యెర్రపెరుగుతోటకూర మధురరసము సరగుణము కటువిపాకము శీతవీర్యముకలది. కొంచెము క్షారముకల వస్తువు కొలదిగ గురుత్వముచేయును. కఫమునుపెంచును. స్వల్పదోషముకలది.

పెరుగు:—తియ్యనిపెరుగు మలమును వెడలించును. కఫమేదస్సులను పెంచును. వడగట్టిన అవుపెరుగు వాతశ్లేష్మహరము. బలము శరీరపుష్టి రుచిగలిగించును, స్వల్పముగ పైత్యము చేయును. చక్కగ కాగిన పాలయొక్క పెరుగు రుచిగ శ్రేష్ఠముగనుండును. పిత్తవాతముల హరించును. సకలధాతువులకు బలమునిచ్చును. అగ్నిదీప్తి బలము యిచ్చును. మీగడ పెరుగు వగరుగ చులకగనుండును. వాతమును పెంచును మలబద్ధము చేయును గ్రహణినికట్టును. రుచిబుట్టించును. పెరుగు చక్కెర కలిపి భుజించిన దప్పి పిత్తరక్తము తాపము హరించును,

బెల్లముకలిపి తినిన వాతముహరించి శుక్రవృద్ధి శరీరపుష్టి గలుగ జేయును. తృప్తినిచ్చును. గురుత్వముగనుండును. బెల్లము మిర్యాలుచేర్చిన పెరుగును త్రాగిన పీనస హరించును. ప్రత్యేకముగ మిర్యాలచూర్ణము కలిపిన పెరుగుత్రాగిన కఫము కాస తగ్గును. వసంత శరత్ గ్రీష్మ ఋతువులందు భుజింపరాదు. హేమంత శిశిర ఋతువులందు పెరుగు ప్రశస్తమైనది. వర్షర్తువునందు దధిసేవ ఆరోగ్యదాయకము. రాత్రులందు పెరుగును త్రాగరాదు. అవసరమై భుజింపవలసియుండు నెడల ఉదకము నేయి కలిపి భుజించవలెను. శోధ కాస క్షయ మేహము అగ్నిమాంద్యము వ్రణము శ్వాస ఆమజ్వరము కుష్టు యీవ్యాధులు కలవారలకు పెరుగు అపథ్యము. పాలు ఉశిరిగకాయ పెసరపప్పు కోడి పందిమాంసము మున్నగు వస్తువులు పెరుగునకు విరుద్ధములుగాన దనిని సేవించునప్పుడట్టివస్తువులను కలిపి తినిన కుష్టు జ్వరము అజీర్ణము ఛర్ది మొదలగు వ్యాధులుకలుగును. పెరుగు పాలు కలిపి త్రాగిన విషమమాన్నమై మనుజునిచంపును. రాత్రిపూట నేడిపాలలో అన్నమును వేసి తోడుపెట్టి అందుపైన శొంఠి మిర్యాలపొడి చల్లి ఉదయముననే సూర్యోదయమునకుపూర్వము భుజించుచున్న నిక్కాక ఒంటితలనొప్పి ఉమ్మదగ్గు రొమ్ములలోను కడుపులోను పుట్టు పైత్యపుమంట రొమ్ము యెండిపోవడము తెల్లకుసుము శుక్లనష్టము కట్టును. సాధారణముగా ఉదయకాలమున పెరుగుకలిపిన యన్నమును భుజించిన తృప్తి బలము పుష్టి జఠరదీప్తి కలుగును. మత్తుచేయును. నిద్రదెచ్చును. పెరుగుమీద తేట గురుత్వమైనది. శుక్రవృద్ధికారి. వాతమును జఠరాగ్నిని చంపును. వస్తిశుద్ధిగావించును. పుల్లగనుండును. గాన పిత్తశ్లేష్మములను పెంచును. పెరుగుమీదమీగడ బడలికనుహరించి బలమునిచ్చును. అన్నహితము మనస్సంతుష్టి స్రోతశ్శుద్ధి కలిగించును, కఫము దప్పి వాతము మలబద్ధము హరించును.

పెసలు:—సం. ముద్గ, రసోత్తమ, వర్ణార్హ, హయానంద అనియు, హిం. మూగ్ అనియుపేరు. పెసరచెట్టు క్షుపము. ప్రసిద్ధము.



కొమ్ముపెసలు నల్లపెసలు పచ్చపెసలు అని యిందు మూడుభేదములు కలవు. ఇంకను భేదములుకలవుగాని యివిముఖ్యములు.

పెసలు సామాన్యముగ కషాయ మధురరసములు లఘు రస గుణములు శీతవీర్యము కటువిపాకముగలవి. నల్లపెసలు త్రిదోషహరములు. బలము వీర్యము దేహపుష్టి నీపనము గలిగించును. వాతమునణచును. సులువుగజీర్ణించును. కొమ్ముపెసలు పిత్తము వాతము మలబద్ధముచేయును. రుచిగనుండును. పచ్చపెసలు కఫపిత్తములు రక్తదోషమురూత్రదోషము హరించు తేలికగనుండును. అగ్నిదీప్తినిచ్చును. దేహశాంతిచేయును. పచ్చపెసలపప్పులో అల్లము జీలకర్ర కలిపి రుబ్బి ఆవునేతిలో అట్టువలెచేసి వేయించి ప్రాతఃకాలమున దినిన అగ్నిదీప్తిని పైత్యశాంతినిచేయును. అరుచిని పోగొట్టును. జ్వరపడిలేచినవారికి నాలుగైదుగోజులిచ్చిన అన్నహితముకలుగును. గొండుమొదలు 5 తులముల యెత్తుకంటె యెక్కువతినిన అజీర్తి కడుపునొప్పి దెచ్చును. ముద్గయూషము అనగా పెసలకట్టు జీర్ణశక్తిని అగ్నిదీప్తిని యిచ్చును. పిత్తశాంతిచేయును. జ్వరము ప్రమేహము అరోచకము క్షయ ప్రదరము అర్శస్సు అను రోగములుకలవారలకు హితముగనుండును, పెసరపప్పు (పొట్టుతీయనిది) బియ్యము కలిపి వండి వార్చినగంజిలో ఉప్పుకలిపిత్రాగిన మార్గాయాసము యెండదెబ్బ విదాహము హరించును. తేలికగనుండును. పిత్తజ్వరములకు పథ్యమైనది. పెసరపప్పువేసి వండినయన్నము అనగా పెసరపులగము రుచిగనుండును. బలము పుష్టిని శక్తిని యిచ్చును. మంగళప్రదము. దేవతాప్రీతికరము. ఆలస్యముగజీర్ణమగును కఫమును పెంచును. వ్రణరోగులు పెసలనుతినిన కురుపులు చీముపట్టును గనుక వారుతినరాదు. పెసలపిండి మాటుపెట్టియిచ్చిన రసపాషాణములు నోరు పట్టకుండును.

వేము:—సం. వేతస, నిచుల, వంజుల, దీర్ఘపత్రిక, విదుల అనియు, హిం. బేల్ అనియు పేరు. వేము నీటివేము మెట్టవేము అని రెండువిధములు. జలముగలచోట్ల తీరములందు దుబ్బువలె పెరుగును. ఇ

దియొకవిధమగు వృక్షమైనను తీగవలె బయలుదేరును. దీనిఆకు వెనురాకువలెనుండును. పూత కాపు ఉండదు. పేము బెత్తములు పొడవుగానుండును. పేముతో కుర్చీలు మొదలగునవి యల్లుదురు. రెండుపేములున్ను యించుమించు సమానగుణములుకలవి.

కారము చేదు వగరు రుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. తాపము శోఫ అర్శస్సు యోనిరోగము వ్రణము విసర్పము మూత్రకృచ్ఛ్ర రక్తపిత్తము అశ్మరి కఫవాతములు మేహము కుష్ఠము విషము హరించును. పేపచిగుళ్ళు కారము రుచి లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. క్షారము గలిగియుండును. కఫవాతహారముగనుండును. పేపాకు వగరు చేదు కారము రుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. కడుపులోని వాతమును వెడలించును. రక్తదోషము కఫము పిత్తము హరించును. పేపగింజలు కాలుపు వగరు రుచులు రూక్షగుణము ఉష్ణవీర్యము అమ్లవిపాకము గలవి. పిత్తముబెంచును. రక్తదోషము కఫము హరించును.

పేయ.—అనగా అరిపలము ద్రవ్యమును ఒకప్రస్థము జలములోవేసి సగము మిగులునటులుగాచి అందు దానిమ్మపండురసము 2 కర్షములు, సైంధవలవణము శొంఠి ధనియాలు ఇవిప్రత్యేకమొక శాణము. వరిపేలాలు 2 కర్షములు చేర్చి మరలకాచి అందు పిప్పళ్ళు జీలకర్ర వీనిచూర్ణము ప్రత్యేకము శాణప్రమాణము కలిపిన పేయయనబడును. మజ్జిగ దానిమ్మపండురసము బియ్యము వీనిని జేర్చి అన్నకణములులేకుండగ కాచబడినది పేయయని మరియొకమతము. ఇదిమిక్కిలి తేలికగనుండును. వాతమునను లోమగతికి దెచ్చును. దప్పి బడలి వమనవిరేచనకర్మల జేసికొన్నవానికి శేషించియున్నదోషము వీనిని హరించును. వాతాది ధాతువులను సామ్యస్థితికి దెచ్చును. జీర్ణశక్తినిచ్చును. స్రోతస్సులకు మార్దవము గలిగించును. చెమటబుట్టించును. అగ్నిదీప్తినిచ్చును. పేయఅనునది పేలాలతో కాచబడినది.



పేలాలు:—సం. లాజ అనియు, హిం. ఖైలై అనియు పేరు. ధాన్యములను వేయించినయెడల తెల్లగాపేలును. ఇవియె పేలాలనబడును. ఇవి లఘువుగ శీతలముగనుండును. బలమిచ్చును. పిత్తకఫములహరించును. వాంతి అతిసారము తాపము రక్తదోషము మేహము మేదోరోగము దప్పి వీనినిహరించును. వేయించిన బియ్యము మలబద్ధముచేయును. రూక్షగనుండును. కఫము మేదస్సుహరించును. గురుత్వముగనుండును. పేలాలగంజి తాపము దప్పి అతిసారము మేహము అణచును. బడలికను తీర్చును. ధాతు సామ్యమును గలుగజేయును. పేలాలు విసరిన పిండిలో పంచదారకలిపి భుజించిన సులభముగ జీర్ణమగును. రక్తపిత్తము ఆకలితాపము హరించును. జఠరదీప్తినిచ్చును. నేత్రములకు హితముగనుండును. పాండు శోఫ అగ్నిమాంద్యము శ్వాసకాసలు అను రోగములుకలవారలకు పేలపిండి ఆహారముగనిచ్చిన మిక్కిలి పథ్యముగనుండును.

పొగబీల్చుట అనగా ధూమపానము:—ఆయారోగముల కనుకూలములగు వస్తువుల పొగను ముక్కుతోను నోటితోను పీల్చుటవలన కన్ను చెవి ముక్కు నోరు తల మున్నగు ఊర్ధ్వాంగములకు సంబంధించిన ధమనులు మొదలగు వానియందణగియుండు శ్లేష్మమును తొలగించి పరిశుద్ధములుగజేయును. వాతదోషము హరించి పుష్టికలుగును. ఇట్టి ధూమపానము శమనము బృంహణము విరేచనము కాసహరము వామనము వ్రణధూపనము అని ఆరువిధములు. ఆయాద్రవ్యములను మెత్తగానూరి ముద్దజేసి సన్నని పుల్లకు దూదిచుట్టి దానిపై మందుపట్టించి ఆరబెట్టి పుల్లను మెల్లగాలాగివేసి యావత్తిని ధూమయంత్రమునగాని శరావములందుగాని యుంచి పొగ బీల్చవలెను. వెదురు లోహము కర్ర దంతము మొదలగువానితో ధూమమును పీల్చు గొట్టములు చేయించి యీగొట్టమును మూడుభాగములు చేసి మూడుకణుపులుండునట్లు చూడవలెను. గొట్టపురంధ్రము కణుపులవద్ద సన్నముగను తక్కినచోట లావుగనుండవలెను. రెండుమూకుళ్ళ నొకదానిపై నొక

టి మూసి యొకదానిపై గొట్టము నుంచునట్లు రంధ్రముచేసి యుంచు గూర్చవలయును.

శమనధూపము—గ్రంధితగరము చంగల్వకోష్టు గాక తక్కిన * ఏలాదిగణద్రవ్యములతో చేయబడిన వర్తిని ధూమనాడియందుంచి పొగను ముక్కుతో బీల్చి నోటితో విడువవలెను. ఒక్కొక్కసారి మూడుగ్రుక్కలచొ॥ నాలుగుపర్యాయములు బీల్చవలెను. దీనివలన ధమనులయందలి శ్లేష్మముకరిగి బైలకు వెడలును. దంతధావన నస్య స్నాన భోజనములకు అంతమందు శమన ధూపమునుపయోగించవలెను. శమన ధూమమునకు మధ్యమధూమము ప్రాయోగిక ధూమము అనియు పేర్లు గలవు.

బృంహణధూమము—కరకతాని మున్నగువాని పప్పులు నేయి గుగ్గిలము సర్జరసము మొదలగువానిం జేర్చి నూరిన ముద్దయొక్క ధూమమును బృంహణధూమమందురు. దీనికి మృదుధూమము స్నేహధూమము అని నామాంతరములుకలవు. బృంహణధూమమును నోటితో పీల్చి నోటితోను ముక్కుతో పీల్చి నోటితోను యిట్లు కండ్లవెంట నీరు గారువరకు పీల్చవలెను. బృంహణ ధూమపానమువలన వాతము నశించును. మూత్రవిసర్జనము తుమ్ము మైధునము కోపము వీనికనంతరమున బృంహణధూపముపయోగింపవలెను.

* ఏలాదిగణము:—చిన్నయేలకులు పెద్దయేలకులు తురుష్కధూపము చంగల్వకోష్టు పేంఖణము జటామాంసి కురువేరు ధ్యామకము స్పృక్కకచోరము లవంగపట్ట తమాలపత్రము గ్రంధితగరము దవనము బోళము నఖముచిప్ప వ్యాఘ్రనఖము అగురు దేవదారు శ్రీవాసము కుంకుమపువ్వు చండ మహిసాక్షి సర్జరసము కుందురుష్కము సురపొన్న నాగకేసరములు ఈవస్తువులయొక్క కూటమికి ఏలాది గణమని పేరు. (అ. సూ.)



రేచనధూమము—శిరోవిరేచనకర వస్తువులను గూర్చి వర్తిచేసి శమన ధూమ విధిప్రకారము పీల్చవలెను, రేచన ధూమము అప్పునదిగ చురుకుగ ఉష్ణముగ తీక్ష్ణనదిగ నుండునుగనుక శ్లేష్మమును కరిగించి శుద్ధిపరచి బైటకువెడలజేయును. రేచన ధూమమును స్నానము వమనశోధనము పగటినిద్ర వీనికనంతరమున నుపయోగించునది. దీనికి తీక్ష్ణ ధూమము శోధన ధూమము వైరేచన ధూమము అని నామాంతరములు.

కాసహరధూమము—త్రికటుకములు చిన్నములక పెద్దములక కసివెంద యింగువ తిప్పతీగ కర్కటకశృంగి మణిశిల మొదలగు కాసహరవస్తువులనుగూర్చి పానముచేయునది. కాస హర ధూమమగును. బృంహణధూమమునువలె దీనిని పీల్చునది, కాసహరధూమమును భోజనానంతరమున కఫము హరించువరకు పీల్చవలెను. దీనివలన క్షయ ఉబ్బసము కాసలు మున్నగునవితగ్గును.

వామనధూమము—జంతువుల స్నాయువులు చర్మము డెక్కలు కొమ్ములు నూరి దానితో చేసిన వర్తియొక్క పొగనుపీల్చుట వామనధూమమనబడును దీనిని నోటితో పీల్చి నోటితో విడువవలెను. నూవులు బియ్యము కలిపి సిద్ధముచేసిన జావను త్రాగించి వమనముచేయించవలసిన అవసరముగలిగినపుడు కఫముహరించి పిత్తము వెలువడు నంతవరకు వామనధూమము నుపయోగించవలెను.

వ్రణధూపనధూమము—వస వేపాకు ఉమ్మెత్తాకు సాంబ్రాణి మొదలగు వస్తువులనూరి చేసిన వర్తిని కాల్చి ధూమమును వ్రణములకుపట్టించుట వ్రణధూపన ధూమమనబడును. దీనివలన వ్రణములబాధ తగ్గును. అందలిచీముకరుగును. చీము బైటకువెడలి త్వరగ పుండు ఆరిపోవును.

**వర్తులపరిమాణములు**—శమనధూమవర్తి 12 అంగుళములు పొడవుగల పుల్లకు 8 అంగుళముల మందును పట్టించవలెను. 48 అంగుళ

ముల పొడవుగల యీగొట్టపురంధ్రము మొదట బటానీగింజ పట్టునంత యు చివర చిటికెనవ్రేలు పట్టునంతయునుండవలెను.

బృంహణధూమవర్తి—8 అంగుళముల పుల్లకు 6 అంగుళము లన్నరమందు పూయునది. యీవర్తిని 32 అంగుళములనాడియందమ ర్చవలెను. దీనిరంధ్రము మొదట రేగుగింజపట్టునంత యుండవలెను.

రేచనధూమవర్తి—6 అంగుళములపుల్లకు 4 అంగుళముల వర కు మందుపూయునది. 24 అం॥ నాడియందు దీని నమర్చవలెను. దీని మొదట రంధ్రముకూడ రేగుగింజపట్టునట్లుండవలెను.

కాసహరధూమవర్తి—4 అంగుళములపుల్లకు 2 అం॥ మందు పట్టించునది. 16 అంగుళములనాడియందు దీనినమర్చవలెను. దీనిరంధ్ర ముకూడ రేగుగింజంతయుండును.

వామనధూమవర్తి—కాసహర ధూమవర్తివలెనే యుండును.

వ్రణధూపనవర్తి—యీనాడి 8 అం॥ పొడవును బటాని గింజంతలావును మధ్య ఉలవగింజపట్టునంత రంధ్రమును కలిగియుండు నది. ఇందు శమన బృంహణములు ఆరోగ్యరక్షకములుగ రేచన వా మనములు శోధన కరములుగ కాసఘ్న వ్రణధూపనములు రోగహర ములుగ నుండును. శమనబృంహణములు ప్రతిదినము ఊర్ధ్వజత్రుగ వి కారములు గలుగకుండ కాపాడుకొనుట కుపయోగింపదగినవి. ప్రతిదిన ము వీనినాచరించుటవలన కండ్లు చెవులు ముక్కు నోరు మున్నగు యిం ద్రియములు ప్రసన్నములుగనుండును. మనస్సు నిర్మలమగును వాక్కు స్ఫుటముగ వెండ్రుకలు దంతములు దృఢతరములుగ నోరు సుగంధ ముగనుండును. పార్శ్వపునొప్పి శ్వాసకాసలు పడిసెము రాకుండును. 12 సం॥ లోపువారును 80 సం॥ దాటినవారును ధూమపానముజేయం జనదు. అలసినవారు భయపడినవారు దుఃఖితులు, విరేచనవస్తి శో ధనములజేసికొన్నవారు రాత్రి జాగరణముచేసినవారు దప్పిగొన్నవారు నోరుపూతగలవారు ఉదరము ఉరఃక్షతము కడుపుబ్బరము పాండువు ప్రమేహము ఛర్ది అనువ్యాధులుకలవారు గర్భిణులు బాలుగు వృద్ధ



లు పెరుగు పాలు నేయి ఆసవములు మత్స్యములు వీనిని భుజించినవా రు ధూమమునుపయోగింపరాదు. అమితముగ లేక అక్రమముగ ధూ మముపయోగింపబడినయెడల పెదవులు గొంతు దవడలు నాలుక వీని యందు పుండ్లుపుట్టును. దప్పి మూర్ఛ మదము భ్రమ పుట్టును. నే త్రశ్రోత్రాదులందు రోగములుకలుగును.

పొగడచెట్టు—సం వకుళ, తైలాంగ, కేసర, సీధుగంధ అని యు, హిం. మౌలసిరీ, బకుల్ అనియుపేరు. ద్దవృక్షము ఆకులు కోలగ నునుపుగ పలుసుగ ఉండును. దీనిపూవులు తెల్లగ గుండ్రగ అ మితపరిమళముగ నుండును, యెండినకొలది సువాసనహెచ్చగును. దీని కాయ గంగరేగుపండువలె కొంచెము కోలగ గుండ్రగ నుండును.

చక్క తీపి వగరు రుచులు గురుగుణము శీతవీర్యము కటువి పాకముగలది, కఫము పిత్తము విషము శ్విత్రము క్రిమి దంతరోగము లు హరించును. పొగడచక్కరసమును పెరుగులోవేసి త్రాగిన అతి సారము జిగటవిరేచనములు కట్టును, చక్కనమిలి పుక్కిటబట్టిన నోటి పూత చిగురువాపు దంతములుకదలుట తగ్గును. చక్కరసమున శిలా జిత్తుభస్మమునుకలిపి త్రాగిన తెల్లకుసుమమానును. మూత్రనాళమం దలిపుండు నయమగును. పొగడపూవు మధుర కషాయరసములు గురు గుణము శీతవీర్యము మధురవిపాకముగలది, పిత్తము కఫము రక్తవికా రము హరించును. మలబద్ధముచేయును. నీళ్ళవిరేచనములనుగట్టును. తలకు వేసి కట్టుగట్టిన తలనొప్పితగ్గును. కండ్లకుగట్టిన కంటిమెరుపు పో టుతగ్గును. పొగడపండు మధుర కషాయరసములు రూక్ష విశద గురు స్నిగ్ధగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది కఫపిత్తముల హ రించును మలబద్ధము ఆధ్మానము వాతము గలిగించును. దంతములను గట్టిపరచును. పొగడగింజల చూర్ణమును నస్యముచేసిన శిరోరోగము లు హరించును.

**పొట్లు.**—పొట్లుమాంసము గురువుగ జిగటగ నుండును. బలమిచ్చును. కఫపిత్తముల బుట్టించును. దీనిక్రొవ్వు, తోకయందలి

మాంసము వీర్యవృద్ధి జేయును. కఫపిత్తముల పెంచును. గురుత్వముగ నుండును.

పొట్లతీగ:—(పొట్లపుగుది) సం. చిచిండ, శ్వేతరాజి, సుక్ష్మా, గృహాకూలక అనియు, హిం. అహిఫలా అనియుపేరు. పొడవగు తెల్ల కాయలుకాచు పొట్ల వాతపిత్తములు హరించును. రుచికరము క్షీణిం చినవారికి మిక్కిలి పథ్యముగనుండును. ఇందులో నల్లకాయలు కాచు నదియుకలదు. రెండువిధముల పొట్ల మధురరసము స్నిగ్ధ లఘుగుణము లు ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. దీపనపాచనముల గలిగించును రుచిబుట్టించును. పుష్టినిచ్చును. శోష త్రిదోషములు వాతపిత్త జ్వర ములుహరించును. పొట్లవేరు విరేచనము చేయును. కాడలకూర కఫ మునుహరించును. పొట్లఆకుకూర పిత్తము జ్వరము కాస కృమి హరిం చును. తేలికగ బలకరముగనుండును. త్వరగజీర్ణమగును. వేడిచేయు ను. పొట్లకాయ మధురముగ రుచిగనుండును. త్రిదోషములు అరుచి కామిల కుష్ఠు మేహము జ్వరము నేత్రరోగము పాండువు వ్రణము అ గ్నిమాంద్యము వాపు క్రిమి హరించును.

పొట్లపండు కారము చేదు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము స్వాదువిపాకముగలది. దీపనపాచనములు వీర్యవృద్ధి కలిగించును. మల మును వెడలించును. వాతపిత్తకఫములను తమ తమ స్థానములందు స్థిర పరచును. శ్వాస జ్వరము త్రిదోషప్రకోపము క్రిమిహరించును. పొట్టి పొట్లకు సంస్కృతమున మేకీ రాజపటోలీ పర్వళీ అనియు, హిం. ప ర్వాల్ అనియుపేరు. దీనికాయ మధురరసము లఘు స్నిగ్ధగుణములు ఉ ష్ణవీర్యము స్వాదువిపాకముగలది. రుచిగ బలకరముగనుండును అగ్ని దీప్తినిచ్చును. కాస రక్తవికారము కృమి త్రిదోషములు హరించును. యీతీగకఫమును ఆకుపిత్తమును హరించును. వేరువిరేచనముచేయును.

పొణికిచెట్టు:— సం. భృంగాహ్వ, భ్రమరచ్ఛల్లి, భృంగాహ్వక అనియు, హిం. భమరచ్ఛల్లి అనియుపేరు. ఇది పెద్దవృక్షము. దీనిక ర్ర మిక్కిలి తేలికగనుండును. ఈకట్టతో బొమ్మలుచేయుదురు. కర్ర



తెల్లగ దంతమువలెనుండును. ఆకులు గుండ్రముగ బాదంఆకులవలె పెద్ద విగ నుండును.

కారము చేదు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాక ముగలది. రుచిబుట్టించును. అగ్నిదీప్తినిచ్చును. కంఠస్వరము బాగుచే యును. సర్వదోషములను హరించును.

పొత్తిదుంప:—సం. కరికాకీ అందురు. దీనిని అడవినాభియందు రు. ఇదితీగజాతి. ఆకులు సన్నముగ పొడవుగనుండును. యెఱ్ఱని పూ వులు పూచును.

చేదు రుచి తీక్ష్ణ సరగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగ లది. కఫవాతములు వ్రణము కుష్ఠు అగ్నిమాంద్యము జ్వరము నంజ కడుపుబ్బరము హరించును. దీనిని నీళ్లతో అరగదీసి యీగంధమును క రుగుచున్న మైనములో వేసి కలియగలిపి ఆముదము వేసి పిసికిబిళ్ళవలె చేసి అడ్డుగఱ్ఱలు సవాయిబెళ్ళలు సెగగడ్డలు మున్నగునవి ఆమ (నూతన) దశలోనున్నపుడు కట్టుగట్టిన నవిఅణగిపోవును. యీదుంపగంధము చి ల్లగింజగంధము కలిపి పట్టువేసినను పైగుణమునిచ్చును. తిప్పతీగనుండి వలె దీనినుండి తీసినసత్తును అడ్డిగెత్తుచొ॥ యుక్తమగుఅనుపానముతో వాడిన విషమజ్వరములు కుదురును. దుంపగంధమును అరగదీసి అందు పసుపు కలిపి అరికాళ్ళకు అరచేతులకుపూసిన సన్నిపాతాదులందలి కర పాదశీతలముతగ్గి వేడిపుట్టును. దీనిమోతాదు అధికమైనచో మనుజుని చంపును. దీనికి విరుగుడుగ నిమ్మరసముల్లిరసము గోమూత్రము శొంఠిరస ము అనువానిలో దేనినైననుపయోగింపవచ్చును.

పొన్నగంటి:—సం. మత్స్యాక్షీ, బాలిక, మత్స్యగంధ, మ త్స్యాదనీ అనియు, హిం. మఛేఛీ అనియుపేరు. ఇది నీటివారలమొల చు చిన్నమొక్క. ఆకులుచిన్నవిగ కొంచెము కోలగనుండును. తరుచు దీనిని కూరవండుకొనితిందురు.

చేదు వగరు తీపి రుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపా కముగలది. మలబద్ధముచేయును, కుష్ఠు కృమి పిత్తము కఫము విష

ము రక్తరోగములు హరించును. దీనివేళ్ళుగాని ఆకుగాని నేతితో వెచ్చజేసి కండ్లకుగట్టిన మోహమువలన గలిగిన కండ్లపోటు తగ్గును. శిరస్సునకుగట్టిన తలనొప్పితగ్గును. అన్నివ్యాధులందు పథ్యముగ నుండును. పొన్నగంటి గుంటగలగరరసములు జేసి కాచిన నూనెను శిరస్సునకు మర్దనముచేయుచుండిన అనేక శిరోరోగములుమానును.

పొన్నచెట్టు:—చూ. పున్నాగవృక్షము.

పోకచెట్టు:—సం. క్రముక, పూగ, పూగీఫల అనియు, హిం పాక్ అనియుపేరు. పోకచెట్లు సన్నముగ పొడవుగ పెరుగును. పోకకాయలు గెలలుగాకాచును. పోకపొత్తులను దొన్నెలవలెకుట్టిగృహోపకరణములుగ వాడుదురు.

పోకకాయ వగరు రుచి గురు రూక్షగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. కఫపిత్తములు నోటియందలి దుర్గంధము పూతశ్వాసకాసలు అతిసారము జ్వరము కృమి హరించును. దంతములను గట్టిపరచును. పచ్చిపోక గురుత్వము అగ్నిమాంద్యము శ్లేష్మము జేయును. దృష్టినిచెరుపును.

పండినపోక జిగటుగనుండును. త్రిదోషహరము. కంఠస్వరమును బాగుచేయును, యెండుపోక వాతమునుచేయును. మధ్యభాగమున మిక్కిలిగట్టిగనుండు పోక శ్రేష్ఠమైనది. పోకపూవు తినిన కృములు బుట్టించును. జిగట వగరు తీపి గురుత్వము గలది. త్రిదోషముల హరించును. పుష్టినిచ్చును. కొంకణదేశమందలి పోకలు సువాసనగ యుండును. శ్లేష్మముహరించును. దీపనపాచనములను పుష్టిని గలిగించును. పూర్వదేశమునబుట్టిన పోకలు త్రిదోషములు ఆమము మలబంధము కంఠరోగము హరించును. విరేచనమును పాచనము చేయును. రుచిగ అగ్నిదీపనకారిగ నుండును. ఆంధ్రదేశమందలి పోకలు వగరు తీపి పులుపు రుచులుకలవి. వాతకఫములు వర్ణదోషముహరించును. లేతపోకలు వగరుగనుండును. కంఠశుద్ధిచేయును. రక్తరోగము ఆమరోగము శ్లేష్మము చీముపడుట ఉదరవ్యాధి కడుపుబ్బరము వీనిని శమింపచేయు



ను. ప్రత్యేకముగ పోకలను తినుట అభ్యాసముచేసిన పాండు శోఫ జనించును. వీర్యమునకు హానిచేయును. గుండెలలో పట్టుబట్టును. దీనికి విరుగుడుపంచదార పానకము.

పోతుగడ్డి:—సం. గండదూర్వ, మత్స్యగంధ అనిఅందురు. చల్లగనుండును. లోహమును ద్రవింపచేయును. మలబద్ధకరము, తాపము దప్పి కఫము రక్తదోషము కుష్టు పిత్తజ్వరము హరించును. లఘువైనది.

పౌండరకపక్షిమాంసము:—స్వల్పముగ పిత్తమును చేయును. చలువగనుండును. శ్లేష్మవాతములహరించును.

ప్రత్తిచెట్టు:—కార్పాసి, కాలాంజని, శిలాంజని అనియు, హిం. కపాస్ అనియుపేరు. నల్లప్రత్తి మధురరసము లఘుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. ఆకులస్వరసము రక్తగ్రహణికట్టును. లేతఆకులను తొక్కి ఆముదము కలిపి వెచ్చజేసి కట్టుగట్టిన మోచేతులు మోకాళ్లు మున్నగు కీళ్ళలోనినొప్పులు తగ్గును. సమూలకషాయమున దుమిర్యాల చూర్ణమును కలిపి యిచ్చిన కలరా నశించును. మలమూత్రములను సరకముగ జారీచేయును. ప్రత్తిఆకు వెమ్మానుకలిపి కషాయముగాచి యిచ్చిన మూత్రబద్ధము విప్పును. వేగునకుగూడ పైని భావనలకుపయోగించు ఆకులకు బలిష్ఠమైనది. కాయలరసమును త్రాగిన నాభిమొదలగు స్థావరవిషములు విరుగును. విషమును హరించుటలో నల్లప్రత్తికన్న యెర్రప్రత్తిశ్రేష్ఠము.

ప్రపౌండరీకము:—సం. శ్రీపుష్ప, పుండరీ, చక్షుష్య, పుండరీయక అనియు హిం. పుండేరీ, పుండరియా అనియుపేరు. ఇదియొకసుగంధివృక్షము. ఇది తీపి చేదు రుచులు లఘుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. దీనిరసమును కంటిలోబోసిన అనేక నేత్రవ్యాధులు కుదురును. పిత్తరక్తము వ్రణము జ్వరము తాపము దప్పి పిత్తకఫములు రక్తదోషము హరించును. శుక్రవృద్ధిచేయును.

ప్రబ్బలిచెట్టు:—సం. వేతస, వంజుళ, వానీర అందురు. శీత లముగనుండును. తాపము వాపు మూలవ్యాధి యోనిరోగము వ్రణ ము విసర్పము మూత్రకృఛ్రి పిత్తాశ్మరి కఫము వాతము వీనిని పోగొ ట్టును. చూ. నీటిప్రబ్బలి.

ప్రాతఃకాలోదకపానము:—కిలుము లేకుండ స్వచ్ఛముగ తోమిన రాగిపాత్రలో స్వచ్ఛమైన (7 మారులు ముతకగుడ్డతో వడపోయ బడిన) యుదకమును రాత్రిపూటపోసి మూతమూసి తెల్లవారుజామున అనగా ఆరుగడియలు ప్రొద్దుండునప్పుడు మలమూత్ర విసర్జనము చేయ కుండ మాటాడకుండ 8 పురిసెడుల నీళ్ళను త్రాగుచుండవలెను. ఇట్లు అభ్యాసముచేయునెడల త్రిదోషములు చిరకాలానుతములుగ నుండు అజీర్తి మలబద్ధము గ్రహణి మూలవ్యాధి హృద్రోగము ఒంటితలనొప్పి శ్వాసకాసలు జీర్ణజ్వరము ఊర్ధ్వజత్రుగ (కన్ను ముక్కు చెవి నోరు తల వీనియందుబుట్టు) రోగములు అన్నియుఅడుగును. విషము జ్వరము మూర్ఛ మూలము శుక్లనష్టము అను రోగములను ముఖ్యముగ హరింపచేయును. ఆయుర్వృద్ధి పుష్టి సంతోషము ఉత్సాహము వీర్యపటుత్వము ఆరోగ్యము కలుగును. బంగారు వెండి అయస్కాంతము కంచు అనులోహములతో చేసిన పాత్రలయందలి యుదకముగూడ పై గుణములను కలిగియుండును గాని రాగిపాత్ర శ్రేష్ఠము. పుచ్చుకొను విధము.—పైవిధముగ నిలవయుంచిన నీటిని తెల్లవారుజామున లేచుచునే 2, 3 సారులు పుక్కిలించి యుమ్మివేసి కాలు చేతులు కన్నులు తడిచేతులతో తుడుచుకొని మొదటి 10 దినములవరకు 5 పురిసెడులను పిదప 10 దినములు 6 పురిసెడులును, ఇట్లు 8 పురిసెడుల వరకు హెచ్చించుచుండునది. 8 పురిసెడులకన్న హెచ్చించరాదు. ఇట్లు అధమము ఒకసంవత్సరకాలమైనను సేవించవలెను. ఇదిగాక తెల్లవారుజామున ముక్కుతో నీళ్ళనుపీల్చి తలను వెనుకకువంచి,నీళ్ళను మ్రింగివేయుచుండవలెను. ఇదియొకవిధమగు ఉదకపానము, దీనిని ధౌతికర్మయని యోగశాస్త్రమున చెప్పుదురు. యీధౌతికర్మవలన నాసికాస్రోతస్సులందలి



శ్లేష్మముహరించి శ్వాసలు సరిగనడచును. పీనస మున్నగు వ్యాధులను రాకుండఆపును. వచ్చినవాటిని నివర్తించును. ఉదకసేవను అభ్యసించు వారు పథ్యముగ హితముగ కాలమునతిక్రమించకుండగ ఆరోగ్యపద్ధతులననుసరించి ఆహారవిహారాదుల ననుష్ఠించవలెను చుట్టలు బీడీలు టీ కాఫీలు వ్యభిచారము దొంగతనము మత్తుపదార్థములను సేవించుట మొదలైనవి మానవలెను. సదాచారము ననుష్ఠించవలెను. దీనినిగూర్చిన విషయము పూర్తిగవ్రాసిన నొకగ్రంథమగును గాన నిచట సూక్ష్మముగ వ్రాయబడినది.

ప్రేంఖణము:—సం. ప్రియంగు, ఫలినీ, శ్యామా, గంధఫలా అనియు, హిం. ఫూలఫేన్, ఫూల్‌ప్రియంగూ అనియుపేరు. ప్రేంఖణపుచెట్టు, చేదు వగరు రుచులు శీతవీర్యము కటువిపాకముగలది. వాతపిత్తములు రక్తాతిసారము దుర్గంధము స్వేదజన్యరోగము దాహము జ్వరము గుల్మము దప్పి విషము మోహము హరించును.

ప్రేంఖణపుపండు తీపి వగరు రుచులు గురు రూక్షగుణములు మధురవిపాకముగలది. మలబద్ధము ఆధ్మానము బలముచేయును. కఫ పిత్తములు హరించును. సుగంధి ప్రియంగు అని యిందులోని భేదము దాహము పిత్తము ఛర్ది జ్వరము రక్తదోషము శమింపచేయును. ముఖమునకు కాంతి గలిగించును. శరీరదుర్గంధమును హరించును. రసవీర్యాదులందు రెండును సమములు.

ప్రొద్దుతిరుగుడుచెట్టు:—సం. ఆదిత్యభక్త వరద, సువర్చల, సూర్యలతా అనియు, హిం. హుర్‌హుజ్, బ్రహ్మసోచలీ అనియు పేరు. ఇదిక్షుపము. దీనిని తోటలలోవేసిపెంతురు. దీనిపూవులు సూర్యుడు యెటున్న అటువైపునకు తిరుగుచుండును. ఈజాతిలో తీగయుకలదు. దీనిపూవులు పలపురంగుగను క్షుపముయొక్క పూవులు తెల్లగను సుందరముగనుండును.

చేదు కారము రుచి శీతవీర్యము రూక్ష సర గుణములు మధుర విపాకముగలది. కఫము చర్మదోషము దురద వ్రణము కుష్ఠు భూత

బాధ శీతజ్వరము వాతము గ్రహణి మేహము క్రిమి హరింపచేయును. ఆకురసముద్రాగిన మూత్రము జారీయగును. చెవిలో బోసిన పోటు హరించును.

బంగారుఅరటి:—సం. స్వర్ణకదలీ అందురు. దీనిపండ్లు మధురరసము గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. అరుచిని బోగొట్టును. తృప్తినిచ్చును. తాపము దప్పి హరించును. శుక్లము కఫము వృద్ధిచేయును.

బంగారము:—సం, స్వర్ణం, జాతరూపం అనియు, హిం. సోనాయనియుపేరు. బంగారము ప్రాకృతము సహజము వహ్నిసంభవము ఖనిజము వేధజము అని అయిదువిధములు. బంగారు చేదు వగరు తీపి రుచులు స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. త్రిదోషములనుహరించును. ముదిమిని రోగమును హరించును. రుచిబుట్టించును. బలము వీర్యము కాంతి ఆయువు పుష్టి కలిగించును. వీర్య పటుత్వము సంభోగశక్తి ఉత్సాహము గలిగించును. క్షయ మందాగ్ని శ్వాసకాసలు శుక్లనష్టము మేహము పాండువు నంజు మున్నగు రోగములను హరించును. స్వర్ణమును చక్కగా శోధనమారణములజేసి యుపయోగించవలెను. స్వర్ణమునుధరించిన ఆలక్ష్మితొలగును. బంగారమును పలుచగ రేకులుకొట్టి వేడియన్నముమీద పరచినకరుగును. దానిని కలుపుకొని మహారాజులు భుజింతురు. గాని భస్మముచేసినపని యదిచేయదు.

స్వర్ణమునుకాల్చి దేవకాంచనపు రసమునందు 7 మారులు చల్లార్చిన శుద్ధమగును. బంగారును రజనుగాకోసి చమ్మఆకు రసముతో 6 పుటములువేసిన భస్మమగును. యింకను అనేక విధములుగ భస్మము సిందూరముచేయు విధానములు రసరత్నసముచ్చయమున జూచుకొనవలయును.

బంగాళాదుంపలు:—సం. ఆలు, ఆలుక, స్వాదుకంద, మ్లేచ్ఛకంద అనియు, హిం. ఆలూ అనియుపేరు. తీపి రుచి స్నిగ్ధగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. వీర్యవృద్ధి అగ్నిదీప్తి కలిగించును.



రుచిబుట్టించును. వాతకఫముల హరించును. మలబద్ధముచేయును. వాపునుహరించును.

బండిగురివెంద:—సం. అతిముక్త, మాధవి, పర్ణాశ్రయ, కాముక, భ్రమరోత్సవ చంద్రవల్లీ, భద్రలతా అనియు హిం. మాధవిలత నియుపేరు. ఇదిపెద్దతీగ, ఆకులుగుండ్రగ పెళుసుగ జంటగనుండును. నువ్వుపూవులవంటి పూవులు గుత్తులుగ పూచును.

కటుతిక్తకషాయరసములు, శీతవీర్యము, లఘుగుణము, కటువిపాకముగలది. పిత్త కాస, వ్రణము, తాపము, శోష, గ్రహణి త్రిదోషములు హరించును. గింజలను నానబెట్టి రుబ్బితలకుపట్టించిన ఒడదెబ్బవలనగలిగిన తలనొప్పి నెమ్మదించును. బండిగురివెందపూవు కండ్లకుగట్టిన కొన్నినేత్రరోగముల హరించును. వృషణములకును అరికాళ్లకును కట్టిన వీర్యస్తంభము, మన్మథోద్రేకమును కలిగించును. పూవులరసమును త్రాగిన కఫహితములు హరించును.

బచ్చలి:—సం. లోణీ, లోణా, ఘోలిక అనియు హిం. నోనియా, కుల్ఫాఅనియుపేరు. తీగబారును. పెద్దబచ్చలి, మట్టుబచ్చలి మొదలగు భేదములిందుగలవు.

పెద్దబచ్చలి, కటురసము, రూక్షగురుగుణములు, ఆమ్లవిపాకము, ఉష్ణవీర్యము కలది. వాతశ్లేష్మములు, అర్శస్సు, మందాగ్ని, విషముహరించును. అగ్నిదీప్తినిచ్చును.

మట్టుబచ్చలి ఆమ్లసారముగలది. వాతము కల్గించును. కఫపిత్తములు వాగ్దోషము వ్రణములు గుల్మము శ్వాస కాసలు ప్రమేహము అర్శస్సు కుష్ఠము అతిసారము హరించును.

బటానీలు —సం. ముండచణక, కలాయ, హరేణు, రేణుక అనియు హిం. మటర్ అనియుపేరు. ఇదిచిన్నచెట్టు దీనికాయలు శనగకాయలవలె నుండును. గింజలు గుండ్రగనుండును. వేయించితిందురు.

మధురకషాయ రసములు, గురురూక్షగుణములు, శీతవీర్యము మధురవిపాకముగలవి. వీర్యపుష్టి బలము గలిగించును. రుచిగనుండును

ఆమము, కఫము, పిత్తము, కడుపునొప్పి గల్గించును. రక్తమును చెరుచును. విదాహమును పుట్టించును. కడుపులో నులిపురుగుల గలుగజేయును·

బలపురాయి.—చిదుకగొట్టిన మెత్తగా నలిగిపోవును. దీనిచూర్ణము మిగుల తెల్లగనుండును. పూటకు 3 చిన్నముల చూర్ణమును కొంచెము పటికిబెల్లపు చూర్ణముకలిపి ఉదయ సాయంత్రములందు 9 దినములు సేవించిన తెల్లకుసుమరోగము తప్పకనయమగును. శుక్లనష్టము కట్టును. మేహము ఉడుకు తగ్గును. చలువచేయును,

బదనిక:—సం· వంద, వృక్షాదని, సేన్యా, · పరపుష్టాఅనియు హిం. బందాల్ అనియు పేర్లు. ఇదిఅనేకవృక్షములపైన వేరులేక నేపుట్టును. కాకులు మొదలగునవి గింజలనుతిని చెట్లలకోటరములో రెట్టలువేయుట చేతగింజలు వేళ్ళుపాకి మొలచునని సామాన్యులందురు బదనికలు ఎరుపు, పసుపు, నలుపు, తెలుపు, నీలము మొదలగు రంగులపూవులు పూచును. ఆకులు వివిధ ఆకారములుగ నుండును. ఇది కషాయ మధుర, తిక్తరసములు శీతవీర్యము కలది దీనిని ధరించిన అలక్ష్మితొలగును. దీనిరసము లేకకషాయము కఫవాతములు రక్తదోషము వ్రణము విషము శ్రమహరించును. వశ్యము ఆకర్షణము మొదలగు తాంత్రికము లందుపనికివచ్చును. భూతబాధ హరించును.

బలాచతుష్టయము:—(చిన్నముత్తవపులగం) సం. బల, వాట్యాలక, సముంగా, అనియు, అందురు. (పెద్దముత్తవ) సం. మహాబల, పీరపుష్పి, అందురు. (నాగముత్తవ) సం. గాంగేరుకి, నాగబలఅందురు (అతిబల) సం బలాకా, అతిబల, భారద్వాజీ, వృక్షగంధిపి అందురు, హిం. ఖరైటీఅందురు. చిన్నముత్తవను పరానగోగు అందురునాగబలను జిబిలిక అందురు. ఈనాల్గు జాతులు పసుపు పచ్చని గుండ్రని పువ్వులు పూచును. అతిబలను దువ్వెనచెట్టని వాడుదురు. ఈచెట్టు ఒకటిన్నరగజము ఎత్తువరకు పెరుగును. తక్కినవి చిన్నవి. దీనికాయలతో పిల్లలు ముద్దర్లు వేసుకొందురు. ఈకాయలనుండి వెడలుగింజలకు బీజబందు



గింజలందురు. ఈనాలుగుజాతుల చెట్లవేళ్లు మిక్కిలి బలిష్టములుగానుండును. పెద్దముత్తవఆకు గుండ్రగా కొద్ది కంగోరాగల్గి యుండును. నాగముత్తవతీగ ఆకృతిగల చిన్నమొక్క, నాలుగుజాతులు తరుచు అన్నిచోట్ల దొరుకును. బలాచతుష్టయము, మధురరసము, స్నిగ్ధగుణము, శీతవీర్యము, మధురవిపాకము గలది. బలము శరీరపుష్టి, కాంతి వీర్యవృద్ధి కలుగజేయును. వాతరక్తము పిత్తరక్తము నరుకుగాయము వీటిని హరించును. మలబద్ధముజేయును. పెద్దముత్తవ. మూత్రకృఛ్రను హరించును. వాతమునకు అనులోమగతి గలుగజేయును. నాగముత్తవ గురుత్వము, కలది వీర్యవృద్ధి బలము, ఆయురారోగ్యము, పుంస్త్వము వృద్ధిజేయును. రక్తపిత్తమును విశేషముగహరించును. నాగముత్తవరసము ఒకతులమునందు రెండుచిన్నముల పిప్పలిచూర్ణము కలిపి ప్రతిపుదయం త్రాగి, పెరుగులోనానిన 2 మినపగారెలనుతినవలెను. యిట్లు 20, 30, దినములు సేవించిన అమితబలము, వీర్యపుష్టి, సంభోగశక్తి కలుగజేయును. బలాచతుష్టయము అనేక ఔషధయోగములందు జేర్చబడి ఉత్కృష్టమైన ఆరోగ్యమునిచ్చును.

బలురక్కసి:—సం. హస్తికర్ణపలాశ అందురు. దీనిఆకులు చేమఆకులవలె పెద్దవిగనుండును, గృహాంగణములందు అలంకారార్థము కుండికలలో వేసి పెంచుదురు. ఆకు పెళుసుగనుండును. ఒకరూపాయంత వెడల్పుగలఆకు రెండుకమలపాకులమధ్య పెట్టి నమిలి మింగినమొదల దగ్గులుతగ్గును. ఆకునూరి ఆముద్దను తాళకమునకు కవచంయిచ్చి పుటమువేసినచో యెఱ్ఱగ సిందూరించును. శరీరముపైన ఆకులువేసి కట్టిన పొక్కును. ఆముదమురాచి నిప్పుపైన యీఆకులనుమగ్గించి 4, 5 పొరలుగా పొత్తికడుపునకు గట్టిన బాలింతల మైలరక్తము వెడలిపోవును. ఒకటి రెండుగంటలకన్న నెక్కువకాలముంచగూడదు.

బలురక్కసిచెట్టు:—సం. బ్రహ్మదండ అందురు· ఇది పిచ్చికుసుమచెట్టువలెనుండును. గాని దీనికి పసుపుపచ్చనిచోనయుండదు. బ్రహ్మదండి తొరముగలమూలిక. దీనిపూవు బంతులవలెనుండును. ఆకు

లనుతొక్కి రసముతీసి త్రాగిన దారుణశూలలు అజీర్ణము మూత్రకృచ్ఛ్ర నశించును. క్షీరముగూడ పైగుణమునుగలది.

బలుసుచెట్టు:—సం. భారద్వాజీ, బలాకా అందురు. సమూలకషాయము వగరు చేదు రుచులు ఉష్ణవీర్యము లఘుగుణము కటువిపాకముగలది. నీళ్ళవిరేచనము అతిసారము గ్రహణి కృమి హరించును. ఆకుకూర గురుగుణము శీతవీర్యముగలది, సకలమేహములు పిత్తరక్తము జ్వరము గ్రహణి అగ్నిమాంద్యము హరించును. అన్నహితమును గలిగించును. కాయలకూర గురుగుణము ఉష్ణవీర్యము చేదు రుచి కటువిపాకముగలది. కఫవాతములు మేహము హరించును. బలుసుపండ్లు పండినవి నల్లగనుండును. మధురకషాయరసములు స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. పిత్తము మేహము హరించును.

బాడిదచెట్టు:—సం. పారిభద్ర, ప్రభద్ర, కంటకి, క్రిమిశత్రు అనియు, హిం. ఫరహద్ అనియుపేరు. పెద్దచెట్టు మాను తెల్లగనుండును. తెలుపు యెరుపు పూవుల భేదముచేత రెండువిధములు. తెల్లదిమంచిది. దీనిని వాజ్జినపుచెట్టు అనియు వాడుదురు. దీని మానుచెక్కరసము కారము రుచి లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కఫవాతములు అరోచకము హరించును. పిత్తముజేయును. దీపనపాచనముల గలిగించును. రసమును చెవిలోబోసిన చెవిపోటుతగ్గును, బాడిదచెక్కచూర్ణమును పంచదారకలిపి సేవించుచున్న సవాయిమచ్చలు పుండ్లుమానును. మేహపొడలుహరించును. మోతాదు రెండుచిన్నములు పూవులనునూరి కుంకుడుగింజంతచొప్పున దినమునకు రెండుసార్లుతినుచున్న గుల్మము శూల అగ్నిమాంద్యమునశించును. తరుచుగ మానుచెక్క ఉపయోగపడును. దీనినిసేవించునపుడు అపథ్యము చేసిన రోగములు కలుగును.

బాదాంపప్పు:—సం. బాదామ, చక్షుష్యమ, వాతనాశనఅనియు, హిం. బాదాం అనియుపేరు. పెద్దచెట్టు. బాదంపప్పు మధురరసము స్నిగ్ధగురుగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. వీర్యము



బలము పుష్టి కాంతి కలిగించును. దగ్గు క్షయ కార్శ్యము మేహము శుక్లనష్టము జ్వరము మొదలగువానిని జయించును. మేకపాలతో పప్పునునూరి రసముపిండి శరీరమునకుపూసిన చిడుము మున్నగు చర్మరోగములునశించి కాంతికల్గును. బాదంపప్పుపైని పెరడు కాల్చి మసిచేసి దానితో పండ్లుతోముకొనిన దంతములకు సత్తువగలుగును. బాదంగింజలనునమిలి పుక్కిటబట్టిన నోటిపూతతగ్గును. బాదంగింజలనుండి తీసిన చమురు నేత్రములలో వేసిన కండ్లకలక యెరుపు తగ్గును. శిరస్సునకు మర్దనచేసిన జ్ఞాపకశక్తి నేత్రప్రసాదము కలుగును, తలనొప్పి తగ్గును. కేశములకు దార్ఢ్యము గలుగును. పంచదారలోవేసి అరతులం చొ॥ త్రాగుచున్న గుండెలకు బలముకలుగును. క్షయరోగమును అరికట్టును. చేదుగానుండు బాదంపప్పు శరీరమునకు మిగుల జబ్బుచేయును. చూ. దేశవాళీబాదాము.

బావంచాలు:—సం. సోమరాజీ, వాకుచీ, కృష్ణఫలా, కుష్ఠనాశిని, కాలమేషిక అనియు, హిం. వాయచీ, వావచీ, బకుచీ అనియుపేరు. నల్లగ సన్నముగ పెసరబద్దలవలెనుండును. మంచిపరిమళము గలవి. సుగంధము నిమిత్తము గట్టిపిండిలో వీనిచూర్ణము కలుపుదురు. చిన్నక్షుపము. నల్లనిపూలుపూచును. దీనికాయలు గుత్తులుగపుట్టును. చెట్టు దుర్గంధమైనది.

కటు మధురతిక్తరసములు సర రూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. మలబద్ధమునువిప్పును. ప్రధానముగ కుష్ఠము మొదలగు సకల చర్మరోగములను హరించును. గనుక కుష్ఠారియని దీనికి పేరుగలిగెను, మరియు శ్లేష్మము రక్తపిత్తము వాతరక్తము వ్రణము దద్రుచీడ మేహము జ్వరము కృమి శ్వాస అగ్నిమాంద్యము కాస విషము శ్విత్రము మొదలగురోగముల హరింపచేయును. బావంచాలరసమును త్రాగుచున్న సకల సవాయి రోగములు హరించును. బావంచాలచూర్ణమును శరీరమునకు నలుగుపెట్టుకొనిన చర్మవ్యాధులు కుదురును. శరీరమునకు కాంతికలుగును.

బాలింతపోలు:—సం. బోల, గంధరస, పిండ, నిర్లోహా, బర్బరరస, నాళక, రసగంధ అనియు, హిం బోల్, హీరాబోల్, ఖునఖారాసీ అనియుపేరు. యెరుపు నలుపు రంగులుకలిగి ముద్దవలెనుండును. కటు తిక్తకషాయరసములు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. దీపనపాచనముల గలిగించును. పవిత్రమైనది. స్త్రీల గర్భాశయదోషముల నన్నిటిని హరించును శుద్ధిపరచును. సువాసనగనుండును. రక్తదోషములు కఫపిత్తములు ప్రదరము అశ్మరి మేహము యోని శూల జ్వరము కుష్ఠు అపస్మారము రక్తాతిసారము స్వేదజన్యరోగములు గ్రహబాధ వీనినిహరించును. పురుషులుసేవించిన పుంస్త్వముతగ్గిపోవును. దీనిని ఆవుపాలతోనూరి పట్టువేసిన కొన్నినొప్పులు నయమగును. బాలింతపోలు గచ్చపప్పు గంధము వీనిని నిమ్మపండ్లరసముతోనూరి బుడ్డకుపట్టువేసిన వాపుహరించును. కీళ్ళకువేసిన అందలి నొప్పులుతగ్గును. బాలింతపోలును నీళ్ళతోనూరి సెనగలంతమాత్రలు చేసి యిచ్చిన ముట్టుకట్టునొప్పి తగ్గును. బహిష్ఠయైన మూడుదినములు ఉదయ సాయంత్రములందు పుచ్చుకొనవలెను. గ్రహణి నీళ్ళవిరేచనములు కట్టుటకుగూడ యీమాత్రలనువాడవచ్చును.

బిడలవణము:—సం. విడ, విడ్గంధ, కృతక అనియు, హిం. కటీలానోన్, విరియాసంచర్ నోన్ అనియుపేరు. ప్రసారిణి అనగాగొంతెమగోరు తీగయొక్క క్షారమును విడలవణమందురు. జఠరాగ్నిని వృద్ధిచేయును. మలబద్ధము ఆమము శూల వాతము మేహము గుల్మము అజీర్ణము ఆనాహము హృద్రోగము కఫము జడత్వము ద్రద్రులు నశింపచేయును. వాతమునునులోమగతికి తెచ్చును

బిదార్యాదిగణము:—తెల్లనేలగుమ్మడు, చిట్టాముదము, తేలుమణి, గలిజేరు, దేవదారు, పిల్లిపెసర, కారుమినుములు, దూలగోవెల, పెద్దపిల్లిపీచర, చిన్నపిల్లిపీచర కాకోళి, మనుబాల జీవకము. ఋషభకము, వాకుడు సుబరి, ముయ్యాకుపొన్న. నక్కతోకపొన్న, పల్లేరు, సుగంధిపాల, హంసపాది యీవస్తువులయొక్క కూటమికి విదార్యాదిగణమనిపేరు యీగణద్రవ్యములు హృదయమునకు హితము జేయును. శరీరపుష్టినిచ్చును. వాతపిత్తములు శోష గుల్మము అంగమర్దము ఊర్ధ్వ శ్వాస కాస వీనినిహరింపచేయును.



బీజపత్రము:— చూ. పత్రబీజము,

బీరకాయ:—(పొట్టిది) సం. కోశాతకి, పీతపుష్ప, ధారాఫల అనియు, హిం. తోరయీ అనియుపేరు. తీగ. దీనిఆకులు గరగరలాడుచు వెడల్పుగ గుండ్రగనుండును. పసుపుపచ్చని పూవులు సాయంకాలమున చక్కగవికసించును. పొట్టిబీర, పెద్దబీర, చేదుబీర. నేతిబీర అని ఇందు నాలుగుభేదములుకలవు. చేదుబీర ఔషధములందుపయోగింతురు. తక్కినవానిని కూరవండుకొనితిందురు. (పొడుగుది) సం. మహాకోశాతకి, హస్తిఘోషా, ధామార్గవ అనియు, హిం. ఘియాతోరయీ అనియుపేరు. పొట్టిబీర మధురరసము స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. కొలదిగ వాతమును హెంచును. కఫపిత్తములను హరించును. జ్వరితులకు పథ్యమైనది. అగ్నిదీప్తి కలిగించును. శ్వాసకాస కృమిరోగులకు హితమైనది. పొడుగుబీరకాయ స్నిగ్ధ సరగుణములు కలది. రక్తపిత్తము వాతపిత్తము హరించును. చూ. చేదుబీర.

బుడమచెట్టు:—సం. చిర్భిట, ధేనుదుగ్ధ, గోరక్షకర్కటి అనియు, హిం. కచరియా, ఫూట్, భకుర్ అనియుపేరు. దీనిని బుడమదోసయనియు అందురు. దోసపాదునే పోలియుండును గాని దీనికాయలు మిక్కిలి చిన్నవి. ఇందు చేదుకాయలది తీపికాయలది రెండు రకములు కలవు.

సమూలకషాయము చేదు వగరు రుచులు సరరూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. శ్వాసకాసలు కుష్ఠము వ్రణము మరద గుల్మము ప్లీహ ఉదరము హరించును.

తియ్యబుడమకాయ మధుర అమ్లరసములు గురు రూక్షగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. కడుపులో వాతమునుబంధించును పిత్తమునుహరించును. మూత్రమును జారీచేయును. శూల అర్శస్సు

గుల్మము అనురోగులకు పథ్యము. బాగుగా పండినపండు వేడిచేయును. అలస్యముగజీర్ణమగును. బుడమ వరుగు రూక్షగుణముగలది. శ్లేష్మవాతములు అరుచి జడత్వముహరించును. తేలికగజీర్ణమగును శరీరమందలి దుష్టమగునీటిని ఆర్పును. కాన నంజురోగులకుహితమైనది దీపనపాచనముల కలిగించును. చేదు బుడమకాయ వరుగు కృమి మూలరోగము పాండువు ఉదరము గుల్మము మలబద్ధము హరించును. దోరకాయలను బద్దలుగాకోసి వాము ఉప్పుకలిపి నిమ్మపండ్లరసములో బావనచేసి ప్రతియుదయమున రెండుమూడు బద్దలు తినుచున్న అరోచకము పిత్తము భ్రమ నులిపురుగు కడుపుబ్బరము అజీర్ణము దగ్గు తగ్గును. అన్నమునందు హితముకలుగజేయును. రుచిబుట్టించును.

మందాగ్నికలవారలకు ఇది అమృతతుల్యముగ నుండును. మరియు తాపము ప్రమేహము మూత్రకృచ్ఛ్ర శోష హరింపచేయును. లేతకాయ వాతమును పెంచి కఫపిత్తములహరించును పండినది పిత్తమును పెంచును. వేడిచేయును. దీనిపువ్వు దోషత్రయమునుకలిగించును.

బుర్రబచ్చలి:—దీనిని బర్రెబచ్చలి యనియు వాడుదురు. దీని ఆకులు కొంచెము నూగుగలిగి పెళుసుగ మందముగ కొంచెము కోలగ గుండ్రగనుండును. శరీరమునకు తగిలిన కొంచెము దురదపెట్టును. ఇది తీగ. బాగుగాపండిన దీనిపండ్లు యెర్రగను పచ్చివి ఆకుపచ్చగనుండును

పులుపు కారము రుచులు ఉష్ణవీర్యము సర తీక్ష్ణ గుణములు కటువిపాకముగలది. ఆకులనువెచ్చజేసి గడ్డలపైకట్టిన వేగముగ పక్వములగును. పగులును. ఆకురసము లోహములన్నిటిని శుద్ధిపరచును. ఆకురసముతో వెండిరజనునూరి పుటమువేసిన భస్మమగును. ఇది వాదవిద్యయందు అనేకరీతుల ఉపయోగపడును.

బూడిదగుమ్మడికాయ:—సం. కూష్మాండం, పుష్పఫల, శిఖివర్ధిక అనియు, హిం. పేఠా, కుంహాడా అనియుపేరు. ఇది తీగబాదు. దీనికాయలు పెద్దవిగ అపక్వస్థితియందు ఆకుపచ్చగ పండిన తరువాత తెల్లగ బూడిదపూసినట్లుగ నుండును.



మధురరసము గురు, రూక్ష సరగుణములు, శీతవీర్యము, మధురవిపాకము, కలది. మూత్రాఘాతము, ప్రమేహము మూత్రకృచ్ఛ్ర అశ్మరి. దప్పి, అగ్నిమాంద్యము వాతరక్తము గ్రహణి, పిత్తము. పిత్తరక్తము, నిక్కాక, మొదలగువాని నణగించును. కృశించినవారు దీనిని సేవించిన పుష్టికలిగించును. బలము, వీర్యము కాంతికలుగజేయును. శుక్లనష్టమును, తెల్లకుసుమను హరించును. రుచిబుట్టించును.

బాగుగా పండినపండు ఒకసంవత్సరము నిల్వయుంచి మురబ్బా లేక లేహ్యముచేసి సేవించినక్షయ. హరించును. సకలదోషములను జయించును. పైబెరడుతీసిన బూడిదగుమ్మడికాయను ముక్కలుగ తరిగి 100 పలములు గ్రహించి వానిని 200 పలముల నీటిలోవేసి సగము రు యిగురువరకు కాచి వడియగట్టుకొని బద్దలను గట్టిగ గుడ్డలో వేసి పిండి కొంచము యెండించి యుంచుకొనవలెను. రాగిపాత్రలో 8 పలముల నేయివేసి పైముక్కలను దోరగావేయించి అందు వడియగట్టి యుంచుకొనిన కషాయమునుపోసి 100 పలముల శర్కరవేసి పాకముపట్టి పిప్పలి శొంఠి, జీలకర్ర, ప్రత్యేకము 2 పలములు, లవంగాలు, లవంగపట్ట, ధనియాలు యాలకులు మిర్యాలు లవంగపత్రి ఇవి ప్రత్యేకము అరపలము చూర్ణించి చేర్చి కలియగల్పి దించి, చల్లారినతరువాత తేనె 4 పలములు కలిపి యుంచుకొనిన కూష్మాండావ లేహమనబడును. బలానుసారము దీనిని సేవించిన, రక్తపిత్తము క్షయ జ్వరము శోష దప్పి వాంతి, శ్వాసకాసలు అభిఘాతము, హరించును. రోగినకు యెగదట్టిన అన్నరసమును క్రిందికిదింపును. సంభోగేచ్ఛ, ధాతువృద్ధి బలము వీనినిగూడ కలుగజేయును.

పైవిధముగ బూడిదగుమ్మడికాయను తరిగి ఆబద్దలను అడవికంద బద్దలను సమభాగములుగ గ్రహించి నేతిలోవేయించి వీటికి రెట్టింపు చక్కెరకలిపి లేహ్య పాకముగవండి సేవించిన మూలరోగము, మూఢవాతము నశించును. అగ్నిదీప్తినిచ్చును.

బూరుగుచెట్టు:—సం శాల్మలీ శల్మలిఅనియు హిం సేమల్ అనియుపేరు. అరణ్యములలోనుండు పెద్దవృక్షము ఒకతొడిమకు 8. లేక 10 ఆకులుండును. వీటికి ముండ్లుండును. దీనిపూవ్రులు తామర పూవులవలె యెఱ్ఱగనుండును. పండ్లుజిల్లేడు పండ్లవలెనుండును. యీకాయలనుండి దూదివెలువడును. ఇదిమిక్కిలి మెత్తగ మృదువుగ సుఖముగనుండును. గనుక పరుపులు మొదలగునవి కుట్టించుకొందురు. బూరుగబంకకు మోచరసమనిపేరు. మరియుదీనిలో ముండ్లుకలది. ముండ్లు లేనిది. యెఱ్ఱపూలది. తెల్లపూవులదిఅని 4 భేదములుకలవు. తెల్లపూవు ముండ్లుకలది. శ్రేష్ఠము తక్కినది స్వల్పగుణములుకలది.

బూరుగుచెక్క—వేరు మధుర కషాయ రసములు లఘు స్నిగ్ధ పిచ్ఛిలగుణములు శీతవీర్యము మధురవిపాకము గలది బలము శుక్రము కఫము వీనిని వృద్ధిచేయును. ధాతుపుష్టికలిగించును. రక్తపిత్తము పిత్తమురక్తదోషము పట్టుహరించును. రసము వగరుగనుండును. కఫమును జయించును. మలబద్ధముచేయును. వేరుపట్టను నీడ నెండించి చూర్ణముచేసి సమముగ పటికిబెల్లము కలిపి ప్రతిదినదయమునందును పావలాయెత్తుచొ॥ తిని ఆవుపాలు (కాచినవి) త్రాగుచున్నయెడల అమిత సంభోగమువలనను సుఖరోగములవలనను చెడిపోయిన పుంస్త్వము మరల కలుగును. బలము కాంతియిచ్చును. పూవ్రులను కూరవండుకొని తినవచ్చును. మధురకషాయరసములు గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. వాతమును పెంచును. మలబద్ధము చేయును. శరీరము నొప్పిను. కఫము పిత్తములహరించును. రక్తదోషమునుఖండించును. యీగుణములు బూరుగుపండునకు గూడ కలవు. దీనిగుంప మలబద్ధకరము శోష తాపము పిత్తము సంతాపము హరించును.

బూరుగుబంకకు సంస్కృతమున పిచ్ఛా, శాల్మలీవేష్టక, మోచస్రావ, మోచరస, వేశ్మరస అనియు. హిం. సేమల్ కాగోంద్, మోచరస్ అనియుపేరు, తెల్లగ తుమ్మగోందువలెనుండును.



వగరు రుచి గురు స్నిగ్ధగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. మలబద్ధము బలము పుష్టి కాంతి వీర్యము ధాతుధార్ఢ్యము బుద్ధిపాటవము యౌవనము కఫము వీనిని గలుగజేయును. స్త్రీలగర్భదోషములహరించి గర్భమును స్థాపనచేయును. వాతము అతిసారము రక్తగ్రహణి పిత్తతాపము ఆమాతీసారము రక్తాతీసారము రసదోషములు మున్నగువానిని హరింపచేయును. ఆవుపాలలో పూటకు 3 చిన్నముల బూరుగుబంకనుకలిపి దినమునకు రెండుసార్లు యిచ్చిన 10 దినములకు తెల్లకుసుమతగ్గును.

ముండ్లు లేని బూరుగునకు సంస్కృతమున కుచ్ఛితశాల్మలి, రోచన, కూటశాల్మలి అనిపేరు. చేదు కారము రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకము గలది. కఫవాతములు యకృత్ ప్లీహాలు జఠరదోషములు గుల్మము విషము భూతబాధ అనాహము మలబంధము రక్తదోషము మేదోరోగము శూల కఫము వీనినిహరించును.

బూరుగుదూది పరుపుపై బరుండిన వాతశ్లేష్మములుహరించును వసంతఋతువున దనుకూలముగనుండును.

బెండకాయ:—సం. భేండా, భిండాతిక, భిండ, పిచ్ఛిల అనియు, హి. భిండీ అనియుపేరు. బెండచెట్లు వర్షర్తుప్రారంభమందు మొలవేయబడి వర్షాంతమువరకు బ్రతికి కాయలుకాచును. బెండఆకులకును కాయలకును పైన నూగుండును. ఆకులు చీళ్ళలుగనుండును. కాయలు పొడవుగ పలకలుగ గుండ్రగనుండును. కాయలునములిన మిక్కిలి జిగురుగనుండును. కాయలు కూరవండుకొనితిందురు.

ఇది మధురరసము గురు పిచ్ఛిలగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. వాతకఫములపెంచి పిత్తమును హరించును. బలము పుష్టి వీర్యము వృద్ధిజేయును. కాస అగ్నిమాంద్యము పీనస వాతము అను నీవ్యాధులందు బెండకాయ అపథ్యమైనది మలబద్ధము చేయును. రుచిబుట్టించును.

బెల్లము:—గుడ, ఇక్షుసార, శిశుప్రియ, రసపాకజ అనియు, హిం. గుడ్ అనియుపేరు. బెల్లము (చెరకురసము వండినది) చెరకురసము గట్టిపడువరకు కాచినయెడల మట్టిబెడ్డవలెనగును. ఇదియెబెల్లమందురు తాటిచెట్టుకల్లుతోగూడ బెల్లము వండుదురు. దానిని తాటిబెల్లమందురు. గౌడదేశమందు చెరకురసమును బెల్లముగా వండునపుడుమిక్కిలి గట్టిపడునట్లువండక కొంచెము పలచగ నుండునపుడే దింపెదరు. దీనికి మత్స్యండికయనిపేరు. దీనికే కరుగుడుబెల్లమనియు వాడుకపేరుకలదు.

బెల్లము మధురరసము లఘు స్నిగ్ధగుణములు ఉష్ణవీర్యము మధురవిపాకముకలది. క్రొత్తబెల్లము మేదస్సు కఫము శ్వాస క్రిమి అగ్నిమాంద్యము కలుగజేయును. మూత్రమునుశోధించును. రక్తవికారము పిత్తదోషము కలవారలకపథ్యము. శుక్ర మజ్జ మాంస రక్తములను ధాతువులకు బలమునిచ్చును, శ్వాసకాసలు హరించును. మలమూత్రములను యథాకాలమునకు యథాయోగ్యముగ ప్రవర్తింప చేయును. మేహము శ్రమ త్రిదోషపాండువులు సంతాపము పిత్తవాతములు హరింపచేయును. అల్లపురసములో కలిపి తినిన కఫమును కరక్కాయతో కలిపి తినిన పిత్తమును, శుంఠితోచేర్చి తినిన వాతమును హరించును. ఆసవము అరిష్టము మోదకము లేహ్యము పానకమున్నగు ఔషధయోగములందు చేర్పబడిబెల్లము అనేకసుగుణములను గలుగజేసి శరీరమును జఠరారోగరహితముగ జేయును. పాతబెల్లము వాతము జ్వరము సంతాపము మలమూత్రబద్ధము అగ్నిమాంద్యము దురద ప్రమేహము శ్రమ మున్నగురోగముల హరించును. బెల్లము కలిపిన నీళ్లు (పానకము) వడదెబ్బతీర్చును. విదాహమును కట్టును. గుండెదడ నాపును. చలువజేయును. నిద్ర పట్టించును. కడుపులోని మంట శమింపచేయును. మిర్యాలపొడి చేర్చి త్రాగవలెను. బెల్లము పాతది యగుకొలది పథ్యముగను క్రొత్తది అపథ్యముగనుఉండును. సాధారణముగా బెల్లము ఆయాయోగములందు గూర్చబడి సేవింపబడిన మంచి గుణమును ప్రత్యేకముగదినిన అనారోగ్యమును కలుగచేయును. గుద



రోగము కామిల శోష మేహము గుల్మము పాండువు హలీమకము వాతము పిత్తరక్తము కాస మొదలగువ్యాధులందు ప్రధానముగ బెల్లము మంచిగుణమునిచ్చును.

తాటికల్లుతో జేసిన బెల్లము మిక్కిలి వేడిచేయును. చెరకుబెల్లమునందలి సుగుణములు దీనియందుగలవు. బెల్లముతో చేయుబడిన మద్యము గౌడమద్యమనబడును. చూ. మద్యములు.

బేదనాలు:—ఒకజాతిగింజలు. సన్నముగ పొడవుగ పెద్దదోసగింజలవలెనుండును. వీటికషాయము లేక చూర్ణము వగరు రుచి శీతవీర్యము లఘుగుణము మధురవిపాకముకలది. ఆమవిరేచనములు నీళ్ళవిరేచనములు రక్తగ్రహణి కట్టును. కషాయమున శిలాజిత్తు భస్మము కలిపియిచ్చిన సెగరోగముమానును. పొంగించిన పటికచూర్ణము కలిపి పుక్కిటబట్టిన నోరుపూతతగ్గును.

బొక్కెనఆకు:—బొక్కెనఆకునకు నీరుపిప్పలి అనిపేరు. చూ. నీరుపిప్పలి.

బొద్దితీగ.—గుండ్రగ కొనదేరిన చిన్నఆకులుండును. వేరు నల్లగను పరిమళముకలదిగను ఉండును, వేరు రసము చేదు రుచి సర లఘుగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము గలది. పాండువు విషము క్షయ ఉబ్బసము కఫము అతిసారము మూత్రాఘాతము మూత్రకృచ్ఛ్ర మేహము ఉబ్బసము మొదలగు వ్యాధులనుజయించును. దీనికి చిరిబొద్దియని వాడుకపేరుకలదు. దీనిఆకును కూరవండుకొని తిందురు. కూరవిరేచనబద్ధముచేయును. అగ్నిదీప్తినిచ్చును. సుఖముగజీర్ణమగును.

బొప్పాయిచెట్టు:—సం. ఏరండచిర్భిట, నలికాదళ, చిర్భిట అనియు, హిం. అండఖర్బూజా, పోపైయా అనియుపేరు. బొప్పాయిచెట్టు సాధారణమైన ఫలజాతిచెట్టు దీనికాయలు కొబ్బరికాయలంతయుండును. పచ్చివి ఆకుపచ్చగ, పండినవి పసుపు ఆకుపచ్చరంగులుగనుండును. బొప్పాయిఆకులు యేనుగు చెవులవలె పెద్దవిగ చిల్లులుగలవిగ మూరెడుకుమించిన పొడవుగల తొడిమకలవిగ నుండును. దీనితోడి

ము బొటనవ్రేలులావును మధ్యబోలును గలిగియుండును. పచ్చికాయ నుగిల్లిన అమితముగ తెల్లనిపాలుగారును. పండినపండునకు అంతగా పాలుకారవు. కొంచెము వెగటువాసనగలిగియుండును. బొప్పాయిపండ్లు మధురముగ రుచ్యముగనుండును. ఈచెట్టు మానుగట్టిలేక మిగుల బలహీనమైనదిగ నుండును.

బాగుగాపండిన బొప్పాయిపండు మధురరసము గురుగుణముశీత వీర్యము మధురవిపాకముకలది. మలబద్ధముచేయును ఆమము కఫవాతములు పెంచును. పిత్తమును శమింపచేయును. దోరగాపండిన పండు కొంచెము చేదు తీపి రుచులుగలిగియుండును. శుక్రము కఫము పెంచును. ఉన్మాదము వర్త్మరోగము వాతవ్యాధి నశింప చేయును పచ్చికాయను పైపెచ్చులుతీసి కొబ్బరికాయవలె తురిమి కూరవండుకొని తినిన స్త్రీలకు చనుబాలు వృద్ధియగును. ఆకులకు ఆముదము చమిరి వెచ్చజేసి కట్టుగట్టిన కొన్నినొప్పులుకుదురును. పాలను శరీరముమీద వేసిన పొక్కును గజ్జి చిడుము తామరగలచోట్ల నెయ్యిలో బొప్పాయిపాలు కలిపి పూతబెట్టిన మాడిపోవును. ఒకతులం పటికని కుండపెంకులో వేసి అదిపొంగుచుండగా రెండుచిన్నములు పాదరసము. ఒకతులం బొప్పాయపాలు వేసి బాగుగా యిగిరి పొంగువరకు వేయించవలెను. యిట్లు వేయించిన పదార్థమును చూర్ణించి గాజుసీసాలో భద్రపరచి గుంజెత్తు చొ॥ తేనెకలిపి యిచ్చిన చిరకాలమునుండియున్న అజీర్ణము దగ్గు యకృత్ ప్లీహ కడుపుబ్బరము శూల నివర్తించును. మంట తక్కువయైనట్టు అనుమానమున్నయెడల ప్రమెదలలోపెట్టి గాఢపుటమువేసి భద్రపరచుకొనవచ్చును. మునాంబరమును బొప్పాయిపాలతోనూరి కందులవంటి మాత్రలుచేసి యిచ్చిన ఋతురక్తము జారీచేయును. ప్రసవస్త్రీల మైలరక్తము వెడలించును. విరేచనముచేయును. బొప్పాయిపూవుల రసములో వసకాల్చిన పసిని కలిపి పూతబెట్టిన ఇంద్రలుప్తము (పేనుకొరుకుట) మానును. లోపలకిచ్చుపాలయొక్క మోతాదు అధికమైన డొకల వాంతిచేయును. బొప్పాయిపండు మల[illegible]సము క్షయ అజీర్ణము



మూలవ్యాధి సిర్ఫవిరేచనములు రక్తకాస యివి గలవారలకు పథ్యముగ నుండును. బొప్పాయి చెట్టునకు మదనానబచెట్టనియు వాడుకపేరు కలదు.

బొబ్బర్లు:—చూ. అలచందలు.

బొమ్మ్రచెముడు:—సం. సమంతదుగ్ధ, వజ్ర, యామలకంటక, సింహుండ అనియు, హిం. థూహర్ అనియుపేరు. దీనికి కోలజెముడని వాడుకపేరుకలదు: మట్టలుగామొలచును. వేరేఆకులుండవు. మట్టలకంతట వాడియగు ముండ్లుండును, ఈముండ్లకు యెదురునూగుండును గనుక గ్రుచ్చుకొనిన వెనుకకు సులభముగరాదు. మట్టవిరిచిన ఒకవిధమగు చొనకారును.

మట్టలరసము చేదు కారము రుచులు గురు సరగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము గలది. తాపము అగ్నిదీప్తి ఛర్ది కలిగించును కుష్ఠు ఉదరము ప్లీహ వాతము ప్రమేహము శూల ఆమము కఫము వాపు గుల్మము అష్ఠీలకమను వాతము కడుపుబ్బరము పాండువు కఫోదరము వ్రణము జ్వరము ఉన్మాదము వాతము మేదోరోగము తేలు విషము వీనిని హరించును,

బోడతరము:—(చిన్నది) సం. శ్రవణీ, శ్రవణా, ముండీ, భూతఘ్ని, పలంకషా అనియు, హిం. ముండీ అనియుపేరు. పెద్దబోడతరమునకు సం. మహాశ్రవణిక, మహాముండీ, భూకదంబిక, అతితపస్వినీ అనిపేరు. చిన్న పెద్ద బోడతరములు రెండు మాగాణిభూములలోతరుచుగాపుట్టు చిన్నచిన్నమొక్కలు. చెట్టు ఒకవిధమగు మదపు వాసన గలిగియుండును. ఆకులు కొంచెము కోలగ గుండ్రగనుండును. యెరుపు తెలుపు పసుపు రంగులపూవులభేదముచే ప్రత్యేకము మూడువిధములు. తెల్లపూవులది శ్రేష్ఠము. పూవులు ఉండలవలెను గుండీలవలెను ఉండును.

చిన్నబోడతరము చేదు తీపి రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. పవిత్రమైనది. గలగండము అపచి మూత్రకృఛ్ర

క్రిమి పిత్తము కుష్ఠు పాండువు శ్లీపదము శ్వాస కాసలు అరుచి అపస్మారము ప్లీహ మేహరోగము శూల మూలవ్యాధి విషము అరుచి గుదరోగము హరించును. తెల్లపూవులబోడతరము సమూలము చూర్ణించిలి పూటకు వేడెత్తుచొ॥ పంచదారకలిపి తినుచున్న జరారోగముల హరించును. బలము పుష్టి కలుగజేయును. ఆకువెచ్చజేసి కట్టిన బోద కాలు వాపు తగ్గును. ఆకురసమున మిరియపుచూర్ణముచేర్చి యిచ్చిన దగ్గు తగ్గును.

200 పలములు బోడతరము, 100 ప॥ బెల్లము, 800 ప॥ నీరు కలిపి యొకకుండలోబోసి చీరజేసి 5 దినములు ఊరనిచ్చి 6వ దినమున తీసి సిసికి అర్కయంత్రమునందుంచి తీసిన అర్కమును రెండు మొదలు 4 తులములయెత్తువరకు ఉదయసాయంత్రములందు సేవించుచుండిన కాములు మూత్రకృఛ్రి ఉన్మాదము నశించును. జ్ఞాపకశక్తికలుగును. శరీరమందలి దుష్టపదార్థముల కూటమిని విడగొట్టును. పొట్టకు గుండెలకు బలముగలిగించును. క్రమముగ సకలరోగములను మొదిమిని హరించును. బోడతరపుస్వరసము 4 భా॥ ఆవునేయి 1 భా॥ పెన్నేరుకల్కము నేతికి నాలగవవంతుచేర్చి నేయి మిగులునటులగాచి వడియగట్టి పూటకు పావలాయెత్తుచొ॥ పంచదారకలిపి సేవించునెడల అమిత వీర్యవృద్ధి బలము ఆయువు ఆరోగ్యముకలుగును. దీనిని సేవించునపుడు ఉప్పు పులుసు కారము వర్జించుట మంచిది. కాయసిద్ధికరముగు మూలికలలో తెల్లబోడతరము మిగుల ప్రశస్తమైనది.

బోడసెనగలు:—చూ. లంకలు.

బ్రహ్మచెముడు:—దీనికి బొమ్మచెముడు అనియుపేరు. దీనిని కొన్నిస్థలములందు చెట్టుసియు వ్యవహరింతురు. చూ. కిస్తుమాదుచెట్టు.

బ్రహ్మమేడిచెట్టు:—సం. కాకోదుంబరికి, ఫల్గు, మలయూ, స్వాత్రభేషజ, నిదాఘిక అనియు, హిం. కఠూయర్ అనియుపేరు. మేడిచెట్టులోనిది యొకభేదము. బ్రహ్మమేడి మేడియొక్క గుణముకలదిగనుండును విశేషముగ గాయము కుష్టు సురద వ్రణము రక్తపిత్తము



పాండువు వాపు వీనినిహరించును. కఫపిత్తముల హరించును. మలమును గట్టిపరచును.

భంగు:—గంజాయి, జాజికాయ, గసగసాలు, జాపత్రి, లవంగాలు, కుంకుమపువ్వు, మరాటీమొగ్గలు, కురువేరు అనువీవస్తువులను నలియగొట్టి కాగుచున్నపాలలో కాచి వడియగట్టి పంచదారకలిపిన భంగుఅగును. దీనినిత్రాగిన విశేషముగ మత్తుకలుగజేయును. అలవాటులేనివారికి నిద్రవచ్చును. అలవాటు కలవారికి అమితఉత్సాహము వీర్యస్తంభనము, ధాతుపుష్టి, సర్వాంగములయందు వేడి, సంభోగశక్తికలుగ జేయును. ఆకలిబుట్టించును. గ్రహణి, నీళ్ళవిరేచనములుకట్టును. మలబద్ధముచేయును. అమితముగబుచ్చుకొన్నవీర్యమునకుహానిచేయును. రక్తమును చెరుచును. వాంతిచేయును. తలదిమ్మెక్కును. దీనికివిరుగుడు నిమ్మకాయపులుసు దానిమ్మరసము.

భద్రదేవదారు:—సం. భద్రకాష్ట, స్నేహవృక్ష, కృమిల, శక్రదారు అనిపేరు. ఇదిచేదు రుచి, రూక్షగుణము, ఉష్ణవీర్యము, కటువిపాకముగలది. వాతకఫములు, భూతబాధ హరించును. శరీరమునకు దీనిగంధమును లేపనముచేసిన శరీరము సల్లబడును,

భద్రముస్తలు:—. తుంగముస్తలు.

భజపత్రి:—సం. భూజన్‌పత్రి, భూజన్‌చర్మి, బహువల్కలమనియు హిం. భోజపత్రఅనియుపేరు. భుజపత్ర వృక్షములు విశేషముగ హిమాలయపర్వత ప్రాంతములందు బుట్టును. దీనిపట్టను భుజపత్రి యందురు, ఆకుకాగితమువలెను అరటియాకులవలెను ఉండును. పూర్వము భుజపత్రముయొక్క ఆకులనే వస్త్రములుగా నుపయోగించుకొనిరట. భుజపత్రియందు అనేక యంత్రములనువ్రాసి మంత్రశాస్త్రజ్ఞులు గ్రహపీడాదులను నివారణ చేయుదురు.

భుజపత్రి, కారము వగరు రుచులు, లఘుగుణము, ఉష్ణవీర్యము కటువిపాకముగలది. త్రిదోషములు, భూతబాధ, పిత్తరక్తము, కఫ

ము, చెవిపోటు, మేహరోగము, విషదోషము మున్నగువానిని హరించును.

భూచంపకము:—సం. భూచంపక, రక్తపుష్ప అనియు హిం. భుయీచంప. అనియుపేరు. పసుపుచెట్టును పోలియుండును. తెలుపు, ఎరుపు, ఊదారంగుల పూవులను పూచును. దీనిదుంప అల్లముయొక్క వాసనగలది. కటుతిక్తకషాయ రసములు, శీతవీర్యము లఘుగుణము, కటువిపాకముగలది. విషము, కుష్ఠము, ఉదరము, నంజుహరించును. సమూలరసము వేసి కాచిన తైలమునందు తేనెకలిపి కాచిన సర్వవ్రణముహరించును. భూతాకుశపుచెట్టు వగరు రుచి, సరలఘుగుణములు, ఉష్ణవీర్యము కటువిపాకముగలది. అజీర్ణము కడుపునొప్పి, ఉదరరోగములు. విషమజ్వరము, ఋతుబద్ధము, రక్తగ్రహణి హరించును.

భూతులసి:—తులసినిపోలిక చిన్నక్షుపము తులసివాసనగలిగియుండును. ఈచెట్లును పడకగదియందు కట్టిన దోమలు రాకయుండును. కారము రుచి, ఉష్ణవీర్యము, లఘురూక్షగుణములు, కటువిపాకముగలది. కఫవాతముల హరించి పిత్తమును పెంచును, అగ్నిదీప్తికలుగజేయును.

భూనాగసత్వము:—వానపాములను తెచ్చికడిగి కాల్చి బూడిగజేసి గుంటకలగరసము వావిలిరసములతో ప్రత్యేక మొకదినము మర్దించి బెల్లము గుగ్గిలము గురివెందగింజ నేయితేనె వెలిగారము అనువానిని కలిపినూరి ఉండలుజేసి మూసలోబెట్టి రెండుఘడియలు గాఢముగ నూది స్వాంగశీతల మైనపిదప వెలికిదీసి గుడ్డలోబోగ్లించి అందుజారిగింపబడనుబాలి మిగుల భారవంతములగు భూనాగ సత్వపురవ్వలను గ్రహించవలెను ఇట్టిసత్వమును రెండునిష్కముల బంగారులో నాల్గవవంతు చేర్చికరగించి దానితో ఉంగరము చేయించి ఆయుంగరము నీళ్ళతోకడిగి అనీళ్లను రాచినంతమాత్రమున స్థావరజంగమ విషములు, నేత్రరోగములు. శూలమూలరోగము కర్ణరోగములు సూ



తికాగ్రహబాధలు మున్నగునవి తత్క్షణము శమించును. వాదవిద్యయందుగూడ దీనికనేకోపయోగములు గలవు.

భూశర్కరకుంప:—తీపి రుచి, గురు గుణము, శీతవీర్యము, మధురవిపాకము కలది. శరీరపుష్టి శుక్రము బలము, మేహశాంతి కలుగజేయును.

భూతృణము:—సం. గృహ్యబీజ, భూతీక జంబుకప్రియ, సుగంధ అనియు హిం. భూతృణ అనియుపేరు. ఇదివనములందును, దొడ్లలోను మొలచును. గుత్తులుగ పూవులు బూచును. చిన్న చిన్న గింజలధికముగ గుత్తులనుండి బయలువెడలును. కారము చేదు రుచులు లఘురూక్షగుణములు ఉష్ణవీర్యము, కటువిపాకముగలది. విరేచనముచేయును, విదాహమును పుట్టించును అగ్నిదీప్తినిచ్చును. నేత్రములకు జబ్బుచేయును. ముఖమును శుద్ధిపరచును, మలమును వృద్ధిచేయును. వీర్యమునకు చెరుపుచేయును. వాతము తాపము భూతబాధ, దారుణ విషదోషము, కృమి, కాస, శ్వాస దద్రు హరింపచేయును.

భోజనవిధి:—స్నానముచేసినట్టియు, విశేషమైన ఆకలిగలిగి భోజనముందె యిచ్ఛగలిగినట్టియు, మనుష్యుడు కాళ్ళు చేతులు కడుగుకొని, రహస్యస్థలమునందు కూర్చుండి, తాను తినబోవు ఆహారమును నిందించకుండ మాటాడకుండ, పితృదేవతలు, అతిథులు శిశువులు, ఆచార్యులు వీరిని అన్నాదులచే తృప్తిపరచి తాను పెంచుచుండునట్టి పశుపక్షి మృగాదులు బాగుగ భుజించిన సంగతి విచారించి తెలిసికొని తనమనస్సునకిష్టముగను ద్రవప్రాయముగను పరిశుద్ధులై ప్రీతివంతులగు పరిచారకులచే తేబడినదిగను తలవెండ్రుకలు మొదలగువానిచే దుష్టముగాకుండునదిగను సుఖోష్ణముగ లఘువుగ షడ్రసములతో కూడినదిగ మధురరసము యెక్కువగనుండు ఆహారమును శరీరానుకూల్యము నాలోచించి వేళతప్పకుండ మిక్కిలి తొందర మిక్కిలి ఆలస్యము లేకుండ భుజించవలెను. అతివేగముగ భుజించువానికి ఆహారముయొక్క గుణదోషములు తెలియకపోవుటయు తగినంత ఆహారము సహించకపోవుటయు

ఒకప్పుడు వెంటనే వమనమగుటయుగూడ సంభవించును. ఆలస్యముగ భుజించిన తృప్తికలుగదు. కాలవిళంబమువలన అన్నాదులుచల్లారి రుచిహీనములగును. భుజించినయన్నముదోషయుక్తంబై స్రోతస్సులలో అధికముగ సంబంధించినయెడల పిత్తప్రకోపము కలవానియొక్క జఠరాగ్ని నడ్డగింపబడకయుండును. అందుచేత ఆకాలమున దుష్టమైనఆకలి కలుగును. అట్టిసమయమున బుద్ధిహీనతచేత భుజించినయెడల విషమువలెనే మనుజునిచంపును. తృణము వెండ్రుకలు ఈగలుమొదలగునవి గలదియు ఒకసారిపక్వమై మరలవెచ్చచేయబడినదియు శాకములుమినుములు మున్నగునవి యధికముగ గలదియు మిక్కిలి ఉష్ణమైనదియు ఉప్పుయెక్కువచేరినదియునగు ఆహారమును తినకూడదు. ప్రతిదినమునందును శాలిధాన్యము గోధుమలు యవలు జాంగలమాంసము కరక్కాయ ఉశిరికకాయ ద్రాక్ష చేమపొట్ల పెసలు పంచదార నెయ్యి పాలు తేనె దానిమ్మపండు సైంధవలవణము భుజించుచుండవలెను. రాత్రులందు తేనె నేయి కలిపి త్రిఫలములను దినుట కభ్యాసముచేసిన నేత్రములకు బలముకలుగును. గురువుగ స్నిగ్ధముగ మధురముగ స్థిరముగ మందముగ నుండు తామరతూండ్లు చెరకు అరటి దొంకాయ మామిడి ఉండ్రాళ్లు బూరెలు మొదలగు ద్రవ్యములను భోజనాదియందు భుజించవలెను వీనికి విపరీతగుణములుగల అనగా లఘువుగ రూక్షగ తీక్ష్ణముగ కటువుగనుండు ద్రవ్యములను భోజనానంతమందు సేవించవలెను, ఉప్పు పులుసు అధికముగనుండు ద్రవ్యములను భోజనమధ్యమందు తినవలెను. ఉదరముయొక్క రెండుభాగములను అన్నములచేతను ఒకభాగము ఉదకముచేతను పూరించవలెను. నాలగవభాగమును వాతాదులయొక్క స్థానార్థమై నశేషముగ నుంచవలయును. భుజించునపుడు నోరు ఉదకముచేత పలుమారు కడుగుకొనవలెను.

మంకెనచెట్టు:—సం. బంధూక, బంధుజీవ, మాధ్యాహ్నిక అనియు, హిం. దుప్‌హారియా, గోజునియా అనియుపేరు. దొడ్లలోను ఉద్యానములలోను వేసి పెంచబడు పుష్పజాతియొక్క. తెలుపు యెరు



పు మున్నగు రెండుమూడు రంగుల పూవులనుపూచును. దీనిపూవులు మధ్యాహ్నకాలమున వికసించును. దీనిఆకులు కోలగ కంగోరా గలిగి యుండును.

మంకెనపూవు చేదు వగరు రుచులు లఘుస్నిగ్ధగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. వాతపిత్తములనుహరించి కఫమును పెంచును. జ్వరము పిశాచబాధ తొలగించును. మలబద్ధముచేయును. మంకెనవిత్తులను దోరగావేయించి చూర్ణించి పంచదారకలిపి యిచ్చిన మేహము నిక్కాక సవామేహము మూత్రమునందలి చురుకుతగ్గును.

మంగచెట్టు:—సం. మదన, ఛర్దన, పిండీనట, శల్యక, పిండీతక అనియు, హిం. మైనఫల్, కరహార అనియుపేరు. ఇది అరణ్యములలోనుండు పెద్దవృక్షము. ఆకులు ఇంచుమించు తానిచెట్టుఆకులవలెనుండును. కాయలు అక్రోట్ కాయలవలె నుండును.

పట్టు కాయ మున్నగువాని రసము లేక కషాయము లేక చూర్ణము కారము చేదు తీపి రుచులు లఘు రూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. దారుణవమనముచేయును. వమనము చేయించు వస్తువులలో నిది మిక్కిలి సుకుమారమైనది. విద్రధి ప్రతిశ్యాయము వ్రణము కుష్ఠు కఫము ఆనాహము శోధ గుల్మము చర్మరోగములు వాతము విషము అర్శస్సు జ్వరము హరించును. పక్వాశయమును శుద్ధిపరచును. వస్తికర్మయందు మిగులనుపయోగకరమైనది. విడిచి విడిచి వచ్చు దీర్ఘజ్వరితులకు మంగపండులోనిగింజలను నీళ్ళతో నూరి చిక్కనిరసముతీసి గిద్దెడురసమును ప్రాతఃకాలమున త్రాగించిన వెంటనే రెండుమూడు వమనములై పక్వాశయము ఆమాశయము శుభ్రపడి జ్వరముతగ్గును. సాధారణముగ సకల కఫవ్యాధులందును వమనముచేయించుటకై మంగకాయనుపయోగించుట మిగుల శ్రేయోదాయకము.

మంచిగంధము:—చూ. చందనము.

మంచు:—మంచుగడ్డనుతినిన కఫవాతముల జేయును మంచు

లోపలుండిన చల్లగనుండును. వాతమును స్తంభింపచేయును. దప్పి పిత్తము తాపము హరించును. శరీరమునకు బరువెక్కించును బద్ధకము గలుగజేయును. పడిసెము దగ్గు పట్టును. మంచునీళ్లను త్రాగిన జీర్ణశక్తి వృద్ధియగును. కఫవాతముల పెంచును. గొంతునొప్పి జ్వరము జలుబు దగ్గు కలుగజేయును.

మంజరతృణము:—సం. మజ్జర, పవన, సుతృణ, స్నిగ్ధపత్రిక అని పేరు. ఈతృణము మృదువుగనుండును. పశువులకు మేపిన పాలుయెక్కువగనిచ్చును. యీపాలు ఆరోగ్యకరమైనవి.

మంజిష్ఠ:—సం. మంజిష్ఠ, వికసా, జింగి, కాలమేషిక, యోజనవల్లి, వస్త్రరంజని, రక్తాంగి యనియు, హిం. మజీఠ్ అనియుపేరు. ఇదియొక గంధద్రవ్యము. మంజిష్ఠచెట్లు యీప్రాంతమున దొరకవు. బట్టలకు రంగువేయుటకుపయోగింతురు.

ఇది మధురతిక్త కషాయ రసములు గురుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కంఠస్వరమును బాగుచేయును. శరీరమునకు కాంతినిచ్చును. విషము కఫము శోధ యోనిరోగములు కర్ణరోగములు నేత్రరోగములు రక్తాతిసారము కుష్ఠము రక్తదోషము విసర్పి వ్రణము మేహము జ్వరము శూల అర్శస్సు రక్తాతిసారము హరించును. శరీరమునకు బలముచేయును. దీని తేలికకషాయము బిడ్డలపాల ఉబ్బసమును హరించును. స్త్రీల ఋతుబద్ధదోషమును హరించి గర్భశుద్ధికలుగజేయును. మంజిష్ఠఆకును కూరవండుకొని తిందురు. ఈకూర మధురరసము లఘుస్నిగ్ధగుణములు ఉష్ణవీర్యము మధురవిపాకముకలది. అగ్నిదీప్తినిచ్చును. వాతపిత్తముల హరింపచేయును.

మండము:—పేయా అను ఆహారపదార్థమును చేయుటలో నొక భేదము. చూ. పేయ

మండూకపర్ణి:—సం. బ్రాహ్మి, మండూకి, భేకి అనియు, హిం. బ్రహ్మీ, వరంభీ, చకేలీ అనియుపేరు. ఆంధ్రులు దీనిని సరస్వ



తిఆకు అనియు, దాక్షిణాత్యులు వల్లారైఆకు అనియు వాడుదురు. ఇది లేతపెరుగుతోటకూరవలె నుండును. తోటలలో చెట్లపాదులయందు మొలచును.

తీపి చేదు వగరు రుచులు సర లఘుగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. ఆయువునిచ్చును. కంఠస్వరమును బాగుపరచును. కుష్ఠు తామర దురద మేహము రక్తకాస విషము శోధ జ్వరము పాండు ప్లీహ వాతరక్తము పిత్తము అరుచి శ్వాస శోష కఫ వాతవ్యాధులు హరింపచేయును బుద్ధిని జ్ఞాపకశక్తిని ప్రజ్ఞను బలమును కలుగజేయును. స్త్రీల గర్భాశయదోషములను జయించును. అపస్మారమునకు ముఖ్యమైన ఔషధము శీఘ్రముగ శరీరమున వ్యాపించును. ఆకుచూర్ణమును గట్టిపిండిలో కలిపిగాని ప్రత్యేకముగగాని కుష్ఠు మొదలగు పుండ్లకు రాచిన త్వరగమానును. ఆకురసమునందు ఆకుచూర్ణమును కలిపి పుచ్చుకొనుచుండిన అక్రమఋతువును సక్రమపరచును. సవాయి రోగములు కుదురును. సకలచర్మరోగములను మాన్పును. సరస్వతియాకు స్వరసము 4 ప్రస్థములు ఆవునెయ్యి 1 ప్ర॥ పసుపు జాజి కోష్ఠు తెగడ కరక్కాయ ఇవిప్రత్యేకము 1 పలము. పిప్పలి విడంగాలు సైంధవలవణము శర్కర వస ఇవిప్రత్యేకము 1 కర్షము మెత్తగా నూరి ముద్దజేసి పైరసఘృతములలో వేసి మందాగ్నిచేత రసము యిగురువరకు ఘృతపాకవిధిననుసరించి కాచి వడియగట్టి ప్రతిదినము బలానుసారము సేవించుచుండిన వాక్శుద్ధికలుగును. 7 దినములు త్రాగిన కంఠస్వరము బాగుపడును. 15 దినములకు మంచి శరీరకాంతికలుగును. ఒకమాసమునకు అమితజ్ఞాపకశక్తి కలుగును. 18 కుష్ఠువులు మూలవ్యాధులు 5 విధములగుల్మములు ప్రమేహము 5 విధముల కాసలు స్త్రీల వంధ్యాత్వము పురుషుల నపుంసకత్వము అగ్నిమాంద్యము హరింపచేయును. బలము వీర్యము కాంతి పుష్టి కలిగించును.

మండూరము:—సం. సింహాన, కిట్ట, మండూర, అయోమల అనిపేరు. లోహమును కరుగుచుండ అందుండి బయలువెడలినమలము

(చిట్టెము లేక కిట్టము) మండూరమనబడును. లోహకిట్టమును తానికట్టెలలో మెఱ్ఱగకాల్చి తానికఱ్ఱతో చేయబడిన తొట్టియందుపోసిన గోమూత్రమునందు చల్లార్చవలెను. ఇటుల యేడుసారులు చల్లార్చిన పరిశుద్ధమగును. దీనిని మెత్తగాచూర్ణించి యథావిధముగ నుపయోగింపదగును. త్రిఫలకషాయము గోమూత్రము అనువానితో మర్దించుచు 100 పుటములువేయబడిన మండూరము అత్యుత్తమగుణములు కలదై రోగముల హరించుటయందుపరాక్రమము గలిగినదగును. ఇనుపభస్మమునందుండు సకలగుణములును మండూరమునందుండును. గాన ఇనుపభస్మమునకుబదులుగ దీనినుపయోగింపవచ్చును. చూ. ఇనుము.

మందారచెట్టు:—సం. జపా, ఓఢ్రపుష్ప, పారిజాత, హరివల్లభ అనియు; హిం. ఓడహుల్. జవా, గుడహర్ అనియుపేరు. మధ్యమాకారముగలచెట్టు. ఉద్యానవనములందు పెంతురు. దీనిఆకులుఅడ్డసరపుఆకులవలె నుండును. పూవులు పెద్దవిగ యెఱ్ఱగ మనోహరముగ నిర్గంధముగనుండును. సాధారణముగా మందారపువ్వులనే ఔషధముగ వాడుదురు. ఆకుపసరు త్రాగిన మలమూత్రములను జారీచేయును దీనికి దాసానిచెట్టని వాడుక పేరు.

దాసానిపూవు తిక్త మధురరసములు స్నిగ్ధ లఘుగుణములు శీతవీర్యము మధురవిపాకము గలది. పుష్టి గర్భవృద్ధి మలబద్ధము వా[illegible] కృమి గలుగజేయును. వెండ్రుకలను నలుపెక్కించి పెంచును. పూవును నలిచి యారసమును రాచిన ఇంద్రలుప్తము (పేనుకొరుకుట) తగ్గును. తాపము ప్రమేహము అర్శస్సు శుక్రదోషము ప్రదరము హరింపచేయును. యెండినపూవుల తేలికకషాయమును త్రాగిన మూత్రకృచ్ఛ్రము అశ్మరి సెగరోగము మేహము తగ్గును. ఆపూవులను వేసి కాచిన తైలమును శిరస్సునకు రాచుకొనుచుండిన వెండ్రుకలు నిక్కగ పెరుగును. పూవులకషాయమును త్రాగినను లేక కడిగినను మేఢ్రము యోని వీనియందలి మంట రోగము తగ్గును.



మంథానతృణము:—సం. మంథానక, హరిత, దృఢమూల, తృణాధిప అందురు. మధురరసము స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. పశువులకిది మంచి ఆహారము. పాలు యెక్కువయగునట్లుచేయును. మనుష్యులకు వీర్యవృద్ధిచేయును.

మట్టితైలము:—గులకరాళ్ళనుండియు, మట్టినుండియు పాతాళయంత్రమునదీసిన తైలము లోపలకుత్రాగిన అమితమైన వేడిచేయును శూల గుల్మము కృమి నంజు అనువ్యాధులుకలవారలకు యివ్వదగినది. పైనపూసిన వాతపునొప్పుల నమోఘముగకుదుర్చును. మరియు చిడుము దురద పొక్కులు మొదలగు చర్మరోగములనుమాన్చును.

మట్టుబచ్చలి:—సం. ఉపోదకి, కలంబి, పిచ్ఛిల, పిచ్ఛిలచ్ఛద అనియు. హిం. పోయీశాగ్ అనియుపేరు. బచ్చలి మొక్కలలోనొకభేదము. విశేషముగ తీగబారదు. పెద్దబచ్చలికన్న నిది పథ్యమైనది. తీపి రుచి సర స్నిగ్ధ పిచ్ఛిలగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. వాతపిత్తములను హరించి శ్లేష్మమును పెంచును. కంఠస్వరమును బాగుచేయును. నిద్ర శుక్రము గలుగజేయును. రక్తపిత్తమునుజయించును. తృప్తి బలము పుష్టి గలుగజేయును. పథ్యమైనది.

మణిశిల:—సం. మనశ్శిలా, గోలా, మనోజ్ఞా, మనోగుప్త, నాగజిహ్వక, నాగశిలా అనియు, హిం. మైనశిల్ అనియుపేరు. శ్యామాంగి, కణవీరక, ఖండక అని మణిశిల మూడువిధములు. శ్యామాంగి యనునది నల్పు తెల్పు మెరుపురంగులుగలిగి బరువైయుండును. కణవీరక తామ్రవర్ణముగలిగి తెలుపులేక తళతళలాడుచు బరువులేనిదై యుండును. ఖండక మిగులయెఱ్ఱనై చూర్ణరూపముగ బరువుగ నుండును. మొదటిదానికన్న రెండవది. దానికన్న మూడవదిఉత్తమము.

ఇది కారము చేదు రుచులు ఉష్ణవీర్యము లఘు రూక్షగుణములు కటువిపాకముగలది. సర్వరసాయనములందు శ్రేష్ఠమైనది. కఫవాతములు భూతబాధ విషము అగ్నిమాంద్యము దురద కాస క్షయ జ్వరము కుష్ఠము సవాయిరోగము చర్మరోగములు హరించును. దీనిని శు

ద్ధిచేయక వాడకూడదు. 1 తులము మణిశిల నీళ్ళతో మెత్తగానూరి బురదవలెచేసి అందు 4 తులముల రేగుఆకు చూర్ణమును మణిలఆకున కంతకు పట్టునట్లు పొలిపి యెండించి ధూమనాడిలోనుంచి పొగనుపీల్చి నయెడల శ్లేష్మము తెగిపడును. దగ్గుతగ్గును. అపరిశుద్ధ మణిశిలను సేవించిన అశ్మరి మూత్రకృఛ్రి అగ్నిమాంద్యము మలబద్ధము కలిగించును. శుద్ధిచేయబడిన మణిశిల పైజెప్పిన సుగుణములనిచ్చును. శుద్ధి:— అగసియాకురసమందుగాని శొంఠిరసమునగాని 7 దినములుభావనచేసిన మణిశిల శుద్ధమగును. పసుపుదుంప గుంటగలగర యెఱ్ఱ అగిసియాకు వీనిరసములతో డోలాయంత్రమున నొకజాము స్వేదనముచేసి పిదప మేకమూత్రముతో స్వేదనముచేసి ఆరనాళముతో కడిగి సర్వరోగములందు నుపయోగింపవచ్చును. దీనికి భస్మముచేయుట కట్టుట సత్త్వముదీయుట మొదలగు పరిణామముల కొన్నిటిని మూరసరత్నసముచ్చయమున జూడుము.

మదనబుడత:—దీనికాడ యెఱ్ఱగను ఆకు కొంచెము కోలగను ప్రతిఆకుసందున జీలకఱ్ఱవంటి కాయలుగలదిగను ఉండును. పశువులు దీనిని మిగుల ఆసక్తితో తినును. దీనివేరునమలిన రుచిగనుండును. వేరురసమున పటికిబెల్లపుచూర్ణము కలిపి త్రాగునెడల మేహశాంతి చలువ రక్తవృద్ధి బలము గలిగించును. విత్తనములు వీర్యవృద్ధికరమగు. యోగములలోచేర్తురు ప్రత్యేకముగ దినినను శుక్రవృద్ధిచేయును. కఫమును పెంచును.

మద్దిచెట్టు:—సం. అర్జున, ధనంజయ, సందీసర్జ అనియు, హిం. కోహ, కౌహ అనియు పేరు. మద్దిచెట్టు పట్టయొక్క నలుపు తెలుపు రంగులనుబట్టి తెల్లమద్ది నల్లమద్ది అని రెండువిధములు. ఇవి అరణ్యములలో పెరుగు పెద్దవృక్షములు. మద్దికలపను గృహముల కుపయోగింతురు. ఆకులు పొడవుగ కొనదేరియుండును. చెట్టునకు గాటుపెట్టిన పాలుగారును. దీనికాయలు నాలుగు కోనులుదేరి మధ్య సన్ననిగింజయుండును.



మద్దిపట్ట వగరు రుచి లఘుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. భగ్నము క్షతక్షయము విషము రక్తవికారము మేదస్సు మేహము వ్రణము కఫపిత్తములు శ్రమ దప్పి హృద్రోగము పాండువు శ్వాస మొదలగు రోగములహరించును. మద్దిచక్కనుకాల్చి అందుండితీసిన క్షారము శూల అజీర్ణముహరించును. వాదవిద్యయందుపయోగించును. మద్దిచక్కబూడిద గంధకము తాళకము మొదలగు పొగవస్తువులనుకట్టును. నాగముమొదలగు కొన్నిలోహములను భస్మము సున్నముచేయుట కుపయోగించును. మద్దిచక్క రసమును త్రాగిన తెల్లకుసుమతగ్గును. తెల్లమద్ది నల్లమద్ది రెండు సమానగుణములు కలవి.గాని వాదమునందునల్లమద్దిని వైద్యమందు తెల్లమద్దిని ఉపయోగించవలెను.

మద్యములు:—సం. మద్యం, హాలా, సురా, మదిరా, వరుణాత్మజ అనిపేరు. మద్య సామాన్యము మిగుల పిత్తము జేయును. శరీరమందు శీఘ్రముగ వ్యాపించును. రుచిబుట్టించును. అగ్నిదీప్తినిచ్చును తాపముగలిగించును. మలమూత్రములను జారీచేయును. మత్తును చురుకును కలిగించును. వాతకఫములజయించును. అన్నమును భుజించునపుడు బలానుసారముగ త్రాగిన అమృతమువలె శరీరమున కారోగ్యమునిచ్చును. ప్రమాణముతప్పి యెక్కువగ త్రాగిన విషమువలె చెరుపు చేయును.

ద్రాక్షపండ్లతోచేసిన మద్యము తాపము హరించును. బలము పుష్టి దీపనశక్తి కలిగించును. రక్తార్శస్సు రక్తపిత్తము హరించును. ఖర్జూరమద్యము వాతము కాంతి రుచి కల్గించి శ్లేష్మమును హరించును. శరీరమును కృశింపచేయును. లఘువుగనుండును, ద్రాక్షామద్యముకన్న తక్కువగుణములుకలది. సురయనగా 60 దినములకు ఫలించెడి బియ్యపుపిండి మొదలగువానిచే వండి అగ్నిసంయోగముచే యంత్రమూలమున దీయబడిన మద్యము గురుత్వముకలది. బలము చనుబాలు పుష్టి మేదస్సు కఫము వీనిని వృద్ధిచేయును. మలబద్ధము చేయును. వాపు గుల్మము అర్శస్సు గ్రహణి మూత్రకృఛ్రి హరించును. వారుణీమద్య

ము. అనగా గలిజేరురసము బియ్యపుపిండి అనువానిచే పైప్రకారముచేయబడిన మద్యము వారుణియనబడును. ఇది సురతోసమానమగు గుణాదులుకలది. లఘువుగనుండును. పీనస కడుపుబ్బరము శూల హరించును. సురమీదకట్టు తేట్టు ప్రసన్నయనియు, దీనికంటె చిక్కగనుండునది కాదంబరియనియు, అధోభాగమందలి ద్రవభాగము జగలమనియు, జగలమునకంటె చిక్కనిది మేదకమనియు, జగలమును కాచిఅందలిసారమునుతీసి వేసిననది పక్వశమనియుచెప్పబడును. మద్యమును సాధించువస్తువులు అనగా అడుగున దిగబడు మడ్డి కిణ్వకమనబడును. ప్రసన్నయనుమద్యము అనాహము గుల్మము అర్శస్సు వాంతి అరుచి వాతము కడుపుబ్బరము రొమ్మునొప్పి కడుపునొప్పి శూల వీనినిపోగొట్టును. దీపనకారి కాదంబరీమద్యము గురుత్వము కలది. శుక్రవృద్ధి అగ్నిదీప్తి వాతము గలుగజేయును. శరీరమునందు వేగముగ వ్యాపించును. జగలమద్యము కఫము వాపు అర్శస్సు గ్రహణి హరించును. మలబద్ధము చేయును. మేదకమద్యము తీపిగ బలకరముగ స్తంభనముగ శీలతముగ గురువుగనుండును. పక్వశమద్యము సారము తీయబడినదిగాన వాతము బెంచి మలబద్ధముచేయును. కిణ్వకము వాతముహరించును. అరుచి గల్గించును. గురుత్వముగలదియై జీర్ణముకాకుండును. అక్షిక మద్యము అనగా తానికాయ బెరడు వరిబియ్యము వీనిచే చేయబడిన మద్యము, పాండువు శోధ మూలరోగము పిత్తరక్తము కుష్టు కఫము హరించును స్వల్పముగ వాతహరమైనది. రూక్షగుణముకలది. అగ్నిదీప్తి విరేచనము గలుగచేయును. తేలికగనుండును. యవలపిండిచే జేయబడిన మద్యము యవసురయనియు నానావిధ ధాన్యములచే జేయబడిన ఆసవములు కాకోళిక, హాలీ, మైరేయ అనియు చెప్పబడును. ఆసవము సుర యను రెండువిధముల మద్యములకు పాత్రములును సాధనములును సమానములగుటచే మైరేయమద్యము ద్వివిధముగనుండును. ఆరెపూవు బెల్లము బియ్యపుకడుగు వీనిచే కాచబడిన మద్యము మైరేయమని కొందరందురు. యవసురయను మద్యము గురువుగ రూక్షగనుండును.



మలబద్ధము త్రిదోషములు కలుగజేయును. కాకోళికామద్యము శరీరపుష్టి శుక్రవృద్ధి కలుగజేయును. దృష్టిమాంద్యముదెచ్చును. గురువైనది. మైరేయమద్యము శరీరపుష్టి శుక్రము గురుత్వము తృప్తి కలిగించును. శరీరమున వేగముగవ్యాపించును. మధూలకమను మద్యము సమస్తరసవర్గములచేతను జేయబడిన మద్యము గురుత్వము తీపి జిగటకలది శుక్రము కఫము బెంచును. శర్కరతోచేయబడిన మద్యము దీపనముగ చులకనగ తీపిగనుండును. జీర్ణశక్తిని రుచిని బుట్టించును. సంభోగేచ్ఛకలిగించును. వాతము శోష పొత్తికడుపులోని నొప్పి హరించును. తేనెతోజేయబడిన మద్యము లఘువైనది. రూక్షగనుండును. కుష్టు విషము మేహము జయించును. బెల్లముతోచేయబడినమద్యము అగ్నిదీప్తి శరీరకాంతి బలము తృప్తిగలుగజేయును కారముగనుండును. చేదుగలవస్తువులచే జేయబడిన మద్యము పుష్టి రుచి నిచ్చును. మలమూత్రములు అపానవాతము వీనిని వెడలించును. కాచబడిన చెరకురసముతో చేయబడిన మద్యము పక్వరసమనియు, శీతరసమనియు చెప్పబడును. పక్వరసము మంచిది. స్వరము, దీపనము, బలము, కాంతి కల్గించును. వాతపిత్తముల బెంచును. పొట్టకుమేలుచేయును. రుచిగ స్నిగ్ధముగ నుండును. మలబద్ధము, మేహము, వాపు, అర్శస్సు, శోధోదరము కఫమువీటిని హరించును. శీతరసము పక్వరసముకన్న తక్కువగుణముకలది లేఖనకారి జాంబవముఅనగా తేనె నేరేడుపండ్లరసము బెల్లమువీనిచే చేయబడిన మద్యము మలబద్ధము వాతముచేయును. వగరు రుచికలది.

చిక్కగ విశేషముగ కాచబడినదిగ దుర్గంధముగ రసహీనముగ పురుగులు పడినదిగ నుండుమద్యమును త్రాగరాదు. అట్లుత్రాగిన అనేకవికారములను రోగములను కలిగించును.

ప్రాతది రుచికలది నిర్మలమైనది. పరిమళమైనది యగుమద్యము మంచిది. అది యగ్నిదీప్తిని బుద్ధివికాసమును యిచ్చును. కఫవాతములహరించును. హృదయమునజేరి ఊర్ధ్వముగ సంచరించు నాడులలో

వ్యాపించి చక్షురాదీంద్రియములను మనస్సును వ్యాకులపరచి తనవీర్యముచేత మనుజుని మోహింపజేయును. మద్యపానమువలన శ్లేష్మతత్వముగలవారలకు ఆలస్యముగను వాతతత్వముగల వానికి స్వల్పకాలములోను పిత్తతత్వముగలవారికి అతిశీఘ్రముగను మదముగలుగును. నూతనమద్యము శ్లేష్మకారి. త్రిదోషప్రకోపము చేయును. వేగముకలది. అరిష్టము అను మద్యము శరీరపుష్టి తాపముగలుగజేయును. దుర్గంధముగ తేటగ గురువుగ నుండును. ఇదియే పాతదిగ నుండిన కాంతినిచ్చును. కఫవాతములు కృమి హరించును. హృదయమునకు మేలుచేయును. పరిమళముగ చులకనగనుండును. స్రోతస్సులను శోధించును. పథ్యమైనది. సాత్వికమగుమద్యము సంగీత హాస్యాదులను రాజసమద్యము సాహసకృత్యములను తామసమద్యము నిందితకర్మలను నిద్రాదులను కలుగజేయును. పులిసినమద్యము కఫహరము. మిక్కిలి వేడిచేయును. చులకనగనుండును. రుచిబుట్టించును. పాచనకరము. పాండువు క్రిమి జయించును. రూక్షగలది. వాతాదిదోషములను భేదించును రక్తపిత్తకరమైనది. గుడాదిరసయుక్త మద్యములన్నియు గురుత్వముకలవి. కఫహరములు.

మధ్యమపంచమూలము:—ముత్తవపులగము గజ్జేరు ఆముదము పెసర పిల్లిపెసర వీనివేళ్ళ సముదాయమునకు మధ్యమ పంచమూలములనిపేరు. ఇవి త్రిదోషములను హరించును. మలమును వెడలించును పథ్యముగ ఆరోగ్యముగనుండును.

మధుశర్కర:—చూ. పంచదార.

మనుబాల:—సం. జీవంతి, జీవని, సుఖంకరి, జీవదాఅనియు హిం. జీవంతీ, డోడీ అనియుపేరు. ఇందు పెద్దజీవంతి చిన్నజీవంతి తిక్తజీవంతి స్వర్ణజీవంతి అని అనేకభేదములుగలవు. ఇది తీగజాతి ఆకువిరిచిన పాలుకారును. ఆకులు సన్నముగ పొడవుగనుండును. దీని ఆకులు కూరవండుకొనితినెదరు. చిన్నజీవంతి మధురరసము శీతవీర్యము స్నిగ్ధలఘుగుణములు మధురవిపాకముకలది. రక్తపిత్తము వాతము క్షయ తా



పము జ్వరము నేత్రరోగము త్రిదోషవికారము రక్తదోషము భూతబాధ పిత్తము హరించును. నేత్రములకు మేలుచేయును. కఫము బలము మేదస్సు శుక్రము జ్ఞాపకశక్తి చురుకుదనము పుష్టి మలబద్ధము కలిగించును. రసబంధనమున కుపయోగించును పెద్దజీవంతికి సంస్కృతమున బృహజ్జీవంతి పుత్రభద్ర జీవపుష్ప అనియు, స్వర్ణజీవంతికి హేమపూర్ణా స్వర్ణలతా హేమవల్లీ అనియు, తిక్తజీవంతికి తిక్తభద్ర తిక్తప్రియంకరీ అనియుపేరు. పెద్దజీవంతికికూడ చిన్నజీవంతియొక్క రసవీర్యాదులు కలిగియుండునుగాని ఇది శీఘ్రముగ రసమును బంధించును. స్వర్ణజీవంతి నేత్రములకు మేలుచేయును. చల్లగానుండును. వాతపిత్తములు రక్తపిత్తము తాపము హరించును. బలమును పెంపొందించును తిక్తజీవంతి చేదు కారము రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. అగ్నిదీప్తి మలబద్ధము పుష్టి శుక్రము బలము పిత్తము కలుగజేయును. రక్తపిత్తము కఫము కంఠరోగములు వాతము గుల్మము అర్శస్సు కృమి కుష్ఠము విషము శ్వాస ప్రమేహము ఎలుకవిషము జీర్ణజ్వరము శోఫ హరింపజేయును. రుచి తాపము పుట్టించును. ఎలుకవిషము హరించుటకు దీనివేరును అరగదీసి కరచినచోట లేపము చేయవలెను.

మనుష్యుడు:—మనుష్యునిపుర్రె, మూత్రము, శుక్రము, ఎముకలు మొదలగువానితో అనేకవిధములగు జయసీరులు చూర్ణములు మొదలగునవిచేసి వానిమూలమున కొన్ని భస్మములు మైనములు రసకట్లు మొదలగునవిచేసి యనేక రోగములందు వాడుపద్ధతులు. అగస్త్య సంప్రదాయమున చెప్పబడినవి. ఆడుదానిగోళ్ళు ఋతురక్తము ఆహారపదార్థములలో కలిపి పురుషునికి తినిపించిన నతడా స్త్రీకి వశ్యుడగును. పురుషునివి స్త్రీకి పెట్టినను నట్లే వశ్యురాలగును. కొత్తదియు మంటిలోచివికిపోకశుభ్రముగనుండినదియునగు స్త్రీపురుషుల ఆర్తవశుక్రములచేత రసముబద్ధమగును. ఇట్లు బద్ధమైన రసము వాదవిద్యయందుపయోగించును. ఉమ్మిని అరచేతిలోవేసికొని వేడిపుట్టునట్లు రంగరించి

వెచ్చగనుండునపుడే పూతపూసిన కొరుకు సవాయిపుండ్లు మానును. మనుష్యమూత్రమును త్రాగిన సర్పవిషము హరించును. గుల్మము హృద్రోగము శూల నివర్తించును. హఠాత్తుగా క్రిందపడిగాని మరి యొకవిధముగాగాని ఒరిపిడిగలిగి కొట్టుకొనిపోయినచోట మనిషిమూత్రమునుపోసిన ఆగాయము త్వరగ మానును. మూత్రముతో తడిపిన గుడ్డను అగ్నిదగ్ధవ్రణముపై వేసిన వెంటనేఆరిపోవును. మనిషిఎముకలను కాల్చిన మసితో నల్లమందు కలిపి గాయములో కుక్కినవెంటనే రక్తస్రావముకట్టి గాయము అతుకుకొని మానిపోవును. మనిషియొక్క పక్కయెముకలను అరగదీసిన గంధమునుపూచిన యెడల అమిత సంభోగమువలన గలిగిన యోనియందలి మంట తగ్గును. శవమునకు గట్టిన త్రాడునుదెచ్చి ఆత్రాడుతో స్త్రీ పురుషుని కొట్టిన ఆతడామెకు వశ్యుడగును. అట్లే స్త్రీయును వశ్యురాలగును. చనిపోయిన చంటిపిల్లల నాలుకనుకోసి తెచ్చి క్షుద్రమంత్రములచే మంత్రించి మారణప్రక్రియాములందు భూతవైద్యులుపయోగింతురు. ఇంకను తంత్రమంత్రములకు సంబంధించిన విషయములు హేయములును అనార్యములును అయియుండుటచే నిందువ్రాయబడవు.

మయిలతుత్థము:—సం. మయూరగ్రీవ, శిఖికంఠ, తుత్థం, హరితాశ్మ. వితున్నక అనియు, హిం. తూతియా, నీలాథోథా, నీలాతూతియా అనియుపేరు. గరుత్మంతు డమృతపానముచేసిన పిదప హాలాహలమను విషమునుకూడ ద్రావి మరకతపర్వతమున వమనముచేసెను అప్పుడమృతయుక్తమైన విషము గడ్డకట్టి నెమలి మెడవంటి వర్ణమును బరువుగలదియై సస్యకము మయూరతుత్థము అను పేర నొప్పుచుండె నందురు గాని యిందు ముఖ్యముగా గంధకము రాగి అను రెండువస్తువులుండును. యేద్రవ్యమున విషవస్తువు కలసి యున్నదో ఆద్రవ్యమునుపటికంటె ఉత్తమగుణములు కలదియగును. దీనిని శాస్త్రోక్తముగ శోధనముచేసి యౌషధములందును భస్మసిందూరాదులజేసిప్రత్యేకముగను వాడదగును. అపరిశుద్ధమైనతుత్థమును దినిన వాంతినిచేసి చంపును.



పరిశుద్ధమైన తుత్థము కారము వగరు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. శ్విత్రము నేత్రవ్యాధులు సమస్తవిషదోషములు, కఫపిత్తములు, కుష్ఠు, దురద, వ్రణము, కృమి, శూల, మూలరోగము, ఆమ్లపిత్తము, మలబద్ధము, శ్వాస కాసలు, రుద్రవాతము మొదలగు అనేకరోగముల హరించును. లేఖనకారి దీపన పాచనములను వమన విరేచనములను గలుగజేయును. మైలతుత్థమును మెత్తగాచూర్ణించి వానసీరులో కలిపి మూత్రనాళమున పిచికారిచేసిన సెగరోగముమానును. మైలతుత్థచూర్ణమును మురికిపుండ్లపైచల్లినవెంటనే పురుగులుచచ్చి దుష్టమైన మాంసభాగమును తినివేసి యెర్రపుండుపడి క్రమముగమానును. బిడ్డలకు రుద్రవాతము అనగా చంటిబిడ్డగుణముకనబడినపుడు వెంటనే తెలివివచ్చుటకు నస్యాదిక్రియలు చేసి తెలివి వచ్చినవెంటనే తుత్థచూర్ణమును చనుబాలలోకలిపి త్రాగించిన వెంటనే ఒకటి రెండు వాంతులై శ్లేష్మముహరించి ఆవ్యాధిరాకుండజేయును. మైలతుత్థమును వెన్నలోగలిపి శరీరమునకు పూసిన గజ్జి చిడుము దురద కుష్ఠు మొదలగు చర్మరోగములన్నియు నశించిపోవును. మైలతుత్థము కలిపి చేసిన కాటుకను కండ్లలోబెట్టిన మంటగానుండును. గానితురలు దుర్మాంసములు మొదలగు సకల కఫవికారములు నశించును. పోత్థమును * రక్తవర్గముచే భావనచేసినను * స్నేహావర్గముచే 7 సారులు నానబెట్టినను గోమూత్రము గేదెమూత్రము మేకమూత్రము వీనిచే ప్రత్యేకము జాము సేపు స్వేదనముచేసినను శుద్ధమగును. శుద్ధిచేసినతుత్థముతో గంధకము వెలిగారముచేర్చి నిమ్మపండ్లరసముతో నూరి పుట

* రక్తవర్గము:—కుసుంబాచెట్టు, చంద్ర, లక్క, మంజిష్ఠ, రక్తచందనము, గోలిమిడి, మంకెన, గంధతృణము, తేనె యీవస్తువులు రక్తవర్గమనబడును.

* స్నేహావర్గము:—నెయ్యి, నూనె, వస, మజ్జ యీనాల్గును కలసి స్నేహావర్గమనబడును.

ము బెట్టిన (కుక్కుటపుటము బెట్టిన) భస్మమగును. కుంకుడుకాయరసముతో నూరి లఘుపుటముబెట్టిన యెఱ్ఱగసిందూరించును. మేడిచెట్టువేరునందు తుత్థపుముక్కను పెట్టి మూసి 3 మాసములు నిలవయుంచి తీసి మేడిపాలతో నూరి శరావసంపుటమందుంచి పుటముబెట్టిన తెల్లగభస్మమగును. సిందూరముకన్న భస్మము యెక్కువ తీక్ష్ణముగ పనిచేయును. యాభస్మసిందూరములు సాధారణముగ శ్వాసకాసలు ఉబ్బసము క్షయ కుష్టము అనురోగములందు వాడదగును. సిద్ధయోగములందు తుత్థభస్మమును మిగుల సులభముగసాధించి ఒకబియ్యపుగింజయెత్తు మోతాదుతో క్షయ ఉబ్బసము కుష్టము మొదలగు దారుణరోగముల గుదుర్చుట సర్వజనవిదితము. అట్టియోగములు దుర్లభములు. సాధారణమగు భస్మముకూడ విషదోషములు హృద్రోగము శూల అర్శస్సు కుష్టు అమ్లపిత్తము మలబద్ధము గరదోషము బొల్లి మున్నగువానినిజయించును. తుత్థము రసమునుబంధించును. తుత్థమునుండితీసిన సత్త్వము భూనాగసత్త్వము సమభాగముగకలిపి ఉంగరముచేయించిదానిని స్పృశించినను చేతినిధరించినను శూలరోగముహరించును. మరియు శాకినీ ఢాకిన్యాది గ్రహబాధలు స్థావర జంగమవిషములు నిస్సంశయముగనశించును. "రామవత్సర సేనాని ముద్రితేపితధాక్షరం। హిమాలయోత్తరదేశే అశ్వకర్ణోమహాద్రుమః। తతశ్శూలం సముత్పన్నంతత్రైవ విలయంగతం॥" అని మంత్రించి ఉంగరమును కడిగి ఆనీళ్లను త్రాగించిన శూల తక్షణముశమించునని భాలుకిమహర్షి వచించెను. యీయుంగరమువేసి కాచిన తైలమును శూలగలచోట రాచినయెడలశూలమాయమగును. యీయుంగరమును ధరించినయెడల గర్భిణీస్త్రీ తక్షణము సుఖప్రసవమగును. దీనివలన అనేక నేత్రరోగములు కుదురును. తుత్థమును చూర్ణించి యొక యినుపపాత్రలో వేసి అందు నీళ్ళుపోసి కొంతసేపుంచి తేటనీరు పారబోసి మరల నీరుబోయుచు పారబోయుచున్న అడుగున తామ్రరూపమగు సత్త్వముదిగబడును. తామ్రమునుండి సత్త్వముదీయువిధములలో నిదిసులభము.



మయూరశిఖ:—సం, బర్హిణచూడ, శిఖినీ, శిఖాలు, శిఖిబల అనియు, హిం. మోరాశిఖా, లాల్ముర్గా అనియుపేరు. ఇది చిన్నక్షుపముగ మొలచును. దీనిశిఖను నెమలిజుట్టువంటి యాకృతిగల ఆకులు వేయును. దీనినిచూచినంతనే మయూరశిఖయని గుర్తుపెట్టుటకు వీలుగలిగియుండును.

తీపి వగరు పులుపు రుచులు లఘుగుణము శీతవీర్యము అమ్లవిపాకముగలది. పిత్తశ్లేష్మములు అతిసారము మూత్రకృఛ్ర బాలగ్రహ బాధాదిదోషములు హరించును. వశ్యకర్మయందుఁగూడ నుపయోగించును,

మరాటామొగ్గలు:—ఒక చెట్టుయొక్క మొగ్గలు లవంగముయొక్క ఆకారముగలిగి అంతకన్న కొంచెముపెద్దవిగ నుండును. గంధకర్మలందును వీర్యస్తంభకఔషధములందును విశేషముగ వాడుదురు. వీర్యస్తంభనము మత్తు ఉత్సాహము ఆకలి పిత్తము కలిగించును. మలబద్ధముచేయును.

మరువము:—సం. మరుత్తక, మరుబక, మరుత్, ఫణిజ్జక, ప్రస్థపుష్ప అనియు, హిం. మరుఆ, మరువా, గేదరేత్ అనియుపేరు ఇది దొడ్లలోవేసి పెంచబడు సుగంధవంతమగు మొక్క. తులసికివలె దీనికిని వెన్నువేయును. ఆకులుపొడవుగ వ్రేళ్ళవలెనుండును. ఇది కారము చేదు రుచులు లఘు రూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. పిత్తమును పెంచును. వాతశ్లేష్మములు కుష్టు క్రిమి తేలు జెఱ్ఱి మొదలగు విషములు రక్తదోషము విషజ్వరము దురద అరుచి శ్వాస శోఫ హృద్రోగము ఆధ్మానము శూల మాంద్యము చర్మరోగములు హరించును. దీపనపాచనముల గలిగించును. రుచిబుట్టించును. ఆకురసమును తలకురుద్దిన పిత్తభ్రమశమించును. చుండు పేలు చచ్చును. శరీరమునకుపూసుకొనిన చర్మవ్యాధులునశించి కాంతికలుగును.

మర్కటీపిప్పలి:—సం. మర్కటీపిప్పలి, వానరపిప్పలిఅందురు.

చేదు వగరు రుచులు గలది. మూత్రకృచ్ఛ్రి అశ్మరి యోనిశూల విస్ఫోటము జయించును.

మఱ్ఱిచెట్టు:—సం. వట, రక్తఫల, శృంగి, న్యగ్రోధ, స్కంధజ, వైశ్రవణావాస అనియు, హిం. వడ్ అనియుపేరు. ఇది పెద్దవృక్షము. ఆకులు మందముగ గుండ్రగ నుండును. చెట్టునకు గాటుబెట్టిన పాలుగారును. దీనిపండ్లు గుండ్రగ పగడములవలె యెఱ్ఱగ నుండును. ముదురుచెట్టునకు ఊడలుదిగును. ఇది వగరు రుచి గురుగుణము శీతవీర్యము మధురవిపాకము గలది. కఫ పిత్తవ్రణములు విసర్పి తాపము యోనిదోషము జ్వరము దప్పి మోహము శోఫ ఛర్ది మూర్ఛ అతిసారము అతిమూత్రము కుసుమరోగము హరించును. వ్రణములను శోధించును, శరీరకాంతినిచ్చును. మలబద్ధముచేయును.

మఱ్ఱిఊడలకషాయమును పుక్కిటబట్టిన నోటిపూత రసపట్లుతగ్గును. లోపలకు త్రాగిన కళ్లెదగ్గుతగ్గును. విరేచనబద్ధముచేయును. మఱ్ఱిఊడలు ఉశిరిగపప్పు తామరపూవు చంగల్వకోష్టు వరిపేలాలు వీనిని సమభాగముగ చూర్ణించి తేనెకలిపి గుటికలుచేసి బుగ్గనుంచుకొని రసమునుమ్రింగుచున్న అమితమైనదప్పి ముఖశోష నశించును. మఱ్ఱియూడలచూర్ణముతో దంతములను తోమిన దంతములు గట్టిపడును. మఱ్ఱియూడలకషాయమునందు కాచు చూర్ణము కలిపి యిచ్చిన నీళ్ళవిరేచనము జిగటవిరేచనములు తక్షణము కట్టును. నులిపురుగులు చచ్చిపోవును. మఱ్ఱియాకులతో కుట్టిన విస్తరియందు వ్రణము కృమి గ్రహణి అతిసారము అనురోగులు భుజించిన పథ్యముగనుండును. మఱ్ఱిచిగుళ్ళనునూరి కట్టుగట్టిన గజ్జి చిడుము వ్రణము మొదలగునవి మానును. మఱ్ఱిపండ్లను నాలుగు అయిదింటిని ఆవుపాలలోవేసి తొక్కి రసమును పిండి త్రాగిన రక్తవమనము రక్తప్రదరము తగ్గును. మఱ్ఱిపండ్లచూర్ణమునందు పంచదారకలిపి తిని ఆవుపాలుద్రాగుచున్న ఇంద్రియనష్టము కట్టును. అమితవీర్యవృద్ధి సంభోగశక్తి బలము ఆయువు వృద్ధియగును. మఱ్ఱిపాలు బేడెత్తు బెల్లము బేడెత్తు కలిపి ప్రతి ప్రాతఃకాలమునందును



తినుచున్న అపస్మారము మేహము కుష్ఠము తలత్రిప్పు శుక్లనష్టము నశించును. మఱ్ఱిపాలలో పటికిబెల్లపుచూర్ణము కలిపి 23 దినములు ఉదయములందు మాత్రము పుచ్చుకొనుచున్న ప్రాతసెగలు నెమ్మదించును. మధ్య నపుంసకత్వము పోవును. మఱ్ఱిపాలు పొడిచిన కొరుకు సవాయిపుండ్లుమానును. కాళ్ళపగుళ్ళకురాచినను నవిమానును. మఱ్ఱిపాలతోనూరి పుటమువేసిన అభ్రకము నిశ్చంద్రికముగ సిందూరించును. 10 పుటములు వేయవలెను. ఈసిందూరము మధుమేహము అతిమూత్రము అనువ్యాధులందమోఘ ఫలమునిచ్చును.

మల్లితీగ:—సం. కుంద, మాఘ్య, మహామోద, శుక్లపుష్ప అనియు హిం. కుందేకావృక్ష అనియుపేరు. తీగజాతిలోనిది. ఉద్యానమందువేసి పెంచుదురు. దీనిపూవులుతెల్లగ పరిమళ భరితములై యుండును. ఆకులుపెళుసుగ గుండ్రగ చిన్నవిగనుండును. మల్లెవేరుఆకు వీనికషాయము లేకరసము చేదు వగరు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. వాతకఫములు రక్తదోషములుశమింపచేయును శుక్రవృద్ధికరమైనది. మల్లెపూవులు తీపి వగరు కారము చేదు రుచులు సరలఘుగుణములు శీతవీర్యము కటువిపాకముకలవి. దీపనపాచనముల గల్గించును. కండ్లపై వేసికట్టిన కన్నుమెరుపు పోటు గరగరలాడుట మంటనీరుగారుట మొదలగు వేడివలనబుట్టు కంటిదోషములు శమించును. శిరస్సునకు గట్టినతలదిమ్ము పోటుతగ్గును. పిత్తవ్రణములపై వేసికట్టిన తాపముమంటతగ్గును. రసముత్రాగినపిత్తము శోధ, విషము, ఆమము, రక్తదోషము, వాతము హరించును. ఒకపల్చనిగుడ్డలో పచ్చకర్పూరమును మూటగట్టిమల్లెపూవులకుమధ్యనుంచి ఆవుపాలతోస్వేదనముచేసి తీసి పూవులతోసహాపచ్చకర్పూరమునూరి ఆవువెన్నకలిపి మరలనూరి కండ్లకు కాటుకబెట్టుచున్న వేడివలన బుట్టుసకల నేత్రవికారములు శమించును. కంటితో అమితవ్యాయామముచేయువారలకీకాటుక మంచిసుగుణమునిచ్చును.

మహామేద:—చూ. అష్టవర్గము.

మహారాష్ట్రి:—సం. మహారాష్ట్రీ, రాష్ట్రి, మరహట్టిక అనియు, హిం. మరేఠీ అనియుపేరు. ఇది పెద్దక్షుపము. ఆకులు తులసియాకులవలె నుండును. పసుపు మెరుపు రంగులుగల దీనికట్టె అక్కలకఱ్ఱవలెనుండును. కారము రుచి తీక్ష్ణగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. వాతకఫములుహరించును.

మహిసాక్షి:—సం. గుగ్గులు, కాలనిర్యాస, మహిసాక్షి, పలంకష అనియు, హిం. గూగుల్ అనియుపేరు. మరుభూమియందలి గుగ్గిలపుచెట్లు గ్రీష్మకాలమున యెండవేడిమికికాగి చెట్లనుండి యొకవిధమగు సారముకారును. అది రాత్రి శీతలముచే గట్టిపడును. అదియే మహిసాక్షియని వ్యవహరింపబడుచున్నది. ఇట్లువెలువడు గట్టిసారముకొంత బంగారువర్ణముగను కొంత గేదెకన్నురంగుగను మరికొంత తామరపూవురంగుగను కొంతతెల్లగను కొంతనల్లగను 5 విధములుగ నుండును. ఈవృక్షములు పర్వతప్రాంతములందుగూడ పెరుగును. దీనియాకులు చిన్నవిగ పూవులుయెఱ్ఱగ మిగులచిన్నవిగ 5 రేకులు గలిగి గుత్తులుగనుండును. పండ్లుకూడచిన్నవి. మహిసాక్షి గుగ్గిలము చేదు వగరు రుచులు సర రూక్ష లఘుగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము గలది. దీని నితరవస్తువులలోచేర్చి వాడిన విరిగినయెముకలు కూడుకొనును. వీర్యవృద్ధి కంఠస్వరము దీపనము బలము గలిగించును. మూలవ్యాధి వాతకఫములు గండమాల వ్రణములు ప్రమేహపిడకలు కుష్ఠము అపచి దగ్గు మొదలగు అనేకరోగములను ఖండించును. ఇది మధురమైనదిగాన వాతమును వగరుగలదిగాన పిత్తమును చేదుకలదిగాన కఫమును హరించును. గనుక యిది త్రిదోషహరమైనది. నూతనమైన గుగ్గులు బలవీర్యముల పెంపొందించును. ప్రాతది మిగుల లేఖనకారిగ నుండును. యెండిదుర్గంధయుక్తమైన గుగ్గులును సేవింపరాదు. ఆయుర్వేదమందు గుగ్గులు ప్రధానముగగల ఔషధములనేకములు గలవు. కొన్ని యుత్తమయోగములు నిరూపింపబడుచున్నవి.

మహిసాక్షి 10 తులములు, త్రిఫలములు 3 తు॥ త్రికటుకము



లు 3 తు॥ దాల్చినపట్ట పన్నీరుమొగ్గలు గోరింటవేరుపట్ట గంగరావిపట్ట వేపవేరుపట్ట ముస్తలు ఫిరంగిచెక్క మరాటీమొగ్గలు చంగల్వకోష్టు కాసినుగువేరుపట్ట తాళిసపత్రి యివిప్రత్యేకమొక్క తులము వీనినెల్ల చూర్ణించి మహిసాక్షి గుగ్గిలపుపాకములోవేసి కలిపి కుంకుడుగింజలంతమాత్రలుచేసి దినమునకు 6 మాత్రలు యిచ్చుచుండిన యెడల త్రిమ్మిరి శోఫ సవామేహము వలన గల్గిన కీళ్ళనొప్పులు శుక్లనష్టము శ్వప్పక శమించును.

కాతినార సురాకారము ధనియాలు ప్రత్యేకమొకతులము రేవల్చిన్ని 2 తు॥ వీని చూర్ణమునకు రెట్టింపు మహిసాక్షి పాకముపట్టి పై చూర్ణములనుచేర్చి కుంకుడుగింజలంత మాత్రలుచేసి యిచ్చిన శుక్లనష్టము కాలుచేతుల నరములతీపు మూత్రకృఛ్రి మొదలైనవినశించును. ఇందు రత్నాపురి గుగ్గిలము అనునది మరియొక భేదము కలదు. చూ. గుగ్గిలము.

మత్స్యములు:—సం. మత్స్య, శఫర, మీన అనియు, హిం. మచ్ఛీ అనియుపేరు. మత్స్యమాంసము సాధారణముగ బలము వీర్యపుష్టి చేయును. వాతమునుహరించును. జిగటగనుండును. నదిలోనుండు చేపలమాంసము గురువైనది. పుష్టినిచ్చును. వాతమును హరించును. నూతిలోనిచేపలు వీర్యపుష్టినిచ్చును. కఫము అష్ఠీలము మూత్రకృఛ్రి కుష్ఠము మలబద్ధముగలుగచేయును. చెరువులోనిచేపలు గురుత్వముగలవి. శుక్రము బలము మూత్రము వృద్ధిజేయును. శీతలముగనుండును. సెలయేటిమత్స్యములు చెరువు చేపలగుణాదులుకలవి. మరియు బలము ఆయువు బుద్ధి దృష్టి గలుగచేయును. మెట్టచెరువులలోని చేపలు తియ్యగ జిగటగ వాతహారముగ నుండును. బలమునిచ్చును. సముద్రపుచేప గురుత్వముగలది. స్వల్పమైన పిత్తమును గలిగించును. వాతముహరించును. ఉప్పునీటిచేప మలబద్ధము దృష్టి నాశనముచేయును. మడుగులోనిచేప బలమునిచ్చును. నిర్మలజలములోనిమత్స్యములు బలకరమైనవికావు.

హేమంతఋతువునందు నూతిచేప, శిశిరర్తువున మెట్టచెరువులలోనిచేప, వసంత గ్రీష్మఋతువులందు నది దొన చెరువు వీనియందలి చేపలు శరదృతువునందు సెలయేటిచేపలు హితకరములు. వర్షాకాలమునందుబుట్టిన అన్నివిధములగు మత్స్యములును సకలరోగములను బుట్టించును.

రోహితమను చేప అన్ని చేపలకంటె మంచిది. స్వల్పముగపిత్తము జేయును. తేలికగ అరుగును. అనేకదంతములుగల చేపమాంసము వగరుగనుండును. బలమునిచ్చును. కఫము గురుత్వము గలిగించును. గుంపుగనుండు చిన్నచేపలు తీపిగనుండును. త్రిదోషహారమైనవి. మిగులచిన్నవిగనుండు చేపలు వీర్యవృద్ధిచేయును. రుచిగనుండును. కాస వాతము హరించును. నడయను కసవునందిరుగు చేప త్రిదోష ప్రకోపముం జేయును. తిమియను చేప బలముచేయును. చేపగ్రుడ్లు మిగుల శుక్రవృద్ధి గలిగించును. జిగటగ గురువుగ నుండును. బలము కఫము మేదస్సు వృద్ధిచేయును. బడలికనిచ్చును. మేహశాంతికరమైనది.

మాంసము:—కాగిననేతిలో యింగువజేర్చి దానిలోమాంసము వేసి సాతాళించి కొంచెము వేడినీళ్ళను పోసి ద్రవములేకుండ పక్వము జేసి మిర్యాలు అల్లము వీటినికలిపి యాలకులు లవంగాలు మొదలగు సువాసనద్రవ్యములచే సువాసన గలుగునట్లు చేయబడిన మాంసము పరిశుష్కమనబడును. ఘనద్రవ్యములతో చేర్చి పక్వము చేయబడిన మాంసము ప్రదిగ్ధమనబడును. మధురాదిరసములతో పక్వముచేయబడినది సరసమనబడును. శూలమునగ్రుచ్చి నిప్పులపై కాల్చబడినది శూల్యమనబడును.

పరిశుష్కమాంసము జిగటగ రుచిగనుండును. తృప్తిని గురుత్వమునుచేయును, బలము బుద్ధి అగ్నిదీపనము తేజస్సు వీర్యము వీనిని వృద్ధిచేయును పైజెప్పిన పరిశుష్కమును ఘనద్రవ్యములతో జేర్చి మర్దించిన ఉల్లిప్తమనబడును. ఇదియును గురుత్వముచేయును. పథ్యమైనది. పరిశుష్కముతో సమానమైన గుణము కలది. ప్రదిగ్ధమనునది



వాతమును హరించును. బలముజేయును. ఆలస్యముగజీర్ణమగును. వీర్యపుష్టిజేయును. సరసమను మాంసముగూడ యీగుణమునే గలిగియుండును గాని యిది మిగుల లఘువైనది. అగ్నిదీప్తినిచ్చును. మాంసముమీద సువాసనద్రవ్యములనుపూసి శూలమున గ్రుచ్చి బొగ్గునిప్పులమీదకాల్చిన శూల్య మాంసము మిక్కిలి శ్రేష్ఠము. సులువుగ జీర్ణమగును. పథ్యమైనది. బొగ్గునిప్పులమీద కాచబడినమాంసము ప్రతప్తమనబడును. దీనిని దానిమ్మపండ్లరసము సైంధవలవణములు సువాసనద్రవ్యములుచేర్చి చక్కగాపిసికి అడవలెతట్టి పక్వముచేసిన నది పిష్టమనబడును. నేయిమొదలైనవానితో సాతాళించిన మాంసము భర్జితమనబడును. సువాసన ద్రవ్యములుచేర్చి తేనెవర్ణముగ జేసిన మాంసము పక్వమనబడును. తైలముచే పాకముచేసిన ప్రదిగ్ధ సరస పక్వ భర్జిత మృదుపాచిత ప్రతప్త పరిశుష్క శూల్య మాంసములు ఉష్ణవీర్యముగలవియైయుండును. గురుత్వముచేయును. పిత్తమును ప్రకోపింపచేయును ఘృతముచే పక్వముచేయబడిన పైమాంసభేదములు రుచిగ చులకనగనుండును. పిత్తమునుహరించును. వేడిచేయును. వీర్యము బలముపెంపొందించును. హృదయమునకు నేత్రములకు మేలుచేయును. మజ్జిగపులిగడుగు స్నేహము చింతపండు కారము మొదలగువాటితో పక్వము చేయబడినమాంసము శరీరమునకు బలమునిచ్చును. రుచిబుట్టించును. దీపనకారి. గురుత్వముగలది, మిగుల రసముకలమాంసము గూడగను రసహీనమాంసము వాతకరముగను గురువుగను ఉండును. ఎముకలు తీసివేసిన మెత్తనిమాంసమును బాగుగవండి సన్నెకలుమీదనూరి త్రికటుకములు మున్నగువానింజేర్చి నేతిలోవేసి పక్వముచేసిన వేశవారమనబడును. ఇదిబలమునిచ్చును, వాతమునుహరించును. గురుత్వముచేయును. పెసరపప్పు మున్నగువానిని సగము ఉడికించి మెత్తగతొక్కి దానిలో పసుపు త్రికటుకములు సైంధవలవణము యింగువ ధనియాలు దానిమ్మపండ్లరసము జాజికాయ వీటినిచేర్చి సువాసన గలుగునట్లు చేసిన నదియొక వేశవారమగును. దీనిని మసాలాఅనివాడుదురు. ఇట్లు

మసాలావస్తువులుచేర్చి వండిన మాంసములు ఆయామసాలాలయొక్క గుణములబట్టి ప్రభావములు మారుచుండునని తెలియవలెను. మాంసమును నూరి, రసముతీసిన నది మాంసరసమనబడును, ఆమాంసరసమునందు లవణముచేర్చిన సౌవీరమనబడును. పైజెప్పిన వేసవారమునుచేర్చిన స్వానిష్కమనబడును. మాంసరసము హృదయమునకు మేలుచేయును. బడలిక శ్వాస వాతము పిత్తము క్షయ వీటినినశింపచేయును వ్రణరోగముకలవారికిని, కృశించినవారికిని, శుక్రక్షయముగలవారికిని, జారినట్టియు, విరిగినట్టియు, సంధులుగలవారికి, దీనస్వరముగలవారికిని నేత్రదృష్టి ఆయువు శ్రోత్రేంద్రియము వీటివృద్ధినికోరువారికిని మిగుల హితకరమైనది. సౌవీరమను మాంసము తృప్తినికలుగజేయును. శీతలముగనుండును. ముఖశోష బడలిక వాతముహరించును. సర్వధాతువులకు పుష్టినిచ్చును. దీపనకారి. స్వానిష్కము గురుత్వము చేయును. అగ్నిదీప్తికలవారికి మిగులపథ్యకారి. దానిమ్మరసము మున్నగువానితో సిద్ధముచేయబడిన మాంసరసము బలమునిచ్చును. త్రిదోషములనుహరించును. కొంచెముమాంసములో నీళ్ళు ఉప్పు కలిపి కాచిన దకలమనియు, చణకమనియు చెప్పబడును. ఇవిలఘువుగనుండును మజ్జిగమొదలైనవాటిలో చేర్చి చక్కగ కాచిన క్వథితమనబడును. అదిపాచనకరమైనది. హృదయమునకు మేలుచేయును. రుచిబుట్టించును. అగ్నిదీప్తినిచ్చును. సులభముగజీర్ణించును. కఫవాతములు మలబద్ధము పోగొట్టును. కొలదిగపిత్తముజేయును. చంపగానేకోయబడిన జంతువుల మాంసము సర్వవ్యాధులనుహరించును. విషపీడితుల కమృతసమానమైనది. యౌవనమందుండునట్టియు బలిసియున్నట్టియు జంతువుల మాంసము బలకరముగను అట్టిది కానిది బలహీనముగను ఉండును. ముసలి జంతువులమాంసము విశేషదోషములుగలదై యుండును. లేతజంతువులమాంసము బలకరము. గర్భస్రావమైనట్టియు చూలుతోనున్నట్టియు జంతువులమాంసము గురుత్వముచేయును. స్వయముగ చచ్చిన జంతువులమాంసము బలహీనత అతిసారము గురుత్వము గలుగజేయును. వి



షము జలము రోగము వీనిమూలమున జచ్చినవాని మాంసము తినిన మరణముకలుగును. లేదా వాతాదిదోషముల ప్రకోపింపజేసి రోగములగలిగించును. పక్షులలో మగపక్షులమాంసము నాలుగుకాళ్ళ జంతువులలో ఆడుదానిమాంసము మంచిది. స్త్రీజాతియొక్క నాభిక్రిందనుండు అపరశరీరమాంసము పురుషజాతికినాభికిపైనుండు పూర్వశరీరమాంసము లఘువుగనుండును. సమానజాతులలో చిక్కిపోక బలిసియుండు జంతుమాంసము అల్పశరీరముగల జంతువులలో స్థూలశరీరముగలదానిమాంసము ప్రశస్తమైనది. సర్వజంతువుల శరీరముయొక్కయుమధ్యనుండు మాంసము గురుత్వముగనుండును. పక్షులయొక్క మెడ రొమ్ము స్థూలముగనుండు అవయవములు వీనియందలి మాంసము మిక్కిలి ప్రశస్తము. ఉదకమునకు దూరప్రదేశమున నివాసము సంచారముజేయు పక్షి మృగాదులమాంసము శ్లేష్మమును జేయకయుండును జలమునందును జలప్రాయప్రదేశమునందును సంచారము లేక నివాసము జేయునట్టియు బలమైనయాహారమును తినునట్టియు జంత్వాదిమాంసములు గురుత్వముకలవిగనుండును జాంగలప్రదేశమున బుట్టినట్టియుమెల్లప్పుడును సంచారము జేయుచుండునట్టియు స్వల్పాహారమును భుజించునట్టియు జంతువులమాంసము లఘువుగనుండును. సకలజంతువుల తొడలు భుజములు కడుపు శిరస్సు కాళ్లు చేతులు నడుము వీపు గుండెకాయలు ప్రేవులు వీనియందలి మాంసము ఒకటికంటె నొకటి గురుత్వముకలవై యుండును.

మాంసరోహిణి:—సం. అతిరుహా, వృత్తా, చర్మకషా, ప్రహారవల్లీ అనియు, హిం. మాంసరోహిణీ అనియుపేరు. ఇది రోహిణి మాంసరోహిణి యని రెండువిధములు. వగరు రుచి సరగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. శుక్రవృద్ధికరము త్రిదోషములను హరించును. మలబద్ధముజేయును. వ్రణములనార్చును. రోహిణియనునది వాతము కృమి శ్వాసకాసలు రక్తదోషము హరించును. కంఠశుద్ధి చేయును. రెండుజాతులును అరణ్యములందు విశేషముగ దొరకును.

దీనికాయలు పొడవుగనుండును. ఒకతొడిమకు 7 ఆకులుండును.

మాచిచెట్టు:—సం. మాచిక, ప్రస్థిక, అంబష్ఠ, అంబాలిక అనియు, హిం. మాచిక అనియుపేరు. దీనికాయలు మాఫలకాయలు మాచికాయలు అని వాడబడును. గుండ్రగ గట్టిగ నుండును. వగరు పులుపు రుచులు లఘుగుణము శీతవీర్యము అమ్లవిపాకముగలవి. వాతవ్యాధి బలాసకము అరుచి అతిసారము పిత్తరక్తము కఫము కంఠరోగము మున్నగు వానిని హరించును. దీనిని తేనెతో అరగదీసి నాలుకకు రాచిన నోటిపూత నంజు పొక్కులు శమించును. నాలుక బెరడుకట్టును. లోపలకుతినిన మలబద్ధముచేయును. దీనిచూర్ణమును దంతములకురాచిన పండ్లవోటబడు రక్తముకట్టును. గంఢమును అరగదీసి హారతికర్పూరముకలిపి రాచిన గజ్జి చిడుము కురుపులుమానును.

మాచిపత్రి:—సం. స్థౌణేయ, వికీర్ణ, శుకపుచ్ఛక అనియు, హిం. ఘనేర్ అనియుపేరు. ఇది చామంతిచెట్టువంటిచెట్టు. ఆకుసువాసనగనుండును. మాచిపత్రియొక్క అనేకోపయోగములు భారతభైషజ్యమంజరియందు విశేషముగ సభివర్ణించబడినవి. ఇది కటుతిక్తరసములు స్నిగ్ధగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. బలము పుష్టి కాంతి జ్ఞాపకశక్తి శుక్రము వృద్ధిచేయును. పిత్తమును శమింప చేయును. కండ్లపై వేసికట్టిన కండ్లమెరుపు మంటతగ్గును. వేడివలన గలిగిన తలడిమ్ము తగ్గును. నిప్పుసెగ పొగతగిలియు అమితముగ చదివియు కన్నులెర్రబడి నీరుగారుచున్నప్పుడు మాచిపత్రిని కండ్లకుగట్టిన తత్క్షణమే కండ్లుచల్లబడును. రసమునుతీసి శరీరమునకుపూసిన దద్రు తామరతీట కుష్టు శరీరదుర్గంధము తిలకాలకము మొదలగు క్షుద్రరోగములు యితరచర్మరోగములు నశించును. లోపలకుత్రాగిన జ్వరము కృమి కుష్టు తాపము దప్పి హరించును. ఋతురక్తము జారీచేయును. అజీర్తివిరేచనములు కడుపునొప్పితగ్గును.

మాదీఫలపుచెట్టు:—సం. మాతులుంగ, బీజపూర కేసరీ, కేసరామ్ల అనియు, హిం. బిజోరానీంబ్ అనియుపేరు. మాదీఫలపుచెట్టు



నారింజ నిమ్మజాతులలోనిది. ఆచెట్లవలెనే యుండును. దీనికాయలు కోలగా దోసకాయలవలెనుండును. పండినపండు పసుపుపచ్చగనుండును.

పులుపు రుచి లఘుగుణము ఉష్ణవీర్యము అమ్లవిపాకము కలది. అగ్నిదీపనము రక్తపిత్తము గలుగజేయును. కంఠము నాలుక హృదయము వీనిని చక్కగా శోధించును. దీనిగుజ్జు శీతలముగగురువుగనుండును. వాతపిత్తములహరించును. శరీరపుష్టి నిచ్చును. మాదీఫల కేసరములు లఘువుగ మలబద్ధకారిగ నుండును. మరియుశూల, గుల్మము, ఉదరరోగము నశింపచేయును. మాదీఫలమునందలి గింజలు గురుగుణము ఉష్ణవీర్యముకలవి. క్రిమి కఫవాతములు హరించును. స్త్రీలు గింజలచూర్ణమును ప్రతియుదయమున ఆవుపాలతో సేవించుచుండిన గర్భముగలుగజేయును. దీనిపూవులు వాతము మలబద్ధము గల్గించును. రక్తపిత్తమును హరించును. లఘువుగనుండును. మాదీఫలరసము శూల అజీర్ణము మలబద్ధము అగ్నిమాంద్యము కఫము వాతము అరుచి శ్వాస కాసలు అనువ్యాధులందు ఉత్తమముగ పనిచేయును. అడవిమాదీఫలము పెద్దమాదీఫలము, చిన్నమాదీఫలము అనువానికినివియేగుణాదులు. తీపిగనుండు మాదీఫలమునకు సంస్కృతమున మధుకర్కటిక స్వాదులుంగ ఘంటాలిక అనియు నామములు తీపి రుచి గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. రక్తపిత్తమును హరించును. తియ్యమాదీఫలము వేరు గంధమునుఅరగదీసి రసమును చెవిలోపిండిన చెవిపోటుతగ్గును. గంధమును చెవిచుట్టు పట్టువేసిన చెవివాపుతగ్గును వేరురసములేకషాయము త్రాగిన విషూచి శమించును. చూ. అడవి మాదీఫలము.

మాధవీలత:—సం. మాధవీ, వాసంతిక, అతిముక్తాఅనియు మాధవి అనియుపేరు. విరివిగ తీగబ్రాకును. సెనగకాయంత గింజలు యెర్రగనుండును. దీనిని బండిగురివెంద తీగయందురు. గింజలమెరుపు గురివెందలను పోలునుగాని చిన్నగురివెందకుండు నలుపు దీనిగింజకులేదు. చూ. బండిగురివెంద.

మానుపసుపు:—సం. దార్వీ, దారుహరిద్ర, ద్వితీయాభ, కపీతక అనియు హిం. దారుహాలదీ అనియుపేరు. ఇదియొకచెట్టుయొక్కచెక్క. పసుపురంగుగ నుండును.

చేదు కారము రుచులు లఘుసర గుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. ప్రమేహము, దురద, చర్మరోగములు విసర్పి, విషము చెవి కన్ను మున్నగువానియందలి వివిధరోగములు హరించును. యీచక్కతో రసాంజనము తయారుచేయుదురు. దీనికషాయమును త్రాగిన సెగ తెల్లకుసుమ తగ్గును. స్త్రీలకు గర్భశుద్ధికలుగును. కృములను చంపును. పసుపుయొక్క గుణములుకూడ దీనియందుండును. చూ. రసాంజనము.

మానుప్పు:—చూ. క్షారకల్పనము.

మామిడల్లము:—సం. కర్పూర అందురు. ఇదిఅల్లమువలెనేయుండును. పచ్చిమామిడికాయయొక్క సువాసన గలిగియుండును. పచ్చడిమొదలగువానిలో దీనినివేసికొనిన మామిడికాయ వేసినట్లు మంచివాసన రుచి కలిగియుండును. మామిడిఅల్లపు రసమును త్రాగిన వాతశ్లేష్మములు హరించును. పిత్తముచేయును. మేహశాంతి కలుగును. రుచిబుట్టించును.

మామిడిచెట్టు:—సం. చూత, ఆమ్ర రసాల, సహకార, అతిసౌరభ, మాకంద, పికవల్లభ అనియు హిం. ఆమ్ అనియుపేరు. మామిడిచెట్లు భరతదేశమంతటను ప్రసిద్ధముగ తోటలువేసి పెంచబడును. ఫలములపులుపు తీపి రుచులు పెద్దచిన్న భేదములు మొదలగువానిచే భేదములు అనేకములుకలవు. ప్రత్యేకనామములును కలవుగాని రసవీర్యాదులు యించుమించు సమానములు. మామిడిచెట్లు వసంతఋతువున చక్కగాపూచి కాచును. జ్యేష్ఠాంతమువరకు కొన్నిచోట్ల ఆషాఢాంతమువరకు పండ్లుపండుచుండును. ఫలజాతిలో నుత్తమమైనది. స్వరూపాదులుసర్వజనవిదితములు గాన వ్రాయననవసరము.



మామిడివేరు వగరు రుచి శీతవీర్యముకలది. మలబద్ధముచేయును. రుచిబుట్టించును. పరిమళముగ నుండును. కఫవాతములహరించును. మామిడిపట్టయు వేరుగుణములుకలది. పైబెరడునకును లోపలఅస్థికిని మధ్యనుండుతెల్లనిపట్ట వగరుగనుండును. మలబంధము చేయును. దాహజనకము పిత్తము మేహము కఫము హరించును. యోనియందలిదోషములను హరించి పరిశుద్ధముజేయును. మామిడిచిగురు వగరుగ మలబద్ధకరముగ రుచిగ వాతపిత్తకఫహరముగ నుండును. మామిడిచిగురు రససిందూరముకల్పి మాత్రచేసి యిచ్చిన రక్తకాస కట్టును. మామిడిచిగుళ్ళనునూరి కుంకుడుకాయంత ఉండను మ్రింగి కొద్దిగ పెరుగుదాగిన నీళ్ళవిరేచనములు జిగటవిరేచనములు కట్టును. మామిడిపూవు అతిసారము కఫపిత్తములు ప్రమేహము అసృగ్దరము హరించును. వాతము మలబద్ధముచేయును. అగ్నిదీప్తి నిచ్చును. రుచిబుట్టించును. రక్తప్రదరమునుకట్టును. మామిడాకుల విస్తరిలో వేడియన్నముపెట్టుకొని తినిన పరిమళయుక్తముగ మనోహరముగనుండును. పిత్తమునుహరించును. అతిసారరోగులకు హితకరముగనుండును. మామిడిజిగురు యెర్రగనుండును. దీనిని కాలిపగుళ్ళకుపట్టించి కొద్దిగవెచ్చజేసిన నవి నయమగును.

లేతమామిడికాయ వగరు పులుపు రుచులు రూక్షగుణము శీతవీర్యము అమ్లవిపాకముకలది. రుచిగనుండును. కఫపిత్తములను త్రిదోషములను రక్తదోషమును కలుగచేయును. కొంచెము ముదిరినది పిత్తమునుహెచ్చించును. కొంచెము ఉప్పుచేర్చితినిన రూక్షగ రుచిగనుండును. మలబద్ధముచేయును. రక్తదోషమును త్రిదోషములను కలిగించును. కంఠరోగము మేహము యోనిదోషము వ్రణము ప్రమేహము అతిసారము హరించును. కాయలపై చర్మమునుతీసివేసి ముక్కలుగాతరిగి యెండించిన మామిడివరుగు పులుపు వగరు రుచులుగలిగియుండును కఫవాతములహరించును. మలమునుభేదించును. బాగుగాపండిన మామిడిపండు తీపి కొంచెము పులుపు రుచులు గురు స్నిగ్ధగుణములు శీత

వీర్యము మధురవిపాకముగలది. పరిమళముగనుండును. బలము శుక్రము తృప్తి కాంతి ఆనందము కలుగచేయును. వాతమును హరించును. కొద్దిగపిత్తముచేయును. జఠరాగ్నిని కఫమును పెంచును. విరేచనము చేయును. రక్తవికారము వ్రణము దప్పి శ్రమ నశింపచేయును. చెట్టునఆరముగ్గినపండు గురువుగ వాతహరముగ మధురామ్లరసములుకలదిగ పిత్తప్రకోపముచేయునదిగ నుండును. గడ్డిమొదలగువానిలో కావువేసి పండించినపండ్లు పులుపు పూర్తిగనశించి తీపిగలిగినవిగనుండును. గనుక రుచిగనుండును. పిత్తమును శమింపచేయును. బలము వీర్యము శుక్రము వృద్ధిచేయును. శీఘ్రముగజీర్ణమగును. చలువచేయును. మామిడిపండ్లరసమునుపిండి వస్త్రమున వడియగట్టి త్రాగిన సరగురుగుణములుగలదిగ నుండును. బలమిచ్చును. వాతమును హరించును. కఫము పుష్టి గలిగించును. తృప్తినిచ్చును. అంతిమనోహరముగ నుండదు. పండును నోటిలోనుంచుకొని రసమును పీల్చుచు దినిన బలము రుచి వీర్యము తృప్తి కలుగచేయును. మరియు తేలికగ చల్లగ శీఘ్రముగ జీర్ణించునదిగ వాతపిత్తహరముగ ఉండును. మలబద్ధముచేయును. కత్తితోకోసిన మామిడిపండు మందముగ శీతలముగ రుచిగ నుండును. ఆలస్యముగజీర్ణమగును. ధాతుపుష్టి బలము నిచ్చును. వాతపిత్తముల జయించును. మామిడిపండురసముదీసి చాపమీదపూసి యెండించి మెల్లగానూడదీసిన మరల చాపవలె ఊడివచ్చును. ఇదియే మామిడితాండ్రఅందురు. ఇది సరగుణముకలది. దప్పి ఛర్ది వాతపిత్తములు హరించును. సూర్యకిరణతప్తమైనదగుటచే శీఘ్రముగ అరుగును. రుచి బుట్టించును మామిడిపండుముక్కలను తేనె మొదలగువాటిలో చెడిపోకుండ నిలవయుంచిగాని మురబ్బాచేసిగాని తినిన మిగుల గురువుగ ఆలస్యముమీద అరుగునదిగ రుచిగనుండును. పుష్టి బలమునిచ్చును. వాతహారమైనది మామిడిపండును తేనెజేర్చి తినిన క్షయ ప్లీహ వాతశ్లేష్మములు హరించును, నేయిజేర్చితినిన వాతపిత్తములు హరించును. అగ్నిదీప్తి బలము కాంతి కలుగును. పాలతోజేర్చితినిన రుచిగ వాతపిత్త



హరముగ శీతవీర్యముగనుండును. బలము శుక్రము కాంతి కలుగును. మామిడిటెంకలోని జీడి ప్రత్యేకముగదినిన నోరుపొక్కును. నీటితోఅరగదీసి యాగంధమున పసుపుకలిపి రాచినయెడల నీటిలోను బురదలోను తిరుగుటవలన ఒరుచి పుండైనవ్రణములు మానును. లోపలకుతినిన వాంతి అతిసారము కడుపులోమంట తెల్లకుసుమ నశింపచేయును ఇది తీపి వగరు పులుపు రుచులు గలిగియుండును.

పుల్లమామిడిపండు లేక కాయను అమితముగదినిన అగ్నిమాంద్యము విషమజ్వరము రక్తవికారము బద్ధగుదము ఉదరవ్యాధి నేత్రములకుహాని మొదలగు రోగములుకలుగును. గాన వానినమితముగ దినరాదు. తీయమామిడిపండ్ల నమితముగదినుటచే పైజెప్పబడిన నన్నిరోగములు కలుగకున్నను దృష్టిమాంద్యము కడుపుబ్బరము ఆయాసము అజీర్ణము మొదలగునవి కలుగునుగాన విశేషముగ వీనినిగూడ తినరాదు జీలకఱ్ఱపొడినిగాని శుంఠికషాయమునుగాని సేవించిన అమిత భక్షణము వలన గలిగిన వికారములుశాంతించును.

మామిడిటెంకలనుండి తీసిన తైలము వగరు తీపి చేదు రుచులు రూక్షగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కఫవాతములు హరించును. సువాసనగలిగియుండును. ముఖరోగములజయించును.

శ్వాసకాసలు గ్రహణి అర్శస్సు వాతపిత్తరోగములు రక్తపిత్తము నేత్రరోగములు కలవారలకు మామిడికాయ అపథ్యకరము గాన వారు వర్జించవలెను.

మామెన:—సం. కాలానుసారీ. ఐంద్రి, మహాగోపీ, సుగంధిని అనిపేరు. మామెన బలమిచ్చును. చలువచేయును. కఫవాతములు దప్పి అరుచి రక్తపిత్తము కఫము హరించును.

మారేడుచెట్టు:—సం. బిల్వ. శ్రీఫల, గోహారీతకి, మాలూర, త్రిశిఖ, శైలూష అనియు, హిం. బేల్ అనియు పేరు. ఇదివృక్షజాతి. గురుపంచమూలములలోనొకటి. ఆకులు మూడుచిల్లులుగలిగి యుండును. దీనికాయలలోని గుంజును తీసివేసి నస్యము తిరుచూర్ణము విభూతి

మొదలగునవి పోసుకొందురు. మారేడుదళము శివప్రీతికరము. శాఖలందు ముండ్లుండును. పూవులు తెల్లగ పరిమళముగనుండును పండిన పండులోనిగుంజు యెఱ్ఱగ తియ్యగనుండును. పండులో గింజలు విశేషముగనుండును. గ్రీష్మఋతువునందు ఆకులురాలి క్రొత్తగ యిగురుపెట్టుటకారంభించును. దీనికఱ్ఱను చందనమునువలె గౌరవింతురు. హిందూస్థానమున సర్వత్ర బిల్వముదొరకును. బిల్వముయొక్క వేరుపైపట్ట ప్రధానముగ నౌషధోపయోగము.

బిల్వమూలము మధుర తిక్త కషాయరసములు లఘు రూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. రుచి దీపనము మలబద్ధము పిత్తము గురుత్వము పాచనము కలిగించును. వాతాతిసారము కఫము జ్వరము యెక్కిళ్ళు రక్తకాస విషము ఛర్ది శ్వాసకాసలు ఉబ్బసము కలరా మున్నగు అనేకరోగముల హరించును. మారేడుఆకు కఫవాతములు ఆమము శూల హరించును. మలబద్ధముచేయును. రుచిబుట్టించును. బిల్వపుష్పము అతిసారము దప్పి ఛర్ది శమింపజేయును. మారేడుకాయల పైపెచ్చుతీసి లోనికండను ముక్కలుగా తరిగి యెండించిన వరుగు కఫము శూల ఆమము వాతము గ్రహణి రోగములను ఖండించును. కాంజికమందు నానవేయబడిన బిల్వము అగ్నిదీప్తి రుచి కలిగించును. ఆమవాతమునుహరించును. మిక్కిలి పండిన మారేడుపండునకు గుణములు హీనమగును. గాన దోరగపండిన పండ్లనే ఔషధములందు పయోగించవలెను.

మారేడుఆకులను మెత్తగా నలియగొట్టి కండ్లపై వేసికట్టిన నేత్రరోగములు హరించును. మారేడుఆకును తొక్కి కషాయముగాచి అరిష్టసంధాన పరిభాషననుసరించి చేయబడిన బిల్వారిష్టము జ్వరాదిరోగములహరించును. ఆకులనుండి అర్కయంత్రమున దీయబడిన అర్కము గ్రహణి అతిసారము విషూచిక కాస జ్వరము మొదలగు అనేకవ్యాధుల జయించును. అనేకఔషధములకిది అనుపానముగను యోగప్రధాన



ముగను వాడబడును. బిల్వప్రధానమగు ఔషధ యోగములగొన్నిటి నుదహరింతుము,

బిల్వమూలము, పచ్చితులసివెన్ను, క్రానుగుగింజలోని పప్పు, గ్రంథితగరము. దేవదారుచక్క, త్రిఫలములు, త్రికటుకములు, పసుపు, మానుపసుపు వీనిని సమభాగములు గ్రహించి గొఱ్ఱెమూత్రముతో మూడుదినములు బాగుగ మర్దించి సెనగగింజంత మొదలు కుంకుడుగింజంతవరకు ప్రమాణముగల మాత్రలుచేసి లోపలకుతినుటకును లేపనముచేయుటకును నస్యమునకునుగూడ ఉపయోగించునది. దీనివలన విషూచి తేలు పాము మొదలగువిషములు వెఱ్ఱికుక్క విషము మున్నగునవి తప్పక శమించును. మళయాళమునందీయోగము రహస్యముగ గౌరవముగ నుంచబడినది. దీనికి బిల్వాదిమాత్ర అనిపేరు.

మారేడువేరుపట్ట 400 తులములు, తామరతూడు 200 తు॥ వీనిని మెత్తగా నలియగొట్టి 1656 తు॥ ల నీళ్ళలోవేసి 8 వ వంతు మిగులునట్లు కాచి వడియగట్టి అందు అల్లపురసము 64 తు॥ దానిమ్మపండ్లరసము 32 తు॥ పైడిప్రత్తి కాయలరసము 32 తు॥ వెలగపండుగుజ్జు 32 తు॥ పంచదార 200 తు వీనినేకముజేసి స్నిగ్ధముగుభాండమున పాకముజేయుచు త్రిజాతములు త్రికటుకములు ధనియాలు, ముస్తలు వాముము నల్లజీలకఱ్ఱ తెల్లజీలకఱ్ఱ సైంధవలవణము యష్టిమధుకము లోహభస్మము అను నీవస్తువులు ప్రత్యేకము 4 తు॥ లు గ్రహించి యాపాకమునవేసి కలియబెట్టి 8 తులములు ఆవునేయినికలిపి దించి చల్లారినపిదప 32 తులములు తేనెచేర్చి కలిపి ధాన్యరాశియందు 15 లేక నెల దినములుంచి తీసి బలానుసారముగ భుజించిన అజీర్ణము ఊర్ధ్వవాతము ఎక్కిళ్ళు దారుణమైనఛర్ది ఆధ్మానము హృదయశూల శ్వాసకాసలు అరుచి అపస్మారము పిత్తము వ్రణము రక్త వికారములు శ్లేష్మము మొదలగు అనేకరోగములను హరించును. అన్నహితము గలిగించును. ఇది అత్యద్భుతమగు యోగము.

మాలతి:—సం. మాలతి, సుమనా, జాతి, వాసంతియనియు హిం. మాలతీ అనియుపేరు. ఇదితీగ. పుష్పము ప్రధానమైనది. మాలతిఆకురసము కఫ పిత్తముల హరించును. మాలతీ పుష్పము కఫపిత్తములు ముఖరోగము వ్రణము కృమి కుష్ఠము హరించును. నేత్రములకు చలువచేయును.

మాల్కాంగుని:—చూ. జ్యోతిష్మతి.

మాక్షికము:—(హేమమాక్షికము) సం. స్వర్ణమాక్షిక (తారమాక్షికము, తారమాక్షిక అనియు, హిం, సోనామాఖీ రూపామాఖీ యనియుపేరు. తాపీ, కిరాత, చీనా, యవనదేశములందు కాంచనరసముగు సువర్ణమాక్షికమును విష్ణువు సృజించెను. యెండవేడిమికి మిగులతప్తమైవై శాఖమాసమందధి తరుచుకనబడును. అది బంగారు వర్ణము రజితవర్ణము గలిగి రెండువిధములై వరుసగ హేమమాక్షికము తారమాక్షికము అనుపేళ్ళ బరగును. అందు మొదటిది మధుర తిక్త ఆమ్ల కషాయరసములు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. ముదిమిని రోగములను విషమును తొలగించును. హేమమాక్షికము అయిదువన్నెల బంగారుచాయగలది. బంగారుతో సమానగుణములు గలది. రసమునకిది ప్రాణమువంటిది. వీర్యవృద్ధి, పుష్టి, బలము, కాంతికలుగజేయును. మేళనముకాని లోహముల నొకటితో నొకటి కలుపుటకును పనికివచ్చును. రసాయనములందు శ్రేష్ఠమైనది. భ్రమ మూర్ఛ హృల్లాసము శ్వాస కాసలు కఫము కుష్టు శోఫ నేత్రరోగములు అర్శస్సు మేహము పాండువు వస్తి దోషము ఉదరము క్షయ మున్నగు అనేకరోగముల శమింపచేయును. అశుద్ధమాక్షికమును సేవించిన అగ్నిమాంద్యము బలహీనత నేత్రవ్యాధులు కుష్ఠము మొదలగు రోగములుకలుగును. ఆముదము నిమ్మపండ్లరసము అనువానిలో నుడికించినను అరటిదుంపరసములో రెండుగడియ లుడికించినను శుద్ధమగును. పిదప దానితో గంధకముచేర్చి నిమ్మపండ్ల రసముతోనూరి మూసలోబెట్టి చీరజేసి 5 వరాహపుటములుపెట్టిన భస్మమగును. ఆభస్మమును లోహ



పాత్రలోనుంచి ఆముదము ఆవునేయి మాదీఫలరసముపోసి పక్వముచేసిన సిందూరించును. ఇట్టి మాక్షికసిందూరము లేక భస్మము రసమందు జారణచేయుటకును, రసాయనములందు కల్పుటకును ఉపయోగించును. గోమూత్రము జెముడుపాలు ఆముదము అనువానిలో మాక్షికము నొకదినము భావనచేసి మర్దించి గుటికలుచేసి మూసలోబెట్టియు భ్రికమునువలె కొలిమిలో నూదిన సత్వమువెడలును. ఇదియు హేమమాక్షికసత్వమనబడును. పాదరసమందు మాక్షికసత్త్వమునుచేర్చి రెండును కలసినపిదప గంధకముకలిపి అభ్రికద్రుతితో కల్వమునసూరి ముద్దజేసి లవణయంత్రమునందు 12 జాములువండి స్వాంగశీతలమునదీసి చూర్ణించి చిన్నమెత్తుచొ॥ ఔషధమును మిర్యాలు వాయువిడంగములు తేనె అనుపానముగ 7 దినములు సేవించిన అపమృత్యువు సకలరోగములు ముదిమి తొలగును. అమృతముకన్న నుత్తమమైనది. హేమమాక్షికముకన్న తారమాక్షికము గుణహీనము. మాక్షికముయొక్క భస్మ సత్త్వ సిందూర ద్రుతి శోధనాది ప్రక్రియలును వాని యుపయోగములును బహుళముగ మాసరత్నసముచ్చయమున జూడుడు.

మినుములు:—సం. మాష, ధాన్యవీర, వృషాంకుర, పిత్ర్య, పితృభోజన అనియు, హిం. ఉడద్ అనియుపేరు. సర్వత్ర వ్యాపకమై ప్రసిద్ధమైన ధాన్యము.

మధురరసము స్నిగ్ధగుణము ఉష్ణవీర్యము అమ్లవిపాకము గలది. మలమును హెచ్చించును. కఫము బలము శుక్రము కాంతి వాతము వీనిని వృద్ధిచేయును. సిక్కాకనణచును. శుక్రమునుజార్చును. ఉడుకు దగ్గు క్షయ కలవారలకు హితమైనది. తృప్తినిచ్చును. స్త్రీలకు స్తన్యమును పుట్టించును. విశేషముగ బలము చేయును రక్తపిత్తమును పుట్టించును. శ్వాస శ్రమ పరిణామశూల అర్దితవాతము అర్శస్సు నశింపచేయును. క్రొవ్వుపుట్టించును. మినపపప్పు పైపొట్టును తీసివేసి ఆవునేతితో వేయించి ఆవుపాలలో ఉడికించి పంచదారకలిపి ఉదయములందు త్రాగుచుండిన వీర్యపుష్టికలుగును. మినపపిండితో చేసిన భక్ష్యములు

బలకరమైనవి. పిత్తకఫముల జేయును. వేయించిన మినపపప్పును పిండి చేసి అందు బెల్లము నేయి కలిపి తినిన విరేచనముచేయును. గురుత్వముగనుండును. వాతమునుహరించును. కఫ శుక్రములపెంచును. మినపగారెలు రుచిగానుండును. బలకరమైనవి. ఆలస్యముగ జీర్ణమగును వాతముహరించును. మజ్జిగలో వేశిన గారెలు అనగా ఆవడలు తాపము మలబద్ధము కలుగజేయును. వాతము హరించును. పులికడుగులో వేసిన గారెలు వాతాదిదోషములను ప్రకోపింపజేయుటయేగాక కంటికి హానిజేయును. గురుత్వమైనవి. సౌవీరములో వేసిన గారెలు రుచిగా పిత్తకరముగా కఫవాతహరముగానుండును. ఇండలీ అనగా వాసెనమీద ఆరిరచే వండిన మినపకుడుము రూక్షగా మలబద్ధకారిగా వాతకఫ కారకముగానుండును. వీర్యవృద్ధి చేయును. అట్లు అనగా కొద్దిగా బియ్యపుపిండి కలిశిన మినపపిండిని ఇనుపపెనముపై వేసి కాల్చిన భక్ష్యములు రుచిగానుండును. మేహ వాతశరీరులకు మంచిది. చలువచేయును. విరేచనముగావించును. బలము వీర్యము పుష్టి కఫము గురుత్వము వీనిని కలుగజేయును.

మిరపకాయలు:—సం. రక్తమరిచ, కటువీర, ఉజ్వల, తీవ్రశక్తి, అజడ అనియు, హిం. లాల్ మరిచ అనియుపేరు. మిరపచెట్లు క్షుపములుగపెరుగును. దీనిపూవులు చిన్నవిగ తెల్లగనుండును. పచ్చిమిరపకాయలు ఆకుపచ్చగ పండినవి యెఱ్ఱగనుండును. ఇందులో పొట్టిమిరప, పొడుగుమిరప, దేశవాళీమిరప, సీమమిరప మొదలగు అనేకభేదములు కలవు.

కారము రుచి లఘు తీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. పచ్చిమిరపకాయలు అపథ్యమైనవి. పిత్తమును పెంచును. పండిన మిరపపండ్లనుండి అర్కయంత్రమునదీసిన యర్కము అగ్నిమాంద్యము శూల కడుపుబ్బరము కలరా మొదలగు వ్యాధుల జయించును. యెండినమిరపకాయల చూర్ణములు నరుకు గాయము యంత్రాది సంఘులలోబడి నలిగిపోయిన అవయములు మున్నగువానికిగట్టి నూనెతో తడిపి



నూనెలో ముంచిన గుడ్డను కట్టుకట్టినయెడల బాధతగ్గి గాయముత్వరగ మానును. పక్షవాతముగల భాగమున నూనెపూసి మిరపకాయల పొడిని అద్ది కట్టుకట్టిన అబాధహరించును. మిరపకాయలపొడి 40 తులములు, వెల్లుల్లి 40 తు॥ నల్లమందు ౩ తు॥ నువ్వులనూనె 80 తు॥ వీనిని ఒక యినుపపాత్రలో బోసి వేరొక యినుపపాత్ర బోర్లించి సంధిబంధము చేసి పొయ్యిక్రింద పాతిపెట్టి 15 దినములవరకు పైని వంట మొదలైనవి చేసికొనుచుండవలెను. ఇట్లు 15 దినములుంచి తీసి చక్కగా పిసికి తైలమును వడియగట్టి యాతైలమును మర్దనచేసిన పక్షవాతము ఆమవాతపునొప్పులు వాతపునొప్పులు తప్పక కుదురును. ఇది అనుభూతయోగము. మిరపగింజలు వాముము మిరియాలు మూకుడులో వేసిమాడ్చి మాడినతరువాత నీళ్ళుపోసి దింపవలెను. 5 నిమిషములుఆగి వడియపోసి యానీటినిద్రాగించిన కలరావ్యాధి నెమ్మదించును. యితర అజీర్ణవిరేచనములును తగ్గును. మిరపకాయలు శరీరమునకుతగిలిన మంటపుట్టును. అజీర్ణము బలాసకము విషూచి వ్రణము తంద్రమోహము ప్రలాపము స్వరభేదము అరోచకము హరింపచేయును.

మిర్యాలు:—(నల్లవి) సం. మరిచ, శ్యామ, వేణుజ, యవనప్రియ, ధర్మపత్తన అనియు, (తెల్లవి) సితమరిచ, శీతోత్థ, సితవల్లీజ, చంద్రక అనియు, హిం. వరుసగ కాలీమరిచ, సఫేద్ మరిచ అనియు పేరు. తెల్లమిర్యాలు నల్లమిర్యాలు అని మిరియాలు రెండు విధములు. మిరియపుతీగలు మలయాళదేశమునందు తిరువాన్కూరు ప్రాంతములందు తోటలువేసి పెంచబడును. తీగను ముక్కలుగానరికి పాతిపెట్టుదురు. ఇవి మూడుసంవత్సరములకు పెరిగి పెద్దవియై పంటకువచ్చును. మిరియపుతీగల వెన్నునందు మిరియములేర్పడును. పండుమిరియముయెఱ్ఱగనుండి యెండించినపిదప నల్లబడును, మిర్యాలను కొన్నిదేశములందుకూరలు మొదలగు ఆహారపదార్థములందు కారము నిమిత్తము వాడుదురు. అనగా ఆంధ్రదేశమున వాడుకచేయు మిరపకాయలకుబదులు మిర్యాలను వాడుదురు. మిర్యాల నానబెట్టి పైపొట్టు తీసివేయబడిననవి తెల్ల

మిర్యాలనియు పొట్టుతీయనివి నల్లమిర్యాలని చెప్పుదురు. గాని పుష్టిక యందే తెల్లనిమిర్యాలుండునని కొందరందురు. తెల్లమిర్యాలు తరుచు అగపడవు. తెల్లమిరియములను పేర్కొన్నచోట కొందరు ఆస్థానమున మునగగింజలనుపయోగింతురు.

మిరియము (యెండినది) కారము రుచి లఘు రూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కఫవాతముల తగ్గించి పిత్తమును పెంచును. శ్వాస శూల క్రిమి అగ్నిమాంద్యము అర్శస్సు కడుపుబ్బరము ఛర్ది శ్వాసకాసలు హృద్రోగము ప్రమేహము నంజు కుష్టము దురద చీడ విషము స్వరభేదము గొంతునొప్పి జలుబు అతిసారము మొదలగు అనేకరోగముల హరించును. అనేక రసౌషధములందును కషాయ ఘృత తైలాది యోగములందును బహుళముగ మిరియములుపయోగపడును. మిరియములను నీళ్ళతో నూరి ఉడికించి నుదురునకు కణతలకు పట్టువేసి కాచినయెడల పడిసెపు,భారము తలనొప్పి వేగముగ తగ్గును. వెన్నునకుపట్టువేసిన చలిజ్వరముకట్టును. మరియు నొప్పులుగల యేచోటవేసినను నొప్పితీయును. సూదికొనగ్రుచ్చి మిరియమును పట్టుకొని ఆముదపుదీపమునగాల్చి యాపొగను ముక్కుతో బీల్చి నోటితో విడచినను మ్రింగినను జలుబువలన లేక జలదోషము వలన గలిగిన గొంతునొప్పి దగ్గు తలభారము ముక్కులుదిబ్బట వేయుట తగ్గును. మరియములను నిమ్మపండ్లరసములో వేసి కొద్దిగ సైంధవలవణముచేర్చి భావనచేసి యామిరియములను భోజనమైనవెంటనే 10 లేక 15 చొ॥ తినుచున్న చిరకాలమునుండియున్న అజీర్ణము తేనుపులు ఆమవిరేచనములు నశించును. రుచిబుట్టించును. అగ్నిదీప్తికలుగును. మిరియపుచూర్ణము ఒకఅణాయెత్తుచొ॥ అరటిపండులో పెట్టి నమలి మ్రింగుచున్నయెడల కొన్ని మొండిదగ్గులుశమించును. మిరియమునుండి తీసిన అర్కము సకల అజీర్ణములు శూలలు కలరామొదలగు వానిని హరింపచేయును. మిరియములు బెల్లము కలిపి నమిలి బుగ్గనుంచుకొని రసమునుమ్రింగుచున్నయెడల గొంతుకడట్టి యిటునటు వెడలక యుండు శ్లేష్మమును క్రిందికి



దింపివేయును. దగ్గునాపును. నోటియందు రుచిబుట్టించును. మిర్యాలను దోరగవేయించి చూర్ణించి తేనెకలిపి నాకిన గొంతులోనినస దగ్గు కట్టును. 9 మిరియపు గింజలను అరతులం నేతితో వేయించి నేయిసహా మిర్యాలను కొద్దిగసైంధవముచేర్చి భుజింపబోవునపుడు ప్రథమకబళములోకల్పి తినిన రక్తగ్రహణి ఆమవిరేచనములు తగ్గును. రాత్రిపూట 9, లేక 11 మిర్యాలను చిన్నమెత్తు షడ్గుణసిందూరము లేక రససింధూరమును అప్రుమజ్జిగలోనానబెట్టి ఉదయమునతీసి మజ్జిగపారబోసి సిందూరమును మిర్యాలను నాలుగైదు గుంటగలగరాకులను గాని నాలుగైదు తులసియాకులనుగాని చేర్చిమెత్తగానూరి గుళికచేసి మింగినయెడల జీర్ణజ్వరము కామల పాండువు శోఫ మేహజ్వరము ఉడుకు తగ్గును. అన్నహితము కలుగును. రక్తము శుభ్రపడును. క్రొత్తరక్తము పట్టును. ఇట్లు 9 దినములకు తగ్గకుండ 27 దినములకు హెచ్చకుండ సేవించవలెను. పైవిధముగ ప్రతిదినము మాత్రతయారుచేసికొనుచుండవలెను. తెల్లమిర్యాలు 20 తులములు పాలు 5 శేర్లు (శేరుఅనగ 80 తులములు) పంచదార 3 శేర్లునేయి శేరు ఖర్జూరము పిస్తా బాదం జాపత్రి జాజికాయ ఇవిప్రత్యేకము 4 తులములు శొంఠి పెన్నేరు జటామాంసి నాగకేసరాలు కుంకుమపువ్వు లోహభస్మములివి ప్రత్యేకము 2 తు॥ వీనిని సంప్రదాయానుసారముగ లేహ్యపాకము చేసి ప్రతిదినము ప్రాతస్సాయంకాలములయందు బలానుసారముగ సేవించుచున్న దురద కురుపులు చీడ మొదలగు చర్మరోగములు మానును. రక్తము పరిశుద్ధమగును. జీర్ణశక్తి సంభోగపటుత్వము కలుగును సకల కఫవికారములు శమించును. ఇది యూనానీ సంప్రదాయమున "మిర్చ్‌పాక్" అని పిలువబడును. మిర్యాలను నీళ్ళతో నూరి కుంకుడుకాయంత ఉండమ్రింగిన రక్తప్రదరము తగ్గును. మిరియము హారతికర్పూరము రసకర్పూరము కలిపి నూరి వెన్నలోకలిపి రాచిన బిడ్డల గజ్జి చిడుము దురద తగ్గును.

మీగడ:—పెరుగుమీది మీగడ బడలికనుపోగొట్టును. బలమునిచ్చును. బరువుగజీర్ణమగును. అన్నహితము కలుగజేయును. మనోహరమైనది. స్రోతస్సులను శోధించును. తృప్తికరమైనది. కఫము దప్పి వాతము మలబద్ధము హరించును. మీగడ పెరుగు వగరుగ లఘువుగ నుండును. వాతము జెంచును. మలబద్ధకరము. అగ్నిదీప్తి రుచి విష్టంభము గలుగజేయును. గ్రహణీరోగముబోగొట్టును.

ముంగిమాంసము:—సం. నకుల, సర్పవైరి అందురు. ఇదియొక్క చిన్నజంతువు. సర్పమునుబట్టి నమిలి తినును. ముంగియున్నచోట సాధారణముగ పాములుండవందురు. దీనిమాంసము మధురరసము స్నిగ్ధగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. కఫవాతములు శ్వాసకాసలు కృశత్వముహరించును. బలముకలుగజేయును.

ముంజదర్భ:—సం. భద్రముంజ, ముంజాత, స్థూలదర్భ, సుమేఖలా, మౌంజీ అనియు, హిం. రామసర్, మూంజ్ అనియు పేరు. జలసమీపములందు బుట్టు దర్భ భేదము పూవులు కాయలు తెల్లగ పొడవుగనుండును. శుభకార్యములందు యీదర్భ నుపయోగింతురు. ఇది వేరు ప్రధానముగగలది. మొలత్రాడుగ నుపయోగింతురు.

ముంజదర్భ వేరు మధురరసము లఘుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. దప్పి తాపము విసర్పి రక్త మూత్రదోషములు వస్తి నేత్రవ్యాధులు హరించును. దోషత్రయమును జయించును. వీర్యవృద్ధికరము గ్రహబాధలందును వ్రతదీక్షలందునుఉపయోగపడును.

ముఖాలేపము:—అనగా ముఖమునందాయా యౌషధుల పిష్టము లేక గంధమును లేపముచేయుట. ఇదిదోషఘ్నము, విషఘ్నము వర్ణకరము అని మూడువిధములు. దోషఘ్నముఖాలేపము ఒక అంగుళము దళసరిగ విషఘ్నముఖాలేపము ముక్కాలు అంగుళము దళసరిగ వర్ణకరముఖాలేపము అరంగుళము దళసరిగ నుండవలెను. ముఖాలేపము నభ్యసించువారలకు దృష్టిబలము హెచ్చును. ముఖము వాడిపోక మృదువుగ మనోహరముగనుండును. ముఖాలేపముచేసికొన్నవా



రు పగలునిద్రించుట అతిసంభాషణము అగ్ని యెండ శోకము క్రోధము వీనినివిడువవలెను. పగటినిద్ర మొదలగువానివలన దురద శోఫ పీనస దృష్టిమాంద్యము మొదలగు నుపద్రవములు సంభవించును. పీనస అజీర్ణము హనుగ్రహము అరోచకము అనురోగములు కలవారును నస్యకర్మచేసికొన్నవారును, రాత్రి జాగరణముచేసినవారును, ముఖాలేపముచేసికొనరాదు. విధివిహితముగ సేవింపబడిన ముఖాలేపము. అకాలపలితము (తలనెరయుట) వ్యంగము వళులు తిమిరము నీలికమున్నగురోగములను హరింప చేయును. రేగుగుజ్జు అడ్డసరపువేరు తెల్లలొద్దుగు తెల్లావాలు వీనిచే తయారుచేసినది కోలమజ్జాదిలేపము అనియు ములకవేళ్ళు నల్లనువ్వులు పసుపు మానుపసుపు లవంగపట్ట పైపొట్టు తీసిన యవలు వీనిచే తయారు చేయబడినది సింహీముఖాదిలేపము అనియు, దర్భవేరు కర్పూరము వట్టివేరు దిరిసెనచక్క సదాపగింజలు వీనిచే తయారుచేయబడినది దర్భమూలాది లేపమనియు, తెల్లకలువ, నల్లకలువ చెంగల్వ గరిక యష్టిమధుకము వీనిచే తయారు అయినది కుముదాదిలేపము అనియు శ్రీగంధము నల్లనువ్వులు వట్టివేరు జటామాంసి గ్రంథితగరము పుష్కరమూలము వీనిచే తయారు చేయబడినది కాలేయకాదిలేపము అనియు, తాళిసపత్రి భద్రముస్తలు ప్రపౌండరీకము యష్టిమధుకము వేగిస అగరు వీనిచే తయారైనది తాళీసాదిలేపము అని చెప్పబడును. ఈఆరువిధముల ముఖాలేపములు హేమంతాది షడృతువులందు యథాక్రమముగ హితకరములు అనగా హేమంతమున కోలమజ్జాదిలేపము శిశిరర్తువున సింహీమూలాదిలేపము, వసంతర్తువున దర్భమూలాదిలేపము, గ్రీష్మర్తువున కుముదాదిలేపము, వర్షర్తువున కాలేయకాదిలేపము, శరదృతువున తాళీసాదిలేపము మంచిది.

ముచుకుందము:—సం. ముచుకుంద, ఛత్రవృక్ష, ప్రతివిష్ణుక అనియు, హిం. ముచుకుంద అనియుపేరు. ఇది పెద్దవృక్షము. పుష్పప్రధానమైనది. ఆకులు పూవులు పెద్దవి. పూవులతిపరిమళయుక్తములు. పండ్లు పొడవుగనుండును.

ముచుకుందపుష్పము కారము చేదు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకము గలది. కంఠదోషము కఫ కాస చర్మదోషము శోఫ వ్రణము తామర తలనొప్పి పిత్తరక్తము విషముహరించును

ముత్యపుచిప్పలు:—సం. శుక్తి, ముక్తాప్రసు, ముక్తాస్ఫోటల అనియు, హిం. మోతీకీసీల్ అనియుపేరు. జలజంతువులలో నొకవిధమగుజంతువు. స్వాతికార్తిలోని వర్షబిందువులు శుక్తులలోబడినంత నవి మూసికొనిపోయి కొంతకాలమున కాబిందువులు ఘనీభవించి ముత్తెములగుననియు పిదప అవి విడిపోవుననియు చెప్పుదురు. ఆచిప్పలకేముత్యపుచిప్పలనిపేరు. వీనిని ఆరనాళము గోమూత్రములతో భావనచేసిన శుద్ధములగును. దీనిని కాల్చిన సున్నమగును. దీనిని శుక్తిభస్మమందురు. ప్రత్యేకముగదినిన నోరుపొక్కును. గాన తమలపాకు మొదలగు వానితోచేర్చి సేవింపనగును. ఇది మధుర కటురసములు స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. శ్వాస హృద్రోగము శూల అగ్నిమాంద్యము స్నాయురోగము జ్వరము వ్రణము పిత్తరక్తము మున్నగు వ్యాధులహరించును. మంచిముత్యముల భస్మమునకుండు గుణములన్నియు దీనియందుగలవు గాని దానికన్న నిది మిగుల తక్కువవీర్యము గలది. ముక్తాభస్మముయొక్క అభావమందు శుక్తిభస్మము నుపయోగించవచ్చును.

ముత్యము:—సం. ముక్తా, మౌక్తికం అనియు, హిం. మోతీ అనియుపేరు. హృదయమునందు తెల్లగనుండి తేలికగ నునుపుగ నిర్మలముగ గుండ్రగ నుండి గంట్లులేక స్ఫుటమైన ముత్యము శ్రేష్ఠము. ఇట్టిముత్యమును శుద్ధిచేసి భస్మముగావించిన నది మధురరసము లఘుగుణము శీతవీర్యము మధురవిపాకము గలది. కాంతి దృష్టి నైర్మల్యము జఠరదీప్తి విషదోషము హరించును. విరేచనము చేయును, మరియు కఫపిత్తములవలనగల్గినక్షయశ్వాసకాసలు అగ్నిమాంద్యము తాపము హరించి బలము శుక్రము ఆయువు వీనిని పెంపొందించును. ముత్యములను ఆమ్లవర్గము కాంజికము గోమూత్రము ఆవుపాలు అనువాసిలో ప్రత్యేకముగ భావనచేసిన శుద్ధమగును. లేక తెల్లఉప్పిపండ్లరసమందైనను చింతపండు రసమునందైనను మూడుదినములు భావనచేసిన శుద్ధమగును. పిదప తెల్లములక పండ్లరసమున భావనచేసి శరావసంపుటమందుంచి భూపుటముపెట్టిన భస్మమగును. ముత్యములపోగులు చెవులందు ధరించిన మనోనిర్మలత్వము నేత్రములకు హితము, వాతపిత్తశాంతి గలుగజేయును. ముత్యముల హారముమెడయందు ధరించిన నేత్రములకు హితకరముగనుండును. వాతము, వాతరక్తము, విషము దప్పి, తాపము, తాపజ్వరము, మోహము, శోకము, బడలిక, నైత్యము హరించును. సర్వేంద్రియతృప్తినిచ్చును. బుద్ధివృద్ధిచేయును. మంగళకరమైనది. సౌభాగ్యము కాంతిగలుగును. ముత్యము వజ్రము నీలము కలిన ఆభరణమును ధరించిన ఆయుస్సంపత్తులు దృష్టి నైర్మల్యము కలుగును. వాతపిత్తములను శ్విత్రమును హరించును.

ముద్రబెండ:—దీని నితుత్తురుబెండఅందురు. బలాచతుష్టములో నొకటి. చూ. బలాచతుష్టయము.

మునగచెట్టు:—సం. శోభాంజన. శిగ్రు, తీక్ష్ణగంధ, అక్షీబ, అనియు హిం. సౌజినా అనియుపేరు. ఇదిసాధారణమైన వృక్షము పూవులయొక్క తెలుపు యెరుపు భేదముచే రెండువిధములు తెల్లమునగకు సంస్కృతమున శ్వేతశిగ్రు, ముఖభంగ శ్వేతమరిచ, సుమూలమధుశిగ్రుక అనియు ఎర్రమునగకు రక్తశిగ్రు సురంగీ, గర్భపాతక, కృష్ణబీజ అనియుపేరు. ఇవిగాక నల్లపూవుల మునగయుకలదు. ఇది అరుదుగ దొరకును. రసవాదమునందుపయోగపడును.

మునగ సామాన్యముగ కారము తీపి రుచులు లఘురూక్ష తీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. విదాహము అగ్నిదీప్తి మలబద్ధము శుక్రవృద్ధి నేత్రహితము కలుగజేయును. పిత్తరక్తమును పెంచును. వాతము విద్రధి వాపు, క్రిమి మేదస్సు అపచి విషము ప్లీహ గుల్మము గండమాల వ్రణము శూల మున్నగురోగములు హరించును. తెల్లమునగ శోఫ వాతము ఒడలునొప్పులు ముఖజాడ్యము హ

రించును. పిత్తరక్తమును పుట్టించును. దీపనము గలిగించును. ఎఱ్ఱ మునగ మిగులవీర్యము కలది. రసాయనమైనది. శోధ వాతపిత్తము ఆధ్మానము కఫము హరించును. సరగుణముకలది.

మునగఆకుకూర మధురరసము స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. మలమును గట్టిపరచును. అగ్నిదీప్తికరము కఫవాతములహరించును. మిగుల కాకచేయును. కృమి విద్రధి ప్లీహ వ్రణము హరించును. రక్తపిత్తమును పుట్టించును. పుష్టి శుక్రము రుచి మదము గలిగించును. మునగపూవు కారము రుచి తీక్షణగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. స్నాయురోగము శోధ కఫవాతములు విద్రధి ప్లీహ గుల్మము హరించును. కృమిని పుట్టించును. మునగపూవులరసమును చురకాయిచ్చిన సవీరపాషాణము కట్టును. మునగపూవులరసముతో యూనానీ సంప్రదాయమున మురబ్బాలను తయారుచేసి వీర్యవృద్ధికరఔషధముగ వాడుదురు. మునగకాయ మధురకషాయరసములు గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. కఫపిత్తములు శూల కుష్టము క్షయ శ్వాస గుల్మము హరించును. అగ్నిదీప్తినిచ్చును. మునగగింజలు తీక్షణగుణము ఉష్ణవీర్యము గలవి. నేత్రరోగములు విషము కఫవాతములుహరించును. గింజలచూర్ణమును నస్యముచేసిన శిరోరోగములు హరించును. నేత్రవ్యాధుల కుపయోగించు అనేకఔషధములలో మునగవిత్తులు ప్రధానముగ చేరియుండును. వీనినే తెల్లమిర్యాలని వాడుదురు. లేతదిగనుండు మునగచిగురును నూరి కుంకుడుకాయంత యుండను తినుచున్న మేదస్సు కృమి కఫపిత్తములు హరించును. వేడిచేయును. మునగచెట్టు జిగురు లేక బంక ఆవుపాలలోకలిపి కణతలకుపట్టువేసి తమలపాకు అంటించిన దారుణమగు వాతపు తలనొప్పి నయమగును. మునగజిగురు రక్తపాషాణము కలిపినూరి పట్టీవేసిన సవాయిబిళ్ళలు సెగగడ్డలు హరించును. మునగవిత్తులనుండి తైలముతీయుదురు. ఇది కారము రుచి పిచ్ఛిలగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కఫవాతములు కృమి హరించును. పైకిపూసిన దు



రద చర్మరోగములు వాతపునొప్పులు ఆమవాతపునొప్పులు కీళ్ళవాపు వ్రణములు నశించును. మునగవేరు కారము రుచి లఘు రూక్ష గుణములు ఉష్ణవీర్యము కటువిపాకము గలది. కృమి శోథ ఉదరవ్యాధి సన్నిపాతజ్వరము వాతము పక్షవాతము ఆహ్నికజ్వరము అభిఘాతజ్వరము కఫము జలుబు హరించును. దీపన పాచనములు గలిగించును. వేరుతో ఆవాలనుకలిపి నూరి కొంచెముపసుపుకలిపి పట్టువేసిన వాతపునొప్పులు హరించును. గుండెలవద్ద పట్టువేసిన కఫము తగ్గును. శరీరముపైన చాలసేపుంచిన పొక్కును. గనుక మంటపుట్టినంతనే తీసివేసి కొబ్బరినూనెరాయవలెను.

ముదుగుదామర:—దీనికి నిద్రగన్నిక, అత్తపత్తిచెట్టు అనిపేరు. చూ. నిద్రగన్నిక.

ముయ్యాకుపొన్న:—సం. శాలిపర్ణి, త్రిపర్ణి, సౌమ్యా. విదారిగంధ అనియు, హిం. సరివన్ అనియుపేరు. ఇది క్షుపము. ఒకతొడిమకు మూడుఆకులు వేర్వేరుగనుండును. చిన్నచిన్న గింజలుండును. ఇది పర్ణినీచతుష్టయములోనొకటి. ఇది చేదు రుచి గురుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. విషమజ్వరము అర్శస్సు శోధ తాపజ్వరము శ్వాస విషము కృమి త్రిదోషశోషలు ఛర్ది క్షుత క్షయము కాస అతిసారము మేహము హరించును. శుక్రము బలము కాంతి కలుగజేయును.

మురదారుశృంగి:—సం. మృద్దారుశృంగం అందురు. ఇది సాధారణరసములలో చేరినది. ఘూర్జర దేశమునందును అర్బుదప్రాంతములందును పుట్టు ఖనిజము. పచ్చని రేకులుగలిగి బరువుగ నుండును. సీససత్వముగలది. దీనిని శుద్ధిచేసి వాడవలెను. శ్లేష్మరోగములను నపుంసకత్వమును హరించును. రసబంధమున కత్యావశ్యకమైనది. వెండ్రుకలకు నలుపెక్కించును. మృద్దారుశృంగిని అల్లపురసము మాదీఫలరసము అనువానిలో మూడుదినములు భావనచేసిన శుద్ధమగును. సీసము మాదీఫలరసము అనువానిలో మూడుదినములు భావనచేసిన శు

ద్ధమగును. సీసము పాదరసము మున్నగువానిం జేర్చి మృద్దారుశృంగిని వండుదురు. ఖనిజమంత తీవ్రముగ నిదిపనిచేయదు. మృద్దారుశృంగిని తీగజిల్లేడురసముతో నూరి పుటముబెట్టిన నల్లగ భస్మమగును. ఇదిసెగ సవాయి కుష్ఠము మొదలగు సకల చర్మరోగములందును అమోఘము గ పనిచేయును. మృద్దారుశృంగి తెల్లగ కారము గలుగునట్లుగ భస్మముచేసిన వాదవిద్యయందుపయోగించునని కొందరుసిద్ధులు చెప్పుదురు.

మురః:—సం. మురా, గంధిళీ, తాళపర్ణీ, దైత్య, గంధకుటీ అనియు, హిం. మురామూంసీ అనియుపేరు. ఇదియొక గంధిద్రవ్యము. చేదు వగరు తీపి రుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. జ్వరము వాతపిత్తములు రక్తరోగము విషము తాపము భ్రమ మూర్ఛ విసర్పి కార్శ్యము క్షయ నరుకు వ్రణము అనువ్యాధుల హరించును.

మురుదొండ:—చూ. ఆకాశగరుడి.

ములక:—సం. బృహతి, మహతి, సింహీ, కులీ. ఆక్రాంత క్షుద్రవార్తాకీ అనియు. హిం. కటాయీ, వరహంటా అనియుపేరు. దీనిని సాధారణముగ నేలములక పెద్దములక అందురు. వంగచెట్టువలె నుండును. చిన్నక్షుపము. ఇందు చిన్నములకయని యొకజాతి కలదు. దీనిని వాకుడుఅందురు. వాకుడునకు సంస్కృతమున కంటకారీ, కాసఘ్ని, స్పృహీ, వ్యాఘ్రీ, ధావనికఅనియు, హిం. కటేరీఅనియుపేరు. దీనిఆకులు కోలగ పొడవుగ చెట్టుఅంతట ముండ్లుకలదిగనుండును, రెండుచెట్లలోను తెలుపు ఊదారంగుల పూవులభేదముచే రెండు రెండు జాతులుకలవు. తెల్లపూవులవిమంచివి. మిగుల గుణకారులు పెద్దములక మూలసారముకలది. దీనివేరు కారము చేదు రుచులు లఘురూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. జ్వరము వాతము శ్వాసకాసలు అరోచకము ఛర్ది కృమి ముఖవైరస్యము ఓకిరింత ,దురదశూల ఆమదోషము త్రిదోషములు హరించును. లేతములకకాయను పైగుణములుండును. పండినది వాతకఫములబెంచును. తెల్లములక



వేరును అరగదీసి కండ్లయందంజనముచేసిన నేత్రరోగముల హరించును. కషాయములేక రసము స్త్రీలకు గర్భశుద్ధిచేయును. కఫవాతములహరించును. వేరుచూర్ణముతో రసభస్మమును చేర్చితినిన నోరుపట్టకయుండును. వాకుడువేరు కటుతిక్తరసములు లఘురూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. దీపన పాచనములు గలిగించును. శ్వాసకాసలు అరుచి కఫవాతము ఉబ్బు క్షయ మూత్రకృచ్ఛ్ర ఉబ్బసము పీనస జలుబు పార్శ్వపీడ హృద్రోగము కృమి ఆమదోషము తాపము హరించును. వాకుడుకాయ కారము రుచి లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. త్రిదోషములు మలబద్ధము శ్వాసకాసలు క్షయ గుల్మము ప్లీహ అర్శస్సు ఉదరము వస్తి శూల హరించును, తెల్లవాకుడువేరు స్త్రీల గర్భమునునిలుపును. రసమునుబంధించును. రుచిబుట్టించును. కఫవాతములు శోష హరించును. వేరు తామ్రభస్మమును చేయుటకుపయోగించును. ఈభస్మము తెల్లగనుండును. మరియు తెల్లవాకుడు వాదజ్ఞులకు పరమమిత్రము. పెద్దములక చిన్నములకఅనునివి అనేక కాసహరయోగములలో ప్రధానముగ చేర్చబడును. వాకుడువేరు కషాయమున పిప్పలిచూర్ణము జేర్చి త్రాగిన సర్వకాసలు నశించును. వాకుడు (సమూలము) ఒకతుల కరకకాయలు నూరు వీనిని ఒకద్రోణ ప్రమాణోదకమునవేసి 4 వ వంతు మిగులునట్లుకాచి వడియగట్టి యాక్వాథమున 100 పలములు బెల్లము చేర్చి పాకము పట్టి చల్లారినవెనుక త్రికటుకములు ప్రత్యేకము రెండుపలములు తేనె ఆరుపలములు చాతుర్జాతకములు ప్రత్యేకము పలము చూర్ణించి కలిపి బలానుసారముగ సేవించుచుండిన ద్విత్రిదోషజన్య కాసలు పీనస క్షతక్షయము శ్వాస ఉరఃక్షతము 11 విధములగు క్షయలు హరించును.

ములుగోరింట:—(తెల్లపూవులది) సం. సైరేయక, శ్వేతపుష్ప కటసారిక, సహచర అనియు, (పచ్చపూలది) కింకిరాత కురంట, కనక, పీతపుష్పక, పీతామ్లాన అనియు, (ఎర్రపూలది) రక్తామ్లాన, రక్తపుష్ప, శోణితఝింటిక అనియు పేరు. అనగా ఇది తెలుపు ప

సుపు నలుపు యెఱుపు వన్నెల పూలభేదముచే నాల్గువిధములు. నల్ల పూవులుపూచు ములుగోరింటకు ఆర్తగళ అనిపేరు. ములుగోరింటకు హిందీయందు కటసరైయా, పియావాసా అనియుపేరు. ఇదిక్షుపము వనములందును ఉద్యానములందును పెరుగును. ఈచెట్లకు తెల్లనిముండ్లుండును. ఆకులు కొంచెముకోలగ గుండ్రగనుండును. పూవులు అంగుళము పొడవుగనుండును. ఈచెట్లజాతులలో పూవుల రంగులభేదము తప్ప తక్కిన ఆకారమునందేమియు భేదముండదు. తెల్లపూవులది శ్రేష్ఠము. కారము చేదు తీపి రుచులు స్నిగ్ధగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కుష్ఠు వాతరక్తము కఫము విషము దురద దంతరోగములు వలీపలితములు హరించును. పచ్చపూల ములుగోరింట చేదు వగరు రుచులుగలది. అగ్నిదీప్తినిచ్చును. వాతకఫములు దురద శోధ రక్తవికారములు చర్మరోగము వీనినిహరింపచేయును.

నల్లపూవుల ములుగోరింట కారము చేదు రుచులుగలది. వాతకఫములు దురద శూల కుష్ఠు వ్రణము మొదలగు చర్మరోగములుహరించును. విశేషముగ నిది దంతరోగములందు పనిచేయును. యెఱ్ఱపూలది చేదు కారము రుచులుగలది. శోధ జ్వరము వాతవ్యాధులు కఫము రక్తవికారములు పిత్తము ఆధ్మానము శూల శ్వాసకాసలుహరించును. తెల్లములుగోరింట వేరు రసముతో 101 సార్లు శుద్ధరజతపు రేకునకు చురకాలిచ్చి వేరుముద్దలోబెట్టి శరావసంపుటమందుంచి గాఢపుటమువేసిన వెండి స్వచ్ఛముగ భస్మమగును. ఇది శుక్లనష్టము కాస మొదలగువానియందు విశేషఫలదాయకము. ఎఱ్ఱములుగోరింట వాదవిద్యయందుపయుక్తము, రసరంజనాదుల కుపకరించును. ఏములుగోరింట వేరునైనను లేక సమూలమునైనను కాల్చి మసిచేసి యామసిని తేనె అల్లపురసములందు కలిపి యిచ్చిన దగ్గులుతగ్గును. ఆకునుమెత్తగాతొక్కి కొద్దిగ వెచ్చజేసి కాపడము పెట్టిన తలనొప్పి పలుగురుపునొప్పి కీళ్ళనొప్పులుతగ్గును. ఆకుస్వరసమునందు చనుబాలు కలిపి



బిడ్డలకుపోసిన పాలడుబ్బసము తగ్గును. దీనిఆకు కూరవండుకొని తినిన కాసరోగులకు హితకరముగనుండును.

ములుదోస:—సం. త్రపుష, కంటకిఫల, సుధావాస, సుశీతల అనియు, హిం. ఖీరా, బాలమఖీరా అనియుపేరు. ఇదితీగ దీని కాయలు కోలగను పూవులు పసుపుపచ్చగనుఉండును. చెట్టునకుముండ్లుండును. యీముండ్లు వాడిగనుండవు. ములుదోసతీగ మధురరసము స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకము గలది. దప్పి తాపము ఆయాసము పిత్తము రక్తపిత్తము అగ్నిమాంద్యము జ్వరము మూత్రకృఛ్రి పాండువు హరించును.

దోరకాయకును పైగుణములుండును. పండినపండు మధురరసముగ కొంచెముపుల్లగ ఉష్ణవీర్యము కలదిగనుండును. పిత్తమును పెంచును. కఫవాతముల హరించును. భ్రమ పిత్తము విదాహము ఛర్ది మూత్రకృఛ్రి రక్తపిత్తము దప్పి తాపము హరించును. మూత్రమును అధికపరచును. హెచ్చుగదినిన జలుబుచేయును. దగ్గుతెచ్చును. గొంతునొప్పిపుట్టించును. ములుదోసవిత్తులు రూక్షగుణము కలవి. పిత్తరక్తము మూత్రకృఛ్రి హరించును. మూత్రమునధికపరచును. సెగరోగముకలవారలకుండు మూత్రద్వారపుమంటను వెంటనేనివారణచేయును. బొట్లుబొట్లుగా మూత్రమునువిడుచుచు బాధపడువారికి యీవిత్తులచూర్ణమును తెల్లజొన్నలకడుగులో కలిపి 10 చుక్కల ఉత్తరేణుఆకు రసమునుపిండి త్రాగించినవెంటనే మూత్రమును జారీచేయును. మంట తగ్గించును.

ములుమోదుగ:—సం. రోహీతక, రోహిత, కుశాల్మలి, సద్రాప్రసూన, కూటశాల్మలి అనియు, హిం. రోహేడా అనియుపేరు. వనములందు విశేషముగపెరుగును. దీనిపూవులు దానిమ్మపూవులవలెనుండును. పూవుల తెలుపు యెఱుపు భేదముచేత ఇది రెండువిధములు. తెల్లములుమోదుగకు సక్తాహ్వా, ఘోరయోగ్యా, సర్వజనవల్లభయని సంస్కృతనామములు. యెఱ్ఱములు మోదుగకు కూటశాల్మ

లి యనిపేరు. రెండువిధముల ములుమోదుగలు కారము వగరు రుచులు స్నిగ్ధ సరగుణములు శీతవీర్యము కటువిపాకముగలవి. ములుమోదుగు విశేషముగ గుల్మము ఉదరము యకృత్ ప్లీహవ్యాధులనుజయించును. గనుకనే దీనికి ప్లీహశత్రుయనియు పేరుకలిగెను. కృమి వ్రణము రక్తవికారము నేత్రరోగములు కర్ణరోగములు వాతము మలబద్ధము మేహరోగము శూల అనాహము భూతబాధ నివర్తింపచేయును. కూటశాల్మలి అనగా ఎఱ్ఱములు మోదుగకు ముండ్లుండవు. చూ. బూరుగుచెట్టు.

ములువుచ్చింత:—దీనినే ఉస్తిచెట్టని, ఉచ్చింతచెట్టని వాడుదురు. చూ. ఉచ్చింత.

ములువెంపలి:—సం. కంఠ, పుంఖా, కంఠాలు, కంఠపుంఖిక అనియు, హిం. కంఠపుంఖా అనియుపేరు. ఇదిచిన్నక్షుపము. వెంపలిచెట్లలో నొకభేదము. దీనికాయలపై సన్ననినూగుండును. వెంపలికాయలకుండదు. ఇదియే వెంపలికిని ములువెంపలికి భేదము. తక్కిన వర్ణనము "వెంపలిచెట్టు" శీర్షికయందుచూడుడు. ములువెంపలి కారము రుచి లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. క్రిమి శూల హరించును. దీనివేరు యెండించి చిలుములోపెట్టి పొగబీల్చిన యెడల శ్వాసకాసలుహరించును.

ముల్లంగి:—(చిన్నముల్లంగి) సం. మూలక, హరిపర్ణ, నీలకంఠ, హస్తిదంతక, భూమిక్షార అనియు, హిం. మూలీ అనియుపేరు (పెద్దముల్లంగి) చాణక్యమూలక, వానేయ, విష్ణుగుప్తక, స్థూలమూల, శాలామర్కట, కౌటిల్య అనియు. హిం. బడామూలీ అనియుపేరు. ముల్లంగిదుంప యొక్క చిన్న పెద్ద భేదముచే రెండువిధములు. పెద్దముల్లంగిదుంప లావుగ గుండ్రగనుండును. చిన్నముల్లంగిదుంప సన్నముగ పొడవుగనుండును. చిన్నముల్లంగిదుంప కారము రుచి తీక్ష్ణ ఉష్ణ గురుగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. విరేచనబద్ధము దీపనము రుచి గలుగజేయును. గుర్మామరోగము గుల్మము హృద్రోగ



ము వాతము హరించును. పెద్దముల్లంగియు రూక్ష ఉష్ణగుణములు కలది. ఇది త్రిదోషములు కంఠ నానా నేత్రరోగములను హరించును. మలబద్ధముచేయును. కంఠస్వరమును బాగుచేయును. త్రిదోషశ్వాసలు పీనస శమింపచేయును. లేతముల్లంగిదుంప కారము, చేదు, రుచులు, లఘు తీక్ష్ణగుణములు, ఉష్ణవీర్యము, కటువిపాకముగలది. దీపనపాచనముల గల్గించును. మూత్రదోషము, అర్శస్సు, గుల్మము, క్షయ శ్వాస, కాసలు, నేత్రరోగము నాభిశూల, కఫవాతములు, కంఠరోగము, త్రిదోషజన్యద్రుమవులు, శూలలు, ఉదావర్తము, పీనస, వ్రణము హరింపచేయును. ముదిరిన ముల్లంగిదుంప ఉష్ణముచేయును. శోష, దాహము, పిత్తము, రక్తదోషము గలుగజేయును. మిగుల పక్వమైనది కారముగ ఉష్ణముగ నుండును, అగ్నిదీప్తికరమైనది. భోజనాత్పూర్వము పిత్తతాపము గలిగించును. భోజనానంతరమున దినిన హితముగ బలకరముగ నుండును. వేశవారముతో కలిపి ముల్లంగిదుంపలనుదినిన అర్శస్సు, శూల, హృద్రోగము హరించును. కొంచెము ఉష్ణముగ నుండునపుడు దుంపల కంటెయుండు వేళ్ళకూరను దినిన కఫవాతములు హరించును. యెండినముల్లంగిగడ్డ వాపు త్రిదోషములుహరించును. లఘువైనది. ముల్లంగిపూవులు శ్లేష్మము పిత్తము హరించును. దీనికాయలు వాతకఫహరములు ముల్లంగిఆకుకూర (నేతితో వండినది) పాచనకరము లఘువైనది వేడిచేయును. రుచిగ త్రిదోషహరముగ నుండును. నేయితో వండబడనిది కఫపిత్తముల పెంచును.

ముషిణిచెట్టు:—సం. విషముష్టి, రణముష్టి, అనియు హిం. జోడీఅనియుపేరు. ఇదియొకక్షుపము, ఆకులు గుండ్రగ కాయలు నిమ్మకాయంత ప్రమాణము గలిగిగుండ్రగ నుండును. పండినపుడు దీనిపండ్లు యెఱ్ఱగ మనోహరముగ నుండును. దీనిలోనిగింజలు గుండ్రగబద్దలవలె నుండును. విషములలోచేరినది. ఈక్షుపము అరణ్యములందు విశేషముగ పెరుగును. ఇందు ముషిణి నాగముషిణియని రెండుజా

తులు కలవు. యించుమించు సమానాకారములుగలవి, గాని నాగముషిణివేరు పాము తలవంటి ఆకారముగ నుండును.

ముషిణిచెక్క వేరు చేదు. కారము, రుచులు, లఘుగుణము, ఉష్ణవీర్యము, కటువిపాకముగలది. అగ్నిదీప్తి, మలబద్ధము. పిత్తము, వీర్యపుష్టి, తాపము, వాంతి, కలిగించును. రక్తపిత్తము, కఫము, కంఠరోగములు, వాతము, గుల్మము అర్శస్సు, కృమి, కుష్టు, విషము శ్వాస, ప్రమేహము, ఎలుక విషము, శోఫ, పామువిషము, చలిజ్వరము, మున్నగురోగముల హరించును. ముషిణిచెక్క గంధమును శరీరమునకు పూసిన దారుణచర్మవ్యాధులు నయమగును. నాగముషిణివేరు గంధమును పాముకరచిన స్థలమునరాచి వేరురసమును త్రాగించిన తక్షణము విషమును హరింపచేయును. ముషిణివేరు చూర్ణమును రోజుమొదలు 6 గుంజలెత్తువరకు నిమ్మపండు రసముతో త్రాగించుచున్న వరుసజ్వరము నయమగును. సాధారణముగ క్వైనాకుబదులుగ వాడవచ్చును. క్వైనాచేయు దోషములనిది చేయదు. ముషిణిఆకులను ధూపమువేయుటచేత గ్రహ బాధలు తొలగును.

ముషిణిగింజ మహావిషము. మోతాదు అధికమైనచో మరణమునుగూడ గలిగించును. శుద్ధిచేసిన ముషిణిగింజల చూర్ణమును ఔషధములలో కలిపి ఉపయోగింతురు. నీళ్ళవిరేచనములు కలరా అజీర్ణము పక్షవాతము, సర్వాంగ వాతము, సవాయి రోగములు, యితరచర్మవ్యాధులు కుష్టము, వాత మేహ వాతపునొప్పులు, గ్రహణి, సర్పాది విషములు హరించును. రస విష గంధకములు ముషిణివిత్తుల చూర్ణము సమభాగముగ కలిపి నిమ్మపండ్లరసముతో మర్దించి పెసలువలె మాత్రలుచేసి సకలవాత జ్వరములందును వాడదగును. ముష్టిగింజలను నిప్పులమీదకాల్చి మసిచేసి యామసిని ఆవుపాలతో త్రాగిన రక్తపిత్తము, రక్తప్రదరము తక్షణము తగ్గును. మూత్రమువెంట పడురక్తము కట్టును. రక్తప్రదరమునకిది అమోఘమగు ఔషధరాజము. విషముష్టి గింజల చూర్ణము 1 భా॥ కాంజికము 2 భా॥ నూనె



1 భాగము ఆముదము అర్ధభాగము, నిమ్మపండ్లరసము 2 భా॥ వినినేకముచేసి తైలము మాత్రము మిగులునటుల గాచిన తైలమును వడియగట్టి మర్దనచేసిన పక్షవాతము, కీళ్ళనొప్పులు, వాత మేహ వాతపునొప్పులు హరించును. బైటపూయుటకు మాత్రమే యీతైలము నుపయోగింపదగును. విషముష్టిగింజల చూర్ణమును 3 గుంజలెత్తు చొ॥ ప్రతి ప్రాతస్సాయంకాలము లందును నిమ్మపండ్లరసముతో నిచ్చుచున్న కుష్టము నశించును. ముషిణివిత్తులు ప్రధానముగ చేరు ఔషధములనేకములు గలవు. యీగింజలనుండి తీసిన తైలమును ఒకటి మొదలు మూడుచుక్కలవరకు వ్యాధి బలమునుసరించి వాడదగును. గింజలకంటె బలముగ పనిచేయును. నరములయందు గల వ్యాధులను తగ్గించుటకీముషిణిగింజలు మిగుల నుపయోగకరములు మోతాదు హెచ్చుచేయుటచేత ఉన్మాదము, తలత్రిప్పు, మత్తు, వాంతి, జ్వరము మొదలగు వ్యాధులు కలుగుటయ గాక, మరణముగూడ సంభవించును. దీని విషమునకు విరుగుడుగ వమన విరేచనముల చేయించి, నేరేడుగింజల చూర్ణమును చిల్లగింజ గంధములో కలిపి మాత్రచేసి యివ్వవలెను. మోతాదు కుంకుడుగింజంత.

మూసాంబరము:—సం. కన్యాసార అందురు. ఇది కలబందగుజ్జుతో చేయబడును. నల్లగ నిగనిగ లాడుచుండును. చేదురుచి, సరలఘుగుణములు, ఉష్ణవీర్యము, కటువిపాకము గలది. విరేచనము చేయును. పిత్తమును పెంచును. పాలతోనూరిన ముసాంబరమును కుంకుడుగింజంత యిచ్చిన ప్రసవించిన స్త్రీల మైలరక్తమును జారీచేయును. ఋతురక్తమును గూడ వెడలించును. గర్భపాతము చేయును. ముసాంబరమును నిమ్మపండ్ల రసముతో ఉడికించి, పట్టువేసిన కవుకుదెబ్బ నొప్పితీయును. పచ్చిపసుపు రసముతో ఉడికించి, కండ్లచుట్టు పట్టువేసిన కొన్ని నేత్రవ్యాధులు కుదురును. పండిన తెల్లజిల్లేడాకు రసములో కలిపి చెవిలోబోసిన చెవిపోటు తగ్గును. త్రిఫలాకషాయములో కలిపి ఉడికించి వెండ్రుకలకు పట్టించిన నవి నలుపెక్కును.

ఉత్తరేణుఆకు రసముతో నూరి పొత్తికడుపునకు పట్టువేసిన బిడ్డల కడుపుబ్బరము తగ్గును. విరేచనము చేయును. నొప్పిగల యేభాగమందైనను దీనిని పట్టువేసిన నొప్పులు నయమగును. ఛందిసి అత్తరులో కలిపి లోపలకుతినిన సెగరోగము మానును. ముసాంబరము, సాంబ్రాణిపూవుకలిపి నూరి కందిగింజలంతమాత్రలు చేసి సేవించిన దగ్గులు తగ్గును. రక్తప్రదరము గల స్త్రీలు, గర్భిణులు, వృద్ధులు, బాలురు, రక్తపిత్తరోగులు ముసాంబరమును సేవింపరాదు. హెచ్చుగ దీనిని తినిన తలత్రిప్పును. మతిభ్రమదెచ్చును. జఠరము క్షీణించును. వీనికి విరుగుడుగ నిమ్మపండ్లరసము నుపయోగింపదగును.

ముస్తాదిగణము:—తుంగముస్తలు, వస, చిత్రమూలము, పసుపు, మానుపసుపు, కటుకరోహిణి, గురివెంద వేరు, నల్లజీడిగింజలు, పాఠ, త్రిఫలములు, తెల్ల అతివస, చెంగల్వకోష్టు, ఏలకులు, తెల్లవస యీవస్తువుల సముదాయమునకు ముస్తాదిగణమని పేరు. ఈగణము యోనిరోగములను చనుబాలను నశింపచేయును. మలమును పాచనము జేయును.

ముష్కకాదిగణము:—మొక్కపు చెట్టు, బ్రహ్మజెముడు, త్రిఫలములు, చిత్రమూలము, మోదుగు, చండ్రి, ఇరుగుడు ఇవి ముష్కకాదిగణ మనబడును. ఈగణము, గుల్మము, మేహము, అశ్మరి, పాండువు, మేదోరోగము, అర్శస్సు, కఫము, శుక్రదోషము అనువానిని నశింపచేయును.

మూత్రములు:—ఆవు, ఏనుగ, గేదె, గొఱ్ఱె, మేక, గాడిద మొదలగువాని మూత్రములు, సాధారణముగ పాచన దీపనముల గలిగించును. చులకనగ ఉప్పగ, కొంచెము కారముగ చేదుగ నుండును. రూక్షజేయును. స్రోతస్సులను శోధించును పిత్తమును పెంచును. హృదయమునకు హితకరముగ నుండును. వాతము ననులోమగతికి దెచ్చును. దోషముల భేదించును. వాతము, గుల్మము, అర్శస్సు,



వాపు, ఉదరరోగము, కఫము, క్రిమి, కుష్ఠు, పాండువు, ఆనాహము, విషము, శూల, అరుచి హరించును. ఆవు, మేక, ఎనుము, గొఱ్ఱె, యీజాతులలో స్త్రీలమూత్రమును గాడిద ఒంటె ఏనుగు మనుష్యుడు గుఱ్ఱము యీజాతులలో పురుష మూత్రమును ఔషధాదులందు వాడదగును. అనగా ప్రశస్తమని తాత్పర్యము.

మూర్కొండచెట్టు:—సం. విశ్వరూపక, గూపగంధ అనియు హిం. పాఠీయనియు పేరు. ఆకుయొక్క గుండ్రతనము కోలదనము భేదముచేత రెండువిధములు. గుండ్రఆకులది మూర్కొండఅని కోలఆకుది కుప్పింటఅని వాడుదురు. ఇదిచిన్న మొక్క దీనిశిరస్సున ఆకుపచ్చని వెన్నులుపుట్టును. కారము, రుచి, లఘుగుణము, ఉష్ణవీర్యము, కటువిపాకముగలది. ఆకురసము చెవిలోబోసిన పోటుతగ్గును. నల్లజీలకర్రచూర్ణముకలిపి శరీరమునకుపూసిన గజ్జి చిడుము మానును. రసము త్రాగిన విరేచనములగును. వాంతిగూడ గల్గించును. ఆకును బాగుగా నలిపి ఆసనమునందు జొనిపిన తక్షణము విరేచనమగును. చంటిబిడ్డగుణమువచ్చు బిడ్డలకు కొంచెము జలుబు దగ్గువచ్చి గుణమువచ్చునను అనుమానము కలిగినవెంటనే పావలాయెత్తు రసమును త్రాగించిన వెంటనే వమనమై కఫము తగ్గి గుణమురాకుండ జేయును. 5 మొదలు 10 చుక్కలవరకు ఆకురసమును చనుబాలలో కలిపి ప్రతి సాయంకాలము త్రాగించుచుండిన పాలఉబ్బసము, యెగరొప్పు, తగ్గు, గొంతుకలోగురగురలాడుట మొదలగు బాధలుతగ్గును. ఆకురసముతో పసుపుతడిపి సున్నముకలిపి కట్టిన జెట్టకురుపు గోరుచుట్టు నెమ్మదించును. కారముగల మంచియింగువ మూర్కొండాకు కలిపినూరి సీతాఫలపు పుల్లచివర పట్టించి పుప్పిపంటి రంధ్రములో పెట్టిన పురుగులు ఊడిపడును. లేదా చచ్చిపోవును. బాధతగ్గును. ఆకురసమును నస్యముచేసిన సన్నిపాతము అపస్మారము పిచ్చి శమించును. రసమునందు విడంగచూర్ణముచేర్చి త్రాగిన కడుపులోని నులిపురుగులు చచ్చును. సమూల రసమునదడిపిన గుడ్డను వేసి కట్టిన మురికి వ్రణములు మానును. అందలిక్రిము

లు చచ్చిపోవును. 4 తులముల ఆకురసముతో 8 తులముల పంచదారపాకముపట్టి యాపానకమును వ్యాధిబలమును ననుసరించి సేవించునెడల ఉబ్బసము, మేఘరంజి, క్షయ మొదలగు దారుణమైనదగ్గులు నశించును. ఆకురసముతో 21 దినములు వామును భావనచేసి దానిని బలానుసారముగ వాడిన కృములు, గుల్మము, మలమూత్రబంధము ఋతుబద్ధము శూల అర్శస్సు శోధ మేదోరోగము హరించును. మరియు కుప్పింటాకు రసముతో పంచలవణములను నూరుచు 16 పుటములు వేసిన చక్కని సిందూరము తయారగును. ఇదిసకల అజీర్ణ వ్యాధులందును అమోఘముగ పనిచేయును. శూల కడుపుబ్బరము తగ్గించును.

మెంతిచెట్టు:—సం. మేథిక, వస్తిక శేలు అనియు హిం. మేథీ అనియుపేరు. ఇదిచిన్నమొక్క. ఆకులుచిన్నవిగ కొంచెము గుండ్రగ వుండును. ఆకుకూరవండుకొని తిందురు. ఆకుకూర చేదుగనుండును. వాతము హరించును. రుచిఅగ్నిదీప్తి కొలదిగ పిత్తము కలిగించును. గ్రహణి కుష్టు అర్శస్సు ఉబ్బు రక్తపిత్తము గుల్మము అనురోగములు కలవారలకు హితముగనుండును. వీర్యము పుష్టి బలము కలిగించును. సులువుగ జీర్ణమగును. కంఠస్వరమును బాగుపరచును. ఋతుబద్ధమును విప్పును. మలమూత్రములు జారీచేయును. పథ్యమైనది.

మెంతిగింజలుఅనగా మెంతులు చేదు రుచి లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలవి. అగ్నిదీపనము రక్తపిత్తము కలిగించును. అరోచకము వాతశ్లేష్మములు జ్వరము ఛర్ది వాతరక్తము కాస అర్శస్సు కృమి క్షయ ఋతుబద్ధము హరింపచేయును. మెంతులనుచూర్ణించి పెరుగులోకలిపి త్రాగినరక్తగ్రహణి జిగట విరేచనములు కట్టును. మెంతులు సదాపాకు నల్లనువ్వులు కల్పికషాయముకాచి యిచ్చిన ఋతురక్తము జారీయగును. మెంతిచూర్ణమును మజ్జిగతో ఉడికించి కట్టుగట్టిన సెగగడ్డలు పక్వములై పగులును. మెంతులు తాటిబెల్లము కలిపినూరి ముల్లు గుచ్చుకొనినచోట కట్టుగట్టిన ఆముల్లు బయటకు వచ్చును. మెంతులను ఆవుపాలతో భావనచేసి చూర్ణించి పంచ



దారకలిపి ప్రతియుదయమున పావులాయెత్తుచొ॥ తినుచున్న శుక్లనష్టము కట్టును. పలచనైన వీర్యము గట్టిపడును. శీఘ్రస్ఖలనము నాపును.

మెట్టతామర:—సం. పద్మచారిణీ, అతిచరా, చారటీ, స్థలపద్మ అనియు హిం. స్థలకమలినీ అనియుపేరు. ఇది తామరతీగవలెనే యుండునుగాని యిది మెట్టమీద నుండును. ఆకులు పూవు కాయ మొదలగునవన్నియు తామరతీగకువలెనే యుండునుగాని అంతకన్న చిన్నవి చేదు వగరు కారము రుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. కఫపిత్తములు మూత్రఘాతము మూత్రకృఛ్రి అశ్మరి రక్తపిత్తము వాతశూల అతిసారము ఛర్ది తాపము మేహము రక్తదోషము శ్వాసకాసలు అపస్మారము విషము అరుచి నశింపచేయును. స్తనములకు దార్ఢ్యమునిచ్చును.

మేక:—సం. మేష అజఅనియు, హిం. భేడ్ అనియుపేరు. ఇది యొకజంతువు. మేకపోతు మాంసము మధురరసము, గురు స్నిగ్ధగుణములు, శీతవీర్యము, మధురవిపాకముగలది. పక్వముచేయబడిన మేకమాంసము లఘువుగనుండును, త్రిదోషములు తాపము క్షయ పీనస శ్లేష్మము హరించును. శరీరపుష్టి నిచ్చును. మేకపాలు ఉప్పు తీపి రుచులు స్నిగ్ధ గురురూక్షగుణములు ఉష్ణవీర్యము మధురవిపాకముగలవి. అశ్మరి వాతపిత్తము కఫము వీటినిపెంచును. రక్తపిత్త వాతరోగులకు హితకరము. శూల, క్షయ, శ్వాస, కాసలు, శోధ, పాండువు, జ్వరాతిసారము, శుక్లనష్టము అనురోగముల హరించును. చంటిపిల్లలకును గర్భిణులకును మేకపాలు మంచిఆహారముగ నుండును. మేకమాంసము మేకపాలు మేకనెయ్యి వీనిని శర్కరతో సేవించుచు మేకలసామీప్యమున నివసించుచుండిన వారికి రాజయక్ష్మరోగము శమించును. దీనిపెరుగు కఫవాతములను పెంచును. దుర్నామరోగము జఠరదీప్తి నేత్రప్రసాదము పాండువు హరించును. రూక్ష అత్యుష్ణముకలుగజేయును. రసపాకములయందు మధురముగ నుండును. కుష్ఠరోగులకు మిక్కిలి అహితమైనది. శోఫ వ్రణముల హరించును. మేకమజ్జిగ

అపథ్యమైనది. పుల్లని మేకమజ్జిగ దుర్గంధయుతముగ నుండును. కటువిపాకము ఉష్ణవీర్యము లఘుగుణముగలది. పిత్తము అగ్నిదీప్తి రక్తదోషము కలిగించును. కఫవాతములను హరించును మేకవెన్న మధురరసము సరలఘుగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. యోనిశూల, కఫము, వాతము, శోఫ అర్శస్సు, వుదరము, జఠరరోగము నశింపజేయును క్రిమి, జ్వరము, దురద, వాంతి, అరుచి కలుగ జేయును.

మేక నేయి సమస్తరోగములను విషములను హరించును. ఎముకలకు బలమునిచ్చును. అశ్మరీ రోగమును మధుమేహమును హరించును. కొంచెము పిత్తమును పెంచును. యోనిదోషము, కఫము, పిత్తము, శోఫ, కంపవాతము అనురోగములు గలవార్లకుమిక్కిలి హితకరము మేకమూత్రము కారము వుప్పు, రుచులు, తీక్ష్ణగుణము కలది. వాతము దుర్నామరోగము వుదరము, శూల, కుష్ఠము, మేహము వీనిని హరించును. మేక పెంటికలను పొగవేసిన గ్రహబాధతగ్గును. మేకకొవ్వులో లేతమామిడి చిగుళ్ళరసము కలిపియిచ్చిన రక్తకాస క్షయ మొదలగునవి నయమగును. మేకయొక్క పాలు పెరుగు మూత్రము పెంటికలరసము నేయి అయిదును సమభాగములుగ జేర్చి అందు యిరువదియవపాలు యవక్షారముకలిపి నేయిమిగులునట్లు కాచి శేవించిన రాజయక్ష్మ నయమగును. 100 పలముల మేకమాంసము 2 ద్రోణముల నీటిలోవేసి 8 వ వంతుమిగులునట్లు కాచివడియగట్టి అందు ఒకప్రస్థము నేయి నేయికి నాల్గవవంతు జీవనీయగణ ద్రవ్యముల కల్కముజేర్చి కాచిశేవించిన పైత్యవాతము వాతాధిక్యముగల కాస క్షయ హృద్రోగము మార్గాయాసము కాస శమించును.

మేడిచెట్టు:—సం. ఉదుంబర, హేమదుగ్ధ, సదాఫల, అపుష్పఫల, శీతవల్కల అనియు హిం. గూలర్ అనియుపేరు. క్షీరిపంచకములో చేరినది. ఇదిపెద్ద వృక్షము ఆకులు గుండ్రగ కొంచెముకోలగ మందముగ గరగర లాడుచుండును. చెట్టునుండి పాలుగారును. కాయలు గుండ్రగ తీయగనుండును. వీటినే అత్తిపండ్లందురు. దీనికి



పూవుపూయకనే కాయపుట్టును. మేడిపట్ట వగరు, తీపి, రుచులు రూక్షగురు గుణములు, శీతవీర్యము, మధురవిపాకముగలది. గర్భసంధానము చేయును. వ్రణములశోధించును. శరీరమునకు కాంతినిచ్చును. కఫపిత్తములు అతిసారము యోనిరోగము సర్పి ప్రమేహము దప్పి తాపము రక్తపిత్తము తెల్లకుసుము హరించును. మూత్రనాళమునుండి స్రవించు రక్తము నాపును. దీనికషాయమును పుక్కిటబట్టిన నోటిపూత చిగురువాపు తగ్గును. చక్కచూర్ణమును ఆవునేతితో కలిపి రాచినమంత్రపుకురుపులు మానుపట్టును. ముదిరిన మేడిచెట్టు యొక్క వేరును నరికి వేరుక్రింద నొకకుండనమర్చి చెట్టును తగులబెట్టవలెను. అప్పుడా కుండలోనికి రసముదిగును. ఆరసమును శరీరమునకుపూసిన కుష్ఠుమొదలగు చర్మరోగములు మానును. లోపలకుతినిన వీర్యము బలము, కాంతి, ఆయువు వృద్ధియగును. మధుమేహము అతిమూత్రము కట్టును. మేడివేరునకు తొలవేసి అందు మైలతుత్థపు ముక్కనుపెట్టి పూడ్చి ఆరుమాసములుంచి తీసిమేడిపాలతోనూరి పుటమువేసిన తెల్లగభస్మమగును. ఇది శ్వాసకాసలు క్షయ ఉబ్బసము మొదలగు రోగములందుపనిచేయును. మేడిపాలు వగరుగ నుండును. గర్భదోషము వ్రణములు హరించును. లేతమేడికాయ మలబద్ధకరము. దప్పి, కఫ, పిత్తములు, రక్తదోషము హరించును. దోరగపండినది తీయగ, వగరుగ నుండును. చలువచేయును. రక్తపిత్తము ఛర్ది హరించును. పిత్తమును పెంచును. విదాహజనకము. నరుకుగాయమును మాన్పును. అగ్నిదీప్తినిచ్చును. మాంసవృద్ధి రక్తదోషము కలుగజేయును. పండినమేడిపండు వగరు తీపి రుచులుగలది. నులిపురుగును కఫమును గలుగజేయును. రక్తవికారము, పిత్తము, తాపము, అతిసారము, ఆకలి, దప్పి శ్రమ, ప్రమేహము, క్షయ, శోష, మూర్ఛ హరించును. చలువచేయును. ఆలస్యముగ జీర్ణమగును. బలము, పుష్టి, వీర్యము పెంపొందించును. అమితముగదినిన కడుపుబ్బును. దీనికివిరుగుడు జీలకర్రరసము.

మేధ:—చూ. అష్టకవర్గు.

మైనము:—సం. మధూచ్ఛిష్ట, మదన, మధుశేష, మధ్వాధార, మధూషితఅనియు హిం. మోమ్ అనియుపేరు. ఇది తేనెటీగలుకూర్చిన తెట్టె. దీనియందు తేనెను నింపును. ఈగలను యెగురగొట్టి తెట్టెను గ్రహించి తేనెను పిండుకొనగా మిగిలిన పిష్టమునకు మైనమనిపేరు. ఇదిస్నిగ్ధముగ మృదువుగ నుండును. భూతబాధ, వ్రణము, కుష్టు. విసర్పి, రక్తదోషము జయించును. విరిగిన యెముకలను అతుకుకొన జేయును. మైనము సైంధలవణము కావిరాయి గుగ్గిలము నేయి బెల్లము తేనె వీనిని సమభాగములుగ గ్రహించి ఉడికించి దీనినిఅరికాళ్లకురాచిన అరికాళ్ళపగుళ్ళు నయమగును. దీనికి మదనాది లేపము అనిపేరు,

మొక్కజీడిచెట్టు:—చూ జీడిమామిడిచెట్టు.

మొక్కజొన్నలు:—సం. మక్కాయ, మహాకాయ, కటిజ, శిఖాలు. సంపుటాంతస్థ అనియు హిం. మక్కా, భుంటీఅనియుపేరు. జొన్నజాతిలోనిది. దీనిగింజలు సెనగగింజలంత యుండును. ఈచెట్టుఆకారమంతయు జొన్నచెట్టును పోలియుండును. ఆకులమధ్యనుండి పొత్తిబయలుదేరును. ఈపొత్తియందట గింజలుండును. లేతగనుండు నపుడు కాల్చుకొనిగింజలను తిందురు. యెండినతరువాత మొక్కజొన్నగింజలను అనేక విధముల ఆహారముగ నుపయోగింతురు.

మొక్కజొన్నలు మధురరసము రూక్షగురుగుణములు శీతవీర్యము మధురవిపాకముగలవి. తృప్తిని వాతమును కలిగించును. పిత్తమునుహరించి కఫమును పెంచును మలబద్ధముచేయును. పుష్టికరమైనది. మిగుల ఆలస్యముగ జీర్ణమగును. అమితముగ దినిన కడుపుబ్బును. అజీర్తిచేయును.

**మొక్కపుచెట్టు:**—సం. ముష్కక, మోక్షక, క్షారశ్రేష్ట. ముష్కిఅనియు హిం. ఘణ్ వాహా, మోషా, మోఖా అనియుపేరు. తెల్లమొక్కపుచెట్టు నల్లమొక్కపుచెట్టు అని రెండువిధములు. ఆకులు



పెద్దవిగనుండును. జిల్లేడునకువలె యీచెట్టునుండియు అమితముగపాలుగారును. క్షారప్రధానమైన వృక్షము ఇదికారము, పులుపు, చేదు రుచులు ఉష్ణవీర్యము సరలఘుగుణములు కటువిపాకముగలది. మలబద్ధము అగ్నిదీప్తి ఆమపాచనము రుచి గలుగజేయును. ప్లీహ గుల్మము ఉదరము విషము కఫము ఛర్ది వాతము మేదోరోగము వస్తిశూల శుక్రదోషము చెవిపోటు పిత్తము దురద కృమి వీనినిజయించును. మొక్కపూవు కుష్టు వాతపిత్తకఫములు హరింపచేయును, మొక్కపుపండు రుచిబుట్టించును. ఆమపాచనముజేయును. అగ్నిదీప్తినిచ్చును. గుల్మము మేహము అర్శస్సు పాండువు శుక్రదోషము ఉదరరోగము వీనిని జయించును. మలమును భేదించును. లేతకాయ పథ్యమైనది. అశ్మరీరోగమునందిది మిగులహితకరము.

మొగపిచ్చుక:—సం. కలవింకఅనిపేరు. మొగ ఊరబిచ్చుకమాంసము మధురరసము, గురుగుణము, శీతవీర్యము మధురవిపాకముగలది. కఫము, శుక్రము, బలము. పుష్టి, శరీరకాంతి సంభోగశక్తి కలుగజేయును. యూనానీ సంప్రదాయమున మొగఊరబిచ్చుకలతో అనేకవిధములగు హల్వాలు మోదకములు మురబ్బాలు తయారుచేయుదురు. తల కాళ్ళు పేగులు తీసివైచిన ఒకపిచ్చుక మాంసమును ఆవునేతితో వేయించి తేనెలోముంచి ప్రతియుదమున తినిన అమితవీర్యవృద్ధికలుగును. 20 ఊరబిచ్చుకల మాంసము, కోడిగుడ్లలోని పచ్చసొన 8 తులములు సెనగపిండి 20 తు॥ పెన్నేరు నేలగుమ్మడు నేలతాడి జాజికాయ అనునవి ప్రత్యేకము రెండున్నర తులములు కుంకుమపూవు అరతులము కస్తూరి పావులాయెత్తు పంచదార 60 తు॥ నేయి 30 తు॥ తేనె 15 తు॥ ఈవస్తువులను లేహ్యపాక సంప్రదాయానుసారముగవండి ప్రతిసాయంకాలమునను ఒకతులము మందునుతిని కాచిన ఆవుపాలలో పట్కిబెల్లముకల్పి త్రాగుచున్నయెడల నపుంసకులకును పుంస్త్వముకలుగును. అమితసంభోగశక్తి ఆనందము కలుగును. ఇది

అత్యద్భుతమను యోగము ఇట్టివి అనేకములుగలవు. గ్రంథవిస్తరభీతి నిచట వ్రాయబడవు.

మొగలిచెట్టు:—సం. కేతకి, సూచికాపుష్ప, జంబుక, క్రకచచ్ఛద అనియు హిం. కేవడా, కేవ్డా అనియుపేరు ఇదియొకపొద ఇందుమొగలి బంగారుమొగలి చిరుమొగలియని మూడుభేదములు కలవు బంగారు మొగలికి సరస్వర్ణకేతకి లఘుపుష్ప సుంగధినీ ఛిన్నరుహా అనియు హిం. పీలీకేవ్డా యనియు చిరుమొగలికి కార్ణకేతకి, రఝుదాత్రీ, మధ్యదండా అనియు హిం. రామ్‌భాస అనియుపేరు. చిరుమొగలి ఉద్యానములయొక్క చుట్టునుండుకంచెలలో పెరుగును. దీనిలో యెఱ్ఱగను కొన్ని తెల్లగను పూవులుపూచును. స్వర్ణకేతకియొక్క పూవులు పచ్చగనుండును. ఆకులుపొడవుగ అంచులందు ముండ్లు గలిగియుండును

మొగలి (తెల్లది) కారము, చేదు, తీపి, రుచులు, లఘుగుణము ఉష్ణవీర్యము, కటువిపాకముగలది. విషము, కఫముహరించును. నేత్రములకు హితకరము. మొగలిపూవు కటుతిక్తరసములు, లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది, కాంతినిచ్చును. వాతకఫములు వెండ్రుకలయందలి దుర్గంధము తాపము హరించును. ఇందులోని కేసరములు సిధ్మరోగము దురదజయించును. స్వర్ణకేతకి కటుమధురరసములుగలది, విషము, కఫము హరించును. దీనిపుష్పము సుఖముకామోద్దీపనము కొంచెముగవేడి పిత్తము కలుగజేయును. మొగలిచన్నులు శీతవీర్యము ఉప్పనిరుచి కలవి. బలమునిచ్చును. జరారోగముల హరించును. పిత్తకఫముల హరించును. చిరుమొగలి కారము చేదు మధురము రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. సాధారణముగానిది పైదానిగుణములను గలిగియుండును. మొగలిపూవు రేకులతోచేసిన విసనకఱ్ఱగాలి చల్లగ ఆనందముగ తాపమును హరించునదిగ నుండును. శుక్రము నిద్ర శరీరకాంతి కలిగించును. మూర్ఛను హరించును. పరిమళముగ నుండును.



మొమ్మాయి:—సం. శిలాజిత్, అనియు హిం. శిలాజీత్ అనియుపేరు. ఉత్తరదేశమున రాళ్ళలో బయలుదేరును హీరాన్‌దేశమున ఆరాజువద్ద ప్రశస్తమైన అసలుమొమ్మాయి దొరకును. దీని వర్ణనము గుణము మొదలగునవికొన్ని "గోమూత్రశిలాజిత్తు" అనుశీర్షికయందు వ్రాయబడినది. మరికొన్ని విశేషములిచట వ్రాయబడును. హఠాత్తుగా ఉన్నతస్థలములనుండి క్రిందబడి కాలుచేతులు విరిగినపుడు ఆ భాగమునందు మొమ్మాయి వేసి కాచిన నేతినిరాచి లోపలకుగూడ త్రాగినచో విరిగిన యెముకలు అతుకుకొనును. పాతనొప్పులుగల వారలు పెసరగింజంత మొమ్మాయిని తేనెతో కలిపితినిన తత్క్షణము నొప్పితగ్గును. శేరునీళ్ళలో ఒకగుంజెత్తు మొమ్మాయినికలిపిన ఆనీళ్ళుయెఱ్ఱబడును. ఆనీళ్ళలో తడిపినగుడ్డను కాలినపుండ్లపై వేసి గుడ్డఆరకుండగ నీళ్లు చల్లుచునుండు నెడల తత్క్షణమే మంటతగ్గి రెండుమూడు దినములలో పుండుమానిపోవును. ఉత్తరేణుఆకు రసముతో మొమ్మాయి తినినకీళ్ళవాపు పరిణామశూల గుండెదడ చిరకాలమునుండియున్న అజీర్ణము గుల్మము నయమగును. పసుపురసముతో కలిపిత్రాగి కొంచెముగాయమువద్దకూడ రాచిన తేలు పాము జెఱ్ఱి యెలుక మొదలగు విషములు నశించును. మొమ్మాయి అభ్రకసత్త్వభస్మము సమముగకలిపి పెసలవలెమాత్రలుచేసి దినమునకు ఒకటిచొ॥ 9 దినములు సేవించిన మధుమేహము మూత్రకృఛ్రి మూత్రఘాతము అశ్మరి మొదలగు మేహవ్యాధులు కుదురును. గోమూత్రముతో కలిపి త్రాగిన ఋతుబద్ధము ఉబ్బు, పాండు. కాస, ఉబ్బసము మొదలగు దారుణరోగములు హరించును. సరస్వతిలేక మండూకబ్రహ్మిరసముతో సేవించిన మూర్ఛ, ఉన్మాదము మతిభ్రమ పోవును. జ్ఞాపకశక్తి వృద్ధియగును. తెల్లములకవేరురసముతో స్త్రీలు బహిష్టులైన మూడుదినములును ఉదయము పూటలదినిన వంధ్యాత్వము నివర్తించి గర్భధారణ యోగ్యతను కల్గించును. నష్టసంతానము గలస్త్రీలకు సంతానము నిలుచునట్లు చేయును. సిలియాకు రసముతో కలిపిరాచిన బొల్లిమచ్చలు మానును.

మొగఊర బిచ్చుకలమాంస రసములో మొమ్మాయికలిపి త్రాగినను ధ్యసపుంసకత్వము స్వప్న స్ఖలనము మొదలగు శుక్రదోషములన్నియు నశించి సంభోగేచ్ఛ వీర్యపటుత్వము ఆనందము కలుగజేయును. కోడి గ్రుడ్లలోని తెల్లసొనలోకలిపి పట్టువేసినబుడ్డ బోదకాలు నయమగును. కోడినెత్తురులోగాని కుందేటినెత్తురులోగాని కలిపిపట్టువేసిన సవాయిబిళ్ళలు అడ్డగర్రలు కరిగిపోవును. కుంకుడుకాయను పన్నీరుతో అరగదీసి రసముపిండి అందుమొమ్మాయికలిపి నస్యముచేసిన మూర్ఛరోగము మానును. బాదంగింజలనుండి తీసిననూనెలో మొమ్మాయికలిపి చెవిలోబోసిన యోగాభ్యాసమునందు ప్రమాదమున గలిగిన చెవిలో హోరు పోటు వివిధధ్వనులు చెవుడు మొదలగురోగములు కుదురును. పటికబెల్లముకలిపిన ఆవుపాలతో యిచ్చిన త్రివిధములగు సెగలుమానును. లవంగాలు, చందనము, కస్తూరి, కుంకుమపువ్వు, మొమ్మాయి సమభాగములుగకలిపి చిన్నచిన్న మాత్రలుచేసి ఒకసంవత్సరము వరకు సేవించునెడల వృద్ధాప్యమువలన పడిసశరీరపు ముడతలుపోవును. వెంట్రుకలు నల్లబడును. సంభోగపటుత్వము కలుగును. నరములకు మంచిసత్వమేర్పడును. దీనిబలము చిరకాలమువరకు శరీరమున నిలుచును. తెల్లజిల్లేడు పూవులరసముతో నిచ్చిన క్రూరమైన మన్యపుజ్వరములుతగ్గును. అసలు మొమ్మాయి దొరకుట దుర్లభము. గనుక అనేకులు చేత మొమ్మాయిని విక్రయించుచున్నారు. కాబూలులోను హీరాన్ దేశములోను కొండయందు ఒకవిధమగు నల్లనిబొగ్గు ఉండును. దానిని గోమూత్రము, పన్నీరు, మర్రిఊడలరసము, పసుపురసము, సున్నపునీరు, తేనె అనువానితో ప్రత్యేకము ఒకదినము మర్దనచేయుదురు. ఇదినల్లగ నిగనిగలాడుచు అసలుమొమ్మాయి యొక్కరూపమును ధరించియుండును. మొమ్మాయియొక్క పైపైపరీక్షలకిదియును ఆగును. గాని మొమ్మాయియొక్క ప్రభావమునందు లక్షకొకభాగమే పనిచేయును. మరికొన్నివిధముల మొమ్మాయిని తయారుచేయు విధానములు మా" వైద్యరహస్యమను గ్రంథమున జూడనగును.



మొరళిపండు:—సం. ప్రియాల, పియాల, ఖరస్కంధ, చార, తాపసేష్టయనియు హిం. చిరోంజీ అనియుపేరు. మొరళిచెట్టు కొంకణాది దేశములందుపుట్టును. ఆకులు చిన్నవిగ గరగరలాడుచుండును. మొరళిపండులోని గింజలపప్పును చారపప్పు అనియు చెప్పుదురు. మొరళిపండు తీపి పులుపు రుచులు గురు సర స్నిగ్ధగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. మలబద్ధము, ధాతుపుష్టి, కఫము, బలము వీనిని వృద్ధిచేయును. పిత్తము తాపము, జ్వరము, దప్పి, క్షతక్షయము, రక్తదోషము హరించును. మొరళిపండు గుజ్జు తీపిగనుండును. వీర్యవృద్ధిచేయును. తాపము పిత్తము హరించును. సారగింజలతైల మధురరసము గురుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. పిత్తను వాతమును హరించును. కఫముపెంచును. మొరళివేరు రసము వగరుగనుండును. రక్తదోషము కఫపిత్తములు హరింపచేయును. చూ. చారపప్పు.

మొల్లలు:—సం. భృంగబంధు, మనోరమ, సదాపుష్ప, అనిపేరు. మొల్లతీగ పుష్పప్రధానమైనది. మొల్లపూవులు చలువచేయును. లఘువుగనుండును. శిరోరోగము విషము పిత్తము శ్లేష్మము హరించును.

మొసలిమాంసము:—సం. మకర, నక్ర అందురు. దీనిమాంసము గురుత్వము, శుక్రపుష్టి, కఫము కలిగించును. వాతమునుహరించును. శరీరమునకు బలమునిచ్చును. మొసలిచేదునకు జున్ను అనిపేరు. చూ. జున్ను. (ఆదిపచ్చికాన).

మోదుగుచెట్టు:—సం. పలాశ, కింశుక, యాజ్ఞిక, వాతపోథ అనియు హిం. ఢాక్, టీసూ, ధారా, కాంకరెయా అనియుపేరు. ఇది పెద్దవృక్షము. ఆకులుగుండ్రగ ఒకతొడిమకు మూడుఆకులు వేరువేరుగనుండును. ఈయాకులతో విస్తళ్ళుకుట్టి భోజనము చేయుటకుపయోగింతురు. లేతఆకులుఎర్రగను ముదిరినఆకు పచ్చగను ఉండును. కాయలుపొడవుగను కాయలోనిగింజలు బద్దలవలె గుండ్రగను ఉండు

ను. గింజపైపొట్టు యెఱ్ఱగనుండును. మోదుగు గింజలను మోదుగుమాడలని తెలుగునను ఢక్పన్నాయని హిందీయందును వాడుదురు. మోదుగు కట్టెలను యజ్ఞాదులందు అగ్నికార్యముల కుపయోగింతురు. ఇదిక్షారముగల వృక్షము పూవులయొక్క తెలుపు యెరుపు నలుపు పసుపు భేదముచేత ఇదినాల్గువిధములు తెల్లమోదుగ మంచిది. తెలుపు యెరుపు మోదుగలు సాధారణముగ దొరకును తక్కినవి అరుదు.

మోదుగచెక్క వగరు కారము చేదు రుచులు స్నిగ్ధగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. వ్రణము గుల్మము గ్రహణి అర్శస్సు యోనిరోగము కృమి గుదరోగములు హరించును. అగ్నిదీపనము వీర్యవృద్ధి గలిగించును. దీనిక్షారము, గుల్మము, అర్శస్సు, అజీర్ణము, కడుపుబ్బరము, నంజు, గ్రహణి, వాతశ్లేష్మము హరించును. చెక్కకషాయముతో కడిగిన పుండ్లుత్వరగ మానుపట్టును. మోదుగుపూవు కటుతిక్తకషాయరసములు. లఘుసరగుణములు, వీర్యము, మధురవిపాకముగలది. వాతము జేయును. కఫపిత్తములు, రక్తదోషము. మూత్రకృఛ్రి, తాపము, దప్పి, వీనినిహరించును. మోదుగువేరు స్వరసము కండ్లమసకలు రేజీకటి కంటిలోని పూవులుమాన్పును. మోదుగుమాడలు అనగాగింజలు చేదు రుచి లఘురూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలవి. కృమి, అర్శస్సు. వాతకఫములు, కుష్టు, గుల్మము, ఉదరము నశింపచేయును, మోదుగుచిగురు వాతము కృమి అనువానిని హరించును. మోదుగుజిగురు మలబద్ధము వీర్యస్తంభనము వీర్యపుష్టి గలిగించును. గ్రహణి, ముఖరోగములు. కాస జయించును. మోదుగాకు విస్తరిలో భుజించిన గుల్మము, మేహము, వాతశ్లేష్మములు రక్తపిత్తము నశించును. మోదుగు గింజలనుండి తీయబడిన తైలము వగరుగ మధురముగ నుండును. వాతకఫముల జయించును. మోదుగుచెట్టుయొక్క తల్లివేరును నరికి క్రిందనొకకుండనమర్చి చెట్టును తగులబెట్టినయెడల కుండలోనికి తైలమువంటి యొకవిధమగు రసముదిగును. ఈరసమును ప్రతిదినము త్రాగుచున్న కుష్టు మేహపాడ



లు పచ్చలు దద్రులు మొదలగు చర్మరోగము లన్నియు కుదురును. ఆముదమున దోరగవేయించిన మోదుగుమాడ రెండుభాగములు నేతితో వేయించిన గచ్చపలుకులు శుద్ధిచేసిన నేపాలములు రససిందూరము పిప్పలిబియ్యము ప్రత్యేకమొకభాగముజేర్చి నిమ్మపండ్లరసముతో నూరికందిగింజలంత మాత్రలుచేసి వాయువిడంగములు దేవదారు కషాయము మున్నగువానితోనిచ్చిన కృమి వాతము వాతశ్లేష్మములు హరించును. ఇదిఅనుభూతమగు చక్కనియోగము దీనికి క్రిమి ఘణిగరుడాస్త్రమనిపేరు.

మోదెన:—సం. బుస, బక, వసుక అనిపేరు. చలువచేయును. విషము శ్లేష్మము పిత్తము మూత్రకృఛ్ఛ అశ్మరి తాపముహరించును.

మృత్తిక:—పాటిమన్ను మెత్తగాగాలించి తడిపి కడుపుపైన దళసరిగ వేసికట్టిన కడుపునొప్పి జలోదరముతగ్గును. తేలుకుట్టినచోటకట్టినను బాధశమించును. యెఱ్ఱమన్నును మంగలములో వేసివేయించి గుడ్డలోగట్టి కాపడముపెట్టిన తలపోటు కీళ్ళనొప్పులు నయమగును. తెల్లమన్నులేక సుద్దమీదనీళ్ళుపోసి ఆవిరివలెపైకివచ్చు ఊష్మమును వాసనచూచిన డోకులుకట్టును. మజ్జిగవేసి చేతితోఅరగదీసిన మట్టిగంధమును కాలినపుండ్లపై రాచినమంట నెమ్మదించును. తడిమట్టిని బోదకాలుకు గట్టిన వాపుతగ్గును. యెరుపు తెలుపు రంగులమన్నులతో వివిధములగు మూసలుచేసి రసలోహాదులను మారణజారణాదుల జేయుటకుపయోగింతురు. ఒకమట్టితోడనే సకలవ్యాధులను నివారించు పద్ధతులు ప్రకృతివైద్యమునగలవు, "ఎర్త్ క్యూర్" అనుగ్రంధమంతయు మృత్తికా చికిత్సయైయున్నది. విస్తరభీతిచేకొన్ని విషయములైనను వ్రాయబడలేదు

మ్రంగ:—చూ. మంగచెట్టు,

మ్రానుపసుపు:—చూ. మానుపసుపు.

యమునానదీజలము:—పిత్తము, తాపము, బడలిక, పోగొట్టును. తీపిగనుండును. వాతముబెంచును. పాచనకారి. అగ్నిదీప్తినిచ్చును. పరిశుద్ధమైనది. బలమునిచ్చును.

యవతిక్తతైలము:—పద్మమను చెట్టుపట్టలోనుండి తీయబడిన నూనె చిరిచేదుగనుండును. ఆయువు ఆరోగ్యమునిచ్చును. దీపనలేఖనకారి బుద్ధివికాసమునిచ్చును. పథ్యమైనది, త్రిదోషముల హరించును,

యవలు:—స. యవ, శుచి, తీక్ష్ణశూక అనిపేరు. ఇదియొక ధాన్యభేదము ఉత్తరదేశమునపండును. గోధుమలవలెనుండును. పితృకర్మలందుపయోగింతురు. యవలు మధురము వగరు రుచులు శీతవీర్యము గురుస్నిగ్ధగుణములు మధురవిపాకముగలవి. పిత్తకఫము రక్తదోషము హరించును. వ్రణరోగులకు నువ్వులవలె పథ్యకారి. బుద్ధి జఠరము వృద్ధిచేయును. లేఖనకారి. మలబద్ధముచేయును. కంఠస్వరమును బాగుచేయును. మేహము దప్పిహరించును. వాతము మలవృద్ధి ధైర్యము శరీకాంతి కల్గించును. ఇందుఅతియవలు నిశూకములు అని భేదములుకలవు. అతియవలు యవలకంటె తక్కువగుణములుకలవి. యవలపిండి చలువచేయును. దీపనకారి చులకనగనుండును. వేగిముగలది. కఫపిత్తహారము లేఖనకారి రూక్షజేసును. నీళ్లలోకలిపిత్రాగిన బలమునిచ్చును. ఉష్ణశరీరులకు పథ్యకరముగనుండును. యవబియ్యమును పొట్టుతీసిన శనగపప్పును వేయించి పిండిచేసిదానిలో శర్కరఘృతము వీటిని జేర్చినపిండియనబడును. యిదిగ్రీష్మకాలమందు భక్షించుటకుహితకరమైనది. గురుత్వముజేసును. దానిని నేయ్యితో ద్రవమగునటుల జేసినలేహికయనబడును, ఇదిలఘువుగనుండును. దీనిని భోజనముచేసిన తరువాతను వాహనములయందు సంచరించునపుడును రాత్రులయందును భుజింజకూడదు. అధికముగను భుజించకూడదు. జలములోకలిపి త్రాగకూడదు. వట్టిపిండిన్ని భుజించకూడదు.

యవక్షారము:—సం. పాక్య, యావశూక, యవాగ్రజ అనియు హిం. జవాఖార్ అనియుపేరు. యవపంచాంగమునుండి సంప్రదా



యానుసారముగ దీసినక్షారము యవక్షారమనబడును. చూ. క్షారకల్పనము. యవక్షారము అగ్నిదీప్తిచేయును. వాతకఫములు శ్వాస గళరోగము ఆమరోగము, అర్శస్సు, గ్రహణి, గుల్మము, యకృత్తు, ప్లీహ హరించును.

యవాసశర్కర:—చూ. పంచదార.

యక్షకర్దమము:—కుంకుమపూవు, అగరు, పచ్చకర్పూరం, కస్తూరి, చందనం యీఐదుగలసి యక్షకర్దమమనియు సుగంధపంచకమనియు చెప్పబడును. యిదిశరీరమునకు పూసుకొనిన చల్లగాసుగంధముగానుండును. దేహకాంతినిచ్చును. చర్మదోషములను తీరనిశిరోరోగమునువిషమును హరించును,

యష్టిమధుకము:—సం. మధుయష్టి, యష్టిమధు, క్లీతక, మధుక అనియు హిం. ములేఠీ, మీఠాలకడీ, ములైఠికా అనియు పేరు. జలమునపుట్టు మరియొకయష్టిమధుకమునకు జలయష్టియనిపేరు యిదియొకక్షుపము దీనిఆకులు గుండ్రగా చిన్నవిగా నుండును. ఎఱ్ఱనిపూవులును పొడవగు చిన్నకాయలును ఉండును. దీనివేరునే ఔషధములయందు వాడుదురు. తీపి, కొంచెము చేదు రుచులు గురుస్నిగ్ధగుణములు శీతవీర్యము మధురవిపాకముకలది. నేత్రములకు హితమయినది. బలము కాంతి శుక్రము తలవెంట్రుకలు వీనిని వృద్ధిచేయును. కంఠస్వరమును బాగుపరుచును. పిత్తము వాతము రక్తదోషము వ్రణశోథ విషము ఛర్ది దప్పి ఆయాసము క్షయ సద్యోవ్రణము వాతరక్తము రక్తపిత్తము హరించును. జలయష్టిమధుకము విషము ఛర్ది దప్పి ఆయాసము హరించును. యష్టిమధుకమును అతిమధురమని వాడుటయుకలదు. మరికొన్నివిశేషములు అతిమధురము అనుశీర్షిక కిందను చూడుము.

యవాగు:—ఆరుభాగములు నీళ్లుపోసి మెతుకులులేకుండా పలచగా కాచబడినగంజి యవాగు అనబడును. 4 భాగములునీళ్లుపోసి మెతుకులులేకుండ కాచినగంజి విలేపి యనబడును. 14 భాగములునీళ్ళుపో

సి మెతుకులుండునటుల కాచినగంజిపేయ యనబడును. అదియేమెతుకులులేనియెడల మండమనబడును. యవాగువు మలమును గట్టిపరచును. దప్పి జ్వరము హరించును. పొత్తికడుపును శుద్ధిజేయును. విలేపి అగ్నిదీప్తికరము బలకారి హృదయమునకు మేలుచేయును. మలమును గట్టిపరచును. చులకనగ నుండును. నేత్రవ్యాధి కలవారికి పథ్యమైనది తృప్తినిచ్చును. దప్పి జ్వరముహరించును. పేయ కడుపునొప్పి జ్వరము బడలిక శరీరస్తంభము అతిసారము వీనినిహరించును. రుచికరమైనది. దీపనకారి లఘువైనది. వాతాదిదోషములు మలము చెమట వీటిని అనులోమగతికి దెచ్చును. మండము మలమును గట్టిపరచును. చులకగ దీపనకారిగ నుండును. శీతలము, ధాతుసామ్యము, స్రోతస్సులకు మృదుత్వము కల్గించును. బడలిక శ్లేష్మము పిత్తజ్వరము హరించును. వేయించినయవలతో కాచినగంజి యావ్యమండమన బడును. యావ్యముల ఘువుగ మలమును గట్టిపరచునదిగ నుండును. శూల అనాహము త్రిదోషములు హరించును. పొట్లపిప్పళ్ళు కలిపినయవలగంజి నవజ్వరమునందు పథ్యమైనది. వరిపేలాలగంజి లఘువైనది. మలమును గట్టిపరచును. శీఘ్రముగ జీర్ణించును. దీపనకారి బియ్యము వీనికి సగము పెసలు చేర్చి కొద్దిగ వేయించి ఇంగువ సైంధవము ధనియాలు ఆకుపత్రి శొంఠి పిప్పలి మిర్యాలు వీనిని సమముగజేర్చి పక్వముచేసిన అష్టగుణమండ మనబడును. ఇదిజ్వరము త్రిదోషములు హరించును. రక్తవృద్ధిచేయును. దీపనకారి శీతలముగ చులకనగనుండును.

యావనాళశర్కర:—చూ. పంచదార.

యిరుగుపచెట్టు:—సం, శింశుప, కృష్ణసార, పిపల, యుగపత్రిక ధూమికఅనియు హిం. సీసమ్ అనియు పేరు. యిది తెల్లయిరుగుప నల్లయిరుగుప అని రెండువిధములు తెల్లయిరుగుపకు సం. శ్వేతశింశుప శ్వేతపత్రి అనియు హిం. సఫేదీసీసో అనియు నల్లయిరుగుపకు కపిలశింశుపా భస్మగర్భ కుశింశుపా అనియు హిం. కాలాసీసమ్ అనియుపేర్లు. యిదిఅరణ్యమునందు పుట్టు పెద్దవృక్షము ఆకులు గుండ్రగానుండును.



పువ్వులు చిన్నవిగా గుత్తులుగాబూచును. యిక్కలిగా పండ్లు పండునని చక్కెకారము చేదు వగరు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. వెదస్సు కుష్ఠు బొల్లి ఛర్ది క్రిమి శోష వస్తి దోషము వ్రణము తాపము రక్తవికారము బలాసకము దద్రువు శోఫ జీర్ణము జ్వరము హరించును. తెల్లయిరుగుప శీతవీర్యముగలది. తెలుపు నలుపు చెట్లు సమాన గుణవీర్యములంగలవి.

యూషములు:—అనగా కట్లు అనేకవిధములు. పదునెనిమిది భాగములు నీళ్ళయందు వకభాగము పెసలు వేసి కాచిన కట్టు ముద్గయూషము అగ్నిదీపనముచేయును. శీతలమైనది. చులకనగ నుండును. వ్రణమునందు జనించెడు జంతువులు తాపము కఫపిత్తజ్వరములు రక్తదోషములు హరించును. దానిమ్మవిత్తులు ఉశిరికాయ వీటిచే కాచబడినకట్టు పిత్త వాతములను హరించును. పెసలు ఉశిరికాయ వీనికట్టు వాతాదులను భేదించును. కఫము పిత్తము దప్పి తాపము మూర్ఛ మదము వీటినిహరించి చలువ చేయును. ఉలవకట్టు గుల్మము అర్శస్సు కఫము వాతము శర్కరాశ్మరి తూని ప్రతితూని మేదోరోగము మేహము వీనినిహరించును. పనకారి దేహమునందు శీఘ్రముగవ్యాపించును. పప్పు ముల్లంగి వీనికట్టు గళగ్రాహక రోగము కఫము జ్వరము శ్వాస కాస పీనస అరుచి కృమి మేదోరోగము హరించును. శెనగకట్టు శీతలముగ వగరుగ చులకనగనుండును. రక్తపిత్తము పీనస కాస కఫ పిత్తములు శమింపజేయును. మకుష్ఠమను ధాన్యపుకట్టు మలబంధనకారి పిత్తము శ్లేష్మము జ్వరము పీనస కాస హరించును. లఘువుగనుండును హృదయమునకు హితకారి తృప్తినిచ్చును. పథ్యకారి.

లవణము స్నేహము వీటినిచేర్చి కాచబడిన కట్టు కృతమనబడును, దీనినిచేర్చక కాచినకట్టు అకృతమనబడును. యీ రెంటిలో కృతమను యూషము గురుత్వముజేయును. రెండవది తేలికనిచ్చును. మజ్జిగజేరినకట్టు కాంజికముజేరినకట్టు పుల్లప్రబ్బలి చేరినకట్టు వకదానికంటె వకటి గురుత్వముజేయును. వాతముబోగొట్టి రుచిబుట్టించును. మండా

ములుయే అన్నము యోషధులచే చేయబడునో వానిగుణములే గలిగియుండును.

రక్తచందనము:—చూ. కుచందనము.

రజతము:—సం. రజత, కలధౌత, రౌప్య, తార, చంద్రభూతి అనియు, హిం, చాందీ అనియుపేరు. సహజము ఖనిసంభవము కృత్రిమము అని మూడువిధములు. కృత్రిమముకన్న ఖనిజము అంతకన్న సహజము మంచిది. కైలాసాది పర్వత రూపమైన వెండి సహజము. దానిని తాకినంతమాత్రమున రోగములు నశించును. హిమాలయాది పర్వతకూటములందు గనులలో పుట్టునది ఖనిజము. ఇది రసాయనము శ్రీరామపాదుకలయందు ఘటితమైయుండు వంగము వెండిగ పరిణమించెను. ఇదియ పాదరూప్యమనబడును. దీనికి కృత్రిమమనిపేరు. బరువుగ స్వచ్ఛముగ స్నిగ్ధముగ కాల్చినను నరికినను తెల్లదిగ నుండునదిగ నునుపుగనుండు రజితము శ్రేష్ఠము. వెండి వగరు పులుపు రుచులు సరగుణము శీతవీర్యము మధురవిపాకము గలది. లేఖనకారి రుచ్యమైనది. వాతకఫములహరించును. అగ్నిదీప్తి బలము వీర్యము కలిగించును. రసాయన సేవావిధి ననుసరించి సేవించిన సకలరోగములు నశించును. వెండిని శోధనమారణములజేసి సేవింపనగును. వెండినికరగించి తైలము మజ్జిగ గోమూత్రము ఆరనాళము ఉలవకషాయము అను వానిలో క్రమముగ చల్లార్చినయెడల పరిశుద్ధమగును. రసభస్మమునునిమ్మపండ్లరసముతో నూరి శుద్ధిచేసిన వెండిరేకులకుపట్టించి యారేకులకు పైన క్రింద గంధకపుచూర్ణముపోసి మూసలో నుంచి చీరజేసి వాలుకాయంత్రమున నొకదినము దృఢమైన యగ్నిచే పాకముచేసి స్వాంగశీతలమున నాపిష్టినిదీసి తాళకముజేర్చి ఆమ్లరసముతో నూరి 12 పుటములువేసిన రజతము భస్మమగును. వెండిని భస్మము గావించు విధులనేకములు. శోధన మారణములుచేసిన రజతభస్మము శతపుటకృష్ణాభ్రక భస్మము, తామ్రభస్మము సమభాగములుగజేర్చి అన్నిటికిసమము త్రికటుచూర్ణముకలిపి బలానుసారముగ నేయి తేనె కలిపి ప్రాతఃకాలము



సేవించుచున్న క్షయ పాండువు ఉదరము అర్శస్సు శ్వాస కాసలు నేత్రవ్యాధులు పిత్తవికారములు నశించును. ఇదియ రౌప్య రసాయనమనబడును. వెండిభస్మమునకు అనుపానము:—సోపురసముతో పుచ్చుకొనిన వీర్యవృద్ధి బలము కాంతి కలుగును. స్త్రీల గర్భదోషములు నశించును. కామోద్దీపనముచేయును. వాయువిడంగముల రసముతో దినిన జ్వరము మేహము త్రిదోషములు హరించును. తెగడ చూర్ణము కలిపి సేవించిన మలబద్ధము అర్శస్సు శోఫ నంజు ఉదరరోగములు కుదురును. ప్రతిప్రాతఃకాలమునందును తేనె నీళ్ళు సమముగజేర్చి అందు రజతభస్మమునుకలిపి త్రాగుచున్న స్థౌల్యరోగము నివర్తించును. తిప్పసత్తుకలిపి భుజించిన ఉష్ణకుదగ్గులు రొమ్ముఆరిపోవుట శుక్లనష్టముమానును. గోమూత్రములోకలిపి త్రాగిన గుల్మము యకృత్ ప్లీహ కఫము తగ్గును. వెన్న చక్కెర కలిపి తినిన ఆయువు కాంతి బలము పుష్టి హెచ్చును. త్రిఫలాకషాయముతో గాని ఏనుగుపల్లేరు వేరు రసముతో గాని సేవించిన జీర్ణించిన సెగ శమించును. తవక్షీరి యేలకుల చూర్ణముతో కలిపి తినిన క్షయము కార్శ్యము కాస నయమగును. ఇట్లు అనుపాన విశేషములతో గూడి రజత భస్మము సకల రోగములను హరించును.

రత్నకంబళము:—అనేకరంగులుగల రోమములచే నేయబడిన రత్నకంబళమును శయనాసనాదులం దుపయోగించిన వాత, పిత్తము హెచ్చును. హేమంతర్తువున పిత్తోద్రేకము ఆయురారోగ్యవృద్ధి కఫశాంతి నేత్రహితము కలిగించును. శిశిరర్తువున వాతప్రకోపము కఫనాశనమును కలిగించును. గాన హితకరముగనుండును.

రత్నఖచితవడ్యాణము:—పిత్తవాతములహరించును.

రత్నపురుష:—సం. శంఖపుష్పి, మేధ్యా, చండా, కంబుమాలినీ అనియు, హిం. శంఖాహులీ, కౌడియాలీ అనియుపేరు యిది తెలుపు మొగపు పుష్పలభేదముచే రెండువిధములు. యిది చిన్నమొక్క. ఊషరభూమియందు విశేషముగాపుట్టును. ఆకులు సన్నగా కో

లగా జిగటగానుండును యింకను నల్లపువ్వులపూచునదియు కలదు. దానినే విష్ణుక్రాంతియందురు. యెఱ్ఱపువ్వుల దానిని రత్నపురుషయందురు. రత్నపురుష వగరు రుచి సరగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. క్రమముగ సేవించిన జరారోగములు హరించును. పవిత్రమైనది. ఆయువు జ్ఞాపకశక్తి బలము వీర్యవృద్ధి మానసోల్లాసము మేహశాంతి చేయును. వయస్సును స్థిరపరచును. వీర్యనష్టమును కట్టును. పలచబడినవీర్యమును గట్టిపరచును. శగరోగము మొదలగు మూత్రనాళములయందలి రోగములుకుదుర్చును. అధిక సంభోగమువలన గలిగిన నీరసముపోగొట్టును. కంఠస్వరమును బాగుచేయును. పిత్తము క్రిమి విషము కుష్టు సాలెపురుగు విషము అపస్మారము గ్రహపీడ మొదలగు రోగములజయించును. తెలుపు యెరుపు పుష్పములమొక్కలు రెండును సమానగుణముగలవి గాని తెల్లపువ్వులది శ్రేష్ఠము. విష్ణుక్రాంత మొక్క కారముగానుండును. బుద్ధిని వృద్ధిచేయును. నులిపురుగు కఫము వ్రణముహరించును. దీనిని కూరవండుకునితినిన విషదోషము తాపము పిత్తవాతము పోగొట్టును. గురుత్వముజేయును. దీనిని సేవించు విధము ప్రతిఉదయమున మూడు లేక అయిదుమొక్కలను సమూలముగా పెరిగి పటికిబెల్లముతో గలిపి నమిలిమ్రింగుట చూర్ణించి పంచదారగలిపి ఆవుపాలతోకలిపి త్రాగుట. పంచదారపాకములో యీచూర్ణము నేయి తేనె కలిపి తినుట స్వరసమునుతీసి సంప్రదాయానుసారముగ ఘృతమునుకాచి సేవించుట వీర్యవర్ధకములగు పెన్నేరు నేలతాడి పిల్లిపీచర మొదలగు వానితో లేహ్యమువండి తినుట యివి మొదలగు అనేకప్రక్రియలు అచ్చటచ్చట కాననగును.

రత్నపురిగుగ్గిలము:—చూ. గుగ్గిలము.

రథారోహణము:—రథము నెక్కుటవలన శుభము సంతోషము అగ్నిదీప్తి కలుగును. దేహమునందు చెమట బుట్టును. వాతపిత్తములు శమించును. రూక్షచేయును. లఘువుగానుండును.



రసకర్పూరము:—ఆముదము, వుమ్మెత్త, చిత్రమూలము వీని వేళ్ళ పైపట్టనుపాదరసముతోచేర్చి కాంజికముతోనూరి బిళ్ళచేసి నీడనుయెండించి ఒకకుండలోఉప్పుపోసి ఆబిళ్ళను ఉప్పుమీదబెట్టి పైసనొక కుండ బోర్లించి చీరజేసి యెండించి రెండుఝాములువండిన తెల్లని భస్మము పైకుండయొక్క లోపలిభాగమంతయుపువ్వువలె ఆవరించియుండును. దీనిని భాండవ రసభాండవ ఇంగ్లీకభాండవ యని వాడుదురు, దేవదారు విష్ణుక్రాంత వీనిని కాంజికముతోనూరి ఆద్రవముతో యేడు సారులు రసమునెత్తుచు నూరి ఆద్రవమును పాతనయంత్రమున వండిన రసముభస్మమగును. కావిరాయి యిటుకసుద్ద పటికి సైంధవలవణము పుట్టమన్ను సూరేకారము కుమ్మరిమన్ను వీనిని రసకర్పూరము చేయుటకై గ్రహింపబడు పాదరసమునకు ప్రత్యేక ప్రత్యేకముగ సమభాగముగగ్రహించి చూర్ణించి వస్త్రగాలితముచేసి యీచూర్ణముతో పాదరసముకలిపి వకజాము మర్దించి యీసముదితచూర్ణమును వకస్థాలియందుబోసి పైన మరియొకస్థాలినిమూసి పాతగుడ్డలు మొదలగువానిజేర్చి నలియగొట్టబడిన మట్టితో రెంటికిని సంధిబంధము గావించి యెండించి యిట్లు మూడుశీలలుచేసి నాలుగుదినములు వండవలెను. సాంగశీతలమైనవెనుక భద్రముగ సంధినివిప్పి పైమూసినస్థాలియందు లోపలిభాగమునంటియుండు రసకర్పూరమును గ్రహించునది యిది బిళ్ళలవలెనుండును. దీనితో లవంగాలు చందనము కస్తూరి కుంకుమపూవు అను వానినిచేర్చి బలానుసారము సేవించునెడ సవాయిరోగములు అన్నియును కుదురును. దీనినే దేవకుసుమరసాయనమందురు. అగ్నిదీప్తి వీర్యవృద్ధి సంభోగశక్తి బలము పుష్టి కలుగచేయును. రసకర్పూరము మిరియములు రెండు సమముగకలపి మాత్రయగుటకు తగినన్ని కరివేపాకులుచేర్చి మెత్తగానూరి కుంకుడుగింజలంత మాత్రలుచేసి వకమాత్ర పసుపు కలిపిన చంటిపిల్లలమూత్రముతో నిచ్చిన కలరావ్యాధి తప్పకనివారించును. వకరోగికి రెండుమూడుమాత్రలు చాలును. మూత్రబంధము ఉపద్రవముగనుండెనేని కొంచెము శుద్ధిచేసిన సురేకారము గోరెంతమాత్రము

లోకలిపి అనుపానముచేయించవలెను. రసభస్మము వాము వెల్లుల్లి మహానాక్షి తెల్లకాచు యివిప్రత్యేకము యేకుచిన్నములు గ్రహించి అందు యేకుచిన్నముల బెల్లమును చేర్చి మెత్తగానూరి ఆముత్తమును పదునాలుగుమాత్రలనుచేసి ఉదయ సాయంకాలములందొక్కొక మాత్ర చొప్పున సేవించి తొమ్మిదవదినమున అభ్యంగనము చేసుకుని నలుబది దినములవరకు కందిపప్పు అన్నము రొట్టె కాచినసీళ్ళు అను వస్తువులను ఆహారముగభుజించుచు గాలి యెండ తగలకుండ జాగ్రతగానుండిన సకలరోగములునశించి శరీరము లోహతుల్యమై బలము కాంతి కలిగి ప్రకాశించుచుండును. మరియు గలగండము గండమాల వాతవ్యాధులు వ్రణములు గుల్మము దుస్తరమైన సవాయిరోగములు నంజు శ్వాసకాసలు దంతరోగములు మొదలగునవి నశించును.

రసకర్పూరమును ఉమ్మితో అరగదీసి రాచిన సవాయిపుండ్లు మానును. మిరియపుచూర్ణము హారతికర్పూరము రసకర్పూరముకలిపి చూర్ణించి వెన్నలోకలిపి రాచిన చిడుము దురద గజ్జి మానును. నల్లమందు రసకర్పూరము కలిపి పెసరగింజలవలె మాత్రలుచేసి యిచ్చిన చంటిబిడ్డల జ్వరము దగ్గు పడిశెముమానును. రసకర్పూరము నూరి ఆముదములోకలిపి త్రాగించిన కడుపుబ్బరము మలబద్ధము యెగరొప్పు తగ్గును. వాతరోగములుహరించును. విరేచనముచేయును.

తీరని అనేకరోగములయందు రసకర్పూరమును అనుపాన భేదములచేనిచ్చిన ఆయారోగములు హరించును. రసభస్మమును సేవించునపుడు నేయి సైంధవము ధనియాలు జీలకర్ర అల్లము అనువానిచే సంస్కరింపబడిన (పోగుపు లేక తాలింపువేయబడిన) చిర్రికూర కొత్తిమిరి పొట్లఆకు కాయ పండు బోడతెరము మొదలగు కూరలు గోధుమలు పాత వరిధాన్యము వీని యన్నము ఆవుపాలు ఆవుపెరుగు ఆవునెయ్యి హంసోదకము పెసరకట్టు యివిపథ్యకరములు. అపథ్యముచేసినయెడల వాతిరోగములు వాంతి మోకాళ్ళయందు మోచేతులయందు మోర్లు ఋతిచలనము తాపము మొదలగు నుపద్రవములు గలుగును. వాంతు



లుగలిగిన పెరుగుఅన్నము జీలకర్రగలిపిన చేపలు మాంసము తినిన తగ్గును. త్రిఫలములు దొండాకు కలబంద నేరేడుచక్క వీనిరసము త్రాగిన తాపము నివర్తించును. యింకను విశేషాంశములు మాంసరత్నసముచ్చయమునందు జూడుడు.

రసము —చూ. పాదరసము.

రససిందూరము:—పాదరసము గంధకము సమములుగ చేర్చి నూరి యాసిష్టిని గాజుకుప్పెలోనుంచి వాలుకాయంత్రమున క్రమాగ్నులతో రెండుదినములువండిన చిగురుటాకురంగుగల సిందూరము కుప్పెయొక్క మూతివద్దపట్టును. పాదరసము గంధకము ఇవి ఒక్కొక్క భాగము 4వ భాగము నవాసాగరము కలిపి నూరి యాచూర్ణమును పైవిధమునవండినను రససిందూరముతయారగును. మూడు భాగములు శుద్ధముగు రసమును, శుద్ధములగు గంధకసీసము లొక్కొక్క భాగమును చేర్చి బాగుగానూరి పైవిధమున వండినను రససిందూరముతయారగును. ఇట్లు తయారైన రససిందూరము పూటకు అడ్డిగెత్తుచో॥ సేవించదగును. అనుపానవిశేషములతో సేవించిన అనేకరోగములనుహరించును. అనుపానము—జ్వరమున జీలకర్ర పిప్పళిరసము సన్నిపాతమున వావిలియాకురసము రక్తపిత్తమున చక్కెర ద్రాక్షపండు కాసరోగమున పిప్పళ్ళు తేనె క్షయయందు నేయి లవంగములు దప్పియందు వట్టివేరు అరోచకమున మాదీఫలము మున్నగు పండ్లరసము వాంతియందు వరిపేలాల పిండి, మదాత్యయమున చక్కెరచేర్చిన నిమ్మసంక్లరసము, మూర్ఛ, మదము అనురోగములందు కొబ్బరికాయలోని నీరు, అపస్మారము సన్న్యాసిరోగములలో గుంటగలగర విషూచియందు శొంఠి జీలకర్ర జాజికాయలరసము లేక చూర్ణము, అజీర్తియందు ధనియాలు శొంఠి కషాయము, గ్రహణియందు పులిచింతాకురసము. ఆమాతిసారమున వేయించిన కరక్కాయచూర్ణము, శూలతోగూడిన ప్రవాహికాగ్రహణియందు కాల్చినశొంఠి, అగ్నిమాంద్యము నంజు ప్లీహ హృద్రోగము వీనియందు అల్లపుస్వరసము, మేహవ్యాధులందు ఉశిరిగరసము, మూ

త్రికృఛ్రియందు పల్లేరుకషాయము, ఆనాహ (మలమూత్రములు బంధించి కడుపుబ్బరముచేయువ్యాధి) యందు ఇంగువ గుల్మమున త్రికటుకములు, శూలయందు యవక్షారము, పాండువున యినుపచిట్టెపు కషాయము, కామిలయందు చింత వేప వీని ఈనెలకషాయము, పీనసయందు గుమ్మపాలు, కుష్టమున బావంచివిత్తులు లేక తగిరిసవిత్తులు, లేక చంద్రభక్కకషాయము, వాతవ్యాధియందు మినపకట్టు లేక నూనె లేక ఉల్లిపాయరసము, నోటిపూతకు చందనము, వాతరక్తమున గొలిమిడి (గొబ్బి) వేరుకషాయము, దంతరోగములలో చంద్రచేవ కషాయము, ఆవరణవాతమున కూతురుబుడమ రసము, ఎక్కిళ్ళు కడుపుబ్బరము వీనియందు ఉలవకట్టు అనువానిని అనుపానములుగ నుపయోగించవలెను. మరియు అరటిపండ్లు చెరకురసము అనువానితో సేవించిన శుక్రము బుద్ధి బలము కాంతి కలిగి ఆయువృద్ధియగును ముసలితనముచేగలిగిన ముడతలు వెంట్రుకలు నెరయుట నశించును. మరియు నీసిందూరమును పరిమాణనియమము నేర్పరచుకొని ప్రతిదినము సేవించునెడల సమస్తరోగములు నశించి దీర్ఘాయురారోగ్యములు కలుగును. చిన్నం రససిందూరము, 5 మిరియములు సాయంత్రమున ఆవుమజ్జిగలో నానబెట్టి ఉదయమునతీసి అందు 4, 5 గుంటగలగరాకులు వేసి నూరి మాత్రచేసి 9 దినములు ఉదయములందుమాత్రమే సేవించుచున్న జీర్ణజ్వరము కామిల పాండువు హరించును. వరుసజ్వరము కట్టును. క్రొత్తరక్తమునుపుట్టించును. అన్నమునందిచ్ఛగలుగజేయును. దీపనపాచనములచేయును.

రససిందూరమును రుద్రజటఆకురసముతో నూరి బిళ్ళచేసి భూమియందు వాలుకాపుటము వేసిన తెల్లగ భస్మమగును. ఇది చంటిబిడ్డల దగ్గు పడిసెము పాలఉబ్బసము నిక్కాక మొదలగురోగములందు బాగుగపనిచేయును. నల్లజీడిగింజలను ముక్కలుగా నరికి (శేరుముక్కలు) యాముక్కలలో 8 తులముల రససిందూరమును పెట్టి నిప్పు తగిలించి బాగుగా జీడిరసమున నుడుకునట్లుచేసి యీవలకుతీసి యాసిందూరము



ను దుష్టుపుపాలతో నూరి పెసలవలె మాత్రలుచేసి జీర్ణజ్వరములు ఉడుకు మన్యపుజ్వరము వరుసజ్వరము మొదలగు వానియందు వాడనగును. యింకను రససిందూరమును వాడుపద్ధతులు వేలు గలవు. సిందూరవిధానములును అనేకములుగలవు. ఆప్రక్రియ లన్నియు సిందూరకల్పము అనుగ్రంథమున విపులముగవ్రాయబడును

రసాంజనము —సం. రసాంజనం, తార్క్ష్యశైల. రసగర్భ, అనియు, హిం. రసోత్ అనియు పేరు మానుపసుపును నలియగొట్టి నాలుగురెట్లు మేకపాలలో వేసి 4వ వంతు మిగులునటులగాచి వడియగట్టి యాకషాయమును మరల గట్టిపడువరకు కాచిన రసక్రియకు దార్వీరసాంజనమనియు, రసాంజనమనియు చెప్పుదురు. గనులందు పుట్టు రసాంజనము పచ్చగనుండును. విషదోషము ముఖరోగములు శ్వాస హిధ్మ వాతపిత్త రక్తదోషములు హరించును. దేహకాంతి నిచ్చును. దార్వీరసాంజనము కటురసము తీక్ష్ణగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. నేత్రములకు హితకరము. కఫము విషము రక్తపిత్తము ఛర్ది హిక్క శ్వాస ముఖరోగములుజయించును. రసాయనము ఖనిజమగు రసాంజనము దొరకకుండుటచే దార్వీరసాంజనము నుపయోగించు పద్ధతి పూర్వాచార్యులు విధించినందున యించుమించుగ ఖనిజముతో సమానమగు ప్రభావముగలదని యూహింపబడుచున్నది.

రసాల— పెరుగును చేతితో చిలికి దానిలో మిరియాలు శొంఠి లవణము శర్కరచేర్చి సిద్ధముచేయబడినది రసాలయనబడును. ఇదిశరీరపుష్టి శుక్రవృద్ధి బలము కలిగించును. జిగటగ నుండును రుచి బుట్టించును.

రాగి:—చూ. తామ్రము. -

రాచఉసిరిగ:—ఇదియొక ఫలప్రధానమైన చెట్టు. ఆకులు కరివేపాకులవలెనుండును. కాయలు గుండ్రగ కొంచెము గొగ్గిగనుండును. పులుపు తీపి వగరు రుచులుగలవి శైత్యముచేయును. దప్పిని ఆపును. రాచఉసిరిగ వేరు రసమును త్రాగిన మూత్రకృఛ్రినెమ్మదించును

మూత్రమును జారీచేయును. అధికపరచును, కఫమును బెంచును. రాచయుసిరిగకాయలను ఉప్పులో ఊరవేసి కారము కలిపి వేసవి కాలమున తిందురు. దీనివలన నోటియందు నీరూరును. దప్పితగ్గును, రుచిని బుట్టించును.

రాజఖండకాదిగుణము:—బెల్లపు పాకములో మామిడిపిండెలు నేయి ఏలకులు లోనగు వీటిని జేర్చి పాకముజేసిన రాజఖండకమనబడును శర్కర మాదీఫలము సైంధవలవణము పులిచింత ఈత నిమ్మ వీనిపండ్ల రసము నల్లావాలు వీనితో పాకముచేయబడిన మామిడిపిండెలురాగమనబడును. తీపి పులుపు వగరు కారము చేదు యీరసములుగల వస్తువులచే పక్వముచేయబడిన ఖాండవ మనబడును. పైజెప్పిన రాజఖండకాదులు అగ్నిదీప్తి శరీరపుష్టి రుచి కలుగచేయును. తాపమునిచ్చును. హృదయమునకు మేలుచేయును. బడలికనుపోగొట్టును.

రాజావర్తము:—ఇది రత్నములలో చేర్చదగిన యొకవిధమగు రాయి కొంచెముమెరుపు అధికముగ నీలము కలసిన రంగుగలదై బరువై నున్ననై యుండు రాజావర్తముమంచిది రాజావర్తమును సేవించిన ప్రమేహము దుర్నామరోగము పాండువు శ్లేష్మవ్యాధులునశించును. దీపనపాచనకరము. వీర్యవృద్ధిచేయును. రసాయనము నిమ్మపండ్లరసము గోమూత్రము క్షారములు వీనిలో రెండుమూడుసారులు స్వేదనముచేసిన రాజావర్తము శుద్ధమగును. శుద్ధమగు రాజావర్తముతో గంధకముచేర్చి 7 పుటములు వేసిన భస్మమగును. శుద్ధిమారణములు జేసిన రాజావర్తమునే సేవించదగును.

రాత్రినార:—ఇంచుమించు దీనియాకృతి నవాసాగరమునుపోలియుండును. దొండాకుపసరుతో నూరి పుటము వేసిన భస్మమగును. ఇది ప్రమేహము మూత్రకృచ్ఛ్రి సెగరోగము పొడితగ్గు మొదలగు రోగములజయించును. చలువచేయును.

రాతిపువ్వు:—సం. శైలేయము, శైల, వృద్ధ, సుభగ అనియు, హిం. భూరి, ఛరీలా అనియుపేరు. దీనిని శిలాధాతువందురు. తెల్లగా పువ్వువలె గట్టిగా నుండును. కొన్నిచోట్ల రాళ్ళయందు మొలచును. దీనిని రాతిమీదవేసినూరిన మెత్తగ చూర్ణమగును. దీనిని కాల్చినయెడల సున్నముగాక కర్పూరశిలాజిత్తువలె భస్మమగును. ఇదిచేదు కారము రుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. హృదయమునకుమేలుచేయును. కఫపిత్తములు అశ్మరి మూత్రకృచ్ఛ్రి రక్తవికారము దురద తాపము విషము ఛర్ది శ్వాస వ్రణదోషములు అగ్నిమాంద్యము రక్తార్శస్సు క్షయ మున్నగురోగములజయించును.

రాబులుగుమాంసము:— జిగటగ శీతలముగ మధురముగ నుండును. గురుత్వముకలది. మలమూత్రములను జారీచేయును. వాతము పిత్తరక్తము హరించును.

రామాఫలము:—సం. రామఫల, రక్తత్వచ, వాసంత, కృష్ణబీజ అనియు, హిం. లవనీ, ఏనోనా అనియుపేరు. శీతాఫలము వలెనే యుండునుగాని దీనిపైచర్మము యెర్రగనుండును. రుచి రూపము అన్నియుసమానములు. అందువల్లనే రామ సీత అని యీరెంటికిని రెండు పేళ్ళుంచిరి. మధుర కషాయ అమ్లరసములు గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. కఫవాతములబెంచును. రక్తదోషము దప్పి తాపము పిత్తము శ్రమ ఆకలి వీటినిజయించును.

రావిచెట్టు:—సం. అశ్వత్థ, బోధిద్రుమ, పిప్పల, గజాశన, చలపత్ర అనియు, హిం. పీపలవృక్ష అనియుపేరు. ఇదిపెద్దవృక్షము. మిగులప్రసిద్ధమైనది. పంచవల్కల వృక్షములలో నొకటి. రావిచెక్క వగరు తీపి చేదు రుచులు గురు రూక్షగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. ఆలస్యముగ జీర్ణమగును. చెక్క కషాయముతో కడిగిన పిత్తశ్లేష్మ వ్రణములుమానును. చూర్ణమును తినినను కషాయముద్రాగినను యోనిదోషము రక్తవికారము పిత్తము హరించును. పక్వమైన రావిపండు చలువచేయును. రక్తవికారము విషము పిత్తము తాపము ఛర్ది శోష అరుచి వీనినిజయించును. రావిచెక్కను కాల్చిన బూడిదనుండితీసిన క్షారము శూల అగ్నిమాంద్యము గుల్మము కడుపులోని బ

ల్లలుహరించును. పాషాణముమొదలగు ఘోగవస్తువులనుకట్టును. చెక్కరసము రస రంజనాదుల కుపకరించును. రావిచిగుళ్ళను ఆముదముతో కొద్దిగ వేయించి కట్టుగట్టిన మేహవాతపునొప్పులుహరించును. రావిచెట్టుక్రింద రాత్రిపూటబరుండిన అనారోగ్యముగను, పగటిపూట ఆరోగ్యముగను ఉండును. రావిపండ్లచూర్ణమును పంచదారకలిపి ప్రతియుదయమున ఆవుపాలతో సేవించునెడల స్త్రీల గర్భదోషములు నివర్తించి గర్భధారణయోగ్యతను కలిగించును. రావిచెక్కనుకాల్చిన బూడిదను ప్రతియుదయమున ఫాలదేశమునందు ధరించుచుండిన ముఖమునకు తేజస్సు కాంతి కల్గును.

రాసున్నము:—సున్నము బెల్లముకలిపి పట్టువేసిన కవుకుదెబ్బ వాపుతగ్గును. సున్నముమీద తేటనీరును 3 మొదలు 5 తులములవరకు లోపలకుత్రాగిన శూల కడుపుబ్బరము తక్షణముతగ్గును. త్రాగిన వెంటనే తమలపాకునమలవలెను. కుంకుడుకాయంతలోపుగ సున్నమును ఉండజేసి వెన్నలోపొదిగి మ్రింగిన చలిజ్వరమాగును.

రాస్న:—సం. రాస్నఅనియు, హిం. రాస్న అనియు పేరు. రాస్నయనునది ఒక చెట్టు. ఇది ఉత్తరహిందూస్థానమున కేదారక్షేత్రమున బహుళముగదొరకును. దీనిచెక్కనే రాస్నయనివాడుదురు. కొందరు దుంపరాస్నము కళింగరాస్నము అను దుంపలను రాస్నగావాడుచున్నారు. గాని యది కేవలముపొరబాటుఅయియున్నది. దుంపరాస్నము కళింగరాస్నము అనువానిలో కారముకలదు. రాస్నయందు కారములేదు గనుక రాస్నయనునది భిన్నముగానుండునని సులువుగదెలియుచున్నది రాస్నావృక్షముయొక్క స్వరూపము చక్కగాతెలియనందున వ్రాయజాలము. రాస్న చేదు రుచి గురుగుణము ఉష్ణవీర్యము కటువిపాకము గలది. కఫవాతము శోధ శ్వాస వాతరక్తము వాతశూల ఉదరము కాస జ్వరము విషము ఆమదోషము హిధ్మ విషజ్వరము ఎక్కిళ్ళు కంపము 80 విధముల వాతవ్యాధులు వీనినిహరించును.



రుదంతి:—అనగా అడవిసెనగచెట్టు. సెనగచెట్టునకును దీనికిని ఆకారమునందేమియు భేదముండదు. రుదంతిచెట్టు మొదటయెప్పుడును తడిగానుండును. చెట్టునుండి నీటిచుక్కలు కన్నీరు చుక్కలవలె పడుచుండును. గాన దీనికి రుదంతియని పేరుగలిగెను. యీచెట్టుయొక్క మొదల పాదరసమునుపాతిపెట్టి 9 దినములుంచిన నదిగట్టిపడి నిప్పుపై వేసినను యెగిరిపోక నిలచియుండుననియు, ఆబద్ధ రసమువలన రసవాదవిధానమున అనేకోపయోగములు కలవనియు చెప్పుదురు. ఈచెట్టుయొక్క యితరఉపయోగములు విశేషముగ తెలియవు.

రుద్రజడచెట్టు:—సం. రుద్రజట, సుగంధ అనియు, హిం. సబ్జాఅనియుపేరు. ఇదిచిన్నమొక్క. సర్వాంగములును పరిమళ భరితములై యుండును. తులసివెన్నువలె వెన్నువేయును. దీనిలోని గింజలు నల్లగా మిలమిలలాడుచుచిన్నవిగ నుండును. నీటిలోనానబెట్టిన యీడల నూకలఅన్నమువలె విచ్చి తెల్లగనుండును. సమూలరసము చేదు కారము రుచులు స్నిగ్ధపిచ్ఛిలగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. ఆకురసము చెవిలోబోసిన పోటుతగ్గును. వేరురసము లేక కషాయమును త్రాగిన మూత్రముజారీఅగును. సమూలరసముతో అనేక లోహపాషాణములను భస్మముచేయుదురు. నీళ్ళలోనానబెట్టిన సబ్జావిత్తులను పంచదార కలిపితినిన అమిత మేహశాంతిచేయును. నిక్కాకనణచును. వేడివలనపుట్టు కండ్లమంట కడుపులోమంటతగ్గును. మలమును వృద్ధిచేయును. మలబద్ధముగూడకలిగించును. ఆకును చూర్ణించి తినుచున్న స్త్రీలకు గర్భశుద్ధిని కలిగించును.

రుద్రాక్ష:—సం. రుద్రాక్ష, భూతనాశన, తృణమేరు, అమర, పుష్పచామర అనియుపేరు. హిం. రుద్రాక్ష అనియుపేరు. ఉత్తరహిందూస్థానమున రుద్రాక్షచెట్టుమొలచును. దీనికాయలు కొన్నిచిన్నవిగ అనేకతరగతులుగ కాయును. రుద్రాక్షపండులోని గింజలను తోలవేసి మాలికలుగూర్చి ధరింతురు. ఇవి మిగులపావనమైనవి, రుద్రాక్షపండు పుల్లగ ఉష్ణవీర్యముగనుండును, వాతకఫములు శిరోరోగము భూతబా

ధనశింపచేయును. రుద్రాక్షలనుఅరగదీసి యాగంథమును సన్నిపాతాదులందు నాలుకపైరుద్దినయెడల నాలుకయందలి అరుచి జడత్వము గరగరలాడుట ముండ్లులేచుట నోరుఆరిపోవుట మున్నగు అనేకజిహ్వాదోషములుశమించును, రుద్రాక్ష, పగడము, ముత్యము, వీనినిఅరగదీసి అల్లపుస్వరసము నిమ్మపండురసము కలిపి నాలుకకుఁరుద్ది బంగారుతోఁగీచుట ఆంధ్ర దేశమందాచారముకలదు, ఈప్రక్రియకు గండూషమని పేరు రుద్రాక్షలనుధరించిన పాపములుహరించును.

రుద్ధి లేక ఋద్ధి:—చూ. అష్టకవర్గ.

రుషభకము లేక ఋషభకము:—చూ. అష్టకవర్గ.

రూమిమస్తకి:—యూనానీసంప్రదాయ ద్రవ్యము. ఇదియొకచెట్టుయొక్కజిగురు. జలుబు దగ్గు మతిభ్రమ స్థౌల్యము దంతరోగములు ముఖదుర్గంధము అజీర్ణము హిక్క మున్నగురోగములను హరించును. మిగులవేడిచేయును వీర్యము బలము కాంతి ఆయువు పెంపొందించును. దీనిపొగనుపీల్చినయెడల విషమువలె శరీరమునకుహానిచేయును, వీర్యవర్ధకమగు ఔషధములలోచేర్చి విశేషముగ వాడుకచేయనగును.

రెడ్డివారినానబాలు:—చూ. నాగార్జుని.

రెల్లుగడ్డి:—సం కాశ, సుకాండ, కాసేక్షు, నాదేయఅనియు హిం. కాంస్ అనియుపేరు. ఇది నదులయొడ్డునపెరుగు ఒకజాతిగడ్డి. తృణపంచమూలములలోనొకటి. శరత్కాలమునందిది తెల్లని పూవులను గుత్తులుగపూచి మనోహరముగనుండును. వేరును ఔషధములలో వాడుకచేయదగినది. మధుర తిక్తరసములు సర స్నిగ్ధగుణములు శీతవీర్యము మధురవిపాకము గలది. రుచి బలము వీర్యము కలిగించును. పిత్తతాపము మూత్రకృఛ్ర క్షయ అశ్మరి రక్తదోషము రక్తపిత్తము క్షతక్షయము పిత్తరోగములు వీనినినశింపచేయును.

రేగడిదూలగొండి:—సం. యాస, మరూద్భవ, దీర్ఘమూల, దూరమూలఅనియు, హిం. జవాసా అనియుపేరు. అనగా చిన్నదూలగొండి. చూ. దూలగోవెల



రేగుచెట్టు:—సం. బదరీ, దృఢబీజ, సుఫల, నఖి అనియు, హిం. బేరీఅనియుపేరు. రేగుచెట్లలో అనేక భేదములుకలవు. చిట్టిరేగు గంగరేగు పుల్లరేగు మొదలగునవి కలవు. యీ చెట్టునకు చిన్నచిన్నముండ్లును చిన్నఆకులును ఉసిరికాయలమొదలు పొగడపండంతవరకు పెద్దవియగుకాయలును తెల్లనిపూవులును ఉండును. కాయలలో రుద్రాక్షలవంటి ఆకారముగలగింజలుండును.

రేగుచక్క రసము వగరు రుచి గురుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. కళ్ళిదగ్గు రక్తపిత్తము కుసుమరోగము నీళ్ళవిరేచనములు గ్రహణిహరించును. రేగువేరుపట్ట చూర్ణమును పుండ్లపైజల్లిన వేగముగమానును. రేగుఆకునునూరి శరీరమునకుపూసిన జ్వరము తాపము నశించును. చక్కను నూరి పూసిన విస్ఫోటము నేత్రరోగములు హరించును. రేగుపండు (తియ్యనిది) వగరు తీపి రుచులుగలది. శుక్రము బలము పుష్టి కలిగించును, కాస శ్వాస దప్పి వాతము ఛర్ది తాపము పిత్తము హరించును. రేగుగింజలలోని పప్పును దోరగవేయించి చూర్ణించి తేనెతోదినిన ఛర్ది తాపము శ్వాసకాసలు హరించును.

పెద్దరేగునకు సంస్కృతమున గజబదరీ తనుబీజ రాజబదర అని పేరు. పెదరేగుపండు మధురరసము శీతవీర్యముకలది. తాపము పిత్తతాపము శోష బడలిక హరించును. వీర్యస్తంభనము వీర్యవృద్ధి కలుగ జేయును.

నేలరేగునకు సం. భూబదర, వల్లివిదారీ, బదరవల్లీ అనిపేరు. నేలరేగుపండు పుల్లగ తియ్యగనుండును. కఫవాతములనుపోగొట్టును. దీపనపాచనకరము. పథ్యమైనది. ఒకింత పిత్తరక్తమును కలిగించును. రుచిబుట్టించును.

రేణుకలు:—సం. రేణుక, కపిల, కౌంతి, హరేణు అనియు, హిం. సంభాలూకేబీజ్ రేణుక అనియుపేరు. ఒకజాతిగింజలు. నల్లగ మిరియములవలెనుండును. కారము చేదు రుచులు ఉష్ణవీర్యము లఘుగుణము కటువిపాకముగలవి. పిత్తము అగ్నిదీప్తి పాచనము గర్భపాత-

ము గలుగజేయును. బలాసము వాతము దప్పి దురద విషము తాపము హరించును. ముఖమును శోధించును. కఫమునుబోగొట్టును.

రేలచెట్టు:—సం. ఆరగ్వధ, రాజవృక్ష, వ్యాధిఘాత, శమ్యాక, చతురంగుల, కృతమాల అనియు, హిం. అమలతాస్, ఘనబహేడా అనియుపేరు. సాధారణమైనచెట్టు. ఆకులుపొడవుగ కోలగనుండును: పసుపుపచ్చనిపూవులును సన్నముగ గుండ్రగ అర్ధగజముమొదలు గజమువరకు పొడవుగనుండు కాయలును ఉండును. రేలపండ్లు నల్లగను పచ్చివి ఆకుపచ్చగనుఉండును. పండుకాయలోనిగుంజు నల్లగ చింతపండువలె నుండును. పలచని గుండ్రగనగు బద్దలవంటి గింజలుండును. యీకాయలను నక్కలుతినును. రేలచెక్కతో చర్మములు బాగుచేయుదురు. రేలచెక్క స్వాదురసము గురుగుణము శీతవీర్యము మధురవిపాకముకలది. మృదువుగ విరేచనము చేయును. జ్వరము హృద్రోగము పిత్తరక్తము వాతము ఉదావర్తము శూల హరించును. రేలపండులోనిగుజ్జు మధురరసము స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకము గలది. అగ్నిదీప్తినిచ్చును, విరేచనముచేయును. పిత్తవాతములహరించును. మలబద్ధము మూలరోగముగలవారలకిది మిగుల హితకరము. మరియు కుష్టు పిత్తకఫములు హరించును. కోష్ఠమును శుద్ధిపరచును. జ్వరమునందు విరేచనము చేయించుట కనుకూలమగు వస్తువు. రేలఆకు లేక చిగురు కఫమును మేదస్సును శోషింపచేయును. గాఢవిరేచనకరము. మలదోషముగల జ్వరమున రేలయిగురుపచ్చడి తినిపించుట మంచిది. రేలపూవు తీపిగ శీతలముగ చేదుగ వగరుగనుండును. మలబద్ధముచేయును. కఫపిత్తములహరించి వాతమును పెంచును. రేలవేరును పాలతో నొక్కి రసముతీసి త్రాగిన వాతరక్తము దద్రులు మండలకుష్టు మొదలగు చర్మరోగములు హరించును.

రేవల్చిన్ని:—సం. రేవటచీనీ, పీత, గంధినీ, పీతమూలిక అనియు, హిం. రేవతచీనీ అనియుపేరు. ఇది చిన్నక్షుపము. దీనివేరు లేకదుంపను ఔషధములందు వాడుదురు. యిది పసుపుపచ్చగ నుండును.



కారము, చేదు, రుచులు, శీతవీర్యము, లఘుగుణముచు, కటువిపాకముగలది. లఘువుగ విరేచనముచేయును. మూత్రబద్ధమునువిప్పును. అజీర్ణము, అతిసారము, అగ్నిమాంద్యము, అరోచకము సుప్తవ్రణములు వీనిని హరించును. రేవల్చిని కలితో అరగదీసి యాగంధమునందు సురాకారము కలిపి వస్తిమీద పట్టువేసిన కొంతసేపటికి మూత్రముగావించును. రేవల్చిన్ని కషాయమునందు సోడాఉప్పు కలిపిన యెర్రబడును. యీనీళ్ళను త్రాగుచుండిన సెగరోగము మూత్రకృచ్ఛ హరించును. మోతాదు ఒకటిరెండు ఔన్సులు.

రోయ్యపీత:—ఇదియొకజాతి. చేపయొక్క చేదు పసుపుపచ్చగనుండును. కఫవాతములు, జలుబు, విదాహము, సన్నిపాతము, సూతికావాతము మొదలగువ్యాధులు హరించును. పంచపిత్తములు (కస్తూరిజున్ను గోరోచనము పావుదార రోయపీత) కలిపి మాత్రలుచేసి బిడ్డలకువాడుదురు. వీటివలన సకల వాతశ్లేష్మములుతగ్గును. మిగులవేడిచేయుదగిన ఔషధములలో కలిపిగాని ప్రత్యేకముగగాని వాడవచ్చును.

రోమకలవణము:—సం. రోమక అందురు. ఉప్పు చేదురుచులు తీక్ష్ణగుణము, ఉష్ణవీర్యము కటువిపాకముగలది. దాహము శోష మలబద్ధము పిత్తము వీటిని కలిగించును. అగ్నిదీప్తినిచ్చును.

లంకలు —వీనిని బటానీలుఅని ప్రసిద్ధముగ వాడుదురు. వీనిని బోడసెనగలనియు అందురు. చూ. బటానీలు.

లంజముండచెట్టు:—దాక్షిణాత్యులు దీనిఆకును కూరవండుకొనితిందురు. ఈఆకులు దేశవాళీ బాదంఆకులవలెనే యుండును. భేదమేమియు స్థూలదృష్టికి కనబడదు. ఆకులువిరిచినను కొమ్మవిరిచినను పాలుగారును. దీనిని పప్పులోవేసి కూరవండుకొని తినినకమ్మగానుండును. ఈకూరనుతినిన వాతపునొప్పులు, బెణుకునొప్పులు, నడుము, కీళ్లుమొదలగుచోట్ల చిరకాలమునుండియున్న నొప్పులుతగ్గును. మొమ్మాయిని ఉపయోగించవలసిన నొప్పులరోగములో దీనినివాడిన కొంతవరకు మంచిగుణము నిచ్చును.

లక్క:—సం. లాక్ష, కీటజ క్షతఘ్నీ. జతు, రక్తమాతృక అనియు హిం. లాఖ్ హీ అనియు పేరు. ఇదియొక జాతి పురుగు పెట్టు గూండ్ల వలన తయారగును. యెరుపు నలుపు రంగులు కల్గియుండును. గుగ్గిలము ఆముదము మొదలగు వస్తువులతో నల్లని లక్క వంటచేయుదురు. కృత్రిమమగు లక్కకన్న కొన్ని మంచిగుణములు యెఱ్ఱలక్కయందుండును. వంటలక్కతో వాదమునందు కొన్ని పోగవస్తువులను కట్టుదురు. లక్క చేదు వగరు రుచులు లఘుస్నిగ్ధగుణములు శీతవీర్యము కటువిపాకముగలది. బలము నిచ్చును. కఫపిత్త రక్తరోగములు హిక్కా కాస జ్వరములు వ్రణము ఉరఃక్షతము విసర్పము కృమి కుష్ఠము విషరక్తము విషమజ్వరము శోఫ చర్మవ్యాధులు మున్నగువానిని సంహరించును. ప్రధానముగ రక్తపిత్తము ప్రదరము రక్తాతీసారము పిత్తక్షయము హరించును. స్త్రీలరజస్సు నాపుచేయును.

లక్ష్మీకాంత:—దీనినే నేలబెండ అందురు. జానెడెత్తు పెరుగును కొంచెము యెరుపువాకుగల తెల్లని చిన్నచిన్న పూలుపూచును. పిప్పలికాయయంత కాయకాచును. దీనిఆకునలిపిన జిగురుగను నమిలినచో చప్పనిరుచికలదిగను ఉండును. ప్రతిదినము ఒక్కొకఆకుచొప్పున హెచ్చించుచు మొదటదినము ఒకటి రెండవదినము రెండాకులు యిట్లుఇరువదిదినములవరకు పుచ్చుకొని క్రమముగ ఒక్కొకఆకు తగ్గించుచు పుచ్చుకొనవలెను. ఉదయముఒక్కపూట చాలును. అమితవీర్యవృద్ధికలుగును. శుక్రముగట్టిపడును. స్తంభనముచేయును. తేలుకుట్టినపుడు 5, 6 ఆకులు నమిలిమింగిన బాధతగ్గును. దీనిని కల్పప్రకారము ఒక సంవత్సరమువరకు సేవించిన తేలు పాము మున్నగు విషములు శరీరమునకెక్కవు.

లక్ష్మీతులసి:—చూ. తులసి.

లఘుపంచమూలములు:—ముయ్యాకుపొన్న, కోలపొన్న, వాకుడు ములక పల్లేరుయీ అయిదింటి వేళ్ళకూటమికి లఘుపంచమూలమనియు హ్రస్వపంచ మూలమనియుపేరు. చేదు వగరు రుచులు సమవీ



ర్యము లఘుగుణము కటువిపాకముగలది. బలము పుష్టికలిగించును. త్రిదోషహరము.

లత్తుక:—సం. అలక్తక, దీప్తఅనిపేరు. ఇది లక్కయొక్క గుణాదులు కల్గియుండును. విశేషముగ వ్యంగరోగహరము.

లవంగపట్ట:—చూ. దాల్చినచెక్క.

లవంగాలు:—సం. లవంగ, దేవకుసుమ, కలికోత్తమ, భృంగార, వారిజ అనియు హిం. లోంగ్ అనియుపేరు. లవంగపుచెట్లు కేరళదేశమున పెరుగును. ఆకుసుగంధముగను చెట్టుమనోహరముగనుండును. లవంగముఅనునది. యీచెట్టుయొక్క మొగ్గ కారము చేదు రుచులు విశదలఘుగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. నేత్రములకు హృదయమునకు మేలుచేయును. దీపనపాచనముల కల్గించును. రుచిబుట్టించును. ముఖదుర్గంధమును హరించును. కఫపిత్తములు రక్తదోషము ఆనాహము శూల దప్పి ఛర్ది ఆధ్మానము శ్వాస హిక్క క్షయ హరించును. యెక్కువగతినిన పిత్తమును హెచ్చించును. లవంగములనుండితీసిన తైలము అగ్నిదీప్తినిచ్చును. వాతము దంతవేష్టము (పలుకురుపు) గర్భిణులకువచ్చు వేవిళ్ళు హరించును. లవంగము పచ్చకర్పూరము, ఏలకులు, దాల్చినచెక్క, నాగకేసరములు, జాజికాయ వట్టివేరు, శొంఠి, జీలకర్ర కృష్ణాగరు, తవక్షీరి, జటమాంసి, నల్లకలువపూవు, పిప్పలి, శ్రీగంధము, గ్రంథితగరము, కురువేరు. తక్కోలాలు, ఇవిసమముగ చూర్ణించి చూర్ణమున సగము చక్కెరకలిపి బలానుసారముగ సేవించిన అగ్నిదీప్తి నోటియందురుచి బలము వీర్యవృద్ధికలుగును. త్రిదోష కఫ ప్రకోపములు హృద్రోగము కంఠరోగము కాస హిక్క పీనస క్షయ తమక శ్వాస అతిసారము ఉరఃక్షతము ప్రమేహము అరుచి గుల్మము సంగ్రహణి నశించును. దీనికి లవంగాదిచూర్ణమనిపేరు. మిరియాలు, వాయువిడంగములు, లవంగములు, శొంఠి ప్రత్యేకమొక భాగము. దుష్టుపువేరుపట్ట నాలుగుభాగములు కలిపిమెత్తగానూరి శనగగింజలంత మాత్రలుచేసి తమలపాకురసముతో సేవిం

చిన దారుణమగు తమక శ్వాస (మేఘరంజి) ఉబ్బసము మొదలగు దగ్గులు శమించును. చక్కనియోగము. పథ్యము. కందికట్టుకారము వేయించినఉప్పు అన్నము. లవంగాలను నీళ్ళతో నొక్కిరసముతీసి పొంగించితాగిన సాధారణపుదగ్గులు తగ్గును. లవంగమును అరగదీసి కంఠములో పెట్టిన దురద మసక తగ్గును. లవంగము రససిందూరము తేనెతో అరగదీసి నాకిన ఒడదెబ్బవలన కలిగిన విదాహముకట్టును. తామరపూవులు లవంగాలు ఉశిరికపప్పు కలిపినూరి కుంకుడుగింజలంతమాత్రలుచేసి బుగ్గను పెట్టుకొని ఊటనుమ్రింగుచున్న దప్పితగ్గును.

లవణతృణము:—సం. లవణతృణ, లోణతృణ, తృణామ్లఅని పేరు. ఉప్పు, పులుపు, వగరు, రుచులు, ఉష్ణవీర్యము లఘుతీక్ష్ణగుణములుకటువిపాకముగలది. స్తన్యమును వృద్ధిచేయును.

లవణత్రయము:—సైంధవ, సౌవర్చ, బిడలవణములు మూడునుకలిపి లవణత్రియమనబడును. ఉప్పు రుచి తీక్ష్ణగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. దీపనపాచనములం జేయును. కఫమునుహరించి పిత్తమును పెంచును.

లవణము:—ఉప్పు లన్నియు సాధారణముగ ఉష్ణవీర్యము మధురవిపాకముగలవి. చూ. సముద్రలవణము.

లావుకపిట్ట:—సం. లావఅందురు. దీనిమాంసము లఘుగుణము శీతవీర్యముగలది. మంచిరక్తమును పుట్టించును. సులభముగజీర్ణమగును. జ్వరితులకు యీమాంసరసము హితమైనది. అగ్నిదీప్తికలిగించును.

లింగదొండ:—సం. లింగినీ, బహుపత్ర, ఈశ్వరి శైవమల్లిక స్వయంభుఅనియు హిం. శివలింగీ, ఈశ్వరలింగీ అనియుపేరు. ఇదియొకతీగ. దీనికాయలునల్లగ గుండ్రగనుండును. పండినవి యెర్రగనుండును పండ్లపై తెల్లని చారలుండును. వీనిలోనిగింజలు శివలింగాకారముగనుండును. ఆకుదుర్వాసనగ నుండును. ఇదికారము రుచి ఉష్ణవీర్యము లఘుతీక్ష్ణగుణములు కటువిపాకముగలది. ముఖదుర్గంధమును హరించును. దీనిఆకురసము పాదరసమును బంధించును. ఇట్లుబద్ధమైనరసము లోహవేధయందును దేహవేధయందును వాదజ్ఞు లుపయోగింతురు. కల్పప్రకారము సమూలచూర్ణమును సేవించిన జరారోగహరముగ నుండును. మరియు సిధ్మకుష్ఠము మొదలగు చర్మరోగములు హరింపచేయును. వశ్యవిద్యయందీతీగ బహుళముగ నుపయోగకరము.



లొద్దుగుచెట్టు:—సం. లోధ్రి తిరీటక శాబర గాలవ హేమపుష్పక భిల్లీ అనియు హిం. లోధ్ అనియుపేరు. ఇదిపెద్దవృక్షము. ఇదిపుష్పముల యొక్కయెరుపు తెలుపు భేదముచే రెండువిధములు తెల్లలొద్దుగమంచిది వేరు లేక పట్టరసము లేక కషాయము వగరు రుచి లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. మలబద్ధముచేయును. కఫపిత్తములు రక్తపిత్తము రక్తదోషము రక్తాతిసారము హరించును. నేత్రములకుహితకరము. శోఫ అతిసారము అరుచి విషము ప్రదరము హరింపచేయును. లొద్దుగుపూవు కటువిపాకము వగరు తీపి చేదు రుచులు శీతవీర్యము గురుగుణముకలది. కఫపిత్తములహరించును. మలబద్ధకరము. లొద్దుగుచక్క మోదుగుచక్క అశోకపుచెక్క వీని కషాయమున రెట్టింపు బెల్లముచేర్చి ఆరెపూవులు లవంగము జాజికాయ నాగకేసరములు మిర్యాలు తేనె కలిపి ఒకమాసమువరకు భూమిలోపాతిపెట్టి తీసి వడియగట్టి తాగిన తెల్లకుసుమ యెర్రకుసుమ అక్రమఋతువు నష్టసంతానత ఋతుశూల మొదలగు స్త్రీలవ్యాధులను హరించును. ఇదియ లోధ్రారిష్ట అనబడును. లొద్దుగు తెల్లలొద్దుగు ఆరుగంట్లకచోరము గిలిగిచ్చ సరళదేవదారు గుమ్ముడుటేకు సన్నరాస్నము కడిమి అరటి అశోకము కూతురుబుడమ తుంగముస్తలు అందుగు యివి లోధ్రాదిగణమనబడును. ఇది మేదోరోగము కఫము యోనిదోషము విషదోషము హరింపచేయును. వాతాది దోషములను మూత్రాది మలములను స్తంభింపచేయును. శరీరమునకుకాంతినిచ్చును.

లోహము:—చూ. ఉక్కు.

వంకాయ:—సం. వార్తాకీ, కంటవృంతాకీ, నిద్రాళు, చిత్రఫలఅనియు, హిం. బైంగన్ అనియుపేరు, ఇందుఅనేకభేదములుకలవు. నీరువంకాయ (పొడవుగ నల్లగనుండునది) స్వాదురసము తీక్ష్ణగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. జ్వరము వాతము బలాసకము హరించును. లేతవంకాయ కఫపిత్తములహరించును. పథ్యమైనది. సులువుగజీర్ణమగును. ముదిరినది పిత్తమునుపెంచును. అపథ్యము. ఆలస్యముగజీర్ణమగును. కుమ్ములోపెట్టి కాల్చినవంకాయ మిగుల తేలికగనుండును. కొలదిగ పిత్తప్రకోపము జేయును. కఫము మేదస్సు వాతము ఆమమునుహరించును. దీపనముగలుగంజేయును. అదియే నూనె ఉప్పు మున్నగునవి కలిపి తినిన సుపువ్వుగ స్నిగ్ధముగ నుండును. మెట్టవంకాయ (తెల్లగ గుండ్రముగనుండునది) నీరువంగకన్న గుణహీనము. ఇది అర్శస్సులందు పథ్యకరము. వీర్యవృద్ధికరము. వంగపండువరుగులు పిత్తమును జఠరమును హెచ్చించును. లఘువుగనుండును రక్తపిత్తమునుఖండించును. సాధారణముగా వంకాయ శ్వాస కాసరోగులకు మిగుల అహితమైయుండును.

వంగము:—చూ. తగరము.

వంశపత్రితృణము:—సం. వంశపత్రి, జీరిక. జీర్ణపత్రికఅందురు. ఇదిమధురరసము, గురుగుణము, శీతవీర్యము, మధురవిపాకముగలది పిత్తము, రక్తదోషము, అరుచి హరించును. పశువులకుమేపిన వాటికి పాలువృద్ధియగును.

వజ్రము:—సం. హీర, వజ్రఅందురు. ఇదియొకరత్నము. ఇందుస్త్రీపురుష నపుంసకజాతులు మూడుకలవు. పురుషవజ్రము శ్రేష్ఠము 8 అంచులు. 8 పలకలు. 6 కోణములుకలిగి మేఘమునందు మెరయు ఇంద్రధనుస్సుయొక్క కాంతివంటి కాంతిగలిగి నీరువలె నీడదేరునది పురుష వజ్రమని యెరుంగవలెను. స్త్రీపురుష నపుంసక వజ్రములను వరుసగ స్త్రీపురుష నపుంసకుల కుపయోగించవలెను. అట్లుగాక మార్పు జొదనేని ఫలమునీయదు. అందరకు పురుషవజ్రముపయోగింపవచ్చును.



పై మూడుజాతులందును తెలుపు యెరుపు నలుపు పసుపు రంగులభేదములుకలవు. తెల్లనిది బ్రహ్మజాతివజ్రము ఇదిజరామరణరహితదేహసిద్ధినిచ్చు రసాయనములందును అణిమాది సిద్ధిసాధనమందును ఉపయుక్తము. యెర్రనిది క్షత్రియవజ్రము. ఇదివలీపలితములను మృత్యువును గూడజయించును. పచ్చనిది వైశ్యవజ్రము. ఇదిశరీరదార్ఢ్యము ధనాకర్షణము జేయును. నల్లనిది శూద్రవజ్రము. ఇదిరోగనాశనము వయస్స్తంభనము జేయును. వజ్రమును శోధనమారణములజేసి సేవింపవలయును. ఇదిసాధారణముగ, ఆయువు వీర్యముకలిగించును. దోషత్రయవికారములను ఖండించును. సకలరోగములను మృత్యువును జయించును. క్షయ మున్నగు దారుణరోగములందు పయోగించును. రసమును బంధించును. రసమునకు వీర్యమును పుట్టించును. అమృత సమానముగనుండును. ఉలవలకషాయమునగాని కొర్రల కషాయమునగాని వజ్రమును డోలాయంత్రమున నొక జామువండిన శుద్ధమగును. ఉలవలకషాయమును నిమ్మపండ్ల రసముతోచేర్చి మణిశిలనునూరి దానిని మూసకు బాగుగాపట్టించి యామూసలో వజ్రమునుపెట్టి చీరజేసి పుటమువేయునది. ఇట్లు 8 పుటములువేసినపిదప ఆవజ్రమును నిప్పులలో కాల్చి శుద్ధపాదరసమున 100 సారులు ముంచినయెడల వజ్రము వారితరమగు భస్మమగును. ఇదిసోమదేవ సిద్ధునియోగము. వజ్రభస్మము 30 భాగములు స్వర్ణభస్మము 16 భా॥ రజతభస్మము 8 భా॥ శుద్ధరసము 11 భా॥ అభ్రకభస్మము 4 భా॥ స్వర్ణమాక్షిక భస్మము 8 భా॥ వైక్రాంతభస్మము 6 భా॥ ఇటుల వీనినెల్లచేర్చి బలానుసారముగ సేవించినసర్వసిద్ధులుకలుగును. ఇదివజ్రరసాయనమనబడును. వజ్రములనుధరించిన సకలగ్రహబాధలు తొలగును శరీరారోగ్యమిచ్చును. అలక్ష్మితొలగును. విశేషములు మారసరత్నసముచ్చయమునం జూడుడు.

వటపత్రి:—సం. వటపత్రి, మోహినీ ఐరావతి, గోధావతి అనియు, హిం. బడ్‌పత్రిఅనియుపేరు. పాషాణభేది (కొండపిండిచెట్టు) లో భేదము. దీనిఆకులు మర్రియాకులవలెనుండును. గాన దీనికి వటపత్రియ

విశేషకలిగెను. కషాయరసము ఉష్ణగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. బలమునిచ్చును. మూత్రకృఛ్రి అశ్మరి మూత్రాఘాతము ప్రమేహము వ్రణముహరించును, యోనిదోష మూత్రదోషములందు ప్రధానముగ గుణదాయకము. మరియు పాషాణభేదియొక్క గుణాదులను గలిగియుండును.

వట్టివేరు:—సం. వీరణ, ఉశీర, నళద అనియు, హిం. ఖస్, నేణారమూల్ అనియుపేరు. అనగా యెఱ్ఱవట్టివేరు. చేదు తీపి రుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. తాపము శ్రమ పిత్తజ్వరము స్వేదదుర్గంధము దప్పి విషము రక్తపిత్తము ఛర్ది మదము విసర్పము మూత్రకృఛ్రి వ్రణముహరించును. తెల్లవట్టివేరుయొక్క గుణాదులును దీనియందుకలవు. చూ. తెల్లవట్టివేరు.

వడగండ్లు:—మిగుల చలవచేయును. అగ్నిమాంద్యము జ్వరము త్రిదోషప్రకోపముచేయును. తాపము శ్వాసకాసలు అరుచి కఫము విషము హరించును.

వడియములు:—సం. వటక అందురు. ఇందు అనేకరకములుకలవు. పచనమైనఅన్నములో నువ్వులు మొదలగు వస్తువులంజేర్చి పోకకాయంత వడియములుచేయుదురు. వీటికి కూటివడియములనిపేరు. నూనెలోవేయించి తినిన పుష్టి గురుత్వము చేయును. వాతము హరించును. బూడిదగుమ్మడుకాయ వడియములు వాతపిత్తజ్వరము జీర్ణజ్వరము కాస శ్వాస వ్రణము విషము మేహము హరించును. శరీరమునకుబలమిచ్చును. ఉశిరిగపండ్లవడియములు లఘువుగనుండును. వాతాదుల భేదించును, నేత్రములకుహితమైనవి. రుచిబుట్టించును. శూల దప్పి తాపము హరించును. అరటిపూవువడియములు శ్వాస కాస కిలాసము కృశత్వము వీనినిహరించును. కఫ రక్తాతిసారములందు హితములు. వేపపూవు వడియములు క్రిమి పిత్తము కఫము పిత్తజ్వరము అరుచి వీనిని జయించును. శుక్రమును వృద్ధిచేయును. లేతనల్లేరులో నువ్వులు మిర్యాలు మున్నగుసంబారములంజేర్చి చేసిన వడియములురుచిగనుండును. హృద



యమునకు మేలుచేయును. గుల్మము అగ్నిమాంద్యము మూలవ్యాధి శ్వాసకాసలు జయించును. పండినవంగిపండ్లలో నువ్వులు మిర్యాలు జీలకఱ్ఱ యింగువ ఉప్పు వీనినిజేర్చిచేసిన వడియములు పథ్యమైనవి, నూనెలోవేయించిన వడియములు పిత్తము రుచి దీపనముకలిగించును. నేతితోవేయించినవి లఘువుగనుండును. పిత్తమునుహరించి తాపమును పోగొట్టును. చలువజేయును. నేత్రములకు హితకరములు. నూనెలోవేయించినవి అపథ్యముగనుండును.

వదనిక:—చూ. బదనిక.

వరగోగు:—సం. శరీరపిలు అందురు. చిన్నమొక్క. దీనివేరు లేక చక్కరసము మిక్కిలివేడిచేయును. సూతికావాతమునందిది ప్రధానముగవాడుదురు. మరియు శూల కడుపుబ్బరము కఫప్రకోపము ఋతుబద్ధము జలుబు మొదలగువానినిహరించును. దీనినికాల్చినబూడిదనుండి క్షారపాకవిధానమున నవసాగరము తయారుచేయుదురు.

వరుగులు:—అనగా కాకరవంగ మున్నగు కాయలను ముక్కలుగాతరిగి యెండబెట్టిన వరుగులుఅనుపేరున వ్యవహరింపబడును. కాకరకాయవరుగు కాస కఫవాతములుహరించును. అగ్నిదీప్తి రుచి పిత్తము కలుగజేయును, నూనెలోవేయించిన బుడమకాయవరుగు అధికజలపానమువలనగలుగు దోషములహరించును. రుచిబుట్టించును. పరిమళయుక్తముగ చులకనగనుండును. ఆరదొండ వరుగు కృముల హరించును. రుచి అగ్నిదీప్తిచేయును. హృదయమునకుహితము. కాసరకాయ వరుగు దీపనకారి. రుచికరము. చేదు కారము రుచులుగలిగియుండును. వేడి పిత్తముపెంచును. వంగవరుగు రుచి బలము శరీరపుష్టి గురుత్వము పిత్తము హృదయమునకు హితము కలిగించును. వేగముగ శరీరమున వ్యాపించును.

వర్తలోహము:—కంచు, రాగి, ఇత్తడి, యినుము, సీసముఅనులోహముల కూడికవలనపుట్టినది వర్తలోహమనబడును. దీనికేపంచ

లోహమని జర్మనీవెండియని పేరు. దీనిని శోధనమారణములజేసి సేవింపదగును. కారము రుచి రూక్షగుణము శీతవీర్యము అమ్లవిపాకముగలది. కఫపిత్తములహరించును. రుచికరము. నేత్రములకు చర్మమునకు మేలుచేయును, జంతురోషమును నశింపచేసి మలమును వెడలించును. యీపాత్రతో వండిన యన్నము మొదలగు వస్తువులను భుజించిన ఆరోగ్యముగనుండును. పులుసు ఉప్పుగల పదార్థముల నీపాత్రలో వండరాదు. వర్తలోహమును కరిగించి గుర్రపుమూత్రమున చల్లార్చినశుద్ధమగును. గంధకతాళకములను వర్తముతో చేర్చి నిమ్మపండ్లరసముతో నూరి పుటమువేసిన భస్మమగును.

వల్వజాతృణము:—సం. వల్వజా, దృఢపత్రి, మౌంజీపత్రి, పానీయశాలి అనిపేరు. మధురరసము గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. పిత్తము తాపము దప్పి హరించును. వాతము ప్రకోపింపచేయును. రుచిబుట్టించును. కంఠశుద్ధిచేయును.

వస:—సం. (ఎర్రది) వచ, ఉగ్రగంధ, గోలోమీ, శతపర్వికా అనియు, (తెల్లది) శతపర్ణి ఘంటిక, శ్వేతవచా, మేదా అనియు, హిం. వచా, శ్వేతవచాఅనియు పేరు. దుంపవస్తువు మదపువాసనగలిగియుండును. శొంఠివంటిది. కటుతిక్తరసములు తీక్ష్ణగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. వాంతి అగ్నిదీప్తి కంఠశుద్ధి కలిగించును. మలమూత్రములను శోధించును. మలబద్ధమును విప్పును, ఆధ్మానము శూల శోఫ వాతజ్వరము అపస్మారము కఫము క్రిమి ఉన్మాదము భూతజంతుజ్వరములు వాతము గ్రంధి ఆమదోషము అతిసారము మదము దప్పిహరించును. ఆయువు బుద్ధి హెచ్చించును. తెల్లవసకును యివియే గుణాదులుగాని తెల్లదిమంచిది సాధారణముగ వస కఫవాతములహరించి పిత్తమును పెంచును. దేహమునకు బలము కలుగజేయును. వసకొమ్మును అరగదీసి సుగంధమును గుడ్డలోవేసిపిండి ఆరసములోచనుబాలుకలిపి త్రాగించిన చంటిపిల్లల పాల ఉబ్బసము జలుబు దగ్గు కడుపుబ్బరముతగ్గును. చిన్నతనమున వసచూర్ణము ఉగ్గుతోకలిపిపెట్టిన పిల్లలకు మాటలుత్వరగవచ్చును నీళ్ళవిరేచనములగుచున్నపుడు చంటిబిడ్డలకు వసచూర్ణము 2 మొదలు 4 గురివెందలెత్తు వరకు తేనెతో కలిపి యిచ్చిన అజీర్ణ విరేచనములుతగ్గి అగ్నిదీప్తి కలుగజేయును. వస శొంఠి సమభాగముగచూర్ణించి నస్యముచేయునెడల పార్శ్వపునొప్పి తగ్గును. మరికొన్నిశిరోరోగములును కుదురును. వసకొమ్మును అరగదీసి తేలు జెర్రి మొదలగు విషకీటములుకుట్టినచోట రాచి గుడ్డపొగవేసిన బాధశాంతించును. లోపలకుకూడ యివ్వవచ్చును. వసకొమ్ము గంధమును రాగిపళ్ళెమునకురాచి ఆముదము దీపపుమసిని పట్టించి దానిని కండ్లలో అంజనముచేసిన వాతకఫ వికారజనిత నేత్రరోగములు హరించును. దృష్టికి ప్రసాదమేర్పడును. వాపుతగ్గును. నొప్పులుగలచోట గంధమునుపట్టించి పసుపులద్దిన అవి నెమ్మదించును వస వెలిగారము ముసాంబరము కలిపి నూరి కుంకుడుగింజలవలె మాత్రలుచేసి యిచ్చిన కొద్దిగలఅయ్యెడు ఋతురక్తమునుజారీచేయును. దానిమ్మబెరడు వస వీనిని ధూపమువేసిన రక్తముపడు మూలరోగుల ఆసనము పోటుతగ్గును. నల్లఉమ్మెత్తఆకురసముతో వసను అరగదీసి కొంచెము ఉడికించిరొమ్మునకు పట్టువేసిన కఫముకరిగి ఉబ్బసము మొదలగు కఫవ్యాధిగ్రస్తులకు కొంత శాంతికలుగును. వసకాల్చినమసిని తేనెతో నాకిన సాధారణపు కళ్ళెదగ్గుతగ్గును. వస విషపుగోడిపిత్తులు వీటినికొద్దిగవేయించి చూర్ణించి దానిని సారాయికలిపియిచ్చిన రక్తగ్రహణి జిగటవిరేచనములు కట్టును. బొడ్డువద్దపట్టువేసిన అక్కడనొప్పిశాంతించును. వసచూర్ణమును పుప్పిపంటిలోబెట్టిన బాధనయమగును.

వసనాభి:—సం. కాకోల, గరళ, క్ష్వేడ. దారద, బ్రహ్మపుత్ర, శౌక్లకేయ, వత్సనాభఅనియు, హిం. బచ్ఛనాభ్ అనియుపేరు ఇది చిన్నక్షుపము. దీనిఆకులు వావిలియాకువలె నుండును. ఈచెట్టునకు చుట్టుప్రక్కల ఒకగజముదూరములో యేమొక్కయు మొలవదు. దీనిదుంపయే వత్సనాభి, వసనాభి, నాభి యనివాడబడును. ఇదివిషవర్గములోచేరినది తీపి రుచి తీక్ష్ణ రూక్ష సూక్ష్మ విశదాది గుణములు

ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. దేహమునందుగల మిగుల సూక్ష్మములగు రోమకూపములుమున్నగు రంధ్రములగుండా లోన ప్రవేశించి శరీరమునంతటను వ్యాపించి పిదప పాకముపొందును. కీళ్ళను సడలింపజేసి రసాదిధాతువులవలన ఓజస్సును పెంచును. సారాయము కల్లు మొదలగునవి త్రాగుటవలనగలుగు మత్తు (నిషా) ను కలిగించి బుద్ధిని లోపింపజేయును. ఒకటితోనొకటి కలసియుండు వాతాది దోషములను బలాత్కారముగ వేరుపరచి వానివాని స్థానములంచేర్చును. యెక్కువగతినిన నాలుకయందలి నీరునార్చి ప్రాణములనుతీయును. క్రమక్రమముగ నాభినితినుట కభ్యాసముచేసిన పాము తేలు మొదలగు జంతువిషములు శరీరమునకెక్కవు. దీని నితరవస్తువులతో చేర్చి యుపయోగించుట సాధారణముగ ఆచారమైయున్నది. బలము శరీరపుష్టి వీర్యపటుత్వము కలిగించును. శ్లేష్మవికారములు కుష్ఠు వాతరక్తము అగ్నిమాంద్యము శ్వాస కాస ప్లీహ ఉదరము భగందరము గుల్మము పాండువు వ్రణము అర్శస్సు జ్వరము మొదలగు రోగములను హరించును. వస నాభికలసిన యౌషధయోగములు కోట్లకొలది గలవు. నాభి ఇంగిలీకము కలిపి నిమ్మసంశ్లరసముతో నూరి ఆవాలంత మాత్రలుచేసి ప్రతిదినము చంటిపిల్లలకుయిచ్చిన జలుబు దగ్గు పడిసెము అజీర్ణము తగ్గును. అగ్నిదీప్తి కలుగును. చేవగల నాభిముక్కను దానిమ్మపండు మధ్యనుంచి చీరజేసి పుటము వేసి తెల్లగాకాలిన నాభిభస్మమును మొలలకు ప్రతిదినము రాచుచుండిన మూలవ్యాధినశించును. కొంతకాలమునకు మొలలుహరించిపోవును. మాడుపట్టున వెంట్రుకలను గొరిగివైచి యచ్చోట కొద్దిగా రక్తముకనుబడునట్లు గాటుబెట్టి నాభిగంధమును రాచి గుడ్డఅంటించిన సన్నిపాతమునందలి దృష్టి దోషము మత్తు తలవిసరు మొదలగునవికట్టును. మంచినాభినిఅరగదీసి అందు కిరసనాయిల్ కలిపి తేలుకుట్టినచోట రుద్దిన బాధనెమ్మదించును. నాభిని చంద్ర మోదుగు మొదలగు వగరు చెక్కలరసముతో అరగదీసి కుష్ఠుపుండ్లకు పూసిన రసికట్టును. కురుపులుమానును. దీనికివిరుగుడు చిర్రివేళ్ళరసము.



వహ్నిజారము:—సముద్రమునందు సంచరించు అగ్నినక్రమను మొసలియొక్కమావి. (జరాయువు) ఆజంతువుచే విడువబడి సముద్రతరంగములచే యొడ్డునకుకొట్టబడి గట్టిపడును దీనికే అగ్నిజారమని వహ్నిజారమనిపేరు. అగ్నిజారము త్రిదోషములను ధనుర్వాతము మొదలగువాతములను హరించును. రసజారణసంస్కారమునం దుపయోగించును. రసమును రంజింపచేయును. రసమునకు వీర్యముపుట్టించును. దీనినే అంబరనికూడఅందురు.

వాకచెట్టు:—చూ. ఓక.

వాకుడుచెట్టు:—సం. కంటకారీ అనియు, హిం. కటాయీ అనియుపేరు. దీనిని చిన్నములక అందురు. నేలమీద ప్రాకును. ముండ్లుండును. ముండ్లు పసుపుపచ్చవన్నెగలసిన తెలుపుగ నుండును. నేలములకకాయలవలెనే కాయలు కాచును. ఊదా తెలుపురంగుల పూవులు పూచును. తెల్లపూవులదిమంచిది. దీనికి నేలములకయొక్క సకల గుణాలుదునుకలవు. చూ. నేలములక.

వాడగన్నేరు:—చూ. కరవీరము.

వామము:—చూ. ఓమము.

వాయువిడంగాలు:—సం. కృమిఘ్న, భస్మక, విడంగ, కైరాల, వేల్ల తండులఅనియు, హిం. వాయువిడంగ్ అనియుపేరు. ఒకజాతిచెట్టుయొక్క గింజలు నల్లగ గుండ్రగ మిరియములవలెనుండి అంతకన్న చిన్నవిగ నునుపుగనుండును. ఇవిప్రాతవి యగుకొలది పథ్యముగను క్రొత్తవియగుకొలది అపథ్యముగనుఉండును. కారము చేదు రుచులు లఘు రూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలవి. ప్రధానముగ కృములనుచంపును. గుల్మము ఆధ్మానము రక్తగ్రహణి ఉదరము శ్లేష్మము మలబద్ధము విషము వాతము కఫము అగ్నిమాంద్యము అరుచి భ్రాంతి శూల ప్లీహ ఉబ్బు పాండువు శ్వాస కాస హృద్రోగము మేదోరోగము మేహము హరించును. దీపనపాచనములంజేయును. రుచిబుట్టించును. మలమూత్రములను జారీచేయును. నేత్రములకు హిత

మైనది. వాయువిడంగములు మోడి మునగపిత్తులు మిర్యాలు సర్జక్షారము విడిచూర్ణమును మజ్జిగలోవేసి సిద్ధపరచిన యవాగు కృములను హరించును. వాయువిడంగము గంధకము మణిశిల వీనికల్కము. కల్కమునకు 4 రెట్లునూనె నూనెకు 4 రెట్లు గోమూత్రము కలిపి పక్వము చేసిన తైలమును పూసిన పేలు ఈళ్లు మున్నగు బాహ్యక్రిములు నశించును,

వాయింట:—సం. బర్బరీ, కబరీ, తుంగీ, ఖరపుష్ప, అజగంధిక అనియు, హిం. బర్బక్ అనియుపేరు. ఇది చిన్నమొక్క. గజముయెత్తులోపుగ పెరుగును. చెట్టునకంతకు ఒకవిధమగు వెగటువాసనయు తెల్లపూవులును సన్నగా పొడవుగానుండుకాయలును కాయలలో నల్లని చిన్నగింజలునునుండును. ఇవి సాధారణముగా దొడ్లలోను అడవులలోనుగూడ మొలచును. ఇది వనతులసిలోభేదము, ఇందు కుక్కవాయింట వాయింట యని రెండుజాతులుకలవు. కుక్కవాయింటకు సంస్కృతమున శ్వానబర్బరిక, పూతిమయూర, పశుగంధిక అనిపేరు. ఆకులు గుండ్రగ చిన్నవిగనుండును. వాయింట కారము చేదు రుచులు రూక్ష తీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముకలది. కఫవాతములు నేత్ర కర్ణరోగములు దురద విషము ఛర్ది కుష్ఠు జ్వరము కృమి దద్రు రక్తదోషము హరించును. గర్భిణులు ప్రసవసమయమున కష్టపడుచున్నపుడు దీనిసమూలరసమును ఒకతులము త్రాగించిన వెంటనే సుఖముగ ప్రసవింతురు. ఆకురసమును చెవిలోబోసిన వాత సంబంధమైన చెవిపోటుతగ్గును. కొద్దిగమంటబెట్టును. ఆకును మెత్తగానూరి కంతులు అపక్వములగు వ్రణములు మొదలగువానికి గట్టిన అవిహరించును. పొక్కుపొక్కును, గనుక మంటబెట్టినపుడు కట్టువిప్పి ఆస్థలమున కొబ్బరినూనెచమురవలెను. వాయింటరసము 4 భా॥ నూనె 1 భాగముకలిపి రసము యిగురునట్లుకాచి శరీరమునకు పూసిన గజ్జి చిడుము మొదలగు పుండ్లు మానును. వట్టిరసమున సైంధవలవణముకలిపి శరీరమునకు పూసిన దురదతగ్గును. ఆకును మెత్తగాతొక్కి ఆముదముతో వెచ్చజేసి శిరస్సున



కుగట్టిన వాతము వలనగలుగు తలదిమ్ము పోటు మెడలుబరువు తగ్గును. లోపలకుతినిన అగ్నిదీప్తి కలుగజేయును. కుక్కవాయింట ఉష్ణవీర్యము కలది. పిత్తవాతశ్లేష్మములు హరించును. చెవినుండి రక్తము చీముకారునపుడు దీనిరసమును చెవిలోబోసిన వేగముగ ఆరోగ్యము నిచ్చును. చెవిపోటుతగ్గించును. ఇందు అడవివాయింట యని మరియొకటి కలదు. వాయింటను వామింటయనియు వాడుదురు. చూ. అడవివాయింట.

వాతాహకందము:—చూ. సన్నిదుంప.

వావిలి.—సం. (తెల్లవావిలి) సింధువార, ఇంద్రాణిక, ఇంద్రసురస, నిర్గుండీ అనియు, (నల్లవావిలి) నీలనిర్గుండీ, సిందుక, శీతసహా, భూతకేశీ అనియు, హిం. సంహాలు, మేఉడీ, సిహాగ్ అనియుపేరు. ఇది పెద్దవృక్షము. మాగేడాకువలె దీనియాకులు మూడుచిల్లలుగనుండును. తెల్లవావిలి ఊదారంగుపూవులను నల్లవావిలి మిగుల నల్లనైనకాటుక రంగుపూవులను పూయును. నల్లవావిలిఆకుకూడ ఘాఢిగానల్లగానుండును. యీచెట్టుక్రిందమన్నుకూడ నల్లగనేయుండును. దీనికర్రతో అన్నము ఉడుకునపుడు కలియబెట్టిన అన్నమంతయు నలుపువర్ణము కలదియై రుచిభేదించకయుండును. వాదవిద్యయందు దీనియుపయోగమత్యధికము ఇది సర్వత్రదొరకదు. భద్రాచలపు అరణ్యమునగలదు. దీనిపూవు గుత్తులు కోలగవెన్నునేయును. సమూల కషాయము వగరు చేదు కారము రుచులు రూక్ష లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకములు గలది. జ్ఞాపకశక్తి తలవెండ్రుకలువృద్ధిజేయును. నెరసిన వెండ్రుకలను నలుపుచేయును. నేత్రములకుహితమైనది. శూల వాపు కాస వాతము శోఫ కృమి కుష్ఠు ప్రదరము అరుచి కఫము జ్వరము మొదలగువ్యాధుల హరించును. అగ్నిదీప్తి నిచ్చును. గుదరోగము క్షయ వాతము ప్లీహ గుల్మము కంఠరోగము విషము మేదోరోగము గ్రుధ్రసీవాతము జలుబు శ్వాస పిత్తముహరింపచేయును. ఆకునుమెత్తగాతొక్కి కొంచెమువెచ్చజేసి నొప్పులుగలచోటకట్టిన వాత మేహవాతపునొప్పులు వాపులు నశించును. నల్లవావిలియాకు చూర్ణము కల్పప్రకారము సేవింపబడెనేని—

జరారోగములను హరింపచేసి సిద్ధులపొసంగును. తామ్రము మొదలగు లోహములను భస్మముగావించును. ఈభస్మములు క్షయావిదారుణరోగములందును హేమవిద్యయందును గూడ ఉపయోగించును. వావిలికషాయము రసోపరసాదులను పరిశుద్ధముగచేయును. వావిలియిగుళ్ళు 5 మిర్యాలు 5 కలిపి నూరి మాత్రచేసి మింగిన కృములునశించును. చలిజ్వరము విషమజ్వరముతగ్గును. వావిలియాకువేసికాచిన నీళ్ళతో బాలింతలకు స్నానముచేయించిన వాతాదిదోషములు కలుగకుండ చేయును. ఇది సర్వసాధారణముగాచేయు ఆచారముకలదు. తెల్లవావిలికిని పైగుణములుకలవుగాని వాదాదులందు పనికిరాదు. మొత్తముమీద గుణహీనము. ఇందు అడవివావిలియనియు, కత్తిరివావిలియనియు మరిరెండుజాతులుకలవు. కత్తిరివావిలికి సంస్కృతమున కర్తరీ నిర్గుండీ యనియు, అడవివావిలికి అరణ్యనిర్గుండీయనియుపేరు.

కత్తిరివావిలి కటుతిక్తరసములు లఘురూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముకలది. వాతకఫములు క్షయ శూల దురద కుష్ఠుహరించును. అడవివావిలి మిగులపథ్యము. పిత్తము విషము గృధ్రసీవాతముహరించును. శరీరమునకుకాంతినిచ్చును. అడవివావిలియాకు చేదుగ లఘువుగనుండును. కృమిని కఫవాతములను హరించును. దీనిపువ్వు కారముగ ఉష్ణముగనుండును. కృమి కఫము ప్లీహా గుల్మము వాతము కుష్ఠు వాపు అరుచి దురదహరించును.

విత్తుబోడతరము:—సం. హపుష వపుష, విస్ర విస్రగంగ అనియు, హిం. హాఊబేర్ అనియుపేరు. దీనిలోచిన్నవిత్తు బోడసరము ఒకటి కలదు. దీనికికాయచిన్నది. పెద్దవిత్తుబోడతరపుకాయ చేపవాసన (నీచువాసనగను) రెండవదానికాయ మామిడికాయవాసనగను ఉండును. కషాయ కటుతిక్తరసములు గురుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. అగ్నిదీప్తి మలబద్ధము చేయును. శూల గుల్మము అర్శస్సు వాతము ఉదరము కఫము అగ్నిమాంద్యము కృమి పీనస ప్రదరము అను రోగములహరించును. చిన్నవిత్తుబోడసరమునకును పైరసాదులుండును



మూత్రకృఛ్రి ప్లీహా విషము కఫముహరించును. పైదాని ప్రభావము లన్నియును కలవు.

విభూతి:—అనగా సోమయాజులు రావిమోదుగు మొదలగు కస్టెలతో అగ్నిహోత్రముచేసి హోమములుచేయుచుండునట్టి బూడిదగాని, గోమయమునుయెండించి కాల్చినబూడిదనుగాని శరీరమునకు ఫాలదేశమునకు పూసుకొనిన పాపములుతొలగును. శరీరమునకు తేజస్సు కలుగును. చర్మరోగములు నశించును. స్వేదజన్యదోషములను చలిని పోగొట్టును. శరీరములోనుండు తేజస్సును బైటకుపోకుండ ఆపుచేయును. పవిత్రముగనుండును. భూతప్రేత పిశాచబాధలుతొలగును. శైవులకు ప్రీతికరము.

విమలము:—సం. విమలఅందురు. మహారసములలో నొకటి. హేమవిమలము, తారవిమలము, కాంస్యవిమలము నని యిది మూడువిధములు. అవిక్రమముగ బంగారు వెండి కంచు రంగులు కలవియై గుండ్రనై అంచులు పలకలుమెరుపుగలిగినవై యుండును. వాతపిత్తములహరించును. వీర్యవృద్ధినిచ్చును. శోధనమారణముల జేసి సేవించిన జరారోగములహరించును. మొదటిది హేమవిద్యయందును, రెండవది తారవిద్యయందును, మూడవది ఔషధములందును ఉపయుక్తము. క్రమముగనవి ఉత్తమ మధ్యమ అధమ గుణములుకలవి. విమలమును అడ్డసరపుకషాయమునగాని నిమ్మపండ్లరసమునగాని దుష్టపాకురసమందుగాని స్వేదనముచేసిన శుద్ధమగును. శుద్దవిమలముతో గంధగముజేర్చి నిమ్మపండ్లరసముతో నూరుచు 10 పుటములువేసిన భస్మమగును. విమలసత్త్వము రసగంధకములు ప్రత్యేకమొకభాగము మణిశిల 5 భా॥ రజతభస్మము 10 యవభాగము, వైక్రాంతభస్మము 10 యవ భాగము వీనినేకముచేసి చూర్ణించి వస్త్రగాలితముజేసి గాజుకుప్పెలో బోసి వాలుకాయంత్రమున క్రమాగ్నులతో వండి స్వాంగశీతలమున దీసి బలానుసారము గురిజెత్తుమొదలు 4 గురిజలెత్తువరకు మిర్యాలు కరక్కాయ నేయి అనుపానములతో సేవించిన జ్వరము శ్వాయథు పాండువు ప్రమే

హమ్ము అరుచి మూలవ్యాధి గ్రహణి శూల క్షయ కామిల వాతపిత్త రోగములు మున్నగువానిని సంహరించును. ఇతర ఔషధములు దీనిని పోలవు.

విరజాజి:—సం. నైపాలీ, నైష్కిక లతా తాలాపిని, వనమల్లిక అనిపేరు దీనికి బొడ్డుమల్లియనియుపేరు. తెల్లనిపూవులు పూచును. పరిమళయుక్తముగ నుండును. వసంతకాలమున పూయనారంభించును. కొన్ని విరజాజులు వర్షకాలమునందునుపూచును. వర్షకాలపు విరజాజి పూవులు శీతలముగ చేదుగ లఘువుగనుండును. త్రిదోషములు హరించును. కర్ణరోగ నేత్రరోగ ముఖరోగములను పోగొట్టును, వసంతర్తువునపూచు పూలకును యివియేగుణాదులు.

విరిగిచెట్టు:—సం. శ్లేష్మాతక, కర్బుదార, పిచ్ఛిల, లేఖశాటక శేలు, గంధపుష్పఅనియు, హిం లిసోడా, నిసోడే, లభేరా అనియుపేరు. ఇది విరిగి, నేలవిరిగియని రెండుజాతులుకలది. నేలవిరిగికి సంస్కృతమున భూకర్బుదార, లఘుశ్లేష్మాతక, భూశేలుఅందురు. విరిగిచెక్కవేరు రసము కారము వగరు తీపి రుచులు స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకముకలది. దీపనపాచనముల గలిగించును. వెండ్రుకలను నలుపుగ పెంచును. బలాసము కృమి శూల ఆమ రక్తదోషములు విస్ఫోటము వ్రణము పిత్తము సర్వవిధవిసర్పములు హరించును. నేత్రములకు హితముచేయును. దీనికాయ చేదు తీపి వగరు రుచులు లఘుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. పుష్టి మలబద్ధము రుచి కలిగించును. పిత్తమునుశమింపచేసి వాతమును పెంచును కఫమును రక్తదోషమునుహరించును బాగుగాపండినపండు తీపి రుచి స్నిగ్ధ రూక్ష గురుగుణములు శీతవీర్యము మధురవిపాకము గలది. పుష్టి శుక్రము మలబద్ధముచేయును. పిదాహదోషమునుపోగొట్టును వాతమునుహరించి పిత్తమును శమింపచేయును.

నేలవిరిగి తీపిగ వాతమును ప్రకోపింపజేయునదిగ నుండును. కొంచెము వేడిచేయును. క్రిములను చంపును. సువర్ణమునుభస్మముగావించును



విషకంట్రకాలు:—సం. అరణ్యజీరక, బృహన్పాలీ, క్షుద్రపత్రి అనియు, హిం. కాలాజీరీ అనియుపేరు. కారము వగరు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. స్తంభవాతము కఫము వ్రణముహరించును. అడవిజీరచెట్టు క్షుపజాతిలోనిది. ఆకుపైన నూగుండును నల్లజీరగింజలనే విషకంట్రకాలు అందురు వీనిని గుర్రములకు తినిపింతు మసాలాలలో విశేషముగ చేస్తురు.

విషబొద్ది—సం. కలికార్, లాంగలకి, గర్భపాతని, అగ్నిజిహ్వ లాంగలీఅనియు, హిం. కలిహారీ అనియుపేరు. విషబొద్ది క్షుపజాతిలో చేరినది. యీచెట్టు పూర్తిగా వత్సనాభియొక్కవలెనుండును. మెరుపు పసుపు వన్నెల పూవులను పూచును. దీనికాయలు మిరపకాయలవలెనుండును. కాయపైమూడుచారలుండును. ఇందులోనిగింజలకు యెర్రనిచర్మముండును. దీనిదుంపనే ఔషధములలోవాడుదురు. విషబొద్దిదుంపను దేశీయనాభిఅందురు కారము ఉప్పు చేదు వగరు రుచులు సర తీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కుష్ఠు దుష్టవ్రణములు శోఫ అర్శస్సు శూల కఫము కృమి వాతము వస్తి శూల విషము దురద శోధ శోష మున్నగురోగములనుహరించును. యోనియందు దీనిగంధమును లేపనముచేసిన గర్భపాతమును జేయును. శుష్కగర్భమును పాతనముచేయుటకును ఉపయోగింతురు. దీనిని నాభివలెనేశుద్ధిచేసి నాభినివాడినట్లే వాడవలయును. మోతాదుహెచ్చైనయెడలచంపును. నాభియొక్కగుణాదులు దీనికుండునుగాని దానికన్న అల్పగుణములుకలది. దీనికివిరుగుడు చిర్రివేళ్ళరసము, పైడిప్రత్తికాయలరసము, వాంతిచేయించడము.

విషముంగిరి:—దీనిని విషముంగళపుచెట్టు, విషముంగలిచెట్టు అనియువాడుదురు. ఆకులు కోలగమృదువుగ నుండును. తెల్లపూవులు పూచును. క్షుపజాతిలోనిది. సమూలము చేదు రుచి తీక్ష్ణసరగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. ఆకురసముత్రాగిన వమనహ

గును. ఆకును నెచ్చజేసికట్టిన వ్రణములు మానును. చెవిపోటుచీము కారుట చెవిలోనికురుపు మున్నగువానికి దీనిరసమును చెవిలోపిండవలెను.

విష్ణుక్రాంతిచెట్టు:—చూ. రత్నపురుష.

వెంపలిచెట్టు:—సం. (నల్లది) శరపుంఖా, కాలశాక, ప్లీహారి, కాలిక, ప్లీహశత్రుఅనియు (తెల్లది) శ్వేతనాయక శుభ్రపుంఖ అనియు (ములువెంపలి) కంటపుంఖా. కంటాలు అనియు హిం. శరపుంఖా శ్వేతశరపుంఖా కంటపుంఖ అనియు పేరు. ఇదిక్షుపజాతిలోనిది. ఇదిసాధారణముగ నీలిచెట్టువలె నుండును. వెంపలి యెరుపు, తెలుపు, రంగుల పూవులచే రెండువిధములును గాక ముళ్ళుగలది యొకటియుకలసి మూడువిధములు. కాయలుసన్నగ పొడవుగ బద్దలవలెనుండును. కాయలపైన సన్నని నూగుండును. తెల్లవెంపలి భూమిమీదనే పాకును. ఇది చేదు వగరు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకము గలది. యకృత్ ప్లీహ గుల్మము కృమి కాస విషము శ్వాస అర్శస్సు రక్తదోషము హృద్రోగము కఫము వాతము కఫోదరము వ్యంగరోగము వేళ్ళు గోళ్ళు కుళ్ళి ఊడిపోవునట్టి దారుణకుష్ఠము మొదలగు వ్యాధులనుఖండించును. వెంపలివేరుపట్టను యెండించి చూర్ణించి చిలుములో పెట్టి కాల్చి పొగబట్టిన శ్వాసకాసహరించును. ఉబ్బసము మేఘరంజి దగ్గులు కలవారికి తత్కాలమున ఆయాసము ఎగరొప్పుతగ్గించును, తెల్లవెంపలివేరు గ్రహబాధలను పోగొట్టును కాయసిద్ధినిచ్చును. వాదవిద్యయందు భస్మములుచేయుట కుపయోగించును. యెఱ్ఱవెంపలికన్న తెల్లది అనేకరెట్లు గుణాధికము. ములువెంపలి కారము రుచి లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కృమి శూల హరించును.

వెక్కుసుతీగ:—చూ. జ్యోతిష్మతి.

వెలితురుచెట్టు.—సం. వేల్లతెరు, దీర్ఘమూల, వీరద్రు, బహుశారిక అనియు, హిం. బర్ వేర్ అనియు పేరు. వెలితురుచెట్టు మాళ్వాదేశమునందును నర్మదాచర్మణ్వతీ నదీతీరములందును మొలచును. పానదేశము మకూసు దొరకును. అరణ్యములో పెరుగు వృక్షము. దీనికి



ముండ్లును పంచవన్నెలపూవులును ఉండును. ఇది కారము చేదు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. మలబద్ధముచేయును. వాతరోగములు మూత్రకృఛ్రి అశ్మరి కీళ్ళనొప్పులు యోనిరోగము మూత్రాఘాతము హరించును.

వెదురు:—సం వంశ, త్వక్సార, తృణధ్వజ, శతపర్వ. యవఫల, వేణుమస్కర అనియు, హిం. బాన్ అనియుపేరు. ఇదిపొద. పొడవుగాపెరుగును. వెదురుకఱ్ఱలను ఇండ్లకు పందిళ్ళకు బుట్టలు చాటలు మొదలగుపనులకుపయోగించెదరు. ఆకు సన్నముగా పొడవుగానుండును పూవులు తెల్లగనుండును వెదుళ్ళ మధ్యనుండి బియ్యమువంటి యొకపదార్థము ఒక్కొకప్పుడువచ్చును. దీనిని వంశలోచనయనియు, వెదురుబియ్యమనియు వాడుదురు.

వెదురు చేదు వగరు తీపి పులుపు రుచులు సరగుణము శీతవీర్యము కటువిపాకముకలది కట్టుబడక వెలువడుచుండు మలమూత్రాదులన్నైనను మలాదులతోగూడి కట్టుబడియుండు ఆహారపదార్థములనైనను భేదించి యథాస్థితిగ అధోభాగమున వెడలింపచేయును. ఒకటితోనొకటి కలసియుండు కఫాదిదోషములను వేరుపరచి యథాస్థానమునంజేర్చును. కఫము రక్తదోషము పిత్తము కుష్ఠు శోథ వ్రణము మూత్రకృఛ్రి ప్రమేహము అర్శస్సు తాపము హరించును. వస్తిని శుద్ధిచేయును. ఋతురక్తమునుజారీచేయును. వెదురాకు వెదురుపీచు యీ రెండిటికషాయమును త్రాగించిన ప్రసవస్త్రీల మైలరక్తమును వెడలించును. వెదురుమొలకకు సంస్కృతమున కరీరఅనిపేరు. కారము వగరు రుచులు సరగురు రూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము గలది. త్రిదోషములను ప్రకోపింపచేయును. విదాహజనకము. యీమొలకల మధ్య ఉక్కురేకులను పెట్టి చీరజేసి పుటము వేసిన చక్కనిభస్మమగును. పిత్తతాపము మూత్రకృఛ్రి హరించును. వెదురుబియ్యము తీపి వగరు రుచులు సర రూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. పుష్టి

వీర్యము బలము కలిగించును, కఫపిత్తములు విషము ప్రమేహము శమింపజేయును.

వెన్న:—చూ. నవనీతము.

వెరడాపుబియ్యము:—యీబియ్యము యెఱ్ఱగ నుండును. అన్నము రుచ్యము బలకరము విరేచనకరమునై యుండును. దీనిగంజి కొన్ని రసజాతులనుకట్టుటకుపకరించును.

వెర్రికుసుమ:—సం. స్వర్ణక్షీరి, హేమశిఖ, పటుపర్ణి. పీతపుష్ప, స్వర్ణదుగ్ధ, కాంచనక్షీరిఅనియు, హిం. సత్యానాసీ, కటేరీ, చోక్ భరేవంద్. పిసోలాఅనియుపేరు. ఇదిచిన్నమొక్క బ్రహ్మదండి చెట్టువలెనుండును. గాని దీనికి బంతులవంటి పూవుగుత్తులుండవు. దీనినిపిచ్చికుసుమయనియుపిలుతురు పిచ్చికుసుమ పసుపువచ్చని అందమైన పూవులనుపూచును. కాయలు బొటనవేలికంటె కొంచెములావుగ ఒకఅంగుళముపొడవుగ పలకలుగనుండును. ఇందులోనిగింజలు పరిమళయుక్తములై నల్లగనుండును. కాడఆకు విరిచినచో బంగారువర్ణముగల సొన కారును, యీచెట్టునకంతయు వాడియగుముండ్లుకలవు.

ఇది కటుతిక్తరసములు సరగుణము శీతవీర్యము కటువిపాకము గలది. విరేచనముచేయును, ఓకిరింతపుట్టించి మోతాదుయెక్కువైన వమనముచేయును. క్రిములనుచంపును. దురద విషము కఫము పిత్తరక్తము కుష్ఠు పిత్తజ్వరము మూత్రకృఛ్రి అశ్మరి ప్రమేహము సెగరోగము శోఫ తాపము వాతరక్తము నేత్రరోగములుహరించును. ఒకబొట్టు పిచ్చికుసుమసొనలో ఒకబొట్టు నేతినికలిపి కండ్లలోవేసిన పూవులు అధిమాంసము (కండ్లలో కొయ్యగండలు పెరుగుట రెప్పలు మందమగుట మున్నగునవి) మసక కండ్లకలకతగ్గును. దృష్టినైర్మల్యమేర్పడును, ఈసొనను పంచదారలో వేసి ప్రతియుదయమున మ్రింగి వెంటనే పెరుగుఅన్నముతినుచున్న 5, 6 దినములకు సెగరోగము తగ్గిపోవును. మోతాదు 5 మొదలు 10 చుక్కలవరకు. పిచ్చికుసుమగింజల తైలమును పైకిపూయుటచేత కుష్ఠు దద్రు తామరమొదలగు చర్మరోగములను



మాన్పును. లోపలకుతినిన అజీర్ణమునుహరించును. విరేచనముచేయును. సమూలము యెండించి తేలికకషాయముకాచి త్రాగిన ఉబ్బురోగము దారుణమగు పురాణదగ్గులు శమించును. ఈచోన శంఖపాషాణమునుకట్టును.

వెలగచెట్టు:—సం. కపిత్థ, దధిత్థ, కపిప్రియ, దధిఫల, దంతశఠ, దేవపాదాఢ్య అనియు, హిం. కైథ్ అనియుపేరు. ఇది పెద్దవృక్షము. కాయలుగుండ్రగ తెల్లగ బంతులవలెనుండును. ఆకులు చిన్నవి. తెల్లనిచిన్నపూవులుబూచును. ఇది మిగులప్రసిద్ధమైనది.

వెలగఆకురసము వాంతిని అతిసారమును యెక్కిళ్ళను వెంటనే ఆపుచేయును. వెలగపూవు విషములబోగొట్టును. వెలగకాయపచ్చిది. పులుపు వగరు రుచులు లఘురూక్షగుణములు ఉష్ణవీర్యము అమ్లవిపాకముగలది. మలబద్ధముచేయును. నాలుకబెరడుగట్టి రుచి తెలియకుండును. కంఠమునకు చెరుపుచేయును. త్రిదోషప్రకోపకారి. పక్వమైన వెలగపండు మధురము పులుపు వగరు చేదు రుచులు గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. త్రిదోషశాంతినిచ్చును. పుష్టి బలము రుచి బుట్టించును. ఛర్దినిఆపును. మలబద్ధముచేయును. శ్వాస క్షయ రక్తదోషము ఛర్ది వాతము హిక్క విషము దప్పి యెక్కిళ్ళు కాస వీటిని హరించును, వెలగగింజలచూర్ణమును నీళ్ళతో త్రాగిన అజీర్ణవిరేచనములు కడుపునొప్పి తగ్గించును నూరిపూసిన విసర్పము తలనొప్పి తగ్గును. గింజలనుండితీసిన తైలము వగరు తీపి రుచులుకలదిగ నుండును. మలబద్ధము పిత్తశమనముచేయును, ఎలుక విషము కఫము ఎక్కిళ్ళు వమనము హరింపచేయును. పచ్చివెలగకాయను నమిలి పుక్కిట బట్టియుంచిన నోటిపూతతగ్గును. వెలగయిగురు రససిందూరము కలిపినూరి సెనగగింజంతమాత్రలుచేసి యిచ్చిన రక్తకాసతగ్గును. వెలగచిగురు రససిందూరము నల్లమందుకలిపి మాత్రచేసియిచ్చిన రక్తగ్రహణిఆగును. వెలగపట్టనుండి పాతాళయంత్రమునదీసిన తైలమునురాచిన కొరుకు సవాయిపుండ్లు త్వరగమానును. ఇతరచర్మరోగములకును పనిచేయును.

వెలగపండు 8 భా॥ పంచదార 6 భా॥ దానిమ్మకాయబెరడు చింతబెరళ్ళు మారేడుపిందెలు ఆరెపువ్వు అజామోదము పిప్పళ్లు యివిప్రత్యేకము 3 భా॥ మిరియాలు జీలకఱ్ఱ ధనియాలు, మోడి కురువేరు సౌవర్చలవణము లవంగపట్ట ఏలకులు లవంగపత్రి నాగకేసరములు చిత్రమూలము క్రొంతి ఇవిప్రత్యేకము ఒక్కభాగము వీనినన్నిటిని చూర్ణించి సేవించిన కంఠరోగము అతిసారము క్షయ గుల్మము సంగ్రహణి నశించును. దీనికి కపిత్థాష్టకమనిపేరు.

వెలమసంధి:—సం. కాకజంఘ, కాకాంచీ, కాకకళ అనియు, హిం. కాకజంఘా, మసీ అనియుపేరు. ఇది క్షుపము. వనములలోను ఉద్యానములలోనుగూడ విశేషముగదొరకును. దీనిఆకులు పొడవుగనలుపుగలసిన ఆకుపచ్చరంగుగ పొడవైననూగుతో గరగరలాడునవిగనుండును. కాడయందుముండ్లుండును. చేదు వగరు రుచులు శీతవీర్యము లఘుస్నిగ్ధగుణములు కటువిపాకముగలది. కఫపిత్తములు జ్వరము పిత్తరక్తము వ్రణము దురద విషము కృమి నరుకు గాయము చెవుపోటునశింపచేయును. ఆకునూరి కట్టిన గాయములు కురుపులుమానును. ఆకురసము చెవిలోబోసిన చెవుపోటుతగ్గును. వేరునుమెత్తగా తొక్కి శిరస్సునగట్టిన తక్షణము హాయిగానిద్రపట్టించును.

వెలిగారము:—సం. లోహద్రావి, టంకణ, ధాతువల్లభ, సుభగాఅనియు, హిం. సుహాగా అనియుపేరు, క్షారవర్గములో నొకటి. ఇదితెల్లగ పటికవలెనుండును. ఇది కారము ఉప్పు రుచులు రూక్షగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది, కఫము స్థావరజంగమవిషములు శ్వాసకాసలు జ్వరము గుల్మము శూల వాతము అగ్నిమాంద్యము బుతుబద్ధము అతిసారము మూత్రబద్ధము వ్రణము మొదలగు రోగముల హరించును. వెలిగారము పటికి సూరాకారము మూడును ఒకమూకుడులోపోసి పొంగించి బేడయెత్తుచొ॥ మంచితీర్థముతో త్రాగిన మూత్రబద్ధమునువిప్పి మూత్రమునుజారీచేయును. పొంగించినవెలిగారమును కురుపులపై చల్లిన వెంటనేమానును, నరుకు గాయములకుగూడ ఉపయోగించును. పాదరసము వెలిగారము కలిపి నూరి పుటమువేసి యాభస్మమును ఒకగుంజెత్తుమొదలు 4 గుంజలెత్తువరకు తేనె అల్లపురసము లేక తమలపాకురసములోకలిపి యిచ్చిన బిడ్డలదగ్గులు హరించును. వెలిగారమును తెల్లజిల్లేడుపాలతో 7 దినములు భావనచేసి పుటమువేసి యాభస్మమును గూడ బిడ్డలదగ్గులకును అజీర్ణవిరేచనములకును వాడినగుణమునిచ్చును. పొంగించిన వెలిగారమును నీళ్ళలోకలిపి నేత్రములలోబోసిన కండ్లయెరుపు పుసి మొదలగునవి తగ్గును. పచ్చివెలిగారము (పొంగించనిది) ను నూరి నీళ్ళతో త్రాగించిన వెంటనే స్త్రీలకు సుఖప్రసవము చేయును. అనగా ప్రసవోన్ముఖముగనుండి బాధపడు స్త్రీలకుతాత్కాలికముగనీయవలెను వెలిగారమునునూరి ఆముదములోకలిపి శరీరమునకుపూసిన గజ్జి చిడుము దురద నయమగును. ఇది గర్భపాతమునుచేయును. గావున ఆసన్నప్రసవసమయమున సుఖప్రసవమగుటకు గాను యివ్వవలెను గాని నెలలునిండకముందు స్త్రీలకుయివ్వరాదు. వెలిగారము లోహముల నొకదానితో నొకటి కలుపుటకును, మరికొన్నివాదవిద్యాక్రియలకును ఉపయోగించును.

వెలిచంద్ర:—చూ. తెల్లచంద్రచెట్టు.

వెలిసెట్టిమాంసము:—దీపనకరము. చలువచేయును. జ్వరము త్రిదోషములు హరించును.

వెల్లుల్లి:—సం. రసోన, లశున, అరిష్ట, మ్లేచ్ఛకంద, శుక్లకంద అనియు, హిం. లశున, బహాశన్, కాందా అనియుపేరు. ఇది కందప్రధానమైనది. ఘాటుగలవాసనగిలిగియుండును. ఆకులు సన్నముగ పొడవుగనుండును. పులుపు అనురసము ఒకటితక్క తక్కినరసములన్నియు కలవుగనుక దీనికి రసోనయనిపేరు. తెల్లగనుండునుగనుక వెల్లుల్లియందురు ఇదిప్రసిద్ధమైనది.

వెల్లుల్లిదుంపయందు కారము, ఆకులయందుచేదు, కాడయందు వగరు, కాడచివర ఉప్పు, బీజములందు తీపి, రుచులుండును, సరగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది వీర్యవృద్ధి బలము అగ్నిదీప్తికర

లిగించును. విరిగినయెముకలను అతుకుకొన జేయును. కంఠరోగములు పిత్తరక్తము అజీర్ణము హృద్రోగము జ్వరము కుక్షిశూల నేత్రరోగములు గుల్మము అరుచి శ్వాసకాసలు దుర్నామరోగము కుష్ఠము జంతువాతము కఫము హరింపచేయును. బలము వర్ణము కాంతి బుద్ధి వైశద్యము జ్ఞానశక్తి యిచ్చును. వెల్లుల్లిని తినువారలకు మద్యమాంసములను విశేషముగ సేవించనిచో ధాతుపాకము కలుగజేయును. మరియు వ్యాయామము యెండతిరుగుట కోపము అమితముగనీరు పాలు బెల్లము అనువస్తువులు వెల్లుల్లిని తినువారికి అపథ్యములు. వెల్లుల్లిరసముతో పసుపునుతడిపి అరకాళ్ళకును అరచేతులకునుపూసిన సన్నిపాతమందలి కరపాదశీతలముతగ్గి వేడిపుట్టును. వెల్లుల్లి జిల్లేడుపూవు మిర్యాలు కలిపి కుంకుడుగింజలంత మాత్రలుచేసి జ్వరమువచ్చుటకుముందు రెండుగంటలకొక మాత్రచొప్పున సేవించిన చలిజ్వరము రాకయుండును. వెల్లుల్లిరసము 10 లేక 15 బొట్లు పంచదారలోవేసి మింగించిన దారుణమగు శూల అజీర్ణము ఊపిరిగొట్టునొప్పితగ్గును. వాయువిడంగములు వెల్లుల్లి కలిపి నూరి కుంకుడుగింజలంతమాత్రలుచేసి రోజుకు 4 మాత్రలుతినిన జంతువాతముతగ్గును. నులిపురుగులు చచ్చిపోవును. ఉబ్బసము మేహరంజిదగ్గు మొదలగు దారుణ కఫరోగములకు వెల్లుల్లిరసము నౌషధమునకనుపానముగ నుపయోగించిన వెంటనే ఆయౌషధము శరీరమున వ్యాపించి గుణము నిచ్చును. వెల్లుల్లిరసమును రెట్టింపు పంచదారలోవేసి పాకముపట్టి ప్రతిదినము త్రాగించుచుండిన ఒగర్పు దగ్గులు తగ్గును. ఆహారపదార్థములలో వెల్లుల్లియెక్కువగ నుపయోగించిన స్త్రీలకు ఋతురక్తమునుజారీచేయుచుండును. గర్భిణులు వెల్లుల్లినివిశేషముగతినిన గర్భపాతముచేయును. కందిరీగ తేలు జెర్రికుట్టినచోట వెల్లుల్లిరసమును గుద్ది గుడ్డపొగ వేసిన బాధతగ్గును. వెల్లుల్లిరసము రుద్రజడాకురసము నువ్వులనూనె సమభాగములుగకలిపి కాచి వడియగట్టి చెవిలోబోసిన పోటు కొయ్యగండలు చీముకారుట మొదలగుచెవియందలిరోగములు నశించును. వెల్లుల్లిరసమున వేపాకునూరి కలిపి పూసిన



వాతపునొప్పులు పక్షవాతపునొప్పులు నయమగును. వెల్లుల్లి అనేకతైలయోగములలో చేరును.

వేగిసచెట్టు:—సం. అసన, బీజక. పీతసాలక, బంధూకపుష్ప అనియు, హిం. విజయసార్ అనియుపేరు. ఇది పెద్దవృక్షము. టేకుకర్రతరువాత దీనినే ప్రశస్తముని గృహోపకరణములకుపయోగింతురు. అరణ్యములందుపెరుగును. దీనిఆకులు రావియాకులవలెనుండును గాని అంతకన్నకొంచెముచిన్నవి. దీనిచెక్క కటుతిక్తరసములు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. వాతము కంఠదోషము రక్తవికారము మండలకుష్ఠు విసర్పము శ్విత్రము గుదరోగములు క్రిమి కఫము రక్తపిత్తము హరించును. చర్మరోగములనుహరించును. వెంట్రుకను పెరుగజేయును. రసాయనమైనది. వేగిసపూవు చేదు రుచి మధురవిపాకముకలది. పాచనకరము. వాతముపెంచును.

వేట:—చూ, వ్యాయామము.

వేపచెట్టు:—సం. నింబ, పిచుమంద, సర్వతోభద్ర, శుకప్రియ, ఛర్దన అనియు, హిం. నీమ్ అనియుపేరు. ఇది పెద్దదియు ప్రసిద్ధమైనదియునగు వృక్షము, వేపచెక్క వేరు చేదు కారము రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. వేరు లేక పట్టకషాయము అగ్నిమాంద్యముహరించును. శూలను నెమ్మదింపచేయును. వ్రణములనుశోధించును. వ్రణముమొదలగువానివాపును పక్వస్థితికిదెచ్చును. కఫమును క్రిందికిదింపును మోతాదు హెచ్చుగ నిచ్చిన వమనముచేసి కఫబాధనుతగ్గించును. కడుపులోని నులిపురుగులజంపును. శోఫ పిత్తము విషము కుష్ఠు మొదలగుచర్మరోగములు- వాతము హృదయతాపము శ్రమ కాస జ్వరము శీతజ్వరము దప్పి అరుచి రక్తదోషము మేహము మొదలగురోగములను ఖండించును. 100 సంవత్సరములవయస్సుగల వేపచెట్టుయొక్క చెక్క వేరు మొదలగువానిని ఔషధములందుపయోగించిన మిగుల గుణదాయకముగను లేతచెట్లవి గుణహీనములుగను ఉండును.

వేపయిగురు వాతహరముగ మలబద్ధకరముగనుండును. రక్తపిత్తము కుష్ఠము నేత్రరోగముహరించును.

వేపాకు (పచ్చిది) తొక్కి కండ్లకుగట్టిన కొన్ని నేత్రవ్యాధులను బోగొట్టును, లోపలకుతినిన కృమి పిత్తము విషము సర్వవిధ అరోచకములు కుష్ఠముహరించును. పండినవేపాకునకుపైగుణాదులుండును గాని విశేషముగ వ్రణములను నశింపచేయును. వేపాకు పసుపునూరి నూనె కలిపి వ్రాసిన మశూచికపుపొక్కులు త్వరగఆరిపోవును. జిలజిలలాడుట మానును. వేపాకుతో పొంగు మశూచికముపడినరోగులకు విసరినను ఆకులపైన పరుండబెట్టినను మిగుల ఆరోగ్యముగ నుండును. వేపాకు నూరి కట్టుగట్టిన దుష్టవ్రణములందలి పురుగులుచచ్చును, వేపాకువేసి కాచిననీళ్ళలో స్నానముచేయించిన బాలింతలకు వాతాది దోషములు రాకుండును. వేపపూవు పిత్తమును రక్తదోషము కఫము మేహము కృమి అజీర్ణము హరించును రుచిబుట్టించును. జ్వరితులకు కుష్ఠము మొదలగు చర్మరోగములుకలవారలకు పథ్యము. వేపయీనెలకషాయము శ్వాస కాసలు గుల్మము అర్శస్సు కృమి మేహము స్థౌల్యము జ్వరము గ్రహణి హరించును. లేతవేపకాయ తేలికగ స్నిగ్ధముగ నుండును. వేడిచేయును. మేహము కుష్ఠము గుల్మము అర్శస్సు కృమి హరించును, బాగుగాపండిన వేపపండు తియ్యగ చేదుగనుండును. గురు పిచ్ఛిల స్నిగ్ధగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది, రక్తపిత్తమున విశేషముగ గుణదాయకము. నేత్రవ్యాధి క్షతక్షయము కఫప్రకోపము హరింపచేయును వేపగింజలగుంజు కుష్ఠము కృమి హరించును. వేపగింజలు నీళ్ళవిరేచనములు కడుపునొప్పి శూల దారుణ అజీర్ణరోగము కలరా కుష్ఠముదుష్టవ్రణములుహరింపచేయును. వేపగింజలపప్పును వేయించి 4వ వంతు రసకర్పూరముచేర్చి నూరి కందిగింజంత లేక శనగగింజంత మాత్రలుచేసి యిచ్చిన శూల కడుపునొప్పి తత్క్షణముతగ్గును. గంధకము రసకర్పూరము శుద్ధిచేసిన నేపాలములు యివి ఒక్కొకభాగము. వేపగింజలు మూడుభాగములు కలిపి నిమ్మపండ్లరసముతో నూరి కందిగింజలంతమాత్రలుచేసి యిచ్చిన జ్వరము కృమి చిడుమునశించును. ప్రతిసంవత్సరము శీతకాలమున కొందరకు శరీరమునందు చిడుముపుట్టుచుండును. అట్టివారలకీమాత్రలు పూటకుఒకటిచొ॥ 15 దినములుయిచ్చిన యిక చిడుముపట్టదు. వేపగింజనుండితీసిన తైలము వ్రణములకు వ్రాసిన అందలిపురుగులుచచ్చిపోవును. చిడుము స్ఫోటకపుపొక్కులు మానిపోవును. ఇంగిలీకము మొదలగువస్తువులనుకట్టును. శుద్ధిపరచును, కుష్ఠురోగులకు పైనవ్రాయుటకును లోపలకుతినుటకును ఉపయోగించిన మిగుల ఉపయోగకరముగనుండును. నింబపంచాంగము (వేపపూవు వేపపండు వేపాకు వేపవేరు వేపపట్ట) రక్తదోషము పిత్తము దురద దుష్టవ్రణము కుష్ఠు తాపము కృమి నశింపచేయును. వేపజిగురు గ్రహణి రక్తగ్రహణి కఫము పిత్తము హరించును. మధుమేహము అతిమూత్రము మాన్పును. వేపజిగురు నల్లమందుకలిపి మాత్రలుచేసి యిచ్చిన స్ఫోటకము పొంగు అనురోగములలోపుట్టు జిగటవిరేచనములు రక్తవిరేచనములు మానును.



వేపుడుబియ్యము:— వేయించిన యవబియ్యపు పిండి చలువచేయును. తేలికగజీర్ణమగును. అగ్నిదీప్తినిచ్చును. కఫపిత్తములను హరించును, నీళ్ళలోగలిపితాగిన బలము కలిగించును. ఉష్ణతత్వముగలవారలకు హితముగనుండును. వరిబియ్యపు పిండియు పై గుణాదులను గలిగియుండును. వేయించినబియ్యమును చూర్ణించి నీళ్ళలోవేసి కాచిన జావ సులభముగజీర్ణమగును. ఆకలిదప్పికలనణచును, ఒడదెబ్బ తీర్చును. జీర్ణజ్వరితులకుహితము,

వేరుపనస:—పచ్చికాయకూర త్రిదోషప్రకోపము మలబద్ధము బలము వీర్యపుష్టిగలిగించును. ఆలస్యముగ జీర్ణమగును. సుఖవ్యాధులుకలవారలకు విషతుల్యము. బాగుగాపండినపండు రుచిగనుండును. శరీరమునార్చును. మూలరోగమునుగలిగించును.

వేరుమల్లి:—సం. సముద్రఫల అనియు, హిం. సముద్రఫల్ అనియుపేరు. ఇది కొంకణదేశమందుపుట్టును. దీనిపండు గుండ్రగ మా

డు రేఖలుగలిగి పసుపుపచ్చగనుండును. వేరుమల్లిపండు చేదుగ నుండును. వేడిచేయును. త్రిదోషహరము. భూతబాధ కంపము భ్రాంతి మతిభ్రమ తాపము హరించును. నీళ్ళతో అరగదీసి త్రాగిన కృములు చచ్చును.

వెర్రిపుచ్చ:—చూ. చేదుపుచ్చ.

వృద్ధదారు:—సం. వృద్ధదారుక, ఆవేగీ, జంతుక, దీర్ఘవల్లరీ కోటరపుష్పి అందురు. ఇందు జీర్ణదారు అని మఱియొకభేదము కలదు, దీనికి సంస్కృతమున జీర్ణదారు, జీర్ణా, అజరా, ఫంజీఅనిపేరు. హిం. వృద్ధదారునకు విధారాఅనియు, జీర్ణదారునకు కాలావిధారా అనియు పేరు. వృద్ధదారు తెల్లపుష్పములను రెండవది నల్లనిపూవులనుపూచును. ఈచెట్టు సముద్రశోషఅను మూలికతో సమానమైనది అని సాలిగ్రామపండితుడువ్రాసెను. ఇదియెచ్చటదొరకునో తెలియదు.

వృద్ధదారు కటుతిక్తకషాయరసములు పిచ్ఛిల లఘుసరగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. ఆయురారోగ్యముల నిచ్చును. కింతరోగము ఉపదంశము (సవాయిరోగము) పాండు క్షయ కాస ప్రమేహము వాతరక్తము ఆమవాతము శోఫ కఫముహరించును. కాంతి బలము వీర్యము కలుగజేయును. జీర్ణదారునకు నివియేగుణాదులు కాని వృద్ధదారునకన్న అల్పగుణదాయకము.

వృత్తగుండాతృణము:—సం. వృత్తగుండ, దీర్ఘనాళ, జలాశయ అనిపేరు. ఇందు రెండుమూడుభేదములున్నవి. తృణజాతిలోనిది. నీటిలోనుండును. మధురరసము గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది కఫపిత్తాతిసారములు తాపము హరించును. రక్తపటిమను తగ్గించును,

వ్యాఘ్రనఖము:—చూ. నఖముచిప్పలు.

వ్యాయామము:—వ్యాయామము చేయుటవలన శరీరమునకు లఘుత్వమేర్పడును. పనులందు పాటవముగలుగును. అగ్నిదీప్తి మేదఃక్షయము శరీరదార్ఢ్యముకలుగును. బలవంతులు స్నిగ్ధమైన ఆహారము



ను భుజించువారునగు మనుష్యులు అర్ధశక్తిగా (లలాటము ముక్కు శరీరసంధులు చంకలు వీనియందు చెమట పట్టువరకు) మాత్రము వ్యాయామముచేయవలెను. హేమంత శిశిర వసంత ఋతువులందు వ్యాయామము విశేషముగను, తక్కినఋతువులయందు స్వల్పముగను చేయదగును. వ్యాయామానంతరమున ఒడలునొప్పులు కలుగకుండుటకుగాను బాగుగ శరీరమును మర్దించవలయును. అతివ్యాయామము చేయుటచేత దప్పి క్షయ రక్తపిత్తము శ్రమ కాస జ్వరము వాంతి మొదలగురోగములు కలుగును. వాతపిత్తరోగులు 16 సంవత్సరములకులోబడిన వయస్సుగలవారు డెబ్బదివత్సరములకు పైబడినవారు అజీర్ణరోగులు వ్యాయామమును వర్జించునది.

వైక్రాంతము:—ఇదియొకరత్నము. దీనికెనిమిది పలకలు యెనిమిది అంచులు ఆరుకోణములుఉండును. తెలుపు మిశ్రవర్ణము కలిగి బరువుగ దట్టముగనుండును. వైక్రాంతము అనేకరంగులలో నుండునని రసగ్రంథములందుగలదు. మనకు తెల్లనిది దొరకుచున్నది. ఇదివజ్రముతో సమానమగు గుణములనుకలిగియున్నది. గాన వజ్రము దొరకనప్పుడాస్థానమున వైక్రాంతమునుపయోగించవచ్చును. దీనిని శోధన మారణములజేసి సేవించదగును. విషదోషము కుష్ఠు జ్వరము క్షయ మొదలగురోగములను హరించును. ఆయువు బలము వీర్యము కాంతి బుద్ధి వైశద్యము అగ్నిదీప్తికలిగించును. జరారోగములహరించును.

ఆమ్లరసములందు క్షారములను లవణములనుజేర్చి దానితో వైక్రాంతమును మూడుదినములు స్వేదనము చేసిన శుద్ధమగును. కాల్చి గుర్రపుమూత్రములో ముంచినను శుద్ధమగును. గంధకముచేర్చి నిమ్మపండ్లరసముతోనూరి యెనిమిదిపుటములువేసిన భస్మమగును. వైక్రాంతభస్మము స్వర్ణభస్మము సమభాగములుగకలిపి ఇందు గుంజాప్రమాణమగు భస్మమును పిప్పళ్ళు మిర్యాలు వీనిచూర్ణముచేర్చి నేతితో సేవించునెడల క్షయముదిమి పాండువు మూలవ్యాధి శ్వాసకాసలు గ్రహణి ఉరఃక్షతము మున్నగురోగములుహరించును. శిలవైక్రాంతము 1 భా॥

రసభస్మము ½ భా॥ అభ్రకసత్వభస్మము 1½ భా॥ యీమూటిని కలిపి తేనె నేయి అనుపానములతో సేవించిన ఇతరఔషధములకు సాధ్యముకాని సకలరోగములు 21 దినములకు నశించిపోవును.

వైడూర్యము:—ఇదియు నవరత్నములలోనొకటి. ఉత్తమమైవైడూర్యమును శోధనమారణములజేసి సేవించిన రక్తపిత్తముహరించును ఆయుర్వృద్ధిబలము బుద్ధిబలము కలిగించును. పిత్తదోషప్రధానములగు సకలవ్యాధులను అమోఘముగపనిచేయును. వైడూర్యమును అశ్వమూత్రమునందును బూడిద గుమ్మడిరసమందును రెండుదినములు భావనచేసిన శుద్ధమగును. పిదప దానిని పాషాణభేదిరసముతో భావనచేసి కొలిమిలోనుంచి తీవ్రాగ్నిచే నూది ఒకగజపుటముగూడ చేసిన భస్మమగును.

శంఖము:—సం. శంఖ, సముద్రజ, కంబు, సునాద, పవనధ్వని అనియు, హిం. శంఖ్ అనియుపేరు. సముద్రమునందు పుట్టు ఒకజాతిపురుగుయొక్క కళేబరమునకు శంఖమనిపేరు. తెల్లగానుండును. ప్రసిద్ధమైనది. కారము రుచి లఘుగుణము శీతవీర్యము కటువిపాకము గలది. పుష్టి బలము వీర్యముకలిగించును. గుల్మము శూల శ్వాస విషము నేత్రవ్యాధులు గ్రహణి తారుణ్యపిడకలు (యౌవనప్రారంభమున బుగ్గలయందు బయలుదేరు మొటిమలు) కామిల క్షయ మొదలగు రోగములహరించును. యెడమవైపునకు తిరిగియుండునది వామావర్తశంఖమనియు, కుడివైపునకుతిరిగియుండునది దక్షిణావర్తశంఖమనియు పేరు. దక్షిణావర్తమునుపూజించిన సకలైశ్వర్యములుకలుగును. గ్రహపీడలు తొలగును. వ్యాధులునివర్తించును. ముక్తికలుగును, పూర్వపుణ్యావశేషమువలననే యిది లభ్యమగును. గాని సాధారణముగా దొరకదు

శంఖద్రావకము:—శంఖమును ద్రవింప చేయునదిగాన శంఖద్రావకమందురు. పసుపుపచ్చగనుండును. శరీరముమీదపడినపొక్కును. మూడుచుక్కలు శంఖద్రావకమును వెన్నునీళ్ళలోకలిపిత్రాగినశూల కడుపుబ్బరము అజీర్ణము గుల్మము హరించును.



శంఖనము:—చూ. నఖముచిప్పలు.

శంఖపుష్పి:—చూ. రత్నపుష్ప.

శంఖోదరి:—సం. శంఖోదరి, శ్వేతపుష్ప. చిత్రప్రభ. ఉష్ణకంటకి, వనవాసి అనియు, హిం. గుల్ తోరా, గుల్పా అనియుపేరు. పుష్పజాతిగుల్మము. దీనిపుష్పము వేడిచేయును. కఫవాతములు శూలఆమవాతము నేత్రవ్యాధులుహరించును.

శకటారోహణము:—అవయవములాగు శూల, నొప్పులు వాతపిత్తప్రకోపము సుఖము సౌభాగ్యము కలుగును.

శనగచెట్టు:—సం. చణక, వాజిమంథ, చణ, వాజిభోజ్య అనియు, హిం. చనే, చనా, ఛోలా అనియుపేరు. ఇదియొక విధమగు ధాన్యపుపైరు. యీమొక్కలుచిన్నవిగ వెంపలిచెట్లంతపెరుగును. ఆకులు చప్పరించిన పుల్లగనుండును. శనగగింజలు ప్రసిద్ధమైనవి. ఇందు నల్లసెనగయని మరియొకభేదముకలదు. శనగలు వగరు రుచి రూక్షగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. మలబద్ధము వాతముచేయును. పిత్తకఫములు కుష్ఠము రక్తపిత్తము హరించును. బలము వర్ణము రుచి కడుపుబ్బరము కలుగజేయును. యూనానీసంప్రదాయమున వీర్యవృద్ధికరవస్తువులలో ముఖ్యముగనెంచబడును. నిప్పులలోకాల్చినవిగాని నేతితోవేచినవిగాని పైరసగుణాదుల గలిగియుండును. గాని యెండించి కాల్చినశనగలు మిగుల రూక్షగ వాతకుష్ఠరోగముల హెచ్చించునవిగనుండును. పచ్చిసెనగలను కాల్చిగాని వేగించి లేక తాలింపుపెట్టి తినిన మిగుల బలముగ రుచిగనుండును. ఆవిరిమీద ఉడకబెట్టిన సెనగలు పిత్తకఫములహరించును. సెనగపప్పు సూపము గురువుగనుండును. బలకరము పచ్చిసెనగలను తినిన శుక్రము బలము హెచ్చును. పిత్తము శమించును. చలువచేయును. వాతమును పెంచును. మలబద్ధకరము. నల్లసెనగలు మధురకషాయ రసములు గురు రూక్షగుణములు శీతవీర్యము మధురవిపాకముగలవి. ముదిమిని హరించును. బలముచేయును. శ్వాసకాసలు పిత్తాతిసారము పిత్తముహరించును. శనగఆకుకూర పు

ల్లగ వగరుగనుండును. వాతము మలబద్ధము రుచి తృప్తి అగ్నిదీప్తి కలిగించును. కఫమునుహరించును. పంటకువచ్చిన సెనగచెట్లమీాద తెల్లవారుజామున సన్ననిగుడ్డనుపరచి చెట్లమీాదుగా రాచుకొనుచుపోయి బట్టతడిసినతరువాత నొకసీనాలో గుడ్డనుపిండవలెను. ఇట్లుపిండిన మంచునీళ్ళకే సెనగపులుసుఅనిపేరు. రాత్రిప్రూటనే సెనగచెట్లపై బట్టపరచి తెల్లవారుజామున మంచునీళ్ళను కొందరు పిండుకొందురు. యీనీరు చెట్లకంటమగాన అంత వీర్యవత్తరముగనుండదు. గాని యిదియుమిక్కిలిపులుపుగానేయుండును. ఇట్లు పిండుకొన్న పులుసు యెండలో 5, 6 దినములు యెండబెట్టినయెడల చెడిపోక నిలవయుండును. మిగుల పుల్లనైనవస్తువుగనుక ప్రత్యేకముగ సేవించిన నాలుకపగిలి పుండగును. గాన కొలదిగ నీళ్ళుకలిపి పుచ్చుకొనవలెను. లేదా అల్లపురసము జీలకర్రరసము ధనియములరసము సెనగపులుసు పటికిబెల్లము తేనెకలిపి తేనెపాకముగ కాచుకొని త్రాగవచ్చును. దీనివలన పిత్తతాపములు ఛర్దియెక్కిళ్లు అరుచి గొంతుకలో ఉండబెట్టినట్లుండుట గర్భిణుల వేవిళ్ళు మొదలగు పిత్తవికారములన్నియు శమించును. మిగుల రుచ్యమైనది. సెనగపిండి కలిసిన వీర్యవృద్ధికరములగు హల్వాలు లేహ్యములు పాకములు యూనానీగ్రంథములందు మొందుగగలవు. గ్రంథవిస్తర భీతిచే నిచటవ్రాయలేదు.

శమీధాన్యము:—సం. శమీజ, శింబిజ, శింబీభవ, సూప్య, వైదళ అనిపేరు. అనగా పెసలు కందులు మొదలగు ద్విదళధాన్యములను శమీధాన్యములందురు. ఇవిమధురకషాయరసములు రూక్షగుణము శీతవీర్యము కటువిపాకముగలవి. కఫపిత్తములహరించును. మలమూత్రములబంధించును. ఇందులో పెసలు మినుములుతప్ప తక్కినవి ఆధ్మానమునుకలుగజేయును. శమీధాన్యములను ఉడకబెట్టి (అనగా గుగ్గిళ్ళు) కట్టుకట్టినరక్తదోషములు ఆమవాతపు నొప్పులు మొదలైనవినశించును. ఆయాధాన్యముల గుణములను ప్రత్యేకశీర్షికలం జూచునది శమీధాన్యములకు శింబీధాన్యములనియుపేరు,



శర్కర:—చూ. పంచదార.

శాంబరలవణము:—సం. శాకంభరీయ, వసుక, రౌమలవణమనియు, హిం. సాంభరనోన్ అనియుపేరు. లవణములలోనొకటి. ఉప్పు రుచి రూక్షలఘుగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము కలది. కోష్ఠము శుద్ధపరచును. మలమూత్రములను జారీచేయును. అర్శస్సు కఫము అనాహము మలబద్ధము వాతముహరించును.

శాలిధాన్యము:—సం. శాలి అనియు, హిం. శాలిధాన్ అనియుపేరు. ఇదియొకధాన్యవిశేషము. ఇందు రక్తశాలి మహాశాలి కలమషష్టిక ఖుంజకీట పనాహీ జీరక కపింజల సౌగంధి శూకల బిలవాసీ కచోరక గరుడ రుక్మవంతి కలమా బిల్వజా మాగధీ పీతాఅని పదునెనిమిదిభేదములు కలవు. రక్తశాలిధాన్యము త్రిదోషములు మూత్రరోగములు నేత్రరోగములుహరించును. మహాశాలిధాన్యము నేత్రములకుహితకరము. గురువైనది. బలముచేయును. షష్టిక ధాన్యము గురుగుణము శీతవీర్యము మధురరసముకలది. త్రిదోషహరము, జీరకము వాతపిత్తములను కలమము శ్లేష్మపిత్తములను హరించును. కపింజలము కఫమును పెంచి వాతపిత్తములను హరించును. మాగధీధాన్యము కఫవాతముల పెంచును. బిలవాసి గురువైనది. శుక్రవృద్ధి చేయును. శూకలము పిత్తవాతములహరించును. కచోరధాన్యము పిత్తముహరించును. గారుడము వాతము పిత్తము మూత్రరోగములు హరించును. రుక్మవంతిధాన్యము తేలికయైనది. రుచి బలము పుష్టికలిగించును. మరియొక కలమధాన్యము తేలికగ పథ్యముగ వాతశ్లేష్మకరముగ నుండును. బిల్వజ మాగధీ పీతధాన్యములుగూడ పైగుణాదులను గలిగియుండును, ధాన్యము పండునట్టి క్షేత్రభేదమునుబట్టి ధాన్యముయొక్క గుణములు మొదలగునవి మారుచుండును. గావున క్షేత్రభేదముగుణము పరిశీలించి యుక్తాయుక్తముల గ్రహించునది.

శింబీధాన్యము:—చూ. శమీధాన్యము.

శిలాజిత్తు:—చూ. గోమూత్రశిలాజిత్తు. కర్పూరశిలాజిత్తు.

శిల్పికాతృణము:—సం. శిల్పిక, శిల్పిని, శీత, క్షేత్రజ, మృదుచ్ఛదఅనిపేరు. ఇది పొలములలోమొలచు తృణజాతివిశేషము. మధురముగ శీతలముగ నుండును. దీనిగింజలు బలమును వీర్యమును వృద్ధిచేయును.

శీతాఫలము:—చూ. సీతాఫలపుచెట్టు.

శూలీతృణము:—శూలీ, శూలపత్రి, అశాఖా, ధూమ్రమూలిక, జలాశ్రయ, పిచ్ఛిల, మహిషీప్రియ అనిపేరు. జలమునందుండును గనుక జలాశ్రయయనియు, ఆకునలిపిన జిగటగనుండును గనుక పిచ్ఛిలయనియు, ఆకుపొడవుగ సూదిమొనదేరి యుండునుగాన శూలియనియు కొమ్మలుండవుగాన అశాఖాయనియు బఱ్ఱెలు దీనిని బాగుగా తినును గనుక మహిషీప్రియయనియు దీనికిపేళ్లుకలిగెను. తృణజాతి విశేషము. కొద్దిగవేడిచేయును. పిచ్ఛిలగురుగుణములు గలది. బలమునిచ్చును. పిత్తతాపముహరించును. రుచిబుట్టించును. పశువులకు మేపిన పాలను యెక్కువజేయును,

శైవ్యము:—చూ. చెవ్యము.

శొంఠి:—చూ, సొంఠి.

శోధనపంచకగుణము:—నశ్యము, వమనము, విరేచనము అనువాసనము రక్తమోక్షణము అనునవి అయిదును ఒకపక్షమున శోధనపంచకమనబడును. నశ్యము అనగా ముక్కులలోగుండా రసము చూర్ణము మొదలైనవిపీల్చుట దీనివలన దృష్టి ప్రసన్నమగును. దంతములకు వెంట్రుకలకు దార్ఢ్యముకలుగును. ముఖమునకు కాంతి కంఠమునకు సుస్వరము, నోటియందు సువాసన కలుగును, కేశములు నల్లబడును. వమనము అనగా మ్రింగకాయ మొదలగు వమనద్రవ్యములనుతిని నోటిగుండా లోపలనుండు దుష్టమగుపదార్థములను వెలువరించుట దీనివలన కాసోపద్రవము స్వరవికారము నిద్ర నోటియందలిదుర్గంధము విషదోషము కఫము నోటనీరుగారుట గ్రహణి మొదలగునవి తగ్గును. విరేచనము అనగా తెగడమొదలగు వస్తువులనుతిని గుదమార్గమునుండి మల



మును వెడలించుట. దీనివలన బుద్ధికి చురుకుదనము ఇంద్రియములకు బలము స్థిరత్వము అగ్నిదీప్తి కలుగును. పిత్తవికారములు శమించును, వయస్సు స్థిరపడును. వస్తి అనగా గుదమార్గమునుండి త్రిఫలకషాయాదులను యెక్కించుట దీనివలన వాతపిత్త కఫ రక్త ద్వంద్వ సన్నిపాత దోషములుహరించును. ప్రధానముగ వాతవ్యాధియందు వస్తి హితకరము. మరియు బలము పుష్టి కాంతి ధైర్యస్థైర్యములుకలుగును. రక్తమోక్షణము అనగా జలగలు మొదలగువానిని పట్టించి దుష్టరక్తమును తీసివేయుట దీనివలన చర్మదోషము గ్రంధులు వాపు రక్తదోషము వలనకలిగిన అనేకవ్యాధులు నివర్తించును.

శ్రీవాసము లేక శ్రీవేష్టకము:—చూ. గంధఫిరోజా.

శ్వేతాభ్రకము:—అభ్రకములో నిదియొకభేదము. దీనినిగూడ కృష్ణాభ్రకమునువలె శోధనమారణములజేసి సేవింపదగును. దానికన్న శ్వేతాభ్రకము గుణహీనము. ప్రత్యేకముగ తెల్లకుష్ఠు లేక బొల్లియందు పనిచేయును.

షడూషణములు:—పిప్పళ్లు మోడి చెవ్యము చిత్రమూలము శొంఠి మిరియములు యీఆరునుచేరి షడూషణములనబడును. వీనిచూర్ణము లేక కషాయము కఫము శ్వాసకాసలు అగ్నిమాంద్యము జ్వరము ఛర్ది శూల కడుపుబ్బరముహరించును దీపన పాచనముల గలుగజేయును.

షడ్రసకృత్యములు:—తీపి పులుపు ఉప్పన కారము చేదు వగరు అనునవి ఆరు రసములు. తీపి పులుపు ఉప్పన రుచులు వాతమును శమింపచేసి కఫప్రకోపమును చేయును. చేదు కారము వగరు రుచులు వాతమును హెచ్చించి కఫమును తగ్గించును. వగరు చేదు తీపి రుచులు పిత్తశమనముచేయును. పులుపు ఉప్పు కారము రుచులు పిత్తమును హెచ్చించును. అనగా మధురలవణములు రెండును వాతపిత్తశమనము కఫప్రకోపముచేయును తిక్తరసము కఫపిత్తశమనము వాతప్రకోపము చే

యును. కటురసము కఫశమనము వాతపిత్తప్రకోపము చేయును. కషాయరసము కఫపిత్తశమనము వాతప్రకోపము గలిగించును. మరియుతీపి రసము శీతలమైనది. సప్తధాతుపుష్టి చనుబాలు దేహబలము వీనిని గలిగించును. నేత్రములకుమేలుచేయును. స్థూలత్వము కఫము నులిపురుగులు వీనినిపుట్టించును. తీపి రసమును విశేషముగసేవించిన జ్వరము శ్వాస గలగండము అస్రసము మొదలగురోగములు కలుగును. పులుపురసము పాచనకరము. రుచిని పిత్తకఫములుచేయును. తేలికయైనది లేఖనకారి వేడిచేయును. బడలికదెచ్చును. వాతమునుగొట్టును. పులుపు విశేషముగదినిన రక్తపిత్తము మొదలగురోగములు కలుగును. కారము కృమి నురద విషముహరించును. అగ్నిదీప్తినిచ్చును. స్తన్యము మేదస్సు శరీరస్థౌల్యము వీనినిబోగొట్టును. గురుత్వముచేయును. కారము నధికముగదినిన భ్రమ స్థౌల్యము తాలుశోషము తాపముకలుగును. చేదు రసము శీతలమైనది. దప్పి మూర్ఛ పిత్తము కఫముహరించును. అగ్నిదీప్తికరము. చనుబాలను శుద్ధిపరచును. శరీరమునుశుష్కింపచేయును. తేలికయైనది. చేదును అమితముగదినిన తలనొప్పి మన్యాస్తము భ్రమ కలుగును. ఉప్పురసము ఉదరమును శోధించును. రుచిని పాచనముకల్గించును. పుంస్త్వము వాతముహరించును. శరీరమునకు శిథిలత్వమునుకలిగించును. ఉప్పు నమితముగదినిన నేత్రరోగము రక్తపిత్తము ఉదరము కండ్లమంటకలుగును వగరు వ్రణములనార్చును. మలబద్ధముచేయును. శరీరమును శోషింపచేయును వగరు నమితముగ దినిన కడుపుబ్బరము రొమ్మునొప్పి ఆక్షేపకవాతము మొదలగు రోగములు కలుగును.

షష్టికధాన్యములు:—కారుష్మక, పీత, ఆమోద, లఘువృష్య, ముకుందక, మహాషష్టిక, కేదార, పుష్పాంకుర, బక అనునవి అరువది దినములలో పండునట్టిధాన్యములు. ఇవి లఘుగుణము శీతవీర్యము మధురరస విపాకములుగలవిగనుండును, మలబద్ధముచేయును. వాతపిత్తములహరించును, సంబావుధాన్యములతో సమానమగుగుణములుకలవి.



సీకాయచెట్టు:—ఆకులు చింతాకువలె అంతకన్న చిన్నవిగనుండును. గుల్మజాతిలోనిది. దీనికాయలు పలచగ దరిసెనపుకాయవలెనుండును. యెండినపుడు నల్లనిరంగుగనుండును. సీకాయను నీళ్ళతో ఉడకబెట్టి రుబ్బి అభ్యంజనకాలమున కుంకుడుకాయకు బదులుగ తలరుద్దుకొనుటకుపయోగింతురు. దీనివలన తలత్రిప్పు కండ్లమసక మంట మొదలగునవితగ్గును. వెండ్రుకలకు మార్దవమిచ్చును. సీకాయచెట్టు యిగుళ్ళను పచ్చడిచేసుకొనితిందురు. పుల్లగ రుచిగ పిత్తహారముగ నుండును. విరేచనము సాఫ్ చేయును. అన్నహితమునుపుట్టించును. పథ్యమైనది.

సంపెంగ:—చూ చంపకము.

సంబరేణు:—సం. సాతలా, సప్తలా, విదులా అనియు, హిం. సాతలాఅనియుపేరు. ఇది నీటివారలలేచెడు చిన్న తీగజాతి మొక్క. ఆకుసన్నగ కోలగ చిన్నదిగనుండును. వావిలియాకును పోలియుండును గాని అంతకన్న పెద్దది. కటుతిక్తకషాయరసములు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. శోఫ కఫము గుల్మము పాండువు పిత్తము ఆనాహము ఉదావర్తము నశింపచేయును. వాతమునుపెంచును.

సగ్గుబియ్యము:—గుండ్రగ తెల్లగ పెద్దఆవాలవలె నుండును. పాలలోవేసి కాచిన ఉబ్బును. పాలలోగాని నీళ్ళలోగాని వేసి కాచిన జావ జ్వరితులకు హితకరము. తేలికగ జీర్ణమగును. మలమూత్రములను జారీచేయును. జ్వరాతిసారమున మంచియాహారముగనుండును.

సజ్జరసము:—చూ. ఏపిబంక.

సత్తు:—సం. జసద, కంసాస్థి, రీతిహేతు, శ్వేతపటలఅనియు, హిం. జస్త అనియుపేరు. ; ఇది తగరమువంటి యొకలోహము. మిక్కిలి మెత్తనిది. దీనితో పాత్రలనుచేయించి పెరుగు పాలు మొదలగునవి పోసుకొనుటకుపయోగింతురు. వంగము (తగరము)ను వలె శోధనముచేసి భస్మముగావించి సేవించదగినది. దీనిని భస్మముచేయురీతు లనేకములు కలవు. కొన్నిటినివ్రాయుదుము. శుద్ధిజేసిన సత్తును కరిగించి చిర్రివేరు ముక్కలనువేయుచు యినపగుదియతో రాచుచు వేయించినయెడల పట్టి

శుద్ధమైనభస్మమగును. దీనిని మెత్తగా వస్త్రగాలితముచేసి వ్రణములకుపూసిన వెంటనే మానును. లోపలకుతినిన చలువచేయును. వీర్యనష్టము తెల్లకుసుమహరించును. ఒకతులాసత్తు బాగుగా కరిగినతరువాత శేరెత్తు నల్లమందువేసి గరిటెతో కలియబెట్టుచు కొలిమి నూదుచున్నయెడల తెల్లనిభస్మమగును. దీనిని వస్త్రగాలితముచేసి కండ్లలోదినమునకొక్క చిటికెడుభస్మమును కండ్లలోవేయుచుండిన 3, 4 దినములకు కండ్లయెరుపు మంట పోటు నీరుగారుట యెండచూడనివ్వకుండుట మొదలగు కంటిరోగములుమానును. సత్తునుకరిగించి యిప్పనూనెలో 21 సార్లుపోసి అసత్తునుకరిగించి నేలయుసిరికగను సమూలము ముక్కలుగా నరికి కొంచెముకొంచెము వేయుచు నేయించుచున్న చక్కనిభస్మమగును. దీనిని బాలుర యకృత్ ప్లీహావృద్ధులకు వాడవలెను. యింకను మరికొన్ని హృదయదోషముల హరించును. మోతాదు ఒకటి మొదలు రెండుమూడు గురుజలెత్తువరకు యివ్వవచ్చును. సత్తు వగరు చేదు రుచులు శీతవీర్యము లఘుగుణము కటువిపాకముగలది. సత్తుభస్మమును అనుపానభేదముచేత భ్రమ పాండు పొడిదగ్గు శ్వాస నేత్రవ్యాధులు మొదలగువానియందు వాడదగును.

సదాపచెట్టు:—సం. (పెద్దది) శతపుష్ప, శతాహ్వ, శతాక్షి, మిసీ అనియు. హిం. సోయాఅనియుపేరు. (చిన్నది) మిశ్రేయా, శాలీన, శీతశివా అనియుపేరు. ఆకు పచ్చని పూవుగలది. గుత్తులుగుత్తులుగ పూవులుపూచును. ఇది కారము రుచి తీక్షణ లఘుగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము గలది. జ్వరము కఫము వాతము వ్రణము శూల నేత్రవ్యాధులు అగ్నిమాంద్యము తేనుపులు యోని శూల ఆధ్మానము మొదలగురోగములను హరించును. చిన్నసదాప అగ్నిదీప్తి నిచ్చును, పొట్టకుమేలుచేయును. మలబద్ధము క్రిమి వీర్యము వీనినిహరించును. సదాపకాయలు కాన ఛర్ది కఫము వాతము నశింపచేయును. సదాపాకు పావుతులం, మిర్యాలు అరతులం, సైంధవలవణము పావుతులం, కలిపి ద్రాక్షపండురసముతో నూరి సెనగగింజంతమాత్రచేసిమింగుచున్న



అజీర్ణము అమితమగుతేనుపులు నివర్తించును. సదాపాకు రసకర్పూరము రససిందూరము సమముగకలిపి తమలపాకురసముతో నూరి పెసలవలె మాత్రలుచేసి బిడ్డలకు వేసిన జ్వరము జలుబు దగ్గు పిల్లికూతలు డొక్కలుయెగరవేయుట అజీర్ణము మొదలగు సకలవాతకఫవికారములు శమించును.

సన్నతాస్నము:—చూ. కళింగతాస్నము,

సస్నిదుంప:—సం. వారాహీకంద, చర్మకారాళుక అనియు, హిం. గోంఠీ, భిరోవ్లీకంద అనియుపేరు. అనూపదేశమందు పుట్టును. దీనికి పందివెండ్రుకలవంటి వెండ్రుకలుండును. గనుక వారాహీకందమందురు. పైచర్మముయొక్క ఆకారముకూడ పందిచర్మమువలెనుండును. చేదు కారము రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. పిత్తమును పెంచును. శుక్రము బలము కాంతి ఆయువు పెంపొందించును. మేహముక్రిమి కుష్ఠము వాతముహరించును. అగ్నిదీప్తినిచ్చును.

సప్తపర్ణి:—సం. సప్తపర్ణ, విశాలత్వక్, శారద, విమలచ్ఛద అనియు, హిం ఛతివన్, సతవన్, సతోనా అనియుపేరు. పెద్దవృక్షము. దీనిని గిల్లిన అమితముగ పాలుగారును. ఒకతొడిమకు 7 ఆకులు విడిగనుండును. పాలకు మదపువాసనగలిగియుండును. చేదు వగరు రుచులు స్నిగ్ధసరగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. క్రిమి కుష్ఠము గుల్మము వ్రణము రక్తదోషము త్రిదోషములుహరించును.

సజ్జాచెట్టు:—చూ. రుద్రజట.

సర్పాక్షిచెట్టు:—సం. సర్పాక్షి, గండాలీ, నాకీకలాపక అనిపేరు. వెంపలిచెట్లలో నిదియొకభేదముగ పరిగణింపబడినది. ఆకారమంతయు వెంపలినిపోలియుండును. కటుతిక్తరసములు లఘురూక్ష గుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. క్రిమి, వృశ్చికము ఎలుక సర్పవిషములు వ్రణము వీనినిహరించును.

సముద్రపాల:—ఆకు కొంచెము కోలగ గుండ్రగ పెద్దదిగ నుండును, ఆకునకు అడుగువైపున తెల్లనినూగు దట్టముగ నుండును, ఇది

తీగజాతిలోనిది. ఆకు రసమున సైంధవలవణము కలిపి పూసిన చిడుము దద్దురు మొదలగు చర్మరోగములుమానును. ఆకులనుతొక్కి ఆముదముకలిపి వెచ్చజేసి కట్టుగట్టినగడ్డలుహరించును. లేదా పక్వమైవెంటనే పగులును.

సముద్రపునురుగు:—సం. సముద్రఫేనన, డిండీర. అబ్ధికఫ, అర్ణవమల అనియు, హిం. సముద్రఫేన్ అనియుపేరు. తెల్లగ నుండును. వగరు రుచి లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. నేత్రరోగములు కఫము కంఠరోగములు హరించును. దీనిని మెత్తగానూరి నువ్వుల నూనెలో కలిపి చెవిలో బోసిన చెవిపోటు కురుపులునశించును. సముద్రపునురుగును చూర్ణించి మూర్గొండాకురసములో కలిపి పూసిన శరీరమునందలి దారుణముగుమరద చర్మరోగములు నశించును. విషదోషమునుజయించును. లోపలకుతిను మోతాదు ఎక్కువయైనచో హానిచేయును. సాధారణముగా దీనిని చెవి కన్ను రోగములకు వాడుదురు. దీనికి సారపీయు అని దేశీయనామముకలదు.

సముద్రపుష్పము:—సం. సముద్రపుష్ప అందురు. వగరు తీపి రుచులు గురుగుణము శీతవీర్యము మధురవిపాకము గలది. రక్తదోషము కఫము పిత్తము కామిల హరించును. గర్భిణుల కష్టముల తొలగించును.

సముద్రలవణము:—మధురవిపాకము గురుత్వముకలది. కఫమును పెంచును. మూర్గొండాకుపసరుతో ఉడకబెట్టి 16 పుటములువేసిన సిందూరించును. యీసిందూరమును చిన్నంమొదలు రెండుచిన్నములవరకు ఉడుకునీళ్ళతో ఉదయసాయంత్రములందు సేవించిన శూలకడుపుబ్బరము అజీర్ణము మొదలైనవితగ్గును. అనేక రసజాతులనుకట్టును. రసవాదమున ఉపయోగించును

సముద్రశోష:—వాతమును హరించి కఫపిత్తముల బెంచును. మలబద్ధకరము.



సరస్వతిఆకుచెట్టు:—చూ. మండూకపర్ణి.

సరళదేవదారు:—సం. సరళ, ధూపకాష్ఠ, పీతదారు, మరిచపత్రిక అనియు, హిం. ధూపసరళ్ అనియుపేరు. దేవదారుజాతిలోని పెద్దవృక్షము. దీనిచక్క ఆకు తైలము ఉపయోగకరములు మధురతిక్తరసములు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకము గలది. ఆకురసమును చెవిలోబోసిన చెవిపోటు చెవినుండి పురుగులుపడుట చీము నశించును. చక్కరసము లేక కషాయము ద్రాగిన కంఠరోగము కఫము వాతము తాపము మూర్ఛ హరించును. కోష్ఠమును శుద్ధిపరచును. చక్క గంధమునుపూసిన చర్మరోగములుహరించును.

సర్జక్షారము:—సం, స్వర్జక్షార, కపోత, సుఖవర్చక అనియు, హిం. సజ్జీఅనియుపేరు. సజకట్టెలనుండి క్షారపాకవిధానమున తయారుచేయబడిన క్షారము సర్జక్షారమనబడును. కారము రుచి తీక్ష్ణ గుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది గుల్మము శూల వాతకఫములు కృమి ఉన్మాదము ఉదరము హరించును.

సహదేవిచెట్టు:—సం. సహదేవీ అందురు. ఇది చిన్నమొక్క. ఆకులుగుండ్రగ చిన్నవిగ మందముగనుండును. తెల్లనిపూవుపూచును. ఇది బలాజాతిలోచేరినదని కొందరమతము. దీనివేరుతొక్కి శిరస్సునకు గట్టిన నిద్రదెచ్చును, సమూలకషాయమున పంచదార జేర్చి త్రాగిన శుక్రవృద్ధి బలముచేయును. రక్తపిత్తమునుతగ్గించును. ఆకురసమున తేనెకలిపి యిచ్చిన గర్భిణుల వాతజ్వరముతగ్గును. ఆకును ఆవునేతితోకలిపి వెచ్చజేసి కండ్లకుగట్టిన యెరుపు పోటు తగ్గును. వాతశ్లేష్మ జ్వరములందు దీనిరసము అనుపానముగ నుపయోగింపజనును,

సాంబ్రాణి:—ఇదియొకచెట్టు జిగురు. ఇందులో మేలురకమును గవ్వపలుకుసాంబ్రాణిఅందురు. తెల్లగ గవ్వవంటి పదార్థమిందు కలసియుండును. ఇది నిప్పుపై వేసిన మిగుల సువాసనగల పొగవచ్చును. దేవతాప్రీతికరము. గ్రహబాధలనుతొలగించును. వ్రణములకు ధూపము వేసిన విషవాయువులు క్రిములు దుర్వాసన హరించి త్వరితముగ

మానునట్టును. గవ్వపలుకుసాంబ్రాణిని చూర్ణించి ఆవుపాలతో పుచ్చుకొనిన క్షయ మేహము క్రిమి వ్రణములు గ్రహణి నంజు మొదలగు రోగములుహరించును. గవ్వపలుకుసాంబ్రాణిని చూర్ణించి ఖర్జూరపు కాయలలోకూరి గట్టిగా దారముతో కట్టి ఆవుపాలతో ఉడికించి తేనెలో వేయవలెను. ఇట్లు తయారుచేసిన ఖర్జూరపుకాయలను ఒక్కొక్కటిచొ॥ ఉదయసాయంత్రములందు సేవించుచున్న అతిమూత్రము మధుమేహము హరించును. వీర్యవృద్ధి బలముకలుగును. గవ్వపలుకుసాంబ్రాణి నల్లకాచు సమభాగముగ కలిపి చూర్ణించి రెండుచిన్నములు చొ॥ రెండుతులములపెరుగులో కలిపి త్రాగిన తక్షణము రక్తగ్రహణి జిగటవిరేచనములుకట్టును, సాంబ్రాణినుండి తీసిన తైలమును రాచిన కుష్టము దద్దుర్లు మొదలగు దారుణ చర్మరోగములు మానును. సాంబ్రాణివేసి కాచిన నూనెకూడ యించుమించు అరఖుయొక్క గుణములనుకలిగియుండును. సాంబ్రాణి హారతికర్పూరము సమముగకలిపి ఖల్వమునమర్దించిన మిక్కిలి జిగటగల పలాస్త్రీ తయారగును. దీనిని వలచనిగుడ్డకుపట్టించి ఒడిసెగడ్డలు అద్దుగర్రలు సెగగడ్డలు మొదలగు వానికి పట్టీవేసిన పోటనేలణచివేయును. కరిగించును. నొప్పితీయును గవ్వపలుకుసాంబ్రాణి చూర్ణమును పూటకుచిన్నము చొ॥ తినుచున్న క్షయ శ్వాసకాసలుతగ్గును. యింకను అనేకవిధముల సాంబ్రాణి ఉపయోగపడును.

సాంబ్రాణిపువ్వు:—సాంబ్రాణినుండి ఊర్ధ్వపాతనయంత్రమున దీసిన తెల్లనిపూవు. మిక్కిలి వీర్యవత్తరమైనది. నిగనిగ లాడుచు తెల్లగనుండును. ఒకచిటికెడుపూవును ముక్కుల లోనికి పీల్చిన శిరోభారము పీనసమొదలగు రోగములుకుదురును. సాంబ్రాణిపూవు ఒక గుంజెత్తుచొ॥ లవంగాలు తమలపాకులరసముతో రోజునకు రెండుమూడుసారులు పుచ్చుకొనిన దారుణ శ్వాస కాసలు ఉబ్బసము మేఘరంజి తగ్గును. సాంబ్రాణిపూవు తులము గోరోచనము అరతులము లవంగాలు పావుతులము వీనిని తమలపాకురసముతో మూడుదినములు నూరి



కందిగింజలంతమాత్రలుచేసి ప్రతి ప్రాతస్సాయంకాలములందును సేవించిన ఉబ్బసము క్షయ మేఘరంజి మొదలగుదగ్గులు తప్పక శాంతించును. సాంబ్రాణిపూవు కఫకాసకు శ్రేష్ఠమగుమందు.

సారకంద:—సం. గజకర్ణాలు, దీర్ఘనాళ, తీక్ష్ణకంద అనియు, హిం. ఆలు, ఘుయ్యా అనియుపేరు. దుంపజాతి విశేషము. చేదు తీపి రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. శీతజ్వరము పాండు శోథ క్రిమి గుల్మము ప్లీహ అనాహము గ్రహణి అర్శస్సు ఉదరము హరించును. మరియు దీనికి అడవికందయొక్క సకల గుణాదులు నుండును.

సాలామిశ్రి:—సం. సుధామూలీ, అమృత. జీవని, జీవా అనియు, హిం. సాలామిశ్రి అనియుపేరు. హిమాలయ పర్వతప్రాంతములందు మొలచును. దీనిదుంప ఔషధయోగ్యముగనుండును. దుంప తెల్లగనుండును. ఇందు మరియొకజాతి సాలామిశ్రి కాబూలు దేశమునందొరకును. వెల్లుల్లి ఉల్లి మొదలగు దుంపలను కొన్ని ద్రవపదార్థముల తోవండి సాలామిశ్రియని దగాచేసి అమ్మెదరు. నిజమైన సాలామిశ్రి దొరుకుట అరుదు.

మధురరసము గురుగుణము శీతవీర్యము మధురవిపాకముకలది. శుక్రము పుష్టి బలముకలిగించును. రక్తదోషమును హరించును. కామోద్దీపనముచేయును. వయస్సును స్థిరపరచును. బలవీర్యవర్ధకౌషధములలోచేర్చి వాడనగును.

సింహాళిపిప్పలి:—సం, సైంహలీ, సర్పదండ, సర్పాంగీ. బ్రహ్మభూమిజ అందురు. ఇది కారము రుచి లఘురూక్షగుణములు ఉష్ణవీర్యము. కటువిపాకముగలది. క్రిమి అగ్నిమాంద్యము కఫవాతములు కోష్ఠరోగములు హరించును.

సిద్ధేశ్వరము:—సం. సిద్ధ, సిద్ధేశ్వర, సిద్ధనాథ అందురు. పుష్పజాతిలోచేరినది. దీనిపుష్పము ఔషధయోగ్యముగనుండును. మధు

రరసము స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకము గలది. గ్రంధులు గొరికుపు (నాడీవ్రణము) వాతవ్యాధులు త్రిదోష వికారములు హరింపచేయును.

సీకాయ:—చూ. షీకాయచెట్టు.

సీతాఫలపుచెట్టు:—సం. సీతాఫల, గండగాత్ర. వైదేహీవల్లభ, కృష్ణబీజ, అత్యృష్య, బహుబీజక అనియు, హిం. సరీఫా అనియుపేరు. ఇది సాధారణమైనచెట్టు. దీనిఆకులు కోలగా బలమైన పసరు వన్నెగలిగి మృదువుగానుండును. పండ్లపైభాగము బొడిమలుకలిగి యుండును. దీనిలోగింజలు విశేషముగను నల్లనిరంగుగను ఉండును. గుంజు తెల్లగ మిక్కిలి మధురముగనుండును. ప్రసిద్ధమైనది. ఆకును తేళ్ళుగల బొరియలలో పెట్టిన అవిపైకివచ్చును. సీతాఫలపుపువ్వులతో కృమిదంతము (పుప్పిపన్ను) రంధ్రమున ఆకురసపు చుక్కలు వేసిన పురుగులు బైటకువచ్చును. ఆకురసమును రాచపుండ్లపైన దట్టముగరాచి ఆకునూరినముద్దనువేసి కట్టిన రాచపుండ్లుమానును. పురుగులుపడిన వ్రణములకు వేనికైనను ఆకురసము పూత ఆకు ముద్దకట్టు మిగులఉపయోగకరము. సీతాఫలము పండినది మధురరసము గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. తృప్తినిచ్చును. బలము మాంసము పుష్టి కలిగించును. శైత్యముచేయును. అమితముగదినిన కృములను పుట్టించును. చలిజ్వరమును కలుగచేయును. గర్భపాతమును గలిగించును. ఋతురక్తమును జారీచేయును. మూత్రమును ధారాళముగ వెడలించును. మధుమేహ అతిమూత్రరోగులకు విషతుల్యము. సెగరోగము మూత్రకృఛ్రగలవారలకు హితకరము. సాధారణముగా యిది వాతకఫముల పెంచును,

సీమనేపాలము:—వీనిని దుండగపుచెట్లని కొన్నిచోట్ల వాడుదురు. కాడలు యెఱ్ఱగనుండును. చిన్నమొక్కలు పెద్దనేపాలమునకువలె ఆకులు, కొమ్మలుగిల్లిన తెల్లనిచొనకారును. దీనిచిగుళ్లు పాషాణముల నఱకట్టును. సవీరముతోచేర్చి నిమ్మపండ్లరసముతో నూరి కందులవలె



మాత్రలుచేసి వాడిన చలిజ్వరములుతగ్గును. పెద్దనేపాలమయొక్కగుణములును ఉండును.

సీమసున్నము:—అజీర్ణవిరేచనములను కట్టును. దంతరోగములను దంతమాలిన్యమునుమాన్పును. అనేకదంతచూర్ణములలోచేర్తురు.

సీసము:—సం. నాగ, భుజంగ, సర్ప అందురు, లోహములలోచేరినది. సులభముగ కరుగునదియు, మిగుల బరువైనదియు, నరికినపుడు నలుపుమెరుపుగలదియు దుర్గంధయుక్తమైనదియు పైకినల్లగనుండునదియు శ్రేష్ఠమైనసీసమని గుర్తించవలెను. దీనిని శోధనమారణముల జేసి సేవించవలెను. సీసము చేదు రుచి స్నిగ్ధగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. శ్వాసకాసలు గ్రహణి శుక్లనష్టము తెల్లకుసుమ ప్రమేహము అగ్నిమాంద్యము మొదలగురోగములను హరించును. సీసమునుకరిగించి వావిలివేరు రేణుకలు పసుపు వీనిచూర్ణమునబోసి లోహదండముతో మర్దించి పిదప వావిలి రసమున చల్లార్పవలెను. ఇట్లు మూడుసారులు చల్లార్చిన శుద్ధమై మూర్ఛా స్ఫోటాది దుర్గుణములను కలిగించక యుండును. ఇట్లు శుద్ధిచేయబడిన సీసమును యినుప మూకుడులోవేసి కరగినతరువాత సీసముతో సమాన పరిమాణముగల పసుపును కొద్దికొద్దిగ వేయుచు ఇనుపగుదియతో రాచుచుండిన నాలుగు జాములకు యెర్రగ నిర్దుష్టమైన సిందూరమగును. దీనిని వస్త్రగాలితము చేసి నిమ్మపండ్లరసముతో నూరుచు మూడుపుటములువేసినయెడల వారితరమగు సిందూరమగును. గుంజెత్తుమొదలు రెండుగుంజలయెత్తు వరకు పటికిబెల్లము వెన్న తేనె మొదలగు అనుపానములతో పైవ్యాధులకువాడవలెను. మరియు నీసిందూరము గుల్మము జ్వరము జ్వరబిళ్ళలు యకృత్ ప్లీహాలుహరించును. అఖండబలమునిచ్చును. అనుపాన భేదముచే సకలరోగములనుహరించును.

సుగంధపాల:—సం. అనంతా, సారిబా, శారిబా, ఉత్పలశారిబా, భద్రవల్లీయనియు, హిం. గోరీసర్, కాలీసర్. కారియాసావ్రా, గొరియాసావ్రా అనియుపేరు. ఇది నల్లసుగంధి తెల్లసుగంధియని రెం

ను తరగతులుకలది. నల్లసుగంధికి బరోసుగంధియని వాడుకపేరు. సుగంధి చిన్నతీగవంటిమొక్క. వేరు ఔషధయోగ్యము. తెల్లసుగంధిని పాలసుగంధియనియు, సుగంధపాల యనియు వాడుదురు. దీనివేరు మంచిపరిమళముగలది. బరోసుగంధివేరు పరిమళముతక్కువ. ఆకులు పొడవుగా తెల్లచారలుకలిగి యెఱ్ఱచెక్కనేలయందు విశేషముగ మొలచును: తెల్లసుగంధి మధురతిక్తరసములు గురు స్నిగ్ధగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. కుష్టు జ్వరము దురద శరీరదుర్గంధము అగ్నిమాంద్యము శ్వాసకాసలు అరుచి ఆమదోషము త్రిదోష వికారములు రక్తదోషము కఫము అతిసారము దప్పి తాపము రక్తపిత్తము వాతము హరింపచేయును. సుగంధి బావంచాలు రెండును సమభాగములుగకలిపి కషాయముగాచి పాలు పంచదారచేర్చి ప్రతియుదయమున త్రాగిన దురద చిడుము తీట మొదలగు చర్మరోగములన్నియునశించును. రక్తముశుభ్రపడును. క్రొత్తరక్తముపట్టును. ప్రమేహము ఉడుకుజ్వరమునశించును. శుక్లనష్టముకట్టును. పొడిదగ్గును రాకుండచేయును. సుగంధి ప్రధానముగాగల సుగంధాది లేహ్యముకూడ పైగుణములనిచ్చును. చాలాకాలము సుగంధిని సేవించిన నంజురోగము పుట్టును. గాన కొలదిరోజులుమాత్రము వైద్యునిసలహాతో తినవలయును. సుగంధిచూర్ణమును ఆవునేతితో కలిపి రాచిన మంత్రకురుపులు విసర్పి మొదలగునవికుదురును. సుగంధిచూర్ణమును వెన్నలో కలిపి పూసిన నోటిపూతతగ్గును.

సుద్ద:—సం. ఖటికా, పాకశుక్ల, కఠినీ, ఖడీ, అనియు, హిం, ఖడియా, గొరఖడీ అనియుపేరు. తెల్లనిమన్ను ఖనులలో దొరకును. గోడలకు వెల్లవేయుటకుపయోగింతురు. తడిపినయెడల వెన్నవలె మృదువుగనుండును. ఇది మధురతిక్త రసములు గురుగుణము శీతవీర్యము మధురవిపాకముకలది. తడిపి వ్రణములకుగట్టిన వ్రణములునశించును. పిత్తము తాపము కఫము రక్తదోషము నేత్రవ్యాధులు హరించును. కొన్నిరసపాకములయందు కవచములిచ్చుట కుపయోగించును.



సున్నము:—రాతిసున్నము అనగా సున్నపురాళ్లనుకాల్చిన సున్నమగును. దీనిని నీళ్లలో వేసి ఆరకుండనుంచిన ఘాటుగనుండును. శరీరముపైన వేసిన పొక్కును. కవ్వుకుదెబ్బలు తగిలినచోట తడిసున్నము రాసి కట్టిన వాపు నొప్పితీయును. సున్నము ఆముదము కలిపి నీళ్లుపోసి బాగుగామర్దించినయెడల వెన్నవంటి చక్కని పాలాస్త్రీ తయారగును. దానిని గజ్జకురుపులకురాచిన నవినయమగును. సున్నము బెల్లము కలిపి పట్టువేసిన గాఢముగ పట్టుబట్టును. దీనివలన కవ్వుకునొప్పులు తీయును. సున్నమునందు నిమ్మపండురసముపోసి ఉడికించి రొమ్మునకు పట్టువేసిన శ్లేష్మమువలనగలుగు గుండెనొప్పి బరువు తీయును. కఫము కరుగును. గొంతునకుపట్టువేసిన గొంతునొప్పితీయును. సున్నపునీళ్లను ఒకఔన్సు త్రాగించి వెంటనే రెండుతమలపాకులు నమిలించి మ్రింగించిన యెడల బాలింత శూలనొప్పులు తాత్కాలికముగతగ్గును. కుంకుమగింజంత సున్నము వెన్నలోవాదిగి స్త్రీలు బహిష్టులైన మూడురోజులు ఉదయపుపూటలు నిచ్చునెడల ఋతుశూల నెమ్మదించును. మరియు చలిజ్వరమును అపుచేయును. సున్నపునీళ్లలో కొబ్బరినూనెవేసి కవ్వముతో చిలికిన తెల్లగ పాలవలెఅగును. దానిని కాలిన పుండ్లకు రాచుచుండిన మంట వెంటనేతగ్గి క్రమముగ పుండుమానును. కాల్చిన సున్నపురాళ్లను జిల్లేడుపాలతోతడిపి చూర్ణించి వస్త్రగాలితముచేసి యాచూర్ణమును 7 దినములు తెల్లజిల్లేడుపాలతో భావనచేసి బిళ్ళచేసి కొలిమిలోకాల్చిన తెల్లనిచూర్ణమగును. ఈచూర్ణమును రెండుగురివెందలెత్తు తమలపాకులోపెట్టి నమిలించిన యెడల యెట్టి అసాధ్య కాసరోగమైనను తక్షణముతగ్గును. దినమునకు మూడుసారులుయివ్వవలెను. సున్నముతో గంధకము తాళకము మొదలగు పాగవస్తువులు భస్మము చేయుదురు. గుల్లసున్నమునకు నివియేగుణములుండునుగాని మిగుల వీర్యము తక్కువనుండును. రాసున్నమందలి సుగుణములు కొన్ని యిందులేవు.

సునాముఖి:—సం. కల్యాణీ, స్వర్ణముఖి స్వర్ణపత్రి అనియు, హిం. సనాయె అనియుపేరు. చిన్నచెట్టు. ఆకు చింతాకువలెనుండును

మలబంధము అగ్నిమాంద్యము ప్లీహ యకృత్ వృద్ధులు ఉదరము అజీర్ణము విషమజ్వరము కామిల పాండువుహరించును. దారుణవిరేచనము చేయును. చింతపండుచారులో సునాముఖివేసి కాచి ఆచారును త్రాగినను చూర్ణమును వేడినీళ్లతో పుచ్చుకొనినను మలబంధమును విప్పునుగాని కండ్లుతిరుగుట మొదలగు అనేక పిత్తవికారముల బుట్టించును. అన్నహితముతగ్గించును. మొత్తముమీద కొద్దికొద్దిగ ప్రతిదినము సేవించుచుండిన మూలవ్యాధి మలబద్ధరోగులకు హితకరముగ నుండును.

సుదర్శనము:—సం. సుదర్శన, సోమవల్లీ, చక్రాని, మధుపర్ణిక అనియు, హిం. సుదర్శన అనియుపేరు. తీపిగ వేడిచేయునదిగ నుండును. కఫము వాతరక్తము హరించును.

సురపొన్న:—చూ. పున్నాగవృక్షము.

సురుగుడుచెట్టు:—దీని వెన్ను మొక్కజొన్న వెన్నువలెనుండును ఆకుకూడ పొడవుగనుండును. చెక్క చూర్ణమును వేపనూనెలోగాని నూనెలోగాని కలిపిరాచినను చక్కగంధమును పూసినను చర్మరోగములను మాన్పును.

సురాకారము:—సం. సూర్యక్షార, తార్క్ష్య, తీక్ష్ణరస, సువర్చిక అనియు, హిం. సోరా, సూర్యాఖార్, వాజీఅనియుపేరు. ఇదియొకక్షారము. తెల్లగా ఉప్పువలెనుండును. దీనికి 6 రెట్లు నీళ్లుపోసి కలిపి తేర్చి వడియగట్టి మూకుడులోపోసి నీరంతయు యిగురువరకుకాచునది యిట్లు 9 సార్లుకాచిన సురాకారము వీర్యవంతముగ నిర్దుష్టముగ నుండును. కారము చేదు రుచులు లఘు తీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. అగ్నిదీప్తి తాపము శోష పిత్తము పుట్టించును. ప్లీహము మూర్ఛ నేత్రరోగములు వాతము మూత్రకృఛ్రి మూత్రాఘాతి అశ్మరులు కుంభ కామిల కాస తలనొప్పి కడుపుబ్బరము ప్రమేహపిటక మున్నగురోగములనుహరించును. పైవిధముగ 9 వంటలు చేసిన సురాకారముబేడెత్తు మొ॥ పావులాయెత్తువరకు రేవల్చిన్ని కషాయములో కలిపియిచ్చిన అరగంటలో మూత్రబంధమునువిప్పును. రేవల్చిన్ని గంధము సురాకారముకలిపి పొత్తికడుపునకు పట్టువేసినను మూత్రమును జారీచేయును. మూత్రపుచురుకుతగ్గును. ఆకాశోదకమునగాని రెండు మారులు అర్కయంత్రమునుండితీసిన నీరునగాని సురాకారమునుకలిపి ఆనీటిలో దూదినితడిపి తలమీదలేచు పుండుపైనవేసి తడిఆరకుండ ఆ నీరుచుక్కలు పోయుచుండిన ఆపుండుతగ్గును. సురాకారము ముల్లంగిదుంపరసముతో ఉడకబెట్టి ముల్లంగిదుంప రసముతోనే నూరి పుటము వేయవలెను. యిట్లు 10 పుటములు వేసిన చక్కగ సిందూరించును. ఆసిందూరముగూడ పైజెప్పినరోగములు కుదుర్చును, తీవ్రముగ పనిచేయును. మోతాదు రెండుమొదలు 4 గుంజెలెత్తువరకుయివ్వవచ్చును. సురాకారము వాదవిద్యయందత్యంతోపయుక్తము.



సైంధవలవణము:—చూ. పంచలవణములు.

సొంఠి:—సం. శుంఠీ, మహౌషధ, విశ్వభేషజ, నాగర, కఫారి, కటుగ్రంథి. శోషణ అనియు, హిం. సోంఠ్ అనియు పేరు. అల్లమును సున్నపునీళ్లతో ఉడకబెట్టి యెండించిన శొంఠిఅగును. అల్లపుమొక్క యొక్క స్వరూపాదులను అర్ద్రకయందుజూచునది. అన్నిమందులకన్న యోగ్యమైనదిగాన మహౌషధ విశ్వభేషజ అనియు, కారముగలది గనుక కటుగ్రంథియనియు, కఫమునుహరించును గాన కఫారియనియు, శరీరము నార్చునదిగాన శోషణయనియు దీనికిపేరు గలిగెను. కారము రుచి లఘుస్నిగ్ధములు మధురవిపాకముగలది. ఛర్ది శ్వాసకాసలు శూల హృద్రోగము శ్లీపదము శైత్యము అర్శస్సు అనాహము ఉదరము వాతము హరించును. శొంఠి ఆగ్నేయగుణముకలది గనుక మలమును బంధించును. "మలబంధహార్" అని మలబద్ధమును పోగొట్టుననియు చెప్పుటచేత మలమునుభేదించునేగాని విరేచనము చేయజాలదని తెలియవలెను. మరియు నిది దీపన పాచనకరమైనది. నీళ్లతో నూరిన ఉప్పును శొంఠికిపట్టించి బొగ్గునిప్పులమీద కాల్చి కత్తిలో గీకివైచి దానిని చూర్ణించి భోజనమునందు ప్రథమకబళమున అరతులంచూర్ణమును తినుచున్న చిరకాలానుగత అజీర్ణములు శూల కడుపుబ్బరము నివర్తిం

చున్న. శొంఠిచూర్ణమును పాలలోవేసి లేహ్యపాకముగవండి కొద్దిగా పంచదారవేసి కలిపి దించినతరువాత జేజెత్తు నేయివేసి కలిపి పుచ్చుకొనిన రక్తగ్రహణి జిగటవిరేచనములుకట్టును. శొంఠిని సైంధవలవణముకలిపిన పుల్లమజ్జిగలో 7 దినములుభావనచేసి యెండించి తినుచున్న ఛర్ది కడుపుబ్బరము అజీర్ణము శూలతగ్గును. శొంఠి వస రెండు సమభాగముగచూర్ణించి నస్యముచేసిన పార్శ్వపునొప్పితగ్గును, శొంఠిని నీళ్ళతో అరగదీసి యీగంధమును ఉడికించి పట్టువేసిన వాపులు నొప్పితగ్గును. కణతలకుపట్టువేసిన తలనొప్పితగ్గును. శుంఠిని ఆముదపుచెట్ల రసముతో నూరి ముద్దజేసి ఆముదపుఆకులలోచుట్టి పుటపాకముచేసిదాని రసమునుపిండి అందు తేనెకలిపి త్రాగిన ఆమవాతము నశించును. శుంఠిచూర్ణమును నేతితోతడిపి ఆముదపుఆకులలోపెట్టి పుటపాకము చేసి దానికిసమముగ శర్కరకలిపి ప్రాతఃకాలమున సేవించిన ఆమవాతము నశించును. శొంఠి 40 తు॥ నేయి 80 తు॥ పంచదార 200 తు॥ నీరు 8192 తు॥ వీనిని పొయ్యిమీదపాకముచేయుచు శొంఠి మిర్యాలు పిప్పళ్ళు ఏలక్కాయలు ఆకుపత్రి కుంకుమపువ్వు నాగకేసరాలు మోడి అగురుచెక్క జాపత్రి జాజికాయ కచోరాలు పాషాణభేది తామ్రభస్మము స్వర్ణమాక్షికభస్మము మండూరం లోహం కాంతం యివి ప్రత్యేకము రెండుతులములుచూర్ణించి చేర్చి లేహ్యపాకమునదించవలెను. ఇది శుంఠీపాక్ అనబడును. దీనిని బలానుసారము సేవించిన ఆయుర్వృద్ధి బలము ఇంద్రియపుష్టి కలుగును. ఆమవాతము శూల అజీర్ణము అగ్నిమాంద్యము పాండువు శోఫనశించును.

సొరతీగ:—చూ. ఆనపతీగ. చేదుసొర.

సొరపీయ:—చూ. సముద్రపునురుగు.

సోపు:—సం. మధురిక, మాధురీ, తాపసప్రియా, గంధాఢ్యిక, త్రిషాహార అనియు, హిం. సౌఫ్ అనియుపేరు. జీలకర్రవలె నుండునుగాని అంతకన్న మిక్కిలిపెద్దవి. వడ్లగింజలో 4 వ వంతు ఉండును. పరిమళముగలది నమిలినయెడల తియ్యగానుండును గనుక మాధురీయనియు మధురికయనియు పేరుకలిగెను. చేదు కారము తీపి రుచుల్గు గురు స్నిగ్ధగుణములు శీతవీర్యము కటువిపాకముగలది. అగ్నిదీప్తి వాతజ్వరము శూల తాపము నేత్రవ్యాధులు వ్రణము ఛర్ది అతిసారము ఆమదోషము ప్లీహ కఫముహరించును. మిగుల వీర్యవృద్ధిచేయును. సోపుచూర్ణమును తేనెతో ప్రతిసాయంకాలముతినిన అమితవీర్యవృద్ధి వీర్యస్తంభనముచేయును. సోపురసమునిచ్చిన స్త్రీల గర్భాశయ దోషములునశించును. సోపురసమున పంచదారకలిపి యిచ్చిన గుండెనొప్పి ఊపిరిగొట్టునొప్పి తగ్గును. స్త్రీలకు చనుబాలు వృద్ధియగును. సోపు అరఖు సోపుతైలము సోపుగుణములను కలిగియుండును.



సోమలత:—సం. సోమలత, సోమవల్లి, ద్విజప్రియ అనియు. హిం. సోమవల్లీ అనియుపేరు. ఇదిరాత్రిపూట మెరుగుడుపూవువలెమెరయును. శుక్లపక్షప్రతిపత్తుమొ॥ పూర్ణిమవరకు ఒక్కొక్క ఆకుచొ॥ ప్రతిదినము మొలచును, పిదపకృష్ణపక్షమునఒక్కొక్కటిచొ॥ ప్రతిదినము రాలిపోవును. అమావాస్యనాడు దీనికాకులుండవు, కావుననే దీనిని సోమలతయందురు. దీనిరసమును సోమయాజులు యజ్ఞసమయమునత్రాగుదురు ఇప్పుడిది యెచ్చటదొరకునో తెలియదు. తీపి కారము రుచులు శీతవీర్యము గురుగుణము మధురవిపాకము గలది. దప్పి శోష హరించును, త్రిదోషములనుహరించును. కల్పప్రకారము సేవించిన ముదిమిని రోగములను హరించును, దీనివలన రసవాదుల కత్యంతోపయోగము కలదని చెప్పుదురు.

సోమింతచెట్టు:—అవిసెవంటి యాకారము కలదిగాని అంతకన్న ఆకులు పూవులు కాయలు మొదలగునవిచిన్నవి. ఆకుతొక్కి శిరస్సునకుగట్టిన తలపోటు కీళ్ళనొప్పులు వాతపునొప్పులు పక్షవాతముహరించును, పూవులయొక్క నలుపు పసుపు భేదముచేత యిది రెండువిధములు. రెండును సమానగుణములుకలవి. నల్లదిమంచిది.

సౌవర్చలవణము:—చూ. పంచలవణములు.

సౌవీరాంజనము:—ఘూమ్రవర్ణముకలది. రక్తపిత్తమును విష హిక్కాదిరోగములను హరించును. వ్రణములనుకోయును. మాన్పును నేత్రములకు మిక్కిలిహితకరము. గాన ప్రతిదినము నేత్రములందంజనముచేసికొనఁదగినది.

సౌవీరము:—ఇది తరవాణివలె తయారుచేయబడు అమ్లపదార్థము. తరవాణిగుణములను గలిగియుండును. చూ. తరవాణి.

స్పంకి:—సం. ఘంటీ, అజాంత్రీ పద్మా అందురు. కారము తీపి వగరు రుచులు గురుస్నిగ్ధగుణములు శీతవీర్యము కటువిపాకము గలది. బలము మలబంధము వీర్యము కఫము కలిగించును., వాతపిత్తములు హృద్రోగము కాస ఆయాసము ఆమదోషము హరించును.

స్పృక్కాశాకము:—సం. స్పృక్కా, కోటివర్షా, మరున్మాల, లతామరుత్, లంకాలిక అనియు, హిం. పిడిడ్‌శాక్ అనియుపేరు. చేదు తీపి వగరు గురుస్నిగ్ధగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. సకలదోషములనుహరించును. కుష్ఠు దురద విషము స్వేదజన్య, దోషము తాపము రక్తవికారము జ్వరము కఫము మేహము అశ్మరి మూత్రకృఛ్రి శూలల నశింపచేయును. వీర్యవృద్ధి బలము కలుగజేయును.

స్వర్ణజీవంతి:—సం. హేమపూర్ణ, స్వర్ణలత, స్వర్ణజీవంతి, సుమంగళఅనియు, హిం. పీలాజీవంతి, సునహారీజీవంతీ అనియుపేరు. పాలతీగలలో నొకభేదము. మధురరసము స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. వాతపిత్త రక్తదోషములు నేత్రవ్యాధులు హరించును. బలము వీర్యము పుష్టి కలుగచేయును.

హంసపాది:—హంసపాదీ, కీటమాతా, త్రిపాదీ, మధుస్రవా, గోధాంఘ్రిఅనియు, హిం. హంసపగీ అనియుపేరు. జాలములలోభూమినంటుకొని పారు ఒకతీగజాతియొక్క ఆకులు. పక్షియొక్క అడుగువలె గొగ్గులుగలిగి చిన్నదిగనుండుటచే దీనికి హంసపాదియని పేరు కలిగెను. నూతులు చెరువులు మొదలగు జలప్రాయ ప్రదేశమునందు



విశేషముగమొలచును. ఇది కారము రుచి గురుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. రక్త విష వ్రణదోషములు విసర్పము తాపము అతిసారము నాలెపురుగువిషము భూత గ్రహబాధలు అపస్మారము భ్రమ హరించును.

హంసోదకము:—చెట్లు మేఘములు మొదలగువాని యావరణము లేకయుండు తటాకముమొదలగు వానియందు పగలు సూర్యకిరణములచేకాగి రాత్రియందు చంద్రకిరణములచేత చల్లబడి అగస్త్యనక్షత్రముదయించుటచేత సాలిపురుగులు మొదలగువానిచే గలుగు విషము చేవిడువబడి కలకబారక పరిశుద్ధమైయుండు జలమునకు హంసోదకమనిపేరు. పైలక్షణములు గలిగియున్నను ఆశ్వయుజ కార్తిక మాసములందుగాక తక్కిన మాసములందట్టి జలమునకు హంసోదకసంజ్ఞలేదు. యీహంసోదకము మిగుల తేలికయైనది. పథ్యకరము. దప్పిని తాపమును పోకడుచును రససేవజేయువారలకు మిగుల హితము, క్షతక్షయము క్షయ మొదలగు రోగములు కలవారలకు దప్పి కలిగినపుడెల్ల హంసోదకమునిచ్చుట హితము.

హరితాళము:—చూ. తాళకము.

హింగుపత్రి:—సం. బాష్పిక, వంశపత్రి అందురు. ఇంగువచెట్టుయొక్కఆకు. ఇది కటుతిక్తరసములు లఘురూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. గుల్మము ప్లీహ యకృత్ అజీర్ణము కడుపుబ్బరము శూల అర్శస్సు ఆమదోషము కృమి హరించును, దీపనపాచనకరము. మరియు యింగువయొక్క గుణములు గూడ కలిగి యుండును.

హిజ్జలము:—సం. హిజ్జల, నిచుల, అంబుజ అందురు. ప్రబ్బలిచెట్లలోభేదము. నీటిప్రబ్బలియొక్క గుణాదులను రూపమునుకలిగియుండును. చూ. నీటిప్రబ్బలి.

హేమమాక్షికము:— చూ. మాక్షికము.

హ్రస్వపంచమూలములు:— శాలిపర్ణి, పృశ్నిపర్ణి, వాకుడు, ములక, పల్లేరు వీనివేళ్ళ సముదాయమునకు హ్రస్వపంచమూలమని పేరు. వగరు చేదు రుచులు సమశీతోష్ణ వీర్యముకలది సకల దోష ములను హరించును.

క్షారకల్పనము:— క్షారప్రధానములగు ఉత్తరేణు మొదలగు కాష్ఠములను తీగలనుకాల్చి బూడిదచేసి దానికి 4 రెట్లునీళ్లుకలిపి రాత్రియంతయు నిల్వయుంచి మరునాడుఉదయము పైతేటనీరును వడియగట్టుకొని ఆనీరు అంతయు యిగురువరకు కాచి అందు తెల్లగ అంటియుండు క్షారమునుగ్రహించవలెను. ఇదియే క్షారపాకవిధానము.

క్షారాష్టకము:— మోదుగు యిరుగుడుచెట్టు ఉత్తరేణు నువ్వుమొక్కపుచెట్టు యవక్షారము వేగిసచెట్టు వెలిగారము యీభస్మములయొక్క సముదాయము క్షారాష్టకమనబడును, ఇది అష్టవిధ శూలలు గుల్మము వాతము మహోదరము హరింపచేయును.

క్షీరకాకోలి:— చూ. అష్టకవర్గు.

వస్తుగుణదీపము సమాప్తము.

శ్రీశారదాంబార్పణమస్తు.

# రోగనిదానదీపము.

అగ్నిదగ్ధవ్రణము:— నిప్పువలన కాలినపుండునకు అగ్నిదగ్ధవ్రణమని పేరు.

అజీర్ణము:— జఠరాగ్ని సమముగ నుండక మందముగను లేక తీక్షణముగను లేక విషమముగను ఉండి క్రమముగ కఫ పిత్త వాతరోగములగలిగించును. సాధారణముగా అజీర్ణవ్యాధి, అకాలభోజనము, అమితభోజనము, అధికజలపానము, మలమూత్రాదివేగములనాపుట, పగటినిద్ర, రాత్రిజాగరణము మొదలగు వానిచే జనించును. ఇది ఆమాజీర్ణము విదగ్ధాజీర్ణము విష్టబ్ధాజీర్ణము రసశేషాజీర్ణము అని నాల్గు విధములు. శరీరముబరువై బుగ్గలు కన్నులువాచి నోటనీరూరుచు భుజింపబడిన మధురామ్లాదిరసముల కనుగుణమగు తేనుపులువచ్చునదిఆమాజీర్ణమనియెరుంగవలెను. భ్రమ దప్పి పైత్యవికారములు, పులితేనుపులు, శరీరమంతట చెమటమొదలగులక్షణములుకలది విదగ్ధాజీర్ణముగ తెలియునది. కడుపుబ్బరము శూల శరీరమంతటనొప్పులు మలము అపానవాయువు బైటవెడలకుండుట దేహము మొద్దుబారియుండుట అను చిహ్నములుకలది విష్టబ్ధాజీర్ణము. అన్నమందు అహితము కడుపు నిండినట్లుండుట శరీరము మిగుల బరువైయుండుట అనులక్షణములుకలది రసశేషాజీర్ణము. ప్రలాపము మూర్ఛ వాంతి కీళ్ళుపట్టువడలుట భ్రమి మొదలగునవి అజీర్ణోపద్రవములు. యివి మిక్కిలిగనుండెనేని యది అసాధ్యవ్యాధియని తెలియదగును. పైఆమ విదగ్ధ విష్టబ్ధాజీర్ణముల వలన విసూచి విలంబిక అలసకము అను అజీర్ణరోగము లుత్పన్నమగును. ఆమవిరేచనములమితముగ నగుట వాంతి దప్పి శూల అవయవములు కొంకరపోవుట భ్రమ శరీరము రంగుమారియుండుట విరుపు తాపము వణుకు తలనొప్పి మొదలగు బాధలు విసూచికయందుండును. భుజింపబడిన యాహారపదార్థములు కఫ వాతదోషయుక్తములై వమన రూపమునగాని విరేచనరూపమునగాని బైలుపడక లోననిల్చి బాధనుకలిగించునది విలంబికయను రోగము. కడుపుబ్బరము మూర్ఛ అపానవాతము బైలువెడలక లోపలనేసంచరించుట మలమువెడలకుండుట దప్పి తే

నవు యివికలిగియున్న అలసకమని యెఱుంగవలయును. దప్పి తేనుపు వాయుసంచారమునను బాధలు విలంబికయందుండవు. ఇదియే యీ రెంటికిభేదము, దంతములు గోళ్ళు పెదవులు నల్లబడి హీనస్వరము కలిగి కన్నులు లోపలకు దించుకొనిపోయి యెముకలపట్లు వదలియుండు నెడల అట్టి యాలసక విసూచికలు మరణముగలిగించునని తెలియునది.

అతిసారము:—ద్రవములుగనుండు రసము మూత్రము చమట మేదస్సు కఫము పిత్తము రక్తము మున్నగుధాతువులు మిగుల ప్రకోపించి జఠరాగ్ని మందముగజేసి మలముతో కలసి అపానవాతమువలన బైటకుత్రోయబడి అధోమార్గమున మాటిమాటికి ద్రవరూపముగ స్రవించుచుండును. యీవ్యాధికి అతిసారమనిపేరు. నురుగుతో గూడి యెఱ్ఱగ విరవిరలాడుచు అపక్వమై బాధతోను శబ్దముతోను మలము కొంచెముకొంచెము మాటిమాటికి వెడలిన వాతాతీసారమని తెలియునది. పసుపు లేక నలుపు కొంచెము యెఱుపురంగులుకల మలము వెడలుట దప్పి మూర్ఛ దేహమునందుమంట గుదస్థానమునపుండగుట యివి పిత్తాతీసారలక్షణములు. కఫాతీసారమున మలము తెల్లగను కఠినముగను కఫముతోగూడి దుర్వాసన గలదిగను వెడలును. పందిచమురు మాంసముకడిగిన నీరువలె మలము వెడలుచు పైచెప్పిన వాతపిత్త కఫ అతిసార లక్షణములన్నిటిని కల్గియుండునది సన్నిపాతాతిసారము. యిది యసాధ్యము. మిగులదుర్వాసన జిగటగల్గి నీళ్ళలోవేసిన మునిగిపోవునట్టిమలము. ఆమమనబడును. ఆమమలము పలుమారు స్రవించు వ్యాధికి ఆమాతిసారమనిపేరు. శోఫ, శూల, జ్వరము, దప్పి, శ్వాస, ఎక్కిళ్ళు, అరుచి, వాంతి, మూర్ఛ, కడుపుబ్బరము, గుదమును మూసుకొనుటకు శక్తిలేక యెల్లపుడు తెరువబడియుండుట మొదలగు అతిసారోపద్రవములుకల రోగి జీవించడు.

అనాహము:—ఆమముగాని మలముగాని ప్రతిదినము బైటవెడలక లోపలనిలచి దుష్టమగువాతముచేత యెండింపబడి మలద్వారమునుండి బైల వెడలకుండినది అనాహమను వ్యాధిగాగుర్తించవలెను. అనాహము



ఆమాశయమున పుట్టినేని దప్పిక, పీనస, శిరస్సుతాపము, ఆమాశయమందుశూల, గురుత్వము, కడుపుబిగబట్టుట, తేనుపురాక హృదయంబుననే నిల్చియుండుట యనులక్షణములుండును. పక్వాశయమున బుట్టినేని శోఫయు అలక వ్యాధిలక్షణములుకలును చూ. అజీర్ణము.

అపచి:—గండమాల యనుపుపుపులు ఒకదానివెనుక మరియొకటిపుట్టును. చిరకాలము నిలిచి యుండుకొన్ని పక్వములై పగిలిస్రవించి మరల మరల కొన్నిజనించి పక్వములై స్రవించుచుండును. యిట్టిదానికి అపచియనిపేరు. పీనస, ప్రక్కనొప్పి, దగ్గు, జ్వరము వాంతి యివిలేని అపచిరోగము సాధ్యముగను యీలక్షణములుకల అపచి అసాధ్యముగను ఉండును. మాలికగాపుట్టునది గండమాలయనియు అట్టినియమములేక యిచ్చవచ్చినట్లు పుట్టునది అపచియనియు సుశ్రుతమున భేదము వ్రాయబడెను.

అపస్మారము:—శరీరము స్మృతితప్పి తెలివిలేక కండ్లుతిరుగుచు కాళ్లుచేతులు విదలించుచున్నయెడల అపస్మారమను వ్యాధియని యెఱుంగవలెను. వణుకు పండ్లు కొరుకుట నోట నురుగువెడలుట శ్వాస ప్రపంచము యెఱ్ఱగ నల్లగకనబడుట అను చిహ్నములు కల్గియున్న వాతాపస్మారమనియు, నోటనుండి పసరురంగునురుగు గారుట శరీరము కన్నులు ముఖము రక్తము పసుపుపచ్చగ నుండుట ప్రపంచము పసుపుపచ్చగ కనబడుట దప్పి వేడి అమితముగ నుండుట అనుచిహ్నములుండిన పిత్తాపస్మారమనియు తెల్లనినురుగు నోటనుండి వెడలుట శరీరము ముఖము కన్నులు తెల్లగనుండుట శరీరము చల్లనై గగుర్పాటు బరువుగల్గియుండుట ప్రపంచము తెల్లగనుండునట్లు కనబడుట చాలసేపటివరకు స్మృతితెలియకపోవుట యివికల్గిన కఫాపస్మారమనియు పైమూడు అపస్మారముల లక్షణములున్న సన్నిపాతాపస్మారమనియు యెఱుంగవలయును. పిత్తాపస్మారము ప్రతిపక్షమునకును వాతాపస్మారము పండ్రెండేసి దినములకును కఫాపస్మారము నెలనెలకును పుట్టుచుండును. అపస్మారవ్యాధి పుట్టబోవునపుడు హృదయమున కంపము. యేమియు తో

చకించుట చెమట తెలితెప్పుట నిద్రపట్టకుండుట మున్నగు పూర్వరూపములు కనబడును.

అర్శస్సు:—ప్రకుపితములైన వాతాది దోషములు చర్మమాంస మేదస్సులను చెరిచి అనేక ఆకారములుగల మాంసపు మొలకలను గుదము మొదలగు ప్రదేశములందు కలిగించును. యిదియే అర్శస్సనియు మూలవ్యాధి యనియు చెప్పబడును. వాతపిత్తశ్లేష్మ సన్నిపాతములు చే వేర్వేరుగ జనించినవి నాలుగును రక్తముచేత జనించిన దొకటియు సహజముగ పుట్టినదొకటియు మొత్తము ఆరువిధములగు అర్శస్సులు గుదస్థానమునందలి మూడువళులయందు పుట్టును. వాతమువలన బుట్టిన మొలలు ద్రవములేక విరివిరలాడుచు శ్యావారుణవర్ణములుగ మేకులవలె స్తంభించి ఆవునాలుకలవలె గరగర లాడుచు ఒకదానివలె నొకటి యుండక వేరువేరు రూపములుగల్గి కఠినములై వివిధములై వంకరలై కొనలయందుపగిలి ప్రత్తిఖర్జూరను రేగుకాయలంత యాకృతిగలిగియుండును. భుజములు నడుము తొడలు గజ్జలు వీనియందు నొప్పి తుమ్ములు తేనుపు మలబద్ధము శ్వాసకాసలు రొమ్ముబిగపట్టుట చెవిలో హోరు గుడగుడయను శబ్దముతో కఠినమై జిగురుగలమలము బలాత్కారముగ బాధతో వెడలుచుండును. చర్మము గోళ్ళు మలమూత్రములు మొదలైనవి నల్లగనుండును మరియు వాతార్శస్సువలన గుల్మ ప్లీహ ఉదర అష్ఠీలారోగములు కూడపుట్టును. పిత్తమువలన మొలలు నల్లని కొనలు మెరుపు లేక పసుపు లేక నలుపువర్ణముగలిగి కొంచెము రక్తముస్రవించుచు దుర్గంధవంతములై వాడబారి వ్రేలాడుచు చిలుకనాలుక జలగ వీనియాకారము గలిగియుండును యీవ్యాధియందు గుదము పుండగును తాపము జ్వరము చెమట దప్పి మూర్ఛ అరుచి మోహము అను ఉపద్రవములుగూడ కల్గును. కఫమువలన బుట్టిన మొలలు మిక్కిలిలోతుగ వ్రేళ్ళుపాతుకొని దట్టముగనిండి కొలదిబాధయు తెల్లనిరంగును లావు నునుపు పొడవుగలిగి వంగియుండక నిడుపుగ గుండ్రముగనుండును. దురదకలిగియుండును. గజ్జలందు ఉబ్బరించి గుదము వస్తి (మూత్రపుసంచి) నాభి యీస్థానములయందు లాగిపట్టినట్లుండుట రొమ్ము అదురుట అరుచి పడిసెము శ్వాస కాసలు మూత్రకృఛ్రి శిరస్సుబరువు చలిజ్వరము నపుంసకత్వము మొదలగు చిహ్నములుండును కొవ్వువలె కఫముతోగూడిన మలము విశేషముగ వెలువడుచుండును. సన్నిపాతజనిత మొలలకు పైమూడుజాతుల లక్షణములన్నియు నుండును.

రక్తము స్రవించు మొలలు రక్తముస్రవించని మొలలు అని ప్రధానములుగ రెండుభేదములున్నవి. రక్తప్రకోపముచేత బుట్టిన మొలలు పిత్తార్శోలక్షణములుగలిగి మర్రిచిగుళ్లు గురివెందలు పగడములు వీనిరంగుగలిగి కఠినములై మలముచే బీడింపబడిన ఉష్ణంబైన దుష్టరక్తమును విశేషముగ స్రవించుచుండును.

మేఢ్రి భగ కర్ణ నాసికానాభి స్థానములయందు పుట్టిన మొలలు వానపాములముఖమువంటి ఆకారముగలవియై యుండును.

అర్బుదము:—శరీరమందెచ్చటనైన నొకచోట వాతాదులవలన రక్తమాంసములు చెడి గుండ్రగ కఠినముగ స్వల్పబాధగల్గి గొప్పదియై గాఢమైన మూలముగల్గి చిరకాలమునకు పెద్దదియై పక్వమగు మాంసపిండమునకు అర్బుదమనిపేరు. ఇది ఆరువిధములుగను గ్రంధితో సమానలక్షణములు కలదిగను ఉండును. కఫ మేదస్సులు అధికముగనుండుటచేతను దోషములు స్థిరములై కఠినములై యుండుటచేతను అర్బుదము త్వరగపాకమునొందదు. దోషములుప్రకోపించి విశేషముగ రక్తమునుచెరిపి సిరలను సంకోచపరచి యొకచోట గుంపుగచేర్చి మాంసపిండమును పెద్దదిగజేయును. అదికొంచెము పగిలి స్రవించుచు మాంసపుమొలకలతో కూడి త్వరగ వృద్ధిజెందుచు నిరంతరము రక్తమును స్రవించుచుండును. దీనికి రక్తార్బుదమనిపేరు. ఇది అసాధ్యమైనది. శరీరమందు పిడికిటిపోటు మొదలగుదెబ్బలు తగిలి మాంసము చెడి వాపుకల్గును. అది నొప్పిలేక నున్నగ రాయివలెనుండును. దీనికి మాంసార్బుదమనిపేరు. చర్మము పగిలి స్వల్పముగస్రవించునదియు ము

క్క రంధ్రమునందును మర్మస్థలములందును స్రోతస్సులందును పుట్టినట్టియు చలనములేక స్థిరమైయున్నట్టియు అర్బుదము అసాధ్యమైయుండును. ఒక అర్బుదముపైన వేరొకయర్బుదము పుట్టినను జంటగా రెండర్బుదములుపుట్టినను అవియు నసాధ్యములై యుండును.

అశ్మరి:—కఫప్రధానమగు అశ్మరీరోగము వాతపిత్తకఫ శుక్రములచే వేర్వేరుగ జనించి నాలుగువిధములైయుండును. నాభి సేవని వస్తి వీనియందు శూల మూత్రమునందు రాయి అడ్డగించుటచే మూత్రధార చీలికలై స్రవించుట, అడ్డగించనపుడు ధారాళముగా వెడలుట మూత్రపుతిత్తియందు అశ్మరిచే గాయమై మూత్రద్వారమునుండి రక్తముపడుట మూత్రము బలాత్కారముగ విడుచునపుడమితబాధ కల్గుట యివి అశ్మరీరోగమునందుండు సాధారణలక్షణములు. పండ్లుకొరుకుట వణకు అమితబాధచే మేఢ్రమును పట్టుకొని పొత్తికడుపును పిసికికొనుట మాటిమాటికి బొట్లుబొట్లుగ మూత్రమునువిడచుట అశ్మరి నలుపు లేక మెగుపువర్ణముగ ముండ్లుకలిగియున్నట్లుండుట మొదలగు లక్షణములుకలది వాతజాశ్మరియనియు, పొత్తికడుపుమంట అచ్చోట తాకిన ఉడుకుచున్నట్లు వేడిగనుండుట అశ్మరి రక్తపీత కృష్ణవర్ణములు కలదియై జీడిగింజలోపలి విత్తనమువలె గట్టిగానుండుట మొదలగులక్షణములుకలది పిత్తాశ్మరియనియు, వస్తియందు సూదులుగ్రుచ్చినట్లు పోటు అశ్మరి మిక్కిలిపెద్దదిగ నునుపుగ తేనెరంగు లేక తెలుపురంగు గలదిగనుండిన కఫజాశ్మరియనియు, యౌవనకాలమున స్త్రీ సంభోగముచేయక శుక్రము నిరోధించుటచేత స్వస్థానమునందుండి చలించిక మేఢ్ర వృషణములకుమధ్యనుండు వస్తిముఖమునందు వాతశుష్కంబైన శుక్రముమూత్రము నడ్డగించును. ఇది శుక్రాశ్మరియనియు నెరుంగవలెను. శుక్రాశ్మరియందు వస్తిపోటు మూత్రముకష్టముగవెడలుట వృషణములువాచుట మొదలగుచిహ్నములుండును. శర్కరయనురోగముకూడ పైలక్షణముల గలిగియుండును.

అష్ఠీల:—వాతముచే వస్తి పూరింపబడి గుదమార్గము నడ్డగిం



చి మిగులబాధతో మలమూత్రములను నిరోధించును. దీనికి అష్ఠీలయనిపేరు. ఇది మూత్రాఘాతలలో నొకభేదము నాభికిక్రింద యున్న ఱదాలివలె కఠినమైన గ్రంథియొకటిపుట్టును. దీనికి గూడ అష్ఠీలయను పేరుకలదు. ఇది వాతవ్యాధులలోనిది.

ఆధ్మానము:—పక్వాశయమందు గుడ గుడ యను శబ్దముతో గూడిన నొప్పిగలిగి గాలిచేనిండిన తోలుతిత్తివలె కడుపు వాతపూరితమైయున్నది ఆధ్మానవాతమనబడును.

ఆమవాతము:—శరీరమువిరుపు, అరుచి, దప్పి, అలసత్వము, ఒడలుబరువు, జ్వరము, అజీర్ణము వాపు యీలక్షణములుకలది ఆమవాతము. మరియు నిది ప్రకోపించునపుడు చేతులు కాళ్ళు శిరస్సు చీలమండ వెన్నెముక క్రిందిభాగము మోకాళ్ళు తొడలు కీళ్లు యీస్థలములయందు పోటుతోగూడినవాపు వాపుగలచోట తేలుకుట్టినట్లు పోటు నాలుకకు రుచితెలియకుండుట అతిమూత్రము దప్పి వాంతి కడుపుబ్బరము మొదలగు ఉపద్రవములుకూడకలుగును. పిత్తప్రకోపముగల ఆమవాతమున వాపు మంటతోగూడి యెఱ్ఱగను వాతముచే పుట్టినది నొప్పిగలిగియు కఫజనితమైనది జడముగ భారముగ దురదగలదిగనుండును.

ఆమపిత్తము:—అజీర్ణము, బడలిక, ఓకిరింత చేదు పులుపు రుచులుగల తేనుపులువచ్చుట శరీరము బరువైయుండుట హృదయకంఠములందు మంట అరుచి యివి ఆమ్లపిత్తమునకు సాధారణలక్షణములు. వణుకు ప్రలాపము మూర్ఛ శరీరము చిమచిమలాడుచుండుట కృశత్వము నొప్పి చిత్తభ్రమ గగుర్పాటు యివి గలిగియున్న వాతజామ్లపిత్తమనియు కఫమునుమియుట దేహము మొద్దుబారియుండుట అరోచకము వమనము అగ్నిమాంద్యము దురద నిద్ర అను నీలక్షణములున్న కఫజామ్లపిత్తమనియు పైవాతకఫలక్షణములు కలిగియున్న ద్వంద్వజామ్లపిత్తమనియు చేదు ఉప్పు కారము రుచులుగల తేనుపులు హృదయ కుక్షి కంఠములందు మంట భ్రమ మూర్ఛ అరుచి వాంతి తలనొప్పి

నోట నీరూరుట నోరు తీపిగనుండుట అనులక్షణములున్న సన్నిపాతాప్లుపిత్తమనియు నెఱుగవలెను.

ఇంద్రలుప్తము:—పిత్తము వాతముతోఁ జేరి ప్రకోపించి రోమములయొక్క కుదుళ్ళనాశ్రయించి వానిని రాలునట్లు చేయును. పిమ్మట కఫము రక్తముతోఁ గూడి రోమరంధ్రముల నడ్డగించును. అందుచే నచ్చోట వెంట్రుకలు మొలవవు, ఇదియే యింద్రలుప్తమనబడును.

ఉదరము:—కడుపుబ్బరము అశక్తత మందాగ్ని వాపు కృశత్వము వాతపురీషబంధము తాపము కునికిపాటు అనునవి సాధారణముగా ఉదరరోగమందుండులక్షణములు. వాతోదరమున హస్త పాద నాభి కుక్షులందువాపు ప్రక్కలు కటిస్థలము ఉదరము కీళ్లు వీనియందు నొప్పి పొడిదగ్గు మలబద్ధము తనంతదానే ఉదరమొకపుడు తగ్గియుండుట ఉదరమునసూదులుగ్రుచ్చినట్లును పగులగొట్టినట్లునుండుట సూక్ష్మములైన సిరలచే నావరింపబడియుండుట ఉదరముపైనవాయించిన గాలితిత్తియొక్కధ్వనినిచ్చుట మున్నగు లక్షణములుండును. పిత్తోదరమున జ్వరము మూర్ఛ తాపము దప్పిక నోరుచేదు భ్రమ అతిసారము ఉదరముపచ్చగనుండుట అమితమైనవేడి చెమట చేతితోఁ ముట్టుకొనిన మృదువుగనుండుట శీఘ్రముగ పక్వమగుట నొప్పి అనులక్షణములుండును కఫోదరమున స్పర్శజ్ఞానము లేకుండుట వాపు శరీరముబరువు అతినిద్ర వాంతియగునట్లుండుట అరోచకము శ్వాసకాసలు మున్నగు లక్షణములుండును. వశ్యమునకై కొందరు దుష్టస్త్రీలు గోళ్ళు మలమూత్రములు ఋతురక్తము వెంట్రుకలుమున్నగువానితోఁ గూడిన అన్నమునుగాని విషాన్నమును విషోదకమునుగాని భుజించిన పైజెప్పిన త్రిదోషోదరముల లక్షణములతోఁ గూడిన సన్నిపాతోదర మేర్పడును. వెండ్రుకల తోడను సన్నని రాళ్ళతోడను గూడిన యన్నమును తినుటచేత హృదయనాభులకు మధ్య ఉదరముకలుగును. ఇదిబద్ధగుదమనబడును. ముండ్లు రాళ్ళు శల్యముతోఁ గూడిన యాహారమును తినుటచే పక్వాశయమునుండివచ్చు పేగును భేదించి చీముపెడలుచుండును. నాభికిక్రింద ఉద



రము పెరుగును. ఇది పరిస్రావియనుఉదరము. నూనెవ్రాసినట్లునిగనిగలాడుచు బొడ్డునకుచుట్టు విశాలముగి నావరించి నీళ్ళచేనిండియున్నట్లుండునదియు గళగళయనుశబ్దము కలదియు నగు ఉదరము జలోదరము లేక దకోదరము అనబడును.

ఉదావర్తము:—వాతమును నిరోధించుటచే కడుపుబ్బరము బడలిక నొప్పి హృదయమందుపోటు మొదలగునవికలుగును. పురీషనిరోధజన్యమైన యుదావర్తమున కడుపులోఁ గోసినట్లుండుట శూల మలబద్ధము ఊర్ధ్వశ్వాస నోటివెంట మలము వెడలుట కలుగును. మూత్రనిరోధజోదావర్తమున మూత్రపుసంచియందును మేఢ్రమునందును శూల మూత్రకృఛ్రి శరీరమువంగుట తలనొప్పి గజ్జలలోఁ బట్టినట్లుండుట కలుగును. జృంభా (ఆవులింత) నిరోధజోదావర్తమున పెడతలనరము కంఠము స్తంభించి శిరోనేత్ర నాసికాముఖ కర్ణరోగములు కలుగును. అశ్రు (సంతోషముచేగాని దుఃఖముచేగాని వచ్చుకన్నీరు) నిరోధజోదావర్తమున పెడతలనరము స్తంభించుట తలనొప్పి ఒంటితలనొప్పి కన్ను మొదలగు యింద్రియములు దుర్బలములైయుండుటకలుగును. ఉద్గార (త్రేనుపు) నిరోధజ ఉదావర్తమున కంఠముఖములందు పోటు కడుపులోధ్వని ఊపిరితిరగకుండుట వాతవ్యాధులుజనించును. ఛర్ది (డోకు) నాపుటచేగల్గు ఉదావర్తమున దురద దద్రులు అరుచి వాపు పాండువు జ్వరము కుష్ఠు విసర్పము మొదలగునవికల్గును. శుక్ర (వీర్యము) మును సంభోగసమయమున స్వభావముగ వెడలకుండ చాలసేపు ఆపుటచేగలిగిన ఉదావర్తమున మూత్రపుసంచి గుదము వృషణములు వీనియందుపోటు నొప్పి మూత్రబంధము శుక్రాశ్మరి శుక్లనష్టము కలుగును. క్షుత్ (ఆకలి) నిరోధజమున కునికిపాటు శరీరమునొప్పులు అరోచకము దృష్టితగ్గుటకలుగును. దప్పినడ్డగించుటచే గలిగిన ఉదావర్తమున కంఠము నోరు యెండిపోవుట చెవుడు రొమ్ములోనొప్పి జనించును. శ్వాస (ఊపిరి) నిరోధజమున హృద్రోగము మూర్ఛ గుల్మము కలు

గును. నిద్రానిరోధజమున ఆవలింత ఒడలువిరుపు శరీరముబరువెక్కుట వీనికిపాటు కల్గును.

ఉన్మాదము:—వాతోన్మాదమున హాస్యము చిరునవ్వు సంగీతము మాటలు ఏడుపు యివికారణము లేకనేచేయుట శరీరము కఠినముగనుండుట చిక్కుట ఆహారము జీర్ణావస్థకువచ్చినపుడు వ్యాధియుద్రేకించుట అనులక్షణములును. పిత్తోన్మాదమున అసహనము ఆర్భాటము దిగంబరత్వము యితరులను భయపెట్టుట పరుగులెత్తుట చల్లనినీళ్ళు అన్నము మొదలగువానియందిచ్ఛ మున్నగు లక్షణములును కఫోన్మాదమున మందముగమాటాడుట అరుచి విజనమందు స్త్రీలకుమధ్యమందు వసింపగోరుట అతినిద్ర వాంతి నోటచొల్లుకారుట మొదలగులక్షణములును సన్నిపాతోన్మాదమున త్రివిధలక్షణములును చోర శత్రుభయముచేగాని యితరశోకముచేగాని గల్గిన ఉన్మాదమున పరస్పర విరుద్ధములగు మాటలు రహస్యములను వెలిబుచ్చుట నవ్వు యేడ్పు మొదలగులక్షణములుండును. విషముదినుటచే గల్గిన యున్మాదమున కన్నులెఱ్ఱబడి దేహేంద్రియ బలకాంతులుతగ్గి దీనత్వముగ నుండును.

ఉబ్బు:—చూ. శోఫ,

ఉరఃక్షతము:—ఇదియొకవిధమగు క్షయరోగము. ఇందు రొమ్ముపగిలినట్లు నొప్పి మంట పీకుట వణుకు ప్రక్కలుచిక్కుట వీర్యబలవర్ణజఠరములుతగ్గుట జ్వరము దీనత్వము అమితవిరేచనములగుట మొదలగులక్షణములు కల్గును.

రొమ్ము నొప్పి రక్తవమనము దగ్గు క్షతక్షయమున గలుగును. ప్రక్కలు కటిస్థలము పృష్ఠము యివి క్షయయందు యీడ్చుకొనిపోవును.

ఊరుస్తంభము:—అతిచింత అతినిద్ర జాడ్యము జ్వరము గగుర్పాటు అరుచి వమనము పిక్కలు తొడలు కృశించుట యివి ఊరుస్తంభమునకు పూర్వరూపములు. మరియు నీవ్యాధిపుట్టినపుడు సంకోచ కంపాదికలక్షణములనుబట్టి వాతవ్యాధియని భ్రమజెంది స్నేహము



చేసినచో పాదములుకృశించిపోవుట స్పర్శ తెలియకుండుట మిగులికష్టముగ కాళ్ళనుకదల్చుట పిక్కలు తొడలు వీనియందు బాధ తాపము వేదన పాదములను క్రిందఆనినపుడు బాధ శీతస్పర్శ తెలియకుండుట కాళ్ళను సమముగనుంచుటకు నడచుటకు శక్తిలేకుండుట తొడలు పాదములు విరిగినట్లుతోచుట యీలక్షణములు ఊరుస్తంభమునందుండును. మరియు తాపము పోట్లు వణుకు యీగుణము లుండిన అసాధ్యముగనుండును

ఋతుబద్ధము:—స్త్రీలు ప్రతినెలకును బహిష్ఠలగునపుడు అనేకకారణములచేత ఋతురక్తము సరిగవెడలక కొంచెము కొంచెముగగాని బొత్తుగా ఋతువుకాకుండుటగాని కలుగును. దీనికే ఋతుబద్ధమనిపేరు.

ఋతుశూల:—బహిష్ఠలైన స్త్రీలకు వాతముచేతను సుఖవ్యాధి సంపర్కముచేత బహిష్ఠలైన మొదటిరోజుగాని మూడురోజులుగాని అమితమయిన శూల కడుపులో జనించును. దీనికి ఋతుశూలయనిపేరు.

ఎక్కిళ్ళు:—కంఠమందలి యుదాన వాయువుతో గూడిన ప్రాణవాయువు "హిక్" అను ధ్వనితో గూడి యకృత్ ప్లీహములను పేగులను ముఖమునుండి బైటకుతీసుకొనివచ్చు విధమున మాటిమాటికి ఊర్ధ్వముఖముగ వెడలుచుండును. అట్టి వాతమునకు హిక్కయనియు ఎక్కిళ్ళుఅనియుపేరు. అన్నజము యమళము క్షుద్రము గంభీరము మహతియని హిక్కలు అయిదుతెరంగులు. అధికముగ ఆహారమును జలమును భుజించుటచేత వాతముపీడింపబడి ఊర్ధ్వమార్గమున చరించిన నది అన్నజహిక్కయనబడును. శిరఃకంఠములను చలింపజేయుచు చాలాకాలమునకు రెండేసియెక్కిళ్ళు అతివేగముగ బైలుదేరిన నది యమళహిక్కయగును, చిరకాలమునకు మందవేగముతో కంఠమూలమున వెలువడునది క్షుద్రహిక్కయగును. ఎక్కిళ్ళు నాభినుండి వెలువడి గంభీరమైన ధ్వని దప్పి జ్వరము మొదలగు ఉపద్రవములతో గూడిన గం

భీరహిక్కయనబడును. వస్తి హృదయము శిరస్సు మొదలగు మర్మముల బాధించుచు సకలావయవములను వణికించుచు యెడతెగక వెక్కిళ్ళువచ్చుచుండిన మహాహిక్కయనబడును.

కంఠరోగము:—రేగుగింజంత గ్రంధియుండ్లుగలిగి కంఠమునపుట్టిన నది కంఠశాలూకము. కఫప్రకోపముచే విశాలము ఉన్నతమునగువాడిగలిగి అన్నాదులను లోపలకు బోనీయకుండునది వలయమను వ్యాధి. కఫవాతప్రకోపముచే శ్వాసతోను నొప్పితోను గూడ హృదయమర్మమును ఛేదించు వాపు కంఠమునం గల్గిన బలాసమనంబడును. కఫరక్తప్రకోపముచే కంఠములో గుండ్రగ యెత్తుగ కొలదిమంట దురదగల్గి పాకమునొందక గురువై గట్టిగను ఉండు వాపుపుట్టిన నది ఏకబృందమనురోగము. రక్తపిత్తప్రకోపమున గుండ్రగ యెత్తుగనుండువాపు మంటజ్వరముగలిగియున్ననది బృందము. ఇది వాతముచేబుట్టిన తీవ్రమగుపోటుండును. త్రిదోషసన్నిపాతముచేత కంఠము మాంసాంకురముతోనిండి మంట పోటు నొప్పి గల్గిన వర్తి యొకటి మిక్కిలి కఠినమైనదిపుట్టును. ఇది శతఘ్నియను పేరుకలది. కఫరక్తప్రకోపము చేత ఉశిరిగగింజంతవాపు కంఠమునంబుట్టును. ఇది గలాయువనబడును. త్రిదోషములచే కంఠమునవాపుగలిగి అంతటవ్యాపించి నొప్పి మంట మొదలగు బాధలగలిగించునది గలవిద్రధియనబడును. రక్తముతోగూడిన కఫముచేత కంఠమునవాపుపుట్టి అన్నజలవాయుమార్గముల నిరోధించిన నది గళౌఘమనబడును. వాయువహా నాడులు కఫముచే నడ్డగింపబడి మూర్ఛ నిట్టూర్పు స్వరభేదము నోరుయెండిపోవుట మున్నగు లక్షణములుకలిగిన స్వరఘ్నమనువ్యాధి. కంఠమున మొదట వాపుకలిగి క్రమముగ పెరిగి బిలమునడ్డగించిన నది మాంసతానమనబడును. కంఠబిలమున మంట పోటు గలిగి యెర్రగ దుర్గంధయుక్తముగ శిథిలముగ నుండు మాంసముతో కూడిన వాపు పిత్తమువలన బుట్టును. ఇది విదారియను పేరు కలది.



కలరా:—మైమరపు గంజివంటి పల్చని విరేచనములును ఆవిధముగనుండు వాంతులును అధికముగ నగుచుచుండుట దప్పి శూల భ్రమ అవయవములు కొంకరపోవుట తాపము శరీరకాంతితగ్గుట వణుకు మూత్రబంధము మొదలగులక్షణములు కలరావ్యాధియందు కల్గును. దీనికి వాంతిభేది యనియుపేరు.

కర్ణరోగము:—చెవిపోటు, హోరు, చెవుడు, చీముకారుట, దురద యెరుపు తెలుపు నలుపు వర్ణములుగల పురుగులుపడుట కురుపు, ఒరుపు, కొయ్యగండ, వాపు మొదలగు చెవియందు గల్గురోగములు.

కామల:—పాండురోగి పిత్తముచేయుపదార్థములను తినిన కామలారోగముపుట్టును. దీనియందు కన్నులు చర్మము గోళ్ళు మొగము పచ్చగనుండును. మూత్రముపచ్చగను మలముయెరుపుగను ఉండును. ఇంద్రియాపటుత్వము తగ్గును. తాపము అజీర్ణము చిక్కుట అరుచి యివిగూడకలుగును. దీనినిచికిత్సించక కొంతకాలము ఊరకున్నచో కోష్ఠమునాశ్రయించికుంభకామలగా పరిణమించియసాధ్యమగును వాంతి అరుచి జ్వరము బడలిక శ్వాసకాసలు మలము ఖండఖండములు, వెడలుట అను లక్షణములుగల కుంభకామల మరణము గలుగజేయును.

కాస:—కణతలు, హృదయము, తల, ఉదరము, పార్శ్వములు వీనియందుశూల ముఖముచిక్కుట బలకాంతి కంఠస్వరములు హీనమగుట, యెల్లపుడు పొడిదగ్గువచ్చుట కంఠస్వరము మారుటయివి వాతకాస లక్షణములు. రొమ్ముమంట జ్వరము నోరెండుట నోరుచేదు దప్పి, చేదుగల పసరుకక్కులు యివి పిత్తకాసలక్షణములు. నోరు జిగటగనుండుట, అరుచి, తలనొప్పి దురద, శరీరముభారము దగ్గినపుడు కఠినమగు కఫముపడుట యివి కఫ కాస లక్షణములు. అమిత స్త్రీ సంపర్కము, అమిత వ్యాయామము మొదలగు, వానిచే రొమ్ములుపగిలి యందువాతము వ్యాపించి దగ్గు కలుగును. ఇదిక్షతకాస.

యనబడును. ఇందు మొదట పొడదగ్గయేర్పడి రొమ్ముపగిలి రక్తమిశ్రితమైన శుష్కకఫము దగ్గినపుడెల్ల పడుచుండును. కంఠముననొప్పి రొమ్మునపోటు హృదయమును తాకినమంట కీళ్లయందునొప్పి జ్వరము దప్పి శ్వాస పిల్లికూతలు మొదలగు లక్షణములుండును. ధాతుక్షయకరమైనకాసకుక్షయ కాసయనిపేరు. ఇందు ఒడలునొప్పి జ్వరము తాపము మూర్ఛ బలహీనము ద్రవములేని కఫము వెడలుట కృశించుట చీము రక్తముకలసిన కఫముపడుట యివికలుగును. ఇది అసాధ్యమైనది.

కుసుమరోగము:—చూ. ప్రదరము.

కుష్ఠము:—చర్మము నలుపు లేక యెరుపువర్ణముగ కుండపెంకువలె విరవిరలాడుచు కఠినమై పోట్లుకలిగియున్నది కపాలకుష్ఠము ఇది వాతాధిక్యముచే గల్గును. చర్మమున దురద మంట నొప్పి యెఱ్ఱని రంగుగలిగి రోమములు కపిలవర్ణములై మేడిపండ్లవలె ఆకారము గలిగియుండునది ఔదుంబరకుష్ఠము. ఇదిపిత్తాధిక్యమున గలుగును. తెలుపు లేక యెరుపు కఠినమైన నీరు గారుచుండుట ఒకటితో నొకటి కలసియుండుతోడలు యీలక్షణములు గలది మండల కుష్ఠము. ఇదికఫాధిక్యముచేగలిగి అసాధ్యమై యుండును. మిగుల కర్కశమై చుట్టుయెఱ్ఱగను నడుమ నల్లగనుండి పోటు దప్పి నాలుకవంటి ఆకారముగల కురుపులుగలది ఋష్యజిహ్వయనుకుష్ఠము. నడుమ తెలుపు చుట్టుయెరుపుగలిగి తామరాకువలె గుండ్రగనుండునది పుండరీకకుష్ఠము. తెలుపు యెరుపు రంగులుకలిగి సూక్ష్మాకారములై చేతుతోరుద్దిన పిండివలె పొట్టు రాలుచు ఆనగ పూలతో సమానమగు ఆకృతిగలది సిధ్మకుష్ఠము ఇదితరుచు రొమ్మునందు పుట్టును. గురివెందగింజవలె నడుమ నల్లగను చుట్టుయెరుపును గల్గి కొంచముగ పుండగును. మిగులవేదన గల్గియుండునది కాకణాంతిక కుష్ఠము. ఇదియసాధ్యము యీయేడు కుష్ఠములును రసాది ధాతువులను చెరిచి యసాధ్యములుగ నుండునుగాన మహాకుష్ఠములని వీటికిపేరు. చెమట లేకుండుట విశాల ప్రదేశములజనించుట చేపముక్కవలె నుండుట అనులక్షణములు గలది. యే



కకుష్ఠమనియు గజచర్మమువలె మిగుల కర్కశమై యుండునది చర్మకుష్ఠముఅనియు చెప్పబడును. నల్లనిరంగుగలిగి కురుపుయొక్కమచ్చవలె మిక్కిలి కఠినస్పర్శగలిగి పరుషమైయుండిన కిటిమకుష్ఠము చేతులు కాళ్ళుపగిలి తీవ్రమైన బాధగలిగియున్న వైపాదికకుష్ఠ మనబడును. దురదగలిగి యెఱ్ఱగనుండు దద్దురుతోగూడునది అలసకకుష్టము, దురద యెరుపు సన్ననిబొబ్బలుగలిగి స్పష్టముగకనబడునది దద్రుమండలకుష్ఠమనబడును, యెఱ్ఱనిమచ్చలు నొప్పి దురద పగిలినీరుకారుట స్పృశించిన నోర్వలేకుండుట యీలక్షణములుకలది చర్మదళంబను కుష్టము స్వల్పమైన యాకృతిగలిగి చీము స్రవించుచు దురద మంటతో అనేక బొబ్బలుపుట్టిన నది పామయనుకుష్టము. తీవ్రమైన మంటగల బొబ్బలు చేతులమీదను గొంతుయందును పుట్టిన కచ్ఛు అనుకుష్టము నలుపు యెరుపుగలిగి సూక్ష్మమగుచర్మమున బొబ్బలు గలిగిన నది విస్ఫోటమనుకుష్ఠము. యెరుపు నలుపు రంగు నొప్పి మంటగలిగి అనేక వ్రణములుకలది శతారువు అనుకుష్టము. దురద నల్లనిరంగు అనేక రంధ్రములుపడి చీముస్రవించుట అనులక్షణములుకలది విచర్చికయనబడును.

క్రిమి:—బాహ్యములు అభ్యంతరములు నని క్రిములు రెండు విధములు. చమటమొదలగువానియందుపుట్టు బాహ్యక్రిములు నువ్వుగింజలవలెనుండి అనేకపాదములుగల్గి వెండ్రుకలు వస్త్రములు మొదలగువానినాశ్రయించియుండును. వీటికిపేలు యీళ్ళు అనిపేరు. బెల్లము మత్స్యమాంసములు మినుములు వీనిని విశేషముగ తినుటచేత కఫపురీషాదులందు క్రిములుపుట్టును. జ్వరము శరీరము వర్ణముచెడుట శూల చిక్కుట భ్రమ అన్నద్వేషము అతిసారము యీలక్షణములు సాధారణముగ కృమివ్యాధిగలవానియందుండును. కఫమువలన ఆమాశయమునబుట్టిన క్రిములు క్రమముగ వృద్ధిజెంది శరీరమందు ఊర్ధ్వాధోభాగములయందు తిరుగుచుండును. అందుకొన్ని చర్మపుతీగవలెను కొన్ని వానపాములు (యెఱ్ఱలు) వలెను, కొన్ని వరిమొలకలవలెను. కొన్ని సన్నముగ పొడవుగను, మరికొన్ని మిక్కిలి సూక్ష్మరూపములుగను.

కొన్ని తెల్లగ కొన్ని యెఱ్ఱగ నుండును. ఇవి యేడువిధములు. యివి గలిగి యున్నపుడు హృదయమదరుట నోరునీరూరుట అజీర్ణము అరుచి మూర్ఛ వాంతిజ్వరము కడుపుబ్బరము చిక్కుట తుమ్ములు పీనస అను ఉపద్రవములుకల్గును. సూక్ష్మాకారములగు రక్తజక్రిములు పాదములు లేక గుండ్రగ రక్తవహ సిరలందుండును. ఇందు తలవెండ్రుకలను నశింపచేయునవి కేశాదములనియు, వెండ్రుకలరాల్పివేయు వాటికి రోమవిధ్వంసనములనియు, రోమకూపముల నాశ్రయించి యుండువానికి రోమద్వీపములనియు యిట్లు ఉదుంబరములు. సౌరసములు మాతలు అని ఆరుభేదములుకలవిగనున్నవి. వీట్లవలన కుష్టవ్యాధిజనించును. పక్వాశయమునబుట్టి యధోమార్గమునసంచరించు పురీషజక్రిములున్నపుడు తేరినువులు నిశ్వాసవాయువు మలదుర్గంధము గలిగి వెడలుట కల్గును. యివి అయిదువిధములు. మలము ఉండలుగట్టుకొని పడుట శూల మలబద్ధము శరీరకృశత్వము శరీరము వెరవెరలాడుట మున్నగులక్షణములు పురీషజములు కలిగియున్నపుడేర్పడును.

క్షతక్షీణము:—రొమ్మునొప్పి రక్తవాంతి అధికమైనదగ్గు క్షతక్షీణమునగలుగును. ఇదియొకవిధమగు క్షయవ్యాధిభేదము.

క్షయ:—భుజ శిరస్సులయందు ప్రక్కలయందు అధికమైన తాపము కాళ్లు చేతులు మంట జ్వరము యీలక్షణములుగలది రాజయక్ష్మ లేక క్షయయని తెలియవలెను. కంఠస్వరముమారుట శూల భుజ శిరస్సులు పార్శ్వములుముడుచుకొనిపోవుట అనునవి వాతప్రకోపమువలన గలుగును. జ్వరము తాపము అతిసారము నోట రక్తముపడుట అనునవి పిత్తముచేగలుగును. శిరోభారము అన్నమునందహితము దగ్గు కంఠనాళము శిథిలమగుట అనులక్షణములు కఫమువలన కలుగును. ఈపదునొకండు లక్షణములును గాని కాస అతిసారము ప్రక్కలయందునొప్పి స్వరభేదము అరుచి జ్వరము అను ఆరులక్షణములుగాని దగ్గు శ్వాస నోటినుండిరక్తముపడుట అను మూడులక్షణములున్నను ఆక్షయవ్యాధి అసాధ్యముగనుండునుగాని శరీరమందలి రక్తమాంసాదు



లు మిక్కిలిక్షీణించకయుండునేని పైపదునొకండు, ఆరు, మూడులక్షణములున్నను కొంతవరకు ఔషధాదులవలన శమించునని ఆశజెందవచ్చును. జ్వరబాధలేక శరీరబలముగలిగి యింద్రియ నిగ్రహము జఠరదీప్తి చికిత్సయందుఆసక్తి గల యక్ష్మరోగికి చికిత్సించిన రోగముశాంతించును. మరియు క్షయయందు వ్యవాయశోష శోకశోష వ్యాయామశోష వ్రణశోషయని భేదములుకలవు. అమితముగ స్త్రీసంభోగముచేయుటచేత వ్యవాయశోషపుట్టును. ఈవ్యాధియందు శరీరము తెల్లబడుట రస రక్తమాంసాది ధాతువులు క్షీణించుట అను లక్షణములును, మేఢ్రము వృషణములు వీనియందుబాధ బలహీనత సంభోగ సమయమున చాలసేపటివరకు శుక్రము స్ఖలనముకాక యుండుట మొదలగు శుక్రక్షయోపద్రవములును కలుగును. శోకశోషయందు దీర్ఘవిచారము. అవయవపటుత్వముతగ్గుట శుక్రక్షయ లక్షణములు కలుగును. వ్యాయామశోషయందు చిక్కిపోవుట వీర్యము బలము జ్ఞాపకశక్తి తగ్గుట వణుకు అరుచి పగిలిన కంచుపాత్రను వాయించినపుడు కలుగు ధ్వనివంటి కంఠధ్వని శ్లేష్మములేకుండనే యెల్లపుడు ఉమియుట శరీరముబరువుగనుండుట ముఖనేత్ర నాసికలనుండి నీరుకారుట గట్టిగవిరవిరలాడుచుండు మలము వెడలుట దేహకాంతి చెడుట అనులక్షణములు కలిగియుండును. ముసలితనముచే వచ్చిన క్షయయందును అధికముగ త్రోవనడచుటచే గలిగిన క్షయయందును గూడ యీలక్షణములుండును. వ్రణశోష రక్తక్షయము వ్రణవేదన ఆహారమునందరతి వీనిచేత కలుగును. ఇది యసాధ్యమైనది.

గండమాల:—రేగుపండు ఉశిరిగపండు వీనికి తుల్యమగు గ్రంథులు కఫము క్రొవ్వు వీనిచే చంకలు భుజశిరస్సులు పెడతల నరము కంఠము గజ్జలు అను నీస్థలములలో నెచ్చోటనైన వరుసగపుట్టినయెడల వానిని గండమాల యందురు. ఇవి చిరకాలమునకు పక్వమై చితుకును.

గలగండము:—కంఠమునందు వాపు గలిగి యది నిలచి అండ్ర

మువలె చిన్నదిగాగాని కొంచెము పెద్దదిగాగాని యేర్పడి వ్రేలాడుచుండును. దీనికిగలగండమనిపేరు. పోటు నల్లని నరములచే చుట్టబడియుండుట పరుషమైయుండుట చాలా ఆలస్యముగ పెరుగుట పగలకుండుట ఒకానొకపుడు అకారణముగ పగులుట నోటియందరుచి పెదవు లెండుట అనులక్షణములున్నయెడల వాతజగలగండమనియు, నునుపు నిగనిగ బరువు పాండువర్ణము దుర్గంధము అమితమగు దురద స్వల్పమగు బాధ గలది మేదోజగలగండమనియు తెలియవలెను. దీనిమొదలుస్వల్పముగనుండిసారకాయవలె వ్రేలాడుచు దేహముబలమునందున్నపుడది బలముగను దేహము కృశించియున్నపుడు కృశించియునుండును. నోరు జిడ్డు మాటలాడునపుడు కంఠమున ప్రతిధ్వనియు కూడనుండును. మిగులకష్టముగ శ్వాసనువిడుచుట శరీరము మెత్తగ నుండుట ఒకసంవత్సరముదాటియుండుట దేహముకృశించుట కంఠస్వరము మారుట యీలక్షణములు గలగండరోగమసాధ్యము.

గుల్మము:—హృదయ నాభులకు మధ్యభాగమున గుండ్రగ నుండి ఒకపుడు కదలుచు మరియొకపుడు కదలకయు పెరుగుచు తరుగుచు నుండునట్టి గ్రంధికి గుల్మమనిపేరు. ఇది వాతపిత్తశ్లేష్మసన్నిపాతములచే వేర్వేరుగనుండును. ఇవి స్త్రీ పురుషులకు సాధారణముగ కలుగును. ఇవిగాక స్త్రీలకుమాత్రము ప్రత్యేకము ఋతురక్తముచేత గర్భాశయమునపుట్టు రక్తగుల్మము నొకటిగలదు. ఇది పురుషులకు పుట్టదు. అరోచకము మలమూత్ర వాతములు మిక్కిలికష్టముగ వెడలుట పేగులరచుట కడుపుబ్బరము ఊర్ధ్వశ్వాసయను నివి గుల్మములయన్నిటియందునుండు సామాన్యరూపములు. ఒకపుడు నిడివిగ ఒకపుడు గుండ్రగ చిన్నదిగ లేక పెద్దదిగ నాభి ప్రక్కలు వస్తి వీనియందు తిరుగుచుండునదిగ ఒకపుడు స్వల్పబాధ మరియొకపుడు అధికబాధగలదిగనుండునది వాతగుల్మము. ఇందు మలము అపానవాతము మలబద్ధమగుట గొంతు నోరుయెండుట శరీరము నలుపు లేక యెరుపువర్ణముగనుండుట చలిజ్వరము హృదయము కుక్షి పార్శ్వములు భుజశిరస్సులు



శిరస్సు వీనియందునొప్పి అన్నము జీర్ణావస్థకువచ్చినపుడు వ్యాధిప్రకోపించుట భోజనసమయమునమృదువుగనుండుట అనులక్షణములుండును, పిత్తగుల్మమునందు జ్వరము దప్పి మ[illegible]ను శరీరము యెఱ్ఱగ నుండుట అన్నముతినునపుడును జీర్ణమగునపు[illegible]ను శూల చెసుట తాపము గుల్మముగలచోట తాకిన కురుపుపైనొక్కినట్లు బాధ యీలక్షణములుకలుగును. కఫగుల్మమున శరీరము మొద్దుబారుట చలిజ్వరము దేహముచిక్కుట దగ్గు అరుచి గురుత్వము శీతలము స్వల్పమగుబాధ గుల్మము కఠినమై మిక్కిలి యున్నతముగనుండుట కలుగును. ద్విదోషజనిత గుల్మములందాయా దోషగుల్మముల లక్షణములును, సన్నిపాత జనిత గుల్మమున త్రిదోషలక్షణములునుండును. అసంపూర్ణముగర్భము స్రవించునపుడును ఋతుమతియగు కాలమునను అపథ్యముచేయుటచేత స్త్రీలకు రక్తగుల్మమేర్పడును. ఇందు ఋతురక్తము వెడలకుండుట నోటివెంటనీరుకారుట స్తనాగ్రములు నల్లబడుట మొదలగుగర్భచిహ్నములుండినను గర్భస్థశిశువుయొక్క కరచరణాద్యవయవములు చలించునట్లుచలించక పిండాకారముగ శూలతోగూడియుండుట అనునవి కలుగును. దీనిని 10 మాసములుగడచినతర్వాత చికిత్సజేయవలయును.

గ్రంధి:—దుష్టములైన త్రిదోషములు మాంస రక్త మేదస్సిరలను దుష్టములుగజేసి గుండ్రగ కఠినముగ ఉన్నతముగనుండువాపును కలిగించును. దానికి గ్రంధియనిపేరు. ఊదువబడినట్లు నరికినట్లు కలియజుట్టినట్లు పగులగొట్టినట్లు నల్లనిరంగు మృదుత్వము కలిగి తిత్తివలె విశాలమైయుండి పగిలినపుడు నిర్మలరక్తమును స్రవించునది వాతగ్రంధియనియు, నిప్పుతో కాల్చినట్లు లోపలనుండి పొగ వెడలుచున్నట్లు చీల్చబడినట్లు క్షారాములచే పక్వముచేయబడినట్లు కాలుచున్నట్లు నుండి యెరుపు లేక పసుపురంగుగలిగి పగిలినపుడు మిక్కిలి వేడియైనరక్తమును స్రవించునది పిత్తగ్రంధియనియు చల్లగను స్వాభావికమగు వర్ణమును అధికమగు దురదయు స్వల్పబాధయు గలిగి రాయివలె గట్టిగనుండి పగిలినపుడు తెల్లని చిక్కని చీమును స్రవించునది కఫగ్రంధియనియు శరీ

రము వృద్ధియగునపుడు పెరుగుచు శరీరము తగ్గినపుడు తగ్గుచు నునుపు మిగులదుగదగలిగి బాధలేక గొప్పదిగానుండిన మేదోజగ్రంథియని ఎఱుంగవలయును. ఇది పగిలినపుడు గానుగుపిండివలెను, పేరిననేతివలెను నుండు మేదస్సును స్రవించుచుండును. సిరాజాలము యీడ్వబడి సంకుచితములై గుమిగూడి శోషించి గుండ్రడగ ఉన్నతమగు గ్రంథిరూపముం దాల్చును ఇది సిరాజగ్రంథియనబడును, ఇది నొప్పిగలిగించుచున్నయెడల సాధ్యముగనుండును.

గ్రహణి:—భుజించినయాహారము పక్వముగ గాని అపక్వముగగాని బాధ దుర్గంధముగలిగి వాతముచే బద్ధముగను పిత్తముచే ఆర్ద్రముగను అపానద్వారమునుండి మాటిమాటికి వెడలుచుండును. ఇది గ్రహణీరోగము. వాతగ్రహణియందు పుల్లత్రేనుపులు శరీరము కర్కశముగనుండుట గొంతునోరు యెండుట ఆకలిదప్పికలు చూపు యివితక్కువగుట చెవిలో హోరు ప్రక్కలు గజ్జలు తొడలు గొంతు వీనియందు నొప్పి ఆమమైన అన్నరసము ఊర్ధ్వ అధోమార్గముల వెడలుట రొమ్మునొప్పి శరీరము చిక్కుట బలక్షయము అరుచి గుదమునందు రంపపు కోతవలె బాధ మధురాదిరసములన్నిటిని తినగోరుట అన్నము జీర్ణావస్థకువచ్చినపుడు కడుపుబ్బుట భుజించినపుడు స్వస్థముగనుండుట నురుగుతో గూడి మలము వెడలుట యను లక్షణములుండును. పిత్తగ్రహణియందు పసుపు నలుపు కలసినరంగుగను లేక పసుపురంగను మాటిమాటికి మలము వెడలుట శరీరము పచ్చబడుట దుర్గంధములగు త్రేనుపులు కంఠమునందును హృదయమునందును మంట అరుచి దప్పి యనులక్షణములుండును. కఫగ్రహిణియందు నోటనీరు అరుచి వాంతి నోరు జిగటగ తీపిగనుండుట కళ్లిదగ్గు పడిశము కడుపునిండుగ యెత్తుగనుండుట వికృతమైన త్రేనుపు అగ్నిమాంద్యము ఆమకఫములతో గూడిన పలచనగు మలము పలుమారు వెడలుట బలహీనము మాంద్యము అనులక్షణములుండును. సన్నిపాతగ్రహణియందన్ని లక్షణములునుండును. పగటియందు ప్రకోపించి రాత్రియందు శాంతించునదియు పేగులుకూయుట పా



లుమాలిక బలహీనము అగ్నిమాంద్యము గలిగి ధ్వనితో స్వల్పమైన బాధతో పది లేక పదునైదు లేక మాసము లేక ప్రతిదినము అపక్వము పిచ్ఛిలము (జిగట) నైన మలము పలుమారు వెడలుచుండును నను చిహ్నములుకలది సంగ్రహగ్రహణియనబడును. ఆమవాతముచే నిదిపుట్టి చికిత్సకు అసాధ్యమై చిరకాలము వరకు బాధించును. నిద్రించునపుడు పార్శ్వములయందు నొప్పిగలిగి సగమువరకు కదలుచున్న జలముగల కుండవలె ధ్వనించుచు మలము వెడలునెడల యది ఘటీయంత్ర గ్రహణియనబడును. ఇదియునసాధ్యము.

చలిజ్వరము:—చూ విషమజ్వరము.

ఛర్ది:—అనగా వమనము. నలుపుగ వగరుగ అధికమగు వేగముతో వచ్చి కష్టముమీద కొద్దివమనమగునెడల వాతచ్ఛర్దియనియు, పసుపురంగు లేక ధూమ్రవర్ణముగలిగి మంటతో గూడి వమనమైన పిత్తచ్ఛర్దియనియు, స్నిగ్ధముగ కఠినముగ తీపిగ తెల్లగ కొద్దిబాధతో వమనమైన కఫచ్ఛర్దియనియు తెలియవలెను. శూల ఒకింతగలిగినది క్రిములచేగల్గినదని తెలియునది.

జంతువాతము:—చూ. క్రిమి.

జ్వరము:—దేశమునకు దేహమునకు కాలమునకు ప్రకృతికి విరుద్ధములగు ఆహారవిహారాదులను సేవించుటచే వాతపిత్తకఫములు ఆమాశయమును చేరి జఠరాగ్నిని వెలుపలకు ద్రోసి రసధాతువుతో చేరి జ్వరము కలుగజేయును. చమటపట్టకుండుట దేహేంద్రియమనస్సులకు తాపము కలుగుట ఒడలునొప్పులు యివి యేకకాలమునందు సాధారణముగ జ్వరమునందు కలుగును. వాతజ్వరము వచ్చుటకుముందు ఆవలింతలు, పిత్తజ్వరమునకుముందు కండ్లమంట, కఫజ్వరమునకుపూర్వము అన్నహితముతప్పుట యివి సాధారణపూర్వరూపములు. వణుకు జ్వరము హెచ్చుచు తగ్గుచునుండుట కంఠము పెదవులు ఆరుట నిద్రలేకుండుట తుమ్ములు జడత్వము శరీరము జిడ్డులేక విరవిరలాడుట తల రొమ్ము శరీరము వీనియందు నొప్పి అరుచి మలముగట్టిపడుట కడుపుబ్బరము నో

ప్పి తీవ్రలింతలు యివి వాతజ్వరచిహ్నములు. జ్వరమతితీవ్రముగ నుండుట ద్రవరూపమగువిరేచనము కొద్దినిద్ర ఛర్ది పెదవులు ముక్కులు కంఠము వీనియందు పుండగుట చెమట పేలావన నోరుచేదు దేహమునందుమంట కండ్లుతిరుగుట యివి పిత్తజ్వరలక్షణములు. శరీరమునతడిగుడ్డకప్పినట్లు మొద్దుగనుండుట జ్వరవేగము తక్కువగనుండుట ప్రొలుమాలిక నోరు తీపిగను మలమూత్రములు తెల్లగను ఉండుట కడుపు నిండుగనుండుట చలి వాంతియగునట్లుండుట అమితనిద్ర పడిశము అరుచి దగ్గు నేత్రములు తెల్లబడుట యివి కఫజ్వరలక్షణములు. వాతపిత్తజ్వర వాతశ్లేష్మజ్వర పిత్తశ్లేష్మజ్వరములందు ఆయాదోషములుండును కొంతసేపు తాపము కొంతసేపు చలి ఎముకలు కీళ్ళు శిరస్సు వీనియందు నొప్పి కన్నులు కన్నీటిచేనిండి కలకబారి యెఱ్ఱనై లోనికి దిగుకొనిపోవుట చెవిలో హోరు నొప్పి గొంతులో ముండ్లుగ్రుచ్చినట్లు నసకునికిపాటు మూర్ఛ ప్రలాపము దగ్గు ఆయాసము అరుచి ఒడలుతిరుగుట. నాలుక కాలినట్లు నల్లగ గరగరలాడుచుండుట కఫరక్తమిశ్రితమైన పసుకక్కుట తలవిసురు దప్పి చెమట మూత్రపురీషములు యివి చాలసేపటికి మిక్కిలి స్వల్పముగ వెడలుట కంఠమున మూలుగుచుండుట నలుపురంగులుగల బొబ్బలుకలుగుట ముక్కు చెవులు నోరు మొదలగు స్రోతస్సులయందుపుండగుట మొదలగు లక్షణములు సన్నిపాతజ్వరమునందుండును. ఈసన్నిపాత జ్వరము ఏడవదినము లేక పదియవదినము లేక పండ్రెండవదినమునందు ఘోరమై శాంతినైనబొందును. లేక మరణమునైనగలిగించును. మరియొక మతమున పదునాల్గు లేక పద్దెనిమిది లేక యిరువదియొకటవదినమునందు శాంతినైనబొందును. లేక మరణమునైన, కలిగించును.

జ్వరాతిసారము:—జ్వరలక్షణములు అతిసారలక్షణములు కలసియున్నయెడల జ్వరాతిసారమనబడును.

తృష్ణ:—చూ. దప్పి,



దంతరోగములు:—అనగా పండ్లయందుపుట్టువ్యాధులు పుచ్చిపన్ను చిగురువాపు దంతములుకదులుట దంతములనుండి చీము రక్తముకారుట మొదలగునవి దంతరోగములు.

దప్పి:—దప్పి వాతపిత్త కఫములు క్షతము క్షయము ఆజీర్ణము ఆహారభేదము అను యేడుకారణములచే వేర్వేరుగపుట్టి యేడువిధములుగనుండును. నోరెండుట శిరస్సు కణతలు వీనియందు నొప్పి రసాదివహస్రోతస్సులు అడ్డగింపబడుట నోటియందరుచి చల్లని నీళ్ళను త్రాగిన కొలదిదప్పి యెక్కువగుట యివి వాతజతృష్ణా లక్షణములు మూర్ఛ అన్నద్వేషము ప్రలాపము తాపము కన్నులెఱ్ఱబడుట శోష శీతోపచారములయందిచ్ఛ నోరుచేదు తాపము యివి పిత్తజతృష్ణాలక్షణములు. నిద్ర గురుత్వము నోరుతీపి యివి కఫజతృష్ణాలక్షణములు. గాయములు మున్నగువానిచేగల్గిన దప్పికి క్షతజమనియు, రసాదులు క్షీణించుటచేగల్గిన దప్పికి క్షయజమనియు పేరు. ఇందు మాటిమాటికి ఉదకపానముచేసినను తృప్తి సుఖమునందకుండుట హృదయపీడ కంపము మొదలైనవికలుగును.

దాహము:—అనగా తాపము. ఇది అధికమద్యపానముచేయుటచేతను రక్తప్రకోపముచేతను పిత్తజ తృష్ణానిరోధముచేతను శస్త్రాది ప్రహారములచే గల్గిన రక్తము ఆమాశయము అగ్నిస్థానము పక్వాశయము వస్తి యకృత్ ప్లీహములు హృదయము ఉండుకము పుప్పుసము యివి నిండియుండుటచేతను రసాది ధాతువులు క్షయించుటచేతను శరీరమున తాపముకలుగును. దీనికి దాహరోగమనిపేరు.

దోషజ్వరము:—తలనొప్పి ఒడలు నొప్పులు జ్వరచిహ్నములు మొదలగునవి కలిగియున్నపుడు స్త్రీసంభోగము చేసిన యెడల దోషములుప్రకోపించి తొడలు కాళ్ళు చీల్చినట్లుండుట తల పగులగొట్టినట్లునొప్పి భ్రమ అసంబద్ధప్రలాపము మూర్ఛ జ్వరము మొదలగు మహోపద్రవములుకలిగి వెంటనే చికిత్సచేయనియెడల మరణముగూడకలిగించును. దీనికి దోషజ్వరమనిపేరు.

నాజు:—చూ. శోఫ.

నాడీవ్రణము.—అనగా నారికురుపు. చీము క్రమముగ నరము యొక్క ఆకారముదాల్చి వ్రణముఖమునుండి కొంచెము కొంచెము బయటకువచ్చుచుండును. ఇదియదీనికి ప్రధానలక్షణము.

నాసారోగములు:—చూ. పీనస.

నేత్రరోగములు:—కండ్లకలక రేజీకటి పొరలు పూవులు చత్వారము మెరుపులు దురద మొదలగునవి నేత్రములందు కలుగు వ్యాధులు,

పాండువు:—రక్తముపలచబడి శరీరముఅంతయు తెల్లబడి పొడిదగ్గు ఆయాసము కాళ్ళు చేతులు కీళ్ళుపట్టుతప్పుట మొదలగు లక్షణములుకల్గది పాండురోగమనబడును.

పాదరసదోషములు.—కీళ్ళు పట్టువదలుట కీళ్ళువాచుట అమితమగుతాపము దంతములుకదలుట దృష్టిచెడుట అజీర్ణము మొదలగునవి అపరిశుద్ధమగు రసభస్మమును సేవించుటచే కలుగు ఉపద్రవములు పరిశుద్ధమైనను రసభస్మమును సేవించునపుడు నిర్ణీతమైన యాహారాది సేవలన్నువిడచి యపథ్యాహారాదులను సేవించినను పైయుపద్రవములు కలుగును. వీనిని పాదరసదోషములందురు.

పీనస:—ముక్కునందు వాతముచేత కఫము శుష్కమై శ్వాసవెడలక బంధింపబడియుండుట ముక్కులయందు ద్రవముగలిగియుండుట మంట దుర్వాసన సువాసనలుగాని నోటికి రుచిగాని తెలియకుండుట యివి పీనసరోగలక్షణములు. మరియు ముక్కునుండి చీము స్రవించుట ముక్కులలోపుండ్లగుట రక్తముతోగూడిన చీము వెడలుట మొదలగునవి ముక్కునపుట్టువ్యాధులు.

ప్రదరము:—ఋతుకాలమునగాక తక్కిన సమయములయందు ఋతురక్తము అధికముగ వెడలిపోయి ఒడలునొప్పులు శూల మొదలగు బాధలగలిగించును. దీనికి రక్తప్రదరమనిపేరు దీనినే యెఱ్ఱకుసుమ అందురు. మరియు తెల్లగ కొవ్వువంటిపదార్థము వెడలుచున్న నది తెల్లకుసుమఅందురు. యెరుపు నలుపు మొదలగు వర్ణములుగల స్రావములుగలుగుటయుకలదు. వీటికి కుసుమవ్యాధులనిపేరు.



ప్రమేహము:—చూ. మేహము.

ప్రమేహపిడకలు:—శరావిక కచ్ఛపిక జాలిని వినత అలజి మసూరిక సర్షపిక పుత్రిణి విదారిక విద్రధి అని ప్రమేహపిడకలు పదివిధములు. వీటికే రాచకురుపులని తెనుగుపేరు. ప్రమేహమును చికిత్సించక విడచినయెడల యీపిడకలు సంధిమర్మములందు బలిసియుండు అవయవభాగములయందు పుట్టును. చుట్టు ఉన్నతముగను మధ్యపల్లముగనుఉండి మూకుడువలెనున్న శరావికయనియు, యావాలవంటియాకారమును అంతియపరిమాణము గల్గినది సర్షపికయనియు, మంటగల్గి తాబేటివీపువలె ఉన్నతమై యుండునది కచ్ఛపికయనియు, మిగుల మంటగల్గి దుర్మాంసముతో గూడియున్న నది జాలినియనియు, వీపులోగాని ఉదరములోగాని మిగుల లోతున పోటుగల్గి, ఆర్ద్రమై నల్లని రంగుగల్గియున్న వినతయనియు, సన్నని బొబ్బలతో గూడి గొప్ప ఆకారముకలది పుత్రిణియనియు, చిరుసెనగలవంటి యాకారమును పరిమాణమునుకలది మసూరికయనియు, మెరుపు తెలుపు వర్ణములు గలిగిన బొబ్బలతో గూడి మిగులక్రూరమైనది అలజి యనియు, నేలగుమ్ముడుగడ్డవలె గుండ్రముగ కఠినముగనుండునది విదారిక యనియు, విద్రధియొక్క లక్షణములతో కూడియున్న నది విద్రధియనియు చెప్పబడును.

ప్లీహ:—చూ. యకృత్.

బలాసకము:—ఇదియొక జ్వరభేదము. రూక్షమైనశరీరము వాపుతోగూడి స్తంభించిన ఆవయవములు ప్రబలమైన శ్లేష్మము కలిగియుండును.

భగందరము:—గుదస్థానమునకు ప్రక్క రెండంగుళముల దూరమున మిగులబాధతో గూడిన బొబ్బపుట్టి పగులును. దీనికిభగందరమనిపేరు. పక్వమై అనేకరంధ్రములు పడి నురుగును మలమూత్రములును ఆరంధ్రములనుండి వెడలించుచుండిన శతపోనకమను భగంధరము

నబడును. యెర్రనిబొబ్బపుట్టి శీఘ్రముగ పక్వమై వేడియైనచీమును స్రవించుచు ఒంటెయొక్క ముఖమువంటి వంకరగలయాకారముగలది ఉష్ట్రముఖభగందరము. చిక్కనైన చీమును స్రవించుచు దురద స్వల్పమగుబాధ తెల్లనిరంగు కాఠిన్యముగలది పరిస్రావి యనంబడు. నానావిధవర్ణములు నానావిధబాధలు నత్తగుల్లలసుడివంటి యాకృతిగల్గి ఆవుచన్నులవలె నిడివియై యుండునది శంబూకావర్తము, ముండ్లు మొదలైనవి గుదమున గ్రుచ్చుకొనిన గాయమునుచికిత్సింపక విడచిన నానాట వృద్ధినొంది పురుగులుపడి అనేకద్వారములుగల వ్రణములేర్పడును. దీనికి ఉన్మార్గియని పేరు. శంబూకావర్తము, ఉన్మార్గి యను నవి అసాధ్యములు.

భూతబాధ:—భూతప్రేత పిశాచాదులాశ్రయించుటచేతను ఆభిచారములచేతను మనుష్యుల కనర్హములైన మాటలు బలము చేష్టలుగలిగియుండుట మున్నగులక్షణములతోగూడి చైతన్యము తప్పియుండుటయు చైతన్యముకలిగియుండుటయు మొదలగు అవస్థలు కలుగును. దీనికే భూతబాధయనిపేరు.

భ్రమ:—రజోగుణము పిత్తము వాతము యీమూడిటిచే భ్రమజనించును, చక్రముపైనగూర్చునట్లు వస్తువులెల్ల తిరుగుచున్నట్లును యెల్లప్పుడు భూమియందు పడియున్నట్లును కానబడుట భ్రమరోగ లక్షణములు.

మధుమేహము:—మూత్రముతోగూడి శర్కర వెడలుచుండిన నది మధుమేహమనబడును. దీనిని చికిత్సించక యుపేక్షించిన రాచకురుపులు మొదలగు ఉపద్రవములుకలిగి మనుజుని చంపును.

మశూచికము.—ఒడలునొప్పులు దురద ప్రాలుమాలిక భ్రమ చర్మమునందువాపు శరీరవర్ణముమారుట కండ్లెర్రబడుట మొదలగు లక్షణములతో మూడు లేక నాల్గురోజులు తీవ్రమైన జ్వరము కలిగి 4 వ రోజునగాని మూడవరోజునగాని శరీరమంతట కొందరకుపలచగను కొందరకు ఒత్తుగను చిన్నచిన్న పొక్కులు పుట్టి 7 దినములవరకు వృద్ధి



జెంది అక్కడనుంచి క్రమముగ దిగజారి వాడి 15 దినములకు పొక్కులు రాలిపోవును. ఇదియె మశూచికము స్ఫోటకము అనబడును.

ముఖరోగములు:—పెదవులు దంతములు దంతమూలములు నాలుక తాలువులు కంఠము ముఖము వీనియందుపుట్టురోగములు ముఖరోగములనబడుచు.

మూత్రకృఛ్రి:—గజ్జలు పొత్తికడుపు మేఢ్రము వీనియందు మిగుల బాధతో కొంచెముకొంచెము మూత్రమును విడుచుట వాతజమూత్రకృఛ్రియనబడు. పిత్తజమున రక్తము మంట నొప్పి గల్గి పసుపురంగుగల మూత్రమును మాటిమాటికి విడువబడును. కఫజమున వస్తి మేఢ్రములందు గురుత్వము వాపుగలిగి చిక్కనైన మూత్రము వెలువడును. సన్నిపాతజమున పైలక్షణములన్నియు నుండును. మరియు మూత్రనాళమున ముల్లు మొదలగుశల్యములచే గాయము కల్గుటచేతను మూత్రపురీషములను శుక్రమునునిరోధించుటచేతను అశ్మరిని చికిత్సించక విడుచుటచేతనుగూడ మూత్రకృఛ్రిపుట్టును.

మూత్రాఘాతము:—బొత్తుగా మూత్రము వెడలక యుండుట మూత్రాఘాతము.

మూర్ఛ:—కొన్నికారణములచేతసత్వగుణమునశించి బాహ్యంబులును ఆంతరంబులునైన యింద్రియముల వహించు నాడులయందు క్రూరములయిన వాతాదికోపములు ప్రవేశించినపుడు మనుజులుమూర్ఛిల్లుదురు. సంజ్ఞనువహించునాడులు వాతాదులచే నడ్డగింపబడునప్పుడు సుఖదుఃఖములను నశింపచేయు అజ్ఞాన హేతుకమైన తమోగుణమునొంది మైమరచి కొయ్యవలెక్రిందబడును. దీనికిమూర్ఛయని పేరు.

మూలవ్యాధి:—చూ. అర్శస్సు.

మేదోరోగము:—దేహపరిశ్రమచేయక పగటియందు నిద్రించువానికిని కఫకరమగు ఆహారములను దినువానికిని ఆహారముపక్వముకాక మేదస్సును (క్రొవ్వు) వృద్ధినొందించును. కొంచెము దప్పి మూర్ఛ అతినిద్ర తుమ్ములు బడలిక చెమట శరీరము దుర్గంధము బల

సంభోగశక్తులు క్షీణించుట యీయుపద్రవములు మేహరోగమున గలుగును.

మేహరోగములు:—అతిమూత్రము మధుమేహము మూత్రకృచ్ఛ్రము మూత్రాఘాతము మూత్రాశ్మరులు మున్నగునవి మేహరోగములుగ జెప్పబడును.

యకృత్:—జీర్ణజ్వరముచేతను సంతాపకరపదార్థములను విశేషముగ తినుటచేతను కఫరక్తములు దుష్టములై ప్రక్కలయందుండు యకృత్ ప్లీహయను మాంసఖండములు రెండునుగాని ఒకటిగాని వృద్ధి నొందును. ఇందు ప్లీహ యెడమప్రక్కను యకృత్ కుడిప్రక్కను ఉండును. వీనియందు అగ్నిమాంద్యము బలక్షయము పాండువు మొదలైనవి కల్గును. ప్లీహవృద్ధికి ప్లీహోదరమనియు యకృద్వృద్ధికి యకృద్దాలియనియు పేరు.

యోనిదోషములు:—వీనిని యోనివ్యాపత్తులందురు. యోనిద్వారమునుండి నురుగుతోగూడి యార్తవము వెడలిన ఉదావర్తయనబడు. ఆర్తవమునశించి సంతతి గల్గకున్న వంధ్యయనియు, యోనియందెల్లపుడు వేదనగల్గియున్న విప్లుతమనియు సంభోగముచేయునపుడమిత బాధగల్గిన పరిప్లుతమనియు, మిగుల కర్కశముగ కఠినముగనున్న వాతలయనియు, అధికముగ రక్తముస్రవించుటచే రక్తము శోషించి యోనియందు మంటగలిగిన లోహితయనియు, వాతముతో గూడి రజోయుక్తంబైన శుక్రము యోనినుండి వెడలిన వామినియనియు, వాతపీడితమై కష్టముగా ప్రసవించునదియై స్వస్థానమునుండి రక్తముస్రవించునది స్రంసనియనియు, గర్భము మాటిమాటికి నిల్చి పలుమారు జారిపోవుచుండిన పుత్రఘ్నియనియు తాపము పాకము జ్వరము గలిగిన పిత్తలయనియు, మైథునముచే సంతోషము కలుగకుండిన అత్యానందమను యోనివ్యాపత్తనియు, కఫరక్తములచేత యోనిమధ్యమున మాంసగ్రంథిపుట్టిన కర్ణినియనియు, సంభోగమున పురుషునికన్న ముందు స్త్రీ మైథునక్రియనుండి విరమించుకొనిన అచరణయనియు, పురుషునికన్న



దీర్ఘకాలము మైథునేచ్ఛ గలిగియున్న అతిచరణయనియు, జిగట దురద శైత్యము కలిగియున్న శ్లేష్మలయనియు, ఋతుమతిగాక స్తనములు జనించకుండి సంభోగకాలమున యోని మిగుల కర్కశమయియున్న షండియనియు, గొప్పదండముగల పురుషునితో సంభోగించి గ్రుడ్డువలె యోని ద్వారమునుండి వెలువడినయెడల అండలియనియు, యోనిద్వారము గొప్పదైయుండిన మహతియనియు, ద్వారము మిక్కిలి స్వల్పముగనున్న సూచీవక్త్రమనియు నెరుంగవలయును. యివిగాక కుసుమ మొదలగునవిగూడ యోనిదోషములని చెప్పదగును.

రక్తగుల్మము.—చూ. గుల్మము.

రక్తగ్రహణి:—చూ. గ్రహణి.

రక్తపిత్తము:—ప్రకుపితమైన రక్తము ద్రవరూపమైనపిత్తముతోగూడి ఊర్ధ్వముఖంబుగనైనను అధోముఖముగనైనను ఉభయముఖముగనైనను వెడలును. అందు ఊర్ధ్వముఖముగ వెడలురక్తము కన్నులు ముక్కు నోరు చెవి అనురంధ్రములనుండియు అధోముఖముగ వెడలు రక్తము యోని గుదము మేఢ్రము యీరంధ్రములనుండియు స్రవించును. మరియు ఆపిత్తము అధికముగ ప్రకోపించినపుడు రోమరంధ్రములన్నిటినుండియు స్రవించును. దీనికి రక్తపిత్తమనిపేరు.

రక్తప్రదరము:—చూ. ప్రదరము.

రక్తదోషము:—వాతపిత్తకఫములచే రక్తము దుష్టమైచర్మమాంసాదులందు,గజ్జి చీడ దురద మొదలగువానిం గలుగ జేయును. దీనికి రక్తదోషమనిపేరు.

రక్తాతిసారము:—రక్తముతోగూడిన మలము మాటిమాటికి గుదమార్గమునుండి వెడలిన నది రక్తాతిసారమగును.

వరిబీజము:—వృషణముల రెంటిలో నేదియో యొకటి వివిధ దోషములచేవాచి పోటు తీపు మొదలగు బాధల,గలిగి యుండును. దీనికి వరిబీజమనిపేరు.

వలీపలితములు:—ముసలితనముచేత శరీరము ముడతలుపడుట వలియనియు, వెండ్రుకలు నెరియుట పలితమనియు చెప్పబడును.

వాతరక్తము:—రక్తదోషముచేత అరికాళ్ళు అరచేతులు చర్మము పగిలి నీరుగారుచు దురదమించుగ కుష్ఠరోగము యొక్క లక్షణములు గలిగియుండును.

వాతవ్యాధులు:—పక్షవాతము ఏకాంగవాతము సర్వాంగము అర్దితవాతము మొదలగునవి 80 వాతరోగములు కలవు. వీనికి వేర్వేరులక్షణములు గ్రంథవిస్తరభీతిచే వ్రాయబడలేదు.

విద్రధి:—వాతాది దోషములు ప్రకోపించి చర్మరక్తమాంసములను చెరిచి యెముకలయందుచేరి బలమైన మూలము నొప్పి గలిగి గుండ్రనైగాని లేక నిడుదయైయుండు దారుణమైనవాపుగలిగించును. దీనిని విద్రధియనియు, మేహాపువ్వుఅనియు వచింతురు, సాధారణముగ నిది అంతర్విద్రధి బహిర్విద్రధియని రెండు తెరంగులు. బహిర్విద్రధియన శరీరముమీదపుట్టునది. అంతర్విద్రధియన గుదము వస్తి ద్వారము నాభి కుక్షి గజ్జలు వృక్కలు ప్లీహాయకృతులు హృదయకమలము క్లోమము యీస్థలములలో నెచ్చటనైనను పాముపుట్టవలె ఉన్నతముగ గుల్మమువంటి యాకారముకలదిగ జనించును.

విషమజ్వరము:—సంతతము సతతము అన్యేద్యుష్కము తృతీయకము చాతుర్థికమునని 5 విధములు. సంతతజ్వరము రసధాతువునాశ్రయించియు సతతము రక్తధాతువును అన్యేద్యుష్కము మాంసమును తృతీయము మేదస్సును చాతుర్థికము అస్థిమజ్జలను ఆశ్రయించియుండుజనించును. 7 లేక 10 లేక 12 దినములు ఒకక్షణమైన విడువక అనుసరించియుండు జ్వరము సంతతము పగటియందు జ్వరమువ్యాపించి సాయంత్రమున తగ్గి మరల రాత్రియందు వేగముజూపునది సతతము రాత్రిగాని పగలుగాని వేగము చూపునది అన్యేద్యుష్కము. జ్వరమువచ్చినదినము మొదలు మరల 3 వ దినముననే వచ్చుచుండునది తృతీయకజ్వరము. ప్రతినాల్గవరోజునను వచ్చునది చాతుర్థికము.



విషము:—నాభి పాషాణము మొదలగు స్థావరవిషములను తినుటచేతను పాము తేలు జెర్రి యెలుక పాలెపురుగు మొదలగు విషకీటములచే కరువబడుటచేతను శరీరమునందలి ధాతువులుచెడి అనేకరూపములగు బాధలుకలిగించుటయు తరుచు మరణమును గలిగించుటయు సంభవించును. దీనికే విషదోషమనిపేరు. ఇదిగాక స్త్రీపురుషులన్యోన్యము వశ్యముకొరకు గోళ్ళు శుక్రశోణితములు మొదలగు వస్తువులను తినిపింతురు. దీనివలనను అనేకమహోపద్రవములు కలుగును. దీనింగూడ విషదోషమని చెప్పదగును.

విషూచి:—చూ. కలరా.

విసర్పము:—వాతాది దోషములు ప్రకోపితములై చర్మరక్తమాంసములను ఆశ్రయించి దేహమందొకచోటనైన నిలుకడలేక సకలావయవములయందు సంచరించు విస్తీర్ణము ఉన్నతమునగు వాపునకు విసర్పముఅనిపేరు. వీనినే మంత్రపుకురుపులందురు.

విస్ఫోటము:—రక్తపిత్తముచేత శరీరమునందు కాలిన పొక్కులవలె బొబ్బలుకలిగి జ్వరమువచ్చును. దీనికివిస్ఫోటమనిపేరు.

వ్రణము:—శారీరములు ఆగంతుకములు నని వ్రణములు రెండువిధములు. వాతాదిదోషములచే పుట్టినవి శారీరములు. శస్త్రాదులచేకలిగినవి ఆగంతుకములు. వ్రణము అనగా సాధారణముగ కురుపు అనియర్థము.

వ్రణశోథ:—శరీరమునందు పుట్టు వ్రణములకు పూర్వరూపముగజనించు వాపును వ్రణశోథఅందురు.

శిరోరోగము:—తలనొప్పి పోటు ఒంటితలనొప్పి సూర్యావర్తము (అనగా సూర్యోదయమున కన్ను కనుబొమలు నొప్పి ప్రారంభించి ప్రొద్దెక్కినకొలది వృద్ధియై అస్తమయమునకు తగ్గునది) అంతవాతము (కంఠమునకు వెనుకప్రక్కను కన్ను కనుబొమలు కణతలు గండపార్శ్వములు వీనియందు అమితమగు నొప్పి) మొదలైనవి శిరోరోగములు.

శూకదోషము:—సేటియందు చరించు కప్పవంటి విషజంతువు నుచేర్చిన లేపనమును మేఢ్రము వృద్ధినొందుటకై పురుషాంగమునకు లేపముచేయుటచేతను దుష్టమైన భగముగల స్త్రీలతో సంభోగించుటచేతను సవాయిరోగములని చెప్పబడు 18 విధములవ్యాధులు జనించును. వీటికి శూకదోషములని పేరు. తెల్లావాలవంటి పొక్కులు లింగమునపుట్టిన నది సర్షపికయనురోగము. కఠినమైన కురుపులు గలిగిన అష్ఠీలిక. శూలముతో యెల్లపుడు నిండియుండిన గ్రధితము. నేరేడు గింజలవంటి కురుపులుగల్గిన కుంభిక. యెరుపు తెలుపు రంగులుగల్గి మిగులబాధపెట్టు పొక్కులున్న అలజి, వాచియున్న మృదితము. ఆవాపు పెద్దదియై ముఖమేర్పడకయుండిన సంమూఢపిటక. మధ్యచీలియుండు పొక్కులు అనేకముగ శిశ్నమునందువ్యాపించిన అవిమంథము. సన్నని పొక్కులచేవ్యాపింపబడిన ఒక పెద్దకురుపుగల్గి తామరమిద్దెవలెనుండిన పుష్కరిక. స్పర్శజ్ఞానమునశించియున్న స్పర్శహాని. పెసలు మినుములు పోలిన యెర్రనికురుపులులేచిన ఉత్తమ. సూక్ష్మములగు రంధ్రములు పడి శిశ్నమును భిన్నభిన్నముగ జేసిన శతపోనకము. శిశ్నముపై చర్మము పాలి జ్వరము మంట గలిగియుండిన త్వక్పాకము. యెరుపు నలుపు వర్ణములుగలిగి తీవ్రమైనబాధపెట్టుచున్న శోణితార్బుదము. శిశ్నమునందు పెద్దవియగుకురుపులున్న నది మాంసార్బుదము. మాంసము కుళ్ళి నానాటికి శిశ్నముఊడిపోవుచు నొప్పి మంట పోటు కలిగియున్న మాంసపాకము. శిశ్నమునందు విద్రధిలక్షణములుగల కురుపులేచిన విద్రధి యనబడును. మాంసమునల్లబడి నువ్వులువలె పొక్కులు లేచి క్రమముగ శిశ్నము ఊడిపోవుచున్న తిలకాలకము యివి శూకదోషములు.

శూల:—కడుపునందిరుప్రక్కలగాని ఒకప్రక్కగాని శూలము గ్రుచ్చినటుల బాధజనించును. దీనికి శూలయని పేరు. ఇది వాతాది దోషములచే 8 విధములు. భుజించిన యాహారపదార్థము జీర్ణావస్థకు వచ్చినపుడు పుట్టునట్టి శూలకు పరిణామశూలయని పేరు ఇదియును



వాతాది దోషభేదముచే 8 విధములు. శూలరోగమునందు వాతము ప్రధానముగ నుండును.

శోఫ:—జ్వరాదిరోగములు జీర్ణించుట మున్నగుకారణములచే శరీరమువాచి అధికమై మొద్దుబారి చంచలముగనుండుట ఉష్ణము సిరలయందు వ్యాపించియుండుట గురుత్వము శరీరము వివర్ణముగుట మొదలగులక్షణములు కల్గును. ఇది శోఫయనియు సంజరోగము ఉబ్బురోగము అనియు చెప్పబడును.

శోష:—చూ. క్షయ

సన్నిపాతము:—చూ. జ్వరము.

సర్పి:—చూ. విసర్పము.

సవాయి:—కొన్ని సవాయిరోగముల లక్షణములు "శూకదోషములు" అనుశీర్షికయందు వ్రాయబడినవి. ఉపదంశము అనబడు కొరుకుసవాయి లక్షణమిచట వ్రాయుదుము. రతికాలమున మేఢ్రమునందు నఖదంత క్షతములుసేయుట సంభోగానంతరమున స్వచ్ఛముగ కడగకపోవుట మున్నగు కారణములచేత మేఢ్రమునందు 5 విధములగు కొరుకు సవాయీలు పుట్టును. సూదులతో పొడిచినట్లు పోటు అదరుట గల్గి నల్లనిబొబ్బలు శిశ్నమందుగల్గిన వాతోపదంశము మిక్కిలి తడిగలిగి మంటతోగూడిన పచ్చని బొబ్బలుకలిగిన పిత్తోపదంశము. యెరుపు నలుపు రంగులుకలిగి రక్తమును స్రవించుచు పిత్తలక్షణములతో గూడిన బొబ్బలుపుట్టిన రక్తోపదంశము. దురద వాపుగల బొబ్బలుపుట్టిన కఫోదంశము. అన్నిలక్షణములతోగూడియున్న సన్నిపాతోదంశము.

సూతికావాతము:—ఒడలునొప్పులు, జ్వరము, కంపము దప్పి శరీరముబరువు వాపు శూల అతిసారము యీరోగములు ప్రసవించిన స్త్రీకికల్గిననది సూతికావాతమని గ్రహించవలెను. ప్రసవించిన స్త్రీకి

వాతము ప్రకోపించి రక్తమునడ్డగించి హృదయము వస్తి శిరస్సు వీని యందు పోటుపుట్టును. దీనికి మక్కల్లమని పేరు.

స్వరభేదము:—స్వరవహా స్రోతస్సులందు ప్రకోపించిన వాతము ప్రవేశించి కంఠధ్వనిని మార్చును దీనికి స్వరభేదమని పేరు.

స్త్రీసంగమదోషము:—చూ. జ్వరదోషము.

హిక్క:—చూ. ఎక్కిళ్ళు.

హిధ్మ:—కుష్టరోగభేదము.

హృద్రోగము:—వాతపిత్తకఫములు ప్రకోపించి అన్నరసమును దుష్టముగజేసి హృదయస్థానమునందు అచ్చట నానావిధబాధల గలిగించును దీనికి హృద్రోగమని పేరు.

---

రోగనిదానదీపము సమాప్తము.

# తప్పొప్పుల పట్టిక.

| పేజీ | పంక్తి | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 6 | 14 | ర్యస్తంభన | వీర్యస్తంభ |
| 7 | 20 | కృపాగరు | కృష్ణాగరు |
| 8 | 16 | సునము | సున్నము |
| 12 | 2 | చూరించి | మూర్ణించి |
| 12 | 9 | పాటివి | పాట్రివి |
| 19 | 17 | గుసు | గ్గుసు |
| 23 | 17 | ఆ్రన | ఆఘ్రాన |
| 24 | 20 | కరకను | కర్కకను |
| 26 | 19 | శృంగజేగ | శృంగబేర |
| 27 | 22 | ప్రవరరోగ | ప్రదరరోగ |
| 28 | 14 | వసులు | వస్తువులు |
| 29 | 19 | కలాస | కిలాస |
| 44 | 10 | హరము | కరము |
| 46 | 16 | తినివతె | తినవలె |
| 50 | 3 | పాకవి | విపాక |
| 56 | 20 | కజేయు | గజేయు |
| 57 | 15 | అశ్వరి | అశ్మరి |
| 59 | 10 | సట్టుచు | పట్టును |
| 59 | 25 | అజమాన్ | అజమాయన్ |
| 60 | 19 | త్రిగివేడి | తినివేడి |
| 60 | 27 | కొంచెముకా | కొంచెముగా |
| 61 | 2 | ఆరము | ఆర్కము |
| 70 | 17 | దున్నరి | దున్నవి |
| 71 | 15 | చాతురాత | చాతుర్జాత |
| 76 | 11 | కలకంద | కలకండ |
| 82 | 23 | స్తంభనముకు | స్తంభనమును |
| 84 | 5 | జంగ | జంటగ |
| 87 | 10 | చపము | చనము |
| 87 | 25 | చిముడు | చిడుము |
| 88 | 13 | మాలవ్యాధి | మూలవ్యాధి |
| 89 | 14 | మగుల | మిగుల |
| 92 | 26 | ద్రా | ద్రాక్ష |
| 93 | 13 | ముక్కలో | ముక్కులో |
| 95 | 20 | గ్రాణములు | ప్రాణములు |
| 98 | 21 | టిలోనుండి | మట్టిలోనుండి |
| 102 | 25 | పరీజ | వటబీజ |
| 108 | 18 | టిడ్డలకు | బిడ్డలకు |
| 110 | 24 | సీసముచేయు | సీసముచేచేయ |
| 111 | 12 | రము | రముకలిగించును |
| 111 | 13 | కలిగింతును | కలిగించును |
| 113 | 9 | ముగిలగి | ముకటువిపాకము |
| 114 | 27 | వెల్పు | వెడల్పు |
| 117 | 2 | ంతు | జంతు |
| 119 | 26 | డువాసన | సువాసన |
| 123 | 20 | మరబ్బా | మురబ్బా |
| 125 | 6 | లందు | లం |
| 125 | 12 | కళము | కఫము |
| 128 | 3 | కలుగునుమతిను | కలుగును |
| 128 | 16 | వత్యనా | వత్సనా |
| 133 | 15 | గొంతక | గొంతుక |
| 134 | 8 | గుణము | గుణములు |
| 137 | 25 | డరము | డము |
| 140 | 2 | ప్వాదుగు | స్వాదుగ |
| 140 | 21 | భేజము | భేదము |
| 143 | 6 | గల | గలది |
| 143 | 19 | శిరి, ఆరి | శిరిఆరి |
| 149 | 3 | జల్లేము | జిల్లేము |
| 150 | 10 | గాన | గాని |
| 157 | 14 | మూలవా | మూలవ్యా |
| 165 | 5 | ఆముదములు | ఆముదము |
| 168 | 8 | గ్దారుశృంగి | ద్దారుశృంగి |
| 168 | 10 | హరదా | హరడా |
| 176 | 4 | గుణము | గుణము.. |
| 176 | 11 | కలుక | కలుగ |

| పేజీ | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 179 | 15 | పాక | పాలు |
| 181 | 8 | శాస | శ్వాస |
| 181 | 10 | ఉందు | ప్రందూ |
| 183 | 21 | హామును | హారిమును |
| 190 | 9 | గుద | గుడ్డ |
| 193 | 1 | డి | వేడి |
| 195 | 6 | తాగిన | తాగిన |
| 205 | 4 | కుష | కుష్ట |
| 205 | 5 | ప్రమేహకా | ప్రమేహము |
| 206 | 19 | కాలు | కాసలు |
| 209 | 9 | చూర్ణ | చూర్ణము |
| 209 | 9 | తిడిపి | తడిసి |
| 210 | 25 | కస్తూ | కస్తూరి |
| 224 | 2 | రు | పేరు |
| 224 | 9 | తాల్చిన | దాల్చిన |
| 227 | 15 | చ్చిన | యిచ్చిన |
| 231 | 16 | లేటి | లేడి |
| 233 | 10 | శుక | శుక్ర |
| 235 | 10 | వానిలో | వానిలో |
| 237 | 24 | మూలగులు | మూత్రములు |
| 243 | 12 | వగరు | వగరు, చేదు |
| ,, | ,, | రుచులుచేసు | రుచులు |
| 247 | 9 | సల్లి | నల్లి |
| 247 | 16 | కరిప | కరివేప |
| 251 | 24 | గుణము | గుణములు |
| ,, | ,, | వీర్యములు | వీర్యము |
| 257 | 7 | హారించేయును | హారింపచేయును |
| 258 | 8 | ప్రస | ప్రపవ |
| 271 | 26 | యోని,దోషము | యోనిదోషము |
| 284 | 24 | లాయంత | కాయంత |
| 301 | 17 | పుషి | పుష్టి |
| 301 | 23 | పిపము | విషము |

| పేజీ | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 302 | 23 | కొబ్బరి | కొబ్బరి |
| 303 | 6 | నాలుదు | నాలుగైదు |
| 303 | 18 | అర్చి | ఆర్చి |
| 307 | 19 | సచ్చ | స్వచ్ఛ |
| 308 | 17 | గుమ్మడు | పెద్దగుమ్మడు |
| 310 | 2 | మెబర | మెత్తబర |
| 310 | 18 | శరీము | శరీరము |
| 310 | 21 | వాతములు | ములు |
| 310 | 22 | ము | వాతము |
| 311 | 1 | సంభోగ | సంభోగ |
| 311 | 8 | గుచ్చవల | గుచ్ఛఫల |
| 312 | 18 | పెటిన | పెట్టిన |
| 314 | 14 | పూడ | పూట |
| 315 | 3 | రస | సర |
| 315 | 25 | సంజుల | వంజుల |
| 318 | 23 | చండ | చంద్ర |
| 323 | 20 | నిమ్మరండ్ల | నిమ్మపండ్ల |
| 329 | 4 | ప్రమ | భ్రమ |
| ,, | 13 | కఫవాతములు | కఫపిత్తములు |
| ,, | 20 | ఆమ్లసారము | ఆమ్లరసము |
| 330 | 27 | గింజలకు | గింజలను |
| 338 | 13 | పట్టిహరించును రసము | హరించును పట్టి రసము |
| 344 | 4 | క్షీంచి | క్షీణించి |
| 346 | 12 | బోలిక | బోలిన |
| 346 | 13 | చెట్లు | చెట్ల |
| 348 | 19 | నానంత | నానంతర |
| 351 | 15 | జాజి | జాజికాయ |
| ,, | 26 | పిట్ట | కిట్ట |
| 352 | 25 | గకర్రగ | చకర్రగ |
| 353 | 14 | కంఠస్వ | కంఠస్వర |
| 357 | 14 | శిత | కాచబడినశీతల |



| పేజీ | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 358 | 2 | శ్రేష్మ | శ్లేష్మ |
| 359 | 24 | క్రొత్తయు పంటిలోనే నికిపో క శుభ్రముగ నుంచినదియుండగా, అనుమాట వదిలివేయవలెను | |
| 361 | 16 | గానితు | గానిపా |
| ,, | 17 | తో | తు |
| 389 | 6 | ధరిరిచిన | ధరించిన |
| 389 | 9 | సర్వేంద్రియ | సర్వేంద్రియ |
| 390 | 10 | మినిపుట్టించును | మినిహరించును |
| 397 | 2 | నానా | నాసా |
| 405 | 2 | గర్భంధా | గర్భసంధా |
| 417 | 16 | పనకారి | దీపనకారి |
| 419 | 3 | సోపు | సోపురసము |
| 433 | 15 | గుణముచు | గుణము |
| 461 | 4 | వ్రములు | వ్రణములు |
| ,, | 15 | యించిన | వేయించిన |
| 462 | 25 | వ్యామామము | వ్యాయామము |
| 465 | 15 | వము | వర్ణము |

| పేజీ | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 474 | 5 | పసుపుశ్రీదన | పసుపుస్రావన |
| 477 | 15 | ఎశి | ఎంత్రి |
| 479 | 12 | నసుము | సముము |
| 481 | 3 | సుష్క్వగుము | సుష్క్వగుమువే |
| 494 | 20 | కఫవజాత్మరి | కఫజాత్మరి |
| 494 | 27 | మాత్రిను | మూత్రము |
| 496 | 22 | గానిఘటించిన | గాని పెట్టినయెడల దానిని భుజించిన |
| 499 | 9 | కొంచెముగ | కొంచెముగనైన లుట |
| 502 | 1 | పొడవగ్గు | పొడిదగ్గు |
| 502 | 15 | తొడలు | పొడలు |
| 502 | 17 | దప్పి | దప్పి |
| 503 | 3 | కిటిమ | కిట్టిమ |
| 503 | 4 | శుపగిలి | శృపగిలి |
| 512 | 27 | కొవ్వవటి | కొవ్వువంటి |
| 519 | 4 | గలిగించుయు | గలిగించుటయు |

తప్పొప్పులపట్టిక సమాప్తము.

# ప్రకటన.

---

## ఆయుర్వేదగ్రంథరత్నమాలా కార్యస్థానమునందు దొరకు వైద్యగ్రంథములు.

1 చరకసంహిత. 1000 పేజీలు తాత్పర్యసహితము.

నవీనరోగములకు మహోత్కృష్టములగు మూలికాచికిత్సలుగల ప్రాచీనగ్రంథము. వెల 6—0—0

2 రసరత్నసముచ్చయము:—

ఆంధ్రభాషలో 'రసప్రదీపిక' యను చిన్నగ్రంథముతప్ప రసపరిభాష రససాధనీయవస్తువివరణము, మూషలు, యంత్రములు, కోష్ఠులు, కర్మపద్ధతులు, మహారస, ఉపరస, సాధారణరస, లోహ, రత్నాది, శోధనమారణ, జారణ, సత్త్వపాతన, ద్రుతి ప్రక్రియలు, నీచలోహములనుత్తమలోహములుగ మార్చు సంప్రదాయములుగలిగిన గ్రంథములేదు. వీనినన్నిటిని వివరించు 'రసరత్నసముచ్చయ' మను గొప్ప రసశాస్త్రగ్రంథము అనేక పండితసహాయ్యమున విపులమైన ఆంధ్రటీకతోను వ్రాయబడి ముద్రింపబడి యున్నది. కొద్దిప్రతులుమాత్రమేయున్నవి. వెల 2—8—0

3 వైద్యకల్పద్రుమము:—

ఈ గ్రంథమున వృద్ధవైద్యపరంపరయందు తాటాకులలోనున్న అమూల్యములగు రహస్యయోగములు అనేకములుకలవు. ప్రథమముద్రణము వెంటనే ఖర్చుపడినందున ద్వితీయముద్రణము చేయబడినది. ద్వితీయముద్రణయందు క్రొత్తయోగములనేకములు చేర్చబడినవి. ఈగ్రంథముయొక్క విలువనుగూర్చి యెంతవ్రాసినను అతిశయోక్తి కానేరదు. చక్కని బైండు. వేయేల? ఇది వైద్యులకు హస్తభూషణముగ నుండును. వెల 1—4—0

ధన్వంతరివ్రతకల్పము. 0—4—0

ధన్వంతరీదండకము. 0—1—0

ఇవిగాక మావద్ద సంస్కృతటీకాసహిత వాగ్భట సూత్రస్థానము, చికిత్సాస్థానము, సుశ్రుతము, [illegible], చింతామణి, శార్ఙ్గధరసంహిత మొదలగు వైద్యగ్రంథములున్నవి కోరవలెను.

విలాసము,—

చివుకుల సత్యనారాయణశాస్త్రి,

నూజవీడు, కృష్ణాజిల్లా.

END OF
TITLE